

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 278

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆదివారం 29-12-2024



నితీశ్ రెడ్డి 'వైల్డ్ ఫైర్'

మెల్‌బోర్న్ మైదానంలో సూపర్ సెంచరీ

ప్రపంచ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక మైదానాల్లో ఒకటి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్..ఏకంగా 83,073 మంది ప్రేక్షకులు... తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు 191/6... ప్రధాన బ్యాటర్లంతా వెనుదిరిగాక మిగిలిన వికెట్లు తీసి టెస్టులో విజయానికి పునాది వేసుకునేందుకు ఆస్ట్రేలియా సిద్ధంగా ఉంది. ఆటగాళ్లంతా ఉత్సాహంగా కనిపిస్తున్నారు... ఇలాంటి సమయంలో 21 ఏళ్ల ఆంధ్ర కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి క్రీజ్‌లోకి వచ్చాడు... సిరీస్‌లో ఇప్పటికే తన ఆటను ప్రదర్శించిన అతడి బ్యాటింగ్‌పై వారికి కొంత అంచనా ఉంది... కానీ ఈసారి మాత్రం రాబోయే తుఫాన్‌ను వారు ఊహించలేదు... తొలి బంతి నుంచే అమిత ఆత్మవిశ్వాసం ప్రదర్శించిన నితీశ్ ఆసీస్ బౌలర్లను లెక్క చేయలేదు... స్టార్క్, బోలండ్, లయన్...ఇలా అందరి పని పడుతూ దూసుకుపోయాడు... మెల్‌బోర్న్‌లో అతని మెరుపులకు మైదానంలో ప్రేక్షకులు దాసోహమయ్యారు. ఆ వేల మందిలో అతని నాన్న కూడా ఉన్నాడు...ఈ తెలుగు కుర్రాడు అంటించిన అగ్ని విక్టోరియా రాష్ట్రంలోని స్టేడియంలో మంటలు రేపింది... అదే జోరులో నితీశ్ సాధించిన శతకానికి ఎంసీజీ మొత్తం దద్దరిల్లింది. ఏళ్ల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ తండ్రి భావోద్వేగంతో కన్నీళ్లపర్యంతమైన తీరు అభిమానులందరినీ కదిలించింది... చప్పట్ల హోరు మధ్య సగర్వంగా పెవిలియన్‌కు తిరిగొస్తుండగా జట్టు సహచరులు మైదానంలోకి వచ్చి అతనికి స్వాగతం పలికిన తీరు నితీశ్ ఇన్నింగ్స్ విలువేమిటో చూపించింది...అతనికి అండగా వాషింగ్టన్ సుందర్ నిలవడంతో భారత్ 358/9 స్కోరు వద్ద మూడోరోజు ఆటను ముగించింది.

- వివరాలు 14లో


ఆట ముగిసిన అనంతరం కొడుకును అక్కున చేర్చుకొని తండ్రి ఆనందబాష్పాలు

న్యూస్‌రీల్

రేపు అసెంబ్లీ ప్రత్యేక భేటీ



రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించడంతో పాటు భారతరత్న ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేసే అవకాశం ఉందని సమాచారం. కాగా, అసెంబ్లీ ప్రత్యేక భేటీకి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

- వివరాలు 2లో▶

మళ్లీ సాగునీటి సంఘాలు!



రాష్ట్రంలో మళ్లీ సాగునీటి వినియోగదారుల సంఘాల వ్యవస్థను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సిఫార్సు చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

- వివరాలు 5లో▶

రోడ్డెక్కిన 'ఉత్తర రింగు'

రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగానికి టెండర్లు పిలిచిన ఎన్‌హెచ్‌ఏఐ



- ప్రతిపాదించిన ఏడేళ్ల తర్వాత కీలక ముందడుగు
- పనులు చేపట్టిన తర్వాత రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని టెండర్ డాక్యుమెంటులో పేర్కొన్న జాతీయ రహదారుల సంస్థ
- తర్వాత ఐదేళ్ల వరకు ఆ సంస్థకే రోడ్డు నిర్వహణ బాధ్యత
- ఈపీసీ విధానంలో నిర్మాణం.. తర్వాత తానే టోల్ వసూలు చేసుకోనున్న ఎన్‌హెచ్‌ఏఐ

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. ఈ రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) టెండర్లను ఆహ్వానించింది. 161.518 కిలో మీటర్ల నిడివి ఉన్న ఈ భాగాన్ని ఐదు ప్యాకేజీలుగా విభజించి విడివిడిగా టెండర్లు పిలిచింది. టెండర్ల దాఖలుకు ఫిబ్రవరి 14వ తేదీని తుది గడువుగా నిర్ధారించింది. ఆలోపు ఫైనాన్షియల్, టెక్నికల్ బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 17న టెండర్లను తెరవనుంది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ రెండేళ్లలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని టెండర్ డాక్యుమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఐదేళ్లపాటు ఈ రహదారి నిర్వహణ బాధ్యతలను కూడా చూసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఈపీసీ పద్ధతిలో నిర్మాణ పనులు..

రీజినల్ ఉత్తర భాగాన్ని ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్

మిగతా 12వ పేజీలో ▶

ప్రాజెక్ట్ రిపోర్ట్...

- మొత్తం నిడివి 161.52 కి.మీ.
- ఖర్చు రూ. 17,080 కోట్లు
- ప్రతి కి.మీ.కి రూ. 52.6 కోట్లు
- రోడ్డు నిర్మించనున్న లేన్లు: 8 లేన్లు (ప్రస్తుతం 4 లేన్లు నిర్మిస్తారు. భవిష్యత్తులో విస్తరిస్తారు)
- ఇంటర్ చేంజ్ కూడళ్లు: 11
- యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే
- ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపైకి వచ్చే వీల్లేకుండా.. నిర్దిష్ట ప్రాంతాల్లోనే ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఉంటాయి.

తెలంగాణకు సూపర్ గేమ్‌చేంజర్: కోమటిరెడ్డి 12లో

అల్విదా మన్మోహన్‌జీ

మాజీ ప్రధానికి ఘనంగా తుది వీడ్కోలు

ఆర్థిక సంస్కర్త, సరళీకరణ విధానాలతో దేశ దశదిశను మార్చిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు జాతి యావత్తూ అంతిమ వీడ్కోలు పలికింది. శనివారం ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన అంత్యక్రియలు ముగిశాయి. అంతకు ముందు మన్మోహన్ పార్థివదేహాన్ని పుష్పాలతో అలంకరించిన సైనిక వాహనంలో ఆయన నివాసం నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఆయనకు ఎంతో ఇష్టమైన నీలిరంగు తలపాగాను చివరి ప్రయాణంలోనూ ధరింపజేశారు. 6లో


మన్మోహన్‌సింగ్ అంతిమయాత్ర దృశ్యం




కేటీఆర్ అర్వింద్‌కుమార్ బీఎల్‌ఎన్ రెడ్డి

7న విచారణకు రండి

'ఫార్ములా-ఈ' రేసు కేసులో కేటీఆర్‌కు ఈడీ సమన్లు

- అంతకుముందే 2న బీఎల్‌ఎన్ రెడ్డి, 3న అర్వింద్‌కుమార్‌ను విచారించనున్న అధికారులు
- వారికి కూడా సమన్లు జారీ.... విదేశీ సంస్థకు నేరుగా సొమ్ము బదిలీ చేయడంపైనే ఫోకస్
- మనీలాండరింగ్‌తోపాటు ఫెమా కింద కూడా దర్యాప్తు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కేటీఆర్‌కు శనివారం సమన్లు జారీ చేసింది. వచ్చే నెల 7వ తేదీన ఈడీ విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో సహ నిందితులుగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బి.లక్ష్మీనరసింహారెడ్డి (బీఎల్‌ఎన్ రెడ్డి)లకు కూడా సమన్లు జారీ చేసింది. వీరిలో బీఎల్‌ఎన్ రెడ్డిని వచ్చే నెల 2న, అర్వింద్‌కుమార్‌ను 3వ తేదీన విచారణకు హాజరుకావాలని

మిగతా 3వ పేజీలో ▶

'చెప్పు'కోలేని నేరాలు!



- చుక్క పోస్తేనే హుస్సేన్‌సాగర్ నుంచి బయటికొస్తానంటూ పోలీసులకు చుక్కలు చూపించిన యువకుడు..
- పురుషుడిపై అత్యాచార యత్నానికి తెగబడిన ఇద్దరు మహిళలు.. ఆపై నగ్న వీడియోలు తీసి బెదిరింపులు..
- భలే దంపతులు.. ఇద్దరూ ఇద్దరే.. తాగి నానా యాగీ చేసే భార్య.. పాదరక్షలు కనిపిస్తే చాలు మూటకట్టేసే భర్త..
- భర్తపైనే అట్రాసిటీ కేసు పెట్టిందో భార్య.. ప్రేమ పేరుతో వెంటపడి.. పాఠాలు చెప్పే గురువునే వేధించిందో యువతి..

16లో

ఇవీ ఈ ఏడాది నమోదైన నేరాల్లోని కొన్ని విచిత్రమైన కేసులు. ఈ తరహా ఉదంతాలతో పోలీసులు తల పట్టుకుంటున్నారు.

ఘాటు తగ్గిన మిర్చి



- భారీగా పడిపోతున్న మిర్చి ధర
- గత సీజన్‌తో పోల్చితే రూ.10 వేలు తగ్గుదల... కొత్త పంట రాకతో పాత మిర్చికి తగ్గిన డిమాండ్
- కోల్డ్ స్టోరేజీల్లోనే 30% పాత నిల్వలు

2లో



మన పథకాలు
అడ్డుకునే చాన్సే లేకుండా చేశాం సార్!

పుస్తకానికి పట్టం

37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు భారీగా తరలివస్తున్న ప్రజలు



- 9 రోజుల్లో 10 లక్షల మంది సందర్శకుల రాక
- 350 స్టాళ్లలో రూ. 15 కోట్ల విలువైన పుస్తకాల విక్రయం
- నేటితో ముగియనున్న బుక్‌ఫెయిర్.. పాల్గొననున్న జస్టిస్ రాధారాణి, మంత్రి జూపల్లి తదితరులు

సాక్షి, హైదరాబాద్: పుస్తకప్రియుడు గెలిచాడు... పుస్తకానికి మరోసారి పట్టం కట్టాడు... ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాలు, ఈ-బుక్‌ల హవా కొనసాగుతున్న కాలంలోనూ సగటు పాఠకుడు పుస్తకానికే జైకొట్టాడు. భాగ్యనగరం వేదికగా జరుగుతున్న 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనే అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. లక్షలాది మంది పాఠక మహాశయులు పుస్తక ప్రదర్శనను సందర్శించి నచ్చిన పుస్తకాలను

మిగతా 3వ పేజీలో ▶

పుస్తకం చదివితేనే నిజమైన అనుభూతి

- పెళ్లిళ్లు, వేడుకల్లో పుస్తకం బహుమతిగా ఇవ్వండి... హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

3లో

క్లుప్తంగా...

మన్మోహన్‌ను భారతరత్నతో గౌరవించాలి
ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు అనేక ప్రజోపయోగ పథకాలు, కార్యక్రమాలను అమలు చేసిన మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రధాని మోదీని కోరుతున్నామని చెప్పారు. శనివారం సీఎల్పీ మీడియా హాల్‌లో జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ అమలుతో పాటు సమాచార హక్కు, ఉపాధి హామీ చట్టాలు తెచ్చిన ఘనత మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. రాజకీయ చక్రంలో బందీ అయిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది కూడా ఆయనేనని, హైదరాబాద్‌కు మెట్రో రైలు తేవడంలోనూ నాటి ప్రధానిగా మన్మోహన్ పాత్ర మరువలేనిదని అన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలుగు జాతికే గౌరవమని, ఆయన గౌరవం ఎవరూ తగ్గించేది కాదని పేర్కొన్నారు. మన్మోహన్‌ను గౌరవించడమంటే పీవీని గౌరవించుకున్నట్టేనని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

రేపటి మంత్రివర్గ సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో సోమవారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. మాజీ ప్రధాని మరణంతో రాష్ట్రంలో సంతాప దినాలు పాటిస్తున్నందున.. ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు జరపడం లేదు. కాగా అదేరోజు ప్రత్యేకంగా శాసనసభ సమావేశమై మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలియజేయనుంది. సంతాప దినాల అనంతరం మంత్రివర్గ సమావేశం జరుగనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బీసీలకు కవిత నాయకత్వం అవసరం లేదు
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని బీసీలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నాయకత్వం అవసరం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. బీసీలకు రిజర్వేషన్ల పేరుతో ఆమె తెగ హడావుడి చేస్తున్నారని, వచ్చే నెల మూడో తేదీన బహిరంగ సభను నిర్వహిస్తామని కవిత చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. అసలు బీసీలకు, కవితకు ఏం సంబంధం ఉందని, బహిరంగ సభ నిర్వహించడానికి ఆమె ఎవరని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడే శక్తి బీసీలకు ఉందని, లిక్కర్ దందాలో ఆరునెలలు జైల్లో ఉండి వచ్చిన కల్వకుంట్ల కవిత నాయకత్వంలో సమస్యలు పరిష్కరించుకునేంత కర్మ తమకు పట్టలేదని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా అని నిలదీశారు. ఇప్పుడు బీసీలపై మొసలి కన్నీరు పెట్టి, కపట ప్రేమ కనబరిస్తే ఏం ప్రయోజనమని అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి స్థానిక ఎన్నికలు జరుపుతారని కవిత చెప్పడంలో వాస్తవం లేదని, లిక్కర్ కేసు నుంచి జనం దృష్టి మళ్లించడానికి ఆమె డ్రామాలు ఆడుతున్నారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు.

దేశ ప్రగతికి బాటలు వేసిన మన్మోహన్‌సింగ్
ఆయన మరణం దేశానికి తీరనిలోటు: బీసీ కమిషన్



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశ ప్రగతికి బాటలు వేశారని, ఆయన మరణం దేశానికి తీరనిలోటని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం బీసీ కమిషన్ చైర్మన్ కార్యాలయంలో మన్మోహన్ మృతిపట్ల కమిషన్ సభ్యులు సంతాపం ప్రకటించారు. అనంతరం మాట్లాడారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక సలహాదారుడిగా, ఆర్థిక మంత్రిగా దేశాన్ని ఆర్థిక స్థిరత్వం వైపు నడిపించడంలో మన్మోహన్‌సింగ్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు.

రేపు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలపనున్న సభ
- తెలంగాణ ఏర్పాటులో ఆయన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి
- సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. దేశాన్ని ఆర్థిక చిక్కుల నుంచి బయటపడేసి, అభివృద్ధి పథంలో పయనించేలా మార్గనిర్దేశం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించనుంది. దేశానికి మార్గం చూపిన ఆయనకు భారత రత్న ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాల అనంతరం ఈ నెల 21న సభ నిరవధికంగా వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే సభను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంకా ప్రోరోగ్ చేయకపోవడంతో.. ఈ నెల 30న సోమవారం ప్రత్యేక భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభించనున్నట్టు శాసనసభ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు శనివారం లేఖ విడుదల చేశారు. ఈ ప్రత్యేక సమావేశం ఒక్కరోజుకే పరిమితం చేయనున్నారు.

మన్మోహన్‌ను కొనియాడుతూ తీర్మానం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 3వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా పాటిస్తున్నాయి. ఈ క్రమంలో మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన కృషిని కొనియాడుతూ తీర్మానం చేయడం ద్వారా నివాళి అర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఆధునిక భారత దేశ ఆర్థిక సంస్కర్తగా పేరుగాంచిన మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేసే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ప్రత్యేక భేటీకి ప్రతిపక్ష నేత కేసీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి అర్పించేందుకు సోమవారం నిర్వహిస్తున్న అసెంబ్లీ ప్రత్యేక భేటీకి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మన్మోహన్ నేతృత్వంలోని కేబినెట్‌లో కొంతకాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్.. పలు సందర్భాల్లో ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సహకారాన్ని రికార్డుల్లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో కేసీఆర్ ప్రసంగించారు కూడా. ఈ నేపథ్యంలో మన్మోహన్ కృషిని కొనియాడుతూ, నివాళి అర్పించే అసెంబ్లీ ప్రత్యేక భేటీకి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలకు
హాజరైన సీఎం రేవంత్
నివాళులు అర్పించిన మంత్రులు పొంగులేటి, సీతక్క



మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని తరలిస్తున్న వాహనంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అశేష జనవాహిని అశ్రునయనాలు, అధికార లాంఛనాల మధ్య మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. శనివారం జరిగిన అంతిమయాత్రలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. పార్థివ దేహం తీసుకెళ్తున్న వాహనంలో రాహుల్ గాంధీ పక్కనే కూర్చున్న రేవంత్, నిగమ్‌బోధ్ ఘాట్ వరకు ఆయనతో కలిసి వెళ్లారు. అంతకుముందు ఏఐసీసీ కార్యాలయంలో మన్మోహన్ పార్థివ దేహానికి మంత్రులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీతక్క నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు అంతిమయాత్రలో పాల్గొని అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికారు.

శ్రద్ధాంజలి ఘటించిన కేటీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. అంత్యక్రియలు నిర్వహించిన నిగమ్‌బోధ్ ఘాట్‌లో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్ రావులతో కలిసి పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

ఘాటు తగ్గుతున్న మిర్చి!

భారీగా పడిపోతున్న మిర్చి ధర
- గత సీజన్‌తో పోల్చితే రూ.10 వేలు తగ్గుదల
- కొత్త పంట రాకతో పాత మిర్చికి తగ్గిన డిమాండ్
- నాణ్యత లేమితో పడిపోయిన ఎగుమతులు



కోల్డ్ స్టోరేజీల నుంచి ఖమ్మం మార్కెట్‌కు శుక్రవారం తీసుకొచ్చిన మిర్చి శాంపిళ్లు

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర గణనీయంగా పతనమవుతోంది. రెండు, మూడు రోజులుగా ధర బాగా పడిపోయింది. గత ఏడాది పంట సీజన్‌లో గరిష్టంగా క్వింటాలుకు రూ.22,300 పలికిన మిర్చి.. ప్రస్తుతం రూ.16 వేలకు దిగజారింది. మోడల్ ధర రూ.19 వేల నుంచి ఉండగా.. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.13 వేలకు మించి పలకడం లేదు. పంట సీజన్‌తో ధరతో పోలిస్తే ప్రస్తుతం దాదాపు రూ.10 వేల మేర ధర పడిపోయింది. ప్రస్తుతం గరిష్ట ధరలు రూ.16,700 నుంచి రూ.16 వేలుగా, మోడల్ ధర రూ.15 వేలు మొదలు రూ.13 వేల వరకు పలుకుతున్నాయి. దీంతో అధిక ధరలు ఆశించి మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొన్న వ్యాపారులు, రైతులు లబోదిబోమంటున్నారు.

నాణ్యత లోపం.. ఎగుమతుల మందగమనం

కొత్త పంట సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పుడు మార్కెట్‌కు వస్తున్న మిర్చి అంత నాణ్యంగా లేకపోవడం.. విదేశాలకు ఎగుమతులు మందగించడం వల్లనే ధర క్షీణిస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మంతోపాటు చుట్టుపక్కల జిల్లాలు, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో పండించే 'తేజ'రకం మిర్చిని చైనా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా చైనాకు ఎగుమతులు అధికంగా ఉంటాయి. ఏటా జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు చైనాలో పండుగ సీజన్. ఈ సమయంలో అక్కడ పరిశ్రమలు మూతపడతాయి. ఫలితంగా అక్కడి వ్యాపారులు పంటలను కొనుగోలు చేయరు. మిర్చి ధర పతనానికి ఇది ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. మిర్చి మొదటి కోతను మైలకాయ అంటారు. సాధారణంగా మైలకాయ నాణ్యత తక్కువగా ఉండడంతో ధర కూడా తక్కువ పలుకుతుంది. ఇది ఎగుమతులకు పనికిరాదు. కొత్త పంట రాకతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసిన మిర్చికి డిమాండ్ తగ్గుతుంది. దానిని పాత మిర్చిగానే లెక్కిస్తారు.

నిల్వ చేసి నష్టాల పాలు

గడిచిన పంట సీజన్‌లో సగటున క్వింటా మిర్చి ధర రూ.20 వేల వరకు పలకగా.. అన్ సీజన్‌లో రూ.25 వేలకు చేరుతుందని అంతా ఆశించారు. దీంతో ధర మరింత పెరిగిన తర్వాత అమ్ముకోవచ్చన్న ఆశతో వ్యాపారులు, రైతులు పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. కానీ వారి అంచనాలు తలకిందులయ్యాయి. రూ.22 వేలు మొదలు రూ.19 వేల వరకు ధర పలికిన సమయాన కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేయగా.. ఇప్పుడు ధర క్రమంగా పతనమవుతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఖమ్మం జిల్లాలోని కోల్డ్ స్టోరేజీల్లో ఇంకా 30 శాతం వరకు మిర్చి నిల్వలు ఉండిపోయాయి. తక్కువ ధరకు అమ్ముదామనుకున్నా కొనేవారు లేరు అని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర (క్వింటాలుకు రూ.ల్లో)

తేదీ	గరిష్ట ధర	మోడల్ ధర	కనిష్ట ధర
కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి			
డిసెంబర్ 20	16,700	14,000	6,500
23	16,625	14000	6,500
24	16,700	14,000	6,000
27	16,000	13,000	6,500
నాన్ ఏసీ మిర్చి			
డిసెంబర్ 20	16,569	14,000	5,000
23	16,218	15,000	6,000
24	16,218	12,300	5,500
27	15,606	12,000	5,000

పొరుగు 'సేవ'కు అందలం!

- ఏళ్లుగా చేసిన సర్వీసుకు బహుమతిగా ఉద్యోగ క్రమబద్ధీకరణ
- నిబంధనలు తోసిరాజని పట్టం.. ఫైళ్లు సిద్ధం చేసిన ట్రైకార్
- గతంలో ప్రభుత్వం తిరస్కరించినా వెనక్కి తగ్గని బోర్డు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ట్రైకార్)లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని క్రమబద్ధీకరించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. ఆయన సేవలను శాశ్వత ప్రాతిపదికన మార్పు చేసి సంస్థలో రెగ్యులర్ ఉద్యోగిగా నియమించేందుకు యత్నిస్తున్నారు. వచ్చే వారంలో జరిగే ట్రైకార్ బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని ఎజెండాలో చేర్చిన అధికారులు.. బోర్డు ఆమోదంతో ఆయన సర్వీసును క్రమబద్ధీకరించనున్నారు. వాస్తవానికి ఆయన సర్వీసును రెగ్యులరైజ్ చేసేందుకు గతంలోనూ అధికారులు ప్రయత్నించగా ప్రభుత్వస్థాయిలో బెడిసికొట్టింది. తాజాగా బోర్డు ఆమోదంతో ఉద్యోగ క్రమబద్ధీకరణ చేపట్టేందుకు అధికారులు పావులు కదుపుతున్నారు. దీనివెనుక మామూళ్ల పర్వం నడిచినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సెర్ప్ ఉద్యోగిగా చేరి...

ట్రైకార్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి... 2005లో సెర్ప్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరారు. అక్కడ కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా పనిచేసిన తర్వాత అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై ట్రైకార్‌లో చేరారు. అక్కడ చేరినప్పటి నుంచి గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్త పథకం అమలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం అమలులో భారీగా అవకతవకలు జరిగాయంటూ గిరిజన సంఘాలు ఆయనపై గతంలో పెద్ద ఎత్తున ఫిర్యాదు చేశాయి. అయితే వాటిపై ట్రైకార్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం డిప్యుటేషన్ కాలపరిమితి ముగిసినప్పటికీ అక్కడే కొనసాగుతూ వచ్చారు. డిప్యుటేషన్ గడువు ముగిసినా సెర్ప్ కార్యాలయంలో రిపోర్టు చేయకపోవడంతో సెర్ప్ ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2021 సెప్టెంబర్ 16న సెర్ప్‌లో తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. అప్పట్నుంచి ఆయన సర్వీసును ట్రైకార్‌లో క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీని నోటిఫికేషన్ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేదా పదోన్నతి పద్ధతిలో చేపడతారు. అత్యవసర సమయంలో ప్రభుత్వంలో శాశ్వత ప్రాతిపదికన నియమితుడైన ఉద్యోగిని డిప్యుటేషన్‌పై నియమించి నిర్ణీత సర్వీసు పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం ఆ ఉద్యోగిని శాఖలో విలీనం చేసి ఆ ఖాళీని భర్తీ చేసే వెసులుబాటు ఉంది. కానీ అలాంటి నిబంధనలేవీ పట్టించుకోని ట్రైకార్... తాజాగా ఉద్యోగిని శాఖలో విలీనం చేసేలా వ్యూహాన్ని రచించి వచ్చే నెల 2న జరిగే బోర్డు సమావేశం ఎజెండాలో చేర్చడం గమనార్హం.

బీసీలు రాజ్యాధికారం దిశగా సాగాలి

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను తక్షణం అమలు చేయాలి
- బీసీల మేధోమథనంలో వక్తల పిలుపు



బీసీల మేధోమథన సదస్సులో మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: భారతదేశంలో 75 కోట్లమంది బీసీలు ఉన్నారని, అందులో నాలుగు వేలకుపైగా కులాలు ఉండగా, 3,800 కులాలు ఇప్పటివరకు కనీసం వార్డుమెంబర్ కూడా కానివి ఉండటం బాధాకరమని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్నా బీసీలను ఇప్పటికీ రాజకీయ అంటరానివారిగా చూడటం సరికాదని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బీసీలు చైతన్యవంతులై వారి ఓట్లు వారే వేసుకుని, బీసీల రాజ్యాధికారం దిశగా అడుగులు వెయ్యాలని పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ సామాజిక న్యాయ వేదిక, బీసీ రాజకీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో '75 ఏళ్ల భారత రాజ్యాంగంలో రాజకీయ అంటరానితనంలో బీసీలు'అనే అంశంపై బీసీల మేధోమథన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ రాజకీయ వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.మురళీమనోహర్, ప్రధాన కార్యదర్శి దేవళ్ల సమ్మయ్య, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరువల్లే బీసీలు రాజకీయ అంటరానివారిగా అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా, రాజకీయ ప్రాతినిధ్యం సాధించకుండా సమాజంలో అసమానతలు తొలగిపోవడం అసాధ్యమని వారు పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ అందులో కులాలవారీగా విడదీసి రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం బీసీ మేధావుల సదస్సు మాత్రమే అని, జనవరి మొదటివారంలో బీసీ కుల సంఘాలు, రాజకీయ నాయకులతో భారీ సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ నరేంద్రబాబు, ప్రొఫెసర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో స్ప్రింగ్ ఫెస్ట్ 66వ ఎడిషన్

- జనవరి 26 నుంచి 28 వరకు ఫైనల్స్
- హిచ్ హైక్ పేరుతో సాంస్కృతిక కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక సాంకేతిక విద్యాసంస్థ ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం 'స్ప్రింగ్ ఫెస్ట్'66వ ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. జనవరి 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు ఖరగ్‌పూర్ వేదికగా 'హిచ్ హైక్'పేరుతో ఈ వేడుకను నిర్వహించనున్నారు. డ్యాన్స్, డ్రామా, మ్యూజిక్, ఫ్యాషన్ తదితర 13 విభాగాల్లో ఇప్పటికే ప్రిలిమినరీ రౌండ్ పోటీని దేశవ్యాప్తంగా హైదరాబాద్, విశాఖపట్నం సహా పది నగరాల్లో నిర్వహించారు. మలిదశలో కోల్‌కతా, భువనేశ్వర్, పట్నా, రాంచీ, గువాహటి, రాయ్‌పూర్‌లో ఎలిమినేషన్ రౌండ్స్ నిర్వహిస్తారు. స్ప్రింగ్ ఫెస్ట్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన రాక్ బ్యాండ్ పోటీ 'బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్-వైల్డ్‌ఫైర్'ను ఢిల్లీ, కోల్‌కతా, షిల్లాంగ్‌లో నిర్వహించి విజేతలకు రూ.1.5 లక్షల బహుమతి అందిస్తారు. అన్ని విభాగాలకు కలిపి విజేతలకు రూ.35 లక్షల నగదు బహుమతి అందించనున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను, సామాజిక స్పృహను వెలికితీయడమే లక్ష్యంగా పోటీలకు అంకురార్పణ చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం 2 మిలియన్లకుపైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా 800 కళాశాలల నుంచి విద్యార్థులు 3 రోజులపాటు నిర్వహించే ఫైనల్స్‌కు వస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు www.springfest.inలో నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలు వెళ్లాయి..
తిరిగి వచ్చాయి!
నాగార్జునసాగర్ డ్యాంపై హైడ్రామా




శనివారం సాయంత్రం తిరిగి విధుల్లోకి వచ్చిన సీఆర్‌పీఎఫ్ బలగాలు

నాగార్జునసాగర్: గత సంవత్సర కాలంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షిస్తూ విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం ఉదయం విధుల నుంచి తప్పుకుని వెళ్లిపోయి.. తిరిగి సాయంత్రం విధుల్లో చేరాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2013 నవంబర్ 29న నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్రా పోలీస్ బలగాలు సగం ప్రాజెక్టును స్వాధీనంలోకి తీసుకున్నాయి. దీంతో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశాల మేరకు అదే సంవత్సరం డిసెంబర్ 3వ తేదీ నుంచి కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. సీఆర్‌పీఎఫ్ బలగాలు సాగర్ ప్రాజెక్టును తమ అధీనంలోకి తీసుకొని భద్రతా విధులు నిర్వహిస్తున్నాయి. సాగర్‌డ్యాంపై తెలంగాణ వైపు, ఆంధ్రా ప్రాంతంవైపు రెండు పక్కలా సీఆర్‌పీఎఫ్ దళాలు విధులు నిర్వహిస్తూ వచ్చాయి. అయితే, అకస్మాత్తుగా శనివారం తెల్లవారుజామున తెలంగాణ వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు తమ విధులను ఉపసంహరించుకొని హిల్‌కాలనీలోని బాలవిహార్‌లోగల తమ క్యాంపులను ఖాళీ చేసి వెళ్లిపోయాయి. ఆంధ్రా వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు యథావిధిగానే ఉన్నాయి. దీంతో తెలంగాణ వైపు ప్రధాన డ్యాంపై స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) బలగాలు డ్యాంను తమ అధీనంలోకి తీసుకొని విధులు నిర్వహించాయి. శనివారం తెల్లవారుజామున వెళ్లిపోయిన సీఆర్‌పీఎఫ్ బలగాలు తిరిగి సాయంత్రానికి సాగర్‌లోని తమ క్యాంపులకు చేరుకొని నాగార్జునసాగర్ డ్యాం భద్రతా విధులలో చేరాయి. ఆంధ్రా వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు అదేవిధంగా ఉండటంతో.. తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు తిరిగి సాగర్ ప్రాజెక్టు విధి నిర్వహణకు వచ్చినట్లుగా తెలుస్తోంది. సాగర్ ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఎవరూ దీనిపై సమాధానం చెప్పడం లేదు. సాయంత్రం తిరిగి చార్జ్ తీసుకున్న సీఆర్‌పీఎఫ్ దళాల అసిస్టెంట్ కమాండర్ షహేర్ మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున విధులను ఉపసంహరించుకొని వెళ్లిపోయామని, తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాలతో తెలంగాణ వైపు చార్జి తీసుకున్నట్లుగా తెలిపారు. సరైన ఉత్తర్వులు వచ్చే వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందన్నారు.

ఆర్థిక అంతరం పెరుగుతోంది

గ్రామీణ తెలంగాణతో పోలిస్తే అర్బన్ తెలంగాణలో 60 శాతం అధిక ఖర్చు
రూరల్ తెలంగాణలో సగటున నెలకు రూ. 5,675 తలసరి ఖర్చు
అదే అర్బన్ తెలంగాణలో రూ.9,131..
రెండింటి మధ్య తేడా రూ. 3,456
నెలవారీ ఖర్చు వివరాలు వెల్లడించిన కేంద్రం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య తలసరి ఖర్చు వ్యత్యాసం పెరుగుతోంది. గ్రామీణ తెలంగాణలో నెలవారీ తలసరి ఖర్చు రూ.5,675 కాగా, అర్బన్ తెలంగాణలో అది రూ.9,131గా ఉన్నట్లు తేలింది. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ 'గృహ వినియోగ వ్యయ సర్వే-2024'పేరుతో వెల్లడించిన నివేదికలో ఈమేరకు వెల్లడైంది. దీని ప్రకారం రెండు ప్రాంతాల మధ్య వ్యత్యాసం రూ.3,456 కాగా, గ్రామీణ ప్రజల కంటే పట్టణ ప్రజల తలసరి 60 శాతం ఎక్కువ ఖర్చు పెడుతున్నట్లు వెల్లడైంది. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కూడా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఖర్చులో తేడా తెలంగాణలోనే ఎక్కువగా ఉండటం గమనార్హం.

సిక్కిం టాప్..

దేశంలో తలసరి నెల వారీ ఖర్చులో ఈశాన్య రాష్ట్రమైన సిక్కిం టాప్‌గా నిలిచింది. ఇక్కడి గ్రామీణ ప్రాంత ప్రజలు నెలకు రూ.9,474 ఖర్చు చేస్తుండగా, పట్టణ సిక్కిం వాసులు రూ.13,675 ఖర్చు చేస్తున్నారు. అన్నిటికంటే తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిచింది. ఈ రాష్ట్రంలో గ్రామీణ తలసరి ఖర్చు రూ. 2,927 కాగా, పట్టణ ప్రాంతాల్లో ఇది రూ.5,114గా నమోదైంది. కేంద్రపాలిత ప్రాంతాల్లో పరిశీలిస్తే చండీగఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రజలు రూ. 8,857, పట్టణ ప్రజలు రూ.13,425 ఖర్చు చేస్తున్నారు. అన్నింటికంటే తక్కువగా దాద్రానగర్ హవేలీ, డామన్‌డయ్యూ గ్రామీణ ప్రజలు నెలకు రూ.4,450, జమ్మూకశ్మీర్‌లోని పట్టణ ప్రజలు రూ.6,375 ఖర్చు చేస్తున్నారు. దేశ సగటును చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,247, పట్టణ ప్రాంతాల్లో రూ.7,078 చొప్పున నెలకు ఖర్చవుతోంది.

తిండి ఖర్చు 40 శాతం లోపే..

తలసరి ఖర్చులో గ్రామీణ, ప్రాంతాల భారతీయులు ఆహారం కోసం ఆదాయంలో 40 శాతం లోపే ఖర్చు చేస్తున్నారని ఈ సర్వేలో వెల్లడైంది. ఆహారేతర అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో 53 శాతం, పట్టణ ప్రాంతాల్లో 60 శాతం ఖర్చు చేస్తున్నట్లు తేలింది. ఈ కేటగిరీలో ఇంటి అద్దెల కోసం ఎక్కువగా వెచ్చిస్తున్నట్లు వెల్లడైంది. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ ఈ సర్వే నిర్వహించింది. ఆగస్టు 2022 నుంచి జూలై 2023 వరకు మొదటి విడత, ఆగస్టు 2023 నుంచి జూలై 2024 మధ్య రెండోవిడతలో దేశంలోని 2,61,953 కుటుంబాల నుంచి శాంపిళ్లు సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఇచ్చే ఉచితాలు కలిపి ఓ సర్వే, ఉచితాలను తీసివేసి మరో సర్వే నిర్వహించారు.

దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి నెల వ్యయం ప్రాంతాల వారీగా..

రాష్ట్రం	అర్బన్	రూరల్	తేడా
తెలంగాణ	9,131	5,675	3,456
కర్ణాటక	8,169	5,068	3,101
తమిళనాడు	8,325	5,872	2,453
ఆంధ్రప్రదేశ్	7,341	5,539	1,802
కేరళ	7,834	6,673	1,161

దేశంలోని మరికొన్ని ప్రధాన రాష్ట్రాల్లో తలసరి ఖర్చు వివరాలు

రాష్ట్రం	అర్బన్	రూరల్
పంజాబ్	7,383	5,874
హరియాణా	8,462	5,449
మహారాష్ట్ర	7,415	4,249
మధ్యప్రదేశ్	5,589	3,522
ఉత్తరప్రదేశ్	5,474	3,578
గుజరాత్	7,198	4,190

గ్రామీణ తెలంగాణను అభివృద్ధి చేయాలి




దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు, తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు మధ్య తేడా ఉంది. కేరళ, తమిళనాడులో గ్రామీణ ప్రజలకు అసంఘటిత రంగంలో ఉపాధి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 150 ఏళ్లుగా రెండు బ్యారేజీలు అందుబాటులో ఉండటం, విద్యాస్థాయి ఎక్కువ ఉన్న కారణంగా రెండు ప్రాంతాల మధ్య వ్యయ తారతమ్యం తక్కువ ఉంటుంది. బెంగళూరు మినహా దక్షిణాది రాష్ట్రాల్లోని ఏ అర్బన్ ప్రాంత ఆదాయాన్ని కూడా హైదరాబాద్ ఆదాయంతో పోల్చలేం. అయితే, తెలంగాణలో గ్రామీణ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. ఈ కారణాలతోనే గ్రామీణ ప్రాంతాల తలసరి ఖర్చు తక్కువగా ఉంటోంది. గ్రామీణ తెలంగాణను అభివృద్ధి చేయడమే ఇందుకు ఏకైక మార్గమని ఈ నివేదిక ద్వారా అర్థమవుతోంది.

–డాక్టర్ అందె సత్యం, ఆర్థిక విశ్లేషకులు

కేసుల వివరాలు ఇవ్వండి

ఎంపీ రఘునందన్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను నివేదించాలని బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావును హైకోర్టు ఆదేశించింది. కేసుల వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. అలాగే రఘునందన్‌రావుకు పాస్‌పోర్టును ఎందుకు రెన్యువల్ చేయలేదో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. పాస్‌పోర్టును రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ రెన్యువల్ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ రఘునందన్‌రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మౌసమీ భట్టాచార్య పై వివరాలు నివేదించాలని ఇరుపక్షాలను ఆదేశించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. క్రిమినల్ కేసులున్నాయని చెప్పి పాస్‌పోర్టును రెన్యువల్ చేయకపోవడం పలు కోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. దీనిపై కేంద్రం తరఫు న్యాయవాది స్పందిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘానికి, పాస్‌పోర్టు అధికారులకు పిటిషనర్ స్వయంగా తనపై కేసుల వివరాలను అందజేశారని తెలిపారు.

తల్లిదండ్రుల్లో ఒకరి సంతకం సరిపోతుంది

మైనర్ పాస్‌పోర్ట్‌పై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మైనర్ పిల్లలకు పాస్‌పోర్టు జారీ పత్రాలపై తల్లిదండ్రులు ఇద్దరూ సంతకాలు చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు వెల్లడించింది. వారిద్దరిలో ఏ ఒక్కరి సంతకం ఉన్నా సరిపోతుందని స్పష్టంచేసింది. చట్టప్రకారం మైనర్ పిల్లలు రక్షణలో ఉన్న సింగిల్ పేరెంట్ సంతకంతో జారీ చేయొచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. తండ్రి సంతకం లేదని చెప్పి పాస్‌పోర్ట్ జారీకి అధికారులు నిరాకరించడాన్ని నాలుగేళ్ల జైనాబ్ అలియా మహమ్మద్ అనే బాలిక తరఫున తల్లి పిటిషన్ వేశారు. దీన్ని న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తల్లి డాక్టర్ సనా ఫాతిమా భర్త అబ్దుల్ ఖదీర్‌కు అమెరికా పౌరసత్వం ఉందని న్యాయవాది వివరించారు. ముస్లిం వివాహ చట్టం ప్రకారం వారి పెళ్లి రద్దయిందని, ఈ వివాదం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు విచారణలో ఉందని తెలిపారు. పిటిషనర్ తన కుమార్తెకు పాస్‌పోర్ట్ నిమిత్తం దరఖాస్తు చేసుకుంటే అమెరికాలో ఉండే బాలిక తండ్రి సంతకం లేదని చెప్పి పాస్ట్‌పోర్ట్ అధికారి నిరాకరించారని చెప్పారు. దీనిపై కేంద్రం తరఫు న్యాయవాది వాదిస్తూ, తండ్రి దేశ పౌరసత్వాన్ని వదులుకున్నారని, ఈనేపథ్యంలో పాస్‌పోర్ట్ జారీకి అధికారులు నిరాకరించారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, మైనర్ పిల్లలకు సింగిల్ పేరెంట్ దరఖాస్తు చేయరాదని పాస్ట్‌పోర్టు యాక్ట్–1967, అలాగే 1980లో వెలువడిన రూల్స్‌లో ఎక్కడా లేదని గుర్తు చేసింది. పిటిషన్‌పై విచారణను ముగించింది.

వెటర్నరీ వర్సిటీ వీసీ ఎంపికపై సీఎస్, అధికారుల భేటీ


సాక్షి, హైదరాబాద్: పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఎంపికపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు అక్టోబర్‌లోనే వైస్ చాన్స్‌లర్‌లను ఎంపిక చేసినప్పటికీ, వెటర్నరీ యూనివర్సిటీకి మాత్రం నియామకం జరపలేదు. ఈ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నియామకం కోసం ప్రభుత్వం గతంలో సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఇన్‌చార్జి వీసీగా ఉన్న పశుసంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు చెన్నై, ఢిల్లీకి చెందిన ఇద్దరు నిపుణులు, ఐసీఏఆర్ అధికారులు, పశువైద్య విశ్వవిద్యాలయాల వీసీలు ఈ కమిటీలో ఉన్నారు. ఈ పోస్టు కోసం దేశవ్యాప్తంగా 40 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వీసీ కోసం దరఖాస్తు చేసుకున్నవారి దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలించి, వారిలో ముగ్గురిని మాత్రమే ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపిస్తే, వారి నుంచి ఒకరిని ప్రభుత్వం ఎంపిక చేసి గవర్నర్ ఆమోదానికి పంపిస్తుంది. ఈ నేపథ్యంలో శనివారం వీసీ ఎంపిక కోసం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షతన సమావేశం జరిగినట్లు తెలిసింది. సమావేశంలో సీఎంఓ ఉన్నతాధికారి, పశుసంవర్థక శాఖ డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ, వెటర్నరీలు పాల్గొన్నట్లు సమాచారం. సమావేశంలో వెటర్నరీ యూనివర్సిటీ వీసీకి అర్హులను ఎంపిక చేసినట్లు సమాచారం.

రేపు నల్లగొండలో సీపీఐ బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు సీనియర్ నేతలు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటీ నరసింహతో కలిసి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువైన నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాల మైదానంలో 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఈ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల ప్రారంభ సభకు ప్రధాన వక్తలుగా సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు హాజరు కానున్నారని చెప్పారు.

పుస్తకం చదివితేనే నిజమైన అనుభూతి

- ఆడియో పుస్తకాలు, ఈ–బుక్స్, ట్యాబ్స్ అలాంటి అనుభూతిని ఇవ్వలేవు
- రచయితకు, పాఠకుడికి మధ్య అనుబంధమే పుస్తకం
- పెళ్లిళ్లు, వేడుకల్లో పుస్తకం బహుమతిగా ఇవ్వండి
- హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



పుస్తకాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో మామిడి హరికృష్ణ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రచయితకు, పాఠకుడికి మధ్య ఒక అనిర్వచనీయమైన అనుబంధాన్ని ముడివేసేది పుస్తకమేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. చేతుల్లో పుస్తకాన్ని పట్టుకొని చదివినప్పుడు మాత్రమే నిజమైన పుస్తక పఠన అనుభూతిని ఆస్వాదించగలమని చెప్పారు. పాఠకుడు, రచయిత కలిసి సంభాషించుకుంటున్నట్లుగా ఉంటుందన్నారు. ఆడియో పుస్తకాలు, ఈ–బుక్స్, ట్యాబ్స్, కంప్యూటర్లు అలాంటి అనుభూతిని ఇవ్వలేవని, అవి కేవలం మిషన్లు మాత్రమేనని పేర్కొన్నారు. గవర్నర్ శనివారం హైదరాబాద్ పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. పుస్తకమే జ్ఞానం, పుస్తకాన్ని మించిన గొప్ప సహచర్యం మరొకటి లేదని గవర్నర్ చెప్పారు. మానవ నాగరికతా పరిణామం, మహోన్నతమైన భారతీయ సాంస్కృతిక జీవన విధానం, వేదాలు, ఉపనిషత్తులు తదితర సాహిత్యమంతా పుస్తకంలోనే నిక్షిప్తమై ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ పుస్తకాన్ని ఏమాత్రం భర్తీ చేయలేదన్నారు. కాలనీలు, బస్తీల్లో కమ్యూనిటీ లైబ్రరీలను విరివిగా ప్రోత్సహించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో జాతీయ స్థాయిలో అద్భుతమైన పుస్తక ప్రదర్శనలు జరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

పుస్తకం బహుమతిగా ఇవ్వండి

సభలు, సమావేశాలు, వేడుకల్లో పుష్పగుచ్ఛాలకు బదులు పుస్తకాలను బహుమతిగా ఇచ్చే సంప్రదాయాన్ని పాటించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. పెళ్లిళ్లు, పండుగల్లోనూ పుస్తకాలు బహుమతిగా ఇవ్వడం ద్వారా మంచి పుస్తక పఠనాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. పుస్తక ప్రదర్శనను సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. పుస్తకాలు ప్రతి ఒక్కరూ చదవాలని, చదివించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుక్ డొనేషన్ బాక్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. దాతల నుంచి సేకరించిన పుస్తకాలను గ్రామాల్లోని గ్రంథాలయాలకు, విద్యార్థులకు అందజేసేందుకు బుక్ ఫెయిర్ కమిటీ ఈ బాక్సును ఏర్పాటు చేసింది. తెలంగాణ సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ సంస్థ, అక్షరయాన్ తదితర స్టాళ్లను గవర్నర్ ఆసక్తిగా సందర్శించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ అధ్యక్షుడు, కవి యాకుబ్ మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శన విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థల చైర్మన్ రియాజ్, బుక్‌ఫెయిర్ కమిటీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకానికి పట్టం

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 19న ప్రారంభమైన పుస్తక ప్రదర్శన శనివారం 9వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు సుమారు 10 లక్షల మందికిపైగా ప్రజలు పుస్తక ప్రదర్శనను సందర్శించినట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. 350 స్టాళ్లలో కనీసం రూ. 15 కోట్ల విలువైన పుస్తకాలు అమ్ముడైనట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు సైతం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బుక్ ఫెయిర్ వేదికగా పదుల సంఖ్యలో కొత్త పుస్తకాల ఆవిష్కరణ సాగింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సైతం శనివారం బుక్ ఫెయిర్‌ను సందర్శించి పలు స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు.

జైకొట్టిన యువత..

ఈసారి యువతరం పుస్తక ప్రదర్శనకు భారీగా తరలివచ్చింది. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతోపాటు నవలలు, కథల పుస్తకాలు, చరిత్ర గ్రంథాలను యువతీయువకులు విరివిగా కొనుగోలు చేశారు. హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి తరలివచ్చిన వేలాది మంది చిన్నారులతో పుస్తక ప్రదర్శన ప్రతిరోజూ కళకళలాడింది. దశాబ్దాలు, శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరని పాఠకాదరణ కలిగిన గురజాడ కన్యాశుల్కం, గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర, బుచ్చిబాబు చివరకుమిగిలేది, శ్రీదేవి కాలాతీత వ్యక్తులు, మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం వంటి పుస్తకాలు పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. రాజ్యాంగంపై ఆంగ్లం, తెలుగు భాషల్లో వెలువడిన పుస్తకాలను చాలా మంది కొనుగోలు చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల పాలన తదితర పుస్తకాలపట్ల కూడా పాఠకులు ఆసక్తి చూపారు. సామాజిక మాధ్యమ శైలిని అనుకరిస్తూ వెలువడుతున్న నవతరం రచయితల పుస్తకాలకు సైతం ఆదరణ లభించింది. ప్రముఖుల జీవిత చరిత్ర గ్రంథాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలను కూడా పాఠకులు అక్కునజేర్చుకున్నారు.

నేటితో ముగింపు

హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన నేటితో ముగియనుంది. సాయంత్రం 5:30 గంటలకు జరిగే ముగింపు వేడుకల్లో మంత్రి జూపల్లి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరుకానున్నారు.

భక్తి పుస్తకాలు కొన్నా



పుస్తకప్రదర్శన చాలా బాగుంది. నాకు శ్రీకృష్ణుడు అంటే ఎంతో ఇష్టం, భక్తి. అందుకే భక్తి పుస్తకాలే ఎక్కువగా కొన్నా. నవలలు, కథల పుస్తకాలు కూడా బాగున్నాయి.

– కృతిక, డిగ్రీ విద్యార్థిని, హయత్‌నగర్

యద్దనపూడి, యండమూరి నవలల కోసం వచ్చా



గతంలో చదివినప్పటికీ మరోసారి యండమూరి వీరేంద్రనాథ్, యద్దనపూడి సులోచనా రాణి నవలల కోసం వచ్చా. అన్ని స్టాళ్లలో సాహిత్యం పుస్తకాలు చాలా ఉన్నాయి. ప్రదర్శన బాగుంది.

– రాధాకృష్ణ, హైటెక్‌సిటీ

పండుగలా ప్రదర్శన



పుస్తక ప్రదర్శన పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. యువత పెద్ద ఎత్తున వస్తున్నారు. పుస్తకాలు కొంటున్నారు. ప్రచురణ సంస్థలు సైతం అమ్మకాలపట్ల సంతోషంగా ఉన్నాయి. జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు తరలి వస్తున్నారు. ప్రదర్శన విజయవంతంగా కొనసాగుతోంది.

– వాసు, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ కార్యదర్శి

పుస్తక పఠనం పెరిగింది



ప్రదర్శనకు వచ్చిన సందర్శకులను చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తోంది. ఏటేటా లక్షలాది మంది పుస్తకప్రియులు వస్తూనే ఉన్నారు. ఇది ఆహ్వానించదగ్గ గొప్ప పరిణామం. పుస్తక పఠనం బాగా పెరిగిందనేందుకు పెరిగిన సందర్శకుల సంఖ్యే నిదర్శనం. తల్లిదండ్రులు పిల్లలతో కలిసి రావడం, కావల్సిన పుస్తకాలు కొనడం శుభపరిణామం. పుస్తకాలు చదవకపోవడం వల్ల పిల్లలు ఏం కోల్పోతున్నారో పెద్దలు గుర్తించినట్లుంది.

– ఆనంద్, ప్రముఖ వ్యాఖ్యాత/ ఆంజనేయరెడ్డి, రిటైర్డ్ అధికారి

సాగు భూమికే రైతుభరోసా

- శాటిలైట్ సర్వే ద్వారా సాగు విస్తీర్ణం వివరాల సేకరణ
- గ్రామాలు, పంట రకాలు, సర్వే నంబర్లవారీగా అధ్యయనం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి
- ఈ నెల 26నే ‘సాగు రైతుకే భరోసా’ కథనంలో ఈ అంశాన్ని వెల్లడించిన ‘సాక్షి’



సాక్షి, హైదరాబాద్: పంటలు సాగుచేసిన భూమికే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందుకోసం శాటిలైట్ సర్వే ద్వారా రిమోట్ సెన్సింగ్ డేటాను వినియోగించనున్నట్లు తెలిపారు. సర్వే నంబర్లవారీగా సాగులో ఉన్న భూమి విస్తీర్ణంతోపాటు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైందనే వివరాలను రిమోట్ సెన్సింగ్ డేటాతో పొందవచ్చని చెప్పారు. ఇదే విషయాన్ని ఈ నెల 26వ తేదీన ‘సాగు రైతుకే భరోసా’శీర్షికతో ప్రచురితమైన కథనంలో ‘సాక్షి’వెల్లడించింది. ఈ సంక్రాంతి నుంచి ‘రైతుభరోసా’ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం సచివాలయంలో రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసే వివిధ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమావేశమయ్యారు.

రిమోట్ సెన్సింగ్ డేటానే కీలకం

సాగు చేసిన భూముల వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు నమోదుచేస్తామని మంత్రి వెల్లడించారు. పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటాలో గ్రామాల వారీగా, సర్వే నంబర్ల వారీగా సాగుభూమి, పంటల వివరాలను సేకరిస్తామని చెప్పారు. సాగు భూముల విస్తీర్ణం, సాగుకు అనువుగా లేని భూముల విస్తీర్ణంతో పాటు ప్రస్తుతం ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైందనే వివరాలను పక్కాగా నమోదు చేస్తామని తెలిపారు. ఈ వివరాలను రైతుభరోసా పథకంతోపాటు, పంటల బీమా పథకానికి కూడా వినియోగిస్తామని పేర్కొన్నారు. పంటల ఆరోగ్య స్థితి, పంటల ఎదుగుదల, చీడపీడలను ఆరంభంలోనే గుర్తించడం, వరదలు, తుఫాన్‌ల వల్ల జరిగే పంటనష్టాన్ని అంచనా వేయడంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులు తమ సంస్థల ద్వారా ఇంతకు ముందు చేపట్టిన ప్రాజెక్టుల గురించి వివరించారు. నమూనా సర్వే కింద రెండు మండలాల్లో పంటలు, గ్రామాల వారీగా సాగైన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. సాగుకు అనువుగా లేని ప్రాంతాలను డిజిటల్ మ్యాప్స్ ద్వారా చూపించారు. పంటలను సోకే చీడపీడలను ఆరంభంలోనే గుర్తించే విధంగా ఆయా కంపెనీలు ఏఐ పరిజ్ఞానంలో తయారు చేసిన మోడల్స్‌ను వివరించారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ వీటన్నిటిని పరిశీలించి మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం మేరకు, కేబినెట్ ఆమోదానికి పంపించడం జరుగుతుందని మంత్రి తుమ్మల తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు షురూ

నల్లగొండ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభానికి ముందు పట్టణంలో ఉపాధ్యాయులు మహాప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీగార్డెన్స్‌కు మహాప్రదర్శన చేరిన అనంతరం టీఎస్‌యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు ఆంజనేయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని సంఘం సీనియర్ నాయకుడు పి.విద్యాసాగర్‌రెడ్డి ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వి.బంగారయ్య ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మహాసభల్లో ప్రారంభోపన్యాసం చేస్తూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో అక్షరాస్యత పెరగలేదన్నారు. ప్రభుత్వ కార్పొరేట్ సంస్థల చేతిలో విద్యా వ్యవస్థ బందీగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవోల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. మత, ప్రాంత భావాలను విద్యార్థుల నుంచి తొలగించే విధంగా విద్యాబోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మహాసభల ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యా డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆది, సోమవారం ప్రతినిధుల సభ జరుగుతుంది. చివరి రోజు రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటారు. కాగా, విద్యా వ్యవస్థను ముందుకు తీసుకుపోయి దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



శనివారం నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

7న విచారణకు రండి

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. ముగ్గురినీ ఆయా తేదీల్లో శుక్రవారం వేర్వేరుగా సమన్లు జారీ చేసింది. ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో హాజరుకావాలని ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ ఆ సమన్లలో పేర్కొన్నారు.

ఏసీబీ కంటే దూకుడుగా..

హైదరాబాద్ నగరంలో ఫార్ములా–ఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లించారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. దీనిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా, అప్పటి హెచ్ఎండీఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిని ఏ3గా చేర్చింది. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగానే మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఈడీ కేసు నమోదు చేసింది. అయితే ఏసీబీ దర్యాప్తు కన్నా ఈడీ మరింత దూకుడుగా ముందుకు వెళుతోంది. నిందితులను విచారించేందుకు సమన్లు జారీ చేసింది. ఈడీ దర్యాప్తులో గుర్తించే అంశాల ఆధారంగా.. కేసులో ముందుకు వెళ్లనుంది. ఇదే సమయంలో ‘ఫెమా’ కింద కూడా ఈడీ దర్యాప్తు కొనసాగుతున్నట్టు తెలిసింది.

నిధుల మళ్లింపుపైనే ఈడీ ఫోకస్..

ఫార్ములా–ఈ కార్ రేస్ సీజన్–10 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర మున్సిపల్ విభాగం (ఎంఏయూడీ), ఫార్ములా–ఈ రేసు నిర్వహణ సంస్థ ఎఫ్ఈవో (ఫార్ములా–ఈ ఆపరేషన్స్) సంయుక్తంగా సిద్ధమయ్యాయి. రేసు నిర్వహణకు సంబంధించి స్పాన్సర్ ఫీజు, పన్నులు కలిపి మొత్తం రూ.110 కోట్లు (90,00,000 బ్రిటన్ పౌండ్లు)ను ఎఫ్ఈవోకు చెల్లించేలా 2023 అక్టోబర్ 30న కొత్త ఒప్పందం చేసుకున్నారు. కానీ అంతకన్నా ముందే నిధులు చెల్లించాలంటూ సెప్టెంబర్ 25న తొలి వాయిదాగా 22,50,000 పౌండ్లు (మన కరెన్సీలో రూ.22,69,63,125), 29వ తేదీన రెండో వాయిదాగా 22,50,000 పౌండ్లు (అయితే పన్నులు, కమిషన్ కలిపి రూ.23,01,97,500) చెల్లించాలంటూ ఎఫ్ఈవో ఇన్వాయిస్‌లు పంపింది. దీనిపై అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ప్రొసీడింగ్స్‌ను పూర్తి చేశారు. అక్టోబర్ 3న మొదటి వాయిదా కింద రూ.22,69,63,125, అక్టోబర్ 11న రెండో వాయిదా కింద రూ.23,01,97,500 మంజూరు చేశారు. ఈ మొత్తం హెచ్ఎండీఏ బోర్డ్ ఖాతా నుంచే బ్రిటన్‌కు బదిలీ అయినట్టు ఈడీ గుర్తించింది. దీనిపై బీఎల్ఎన్ రెడ్డిని విచారించాలని నిర్ణయించింది. హెచ్ఎండీఏ బోర్డు నుంచి బదిలీ అయిన రూ.45.71 కోట్లు, పెనాల్టీగా ఐటీ శాఖకు చెల్లించిన రూ.8 కోట్లు కలిపి మొత్తం రూ.54.89 కోట్లకు సంబంధించిన వివరాలను రాబట్టనుంది. ఎవరి ఆదేశాలతో ఇది చేశారు? ఇందుకు సంబంధించిన పత్రాలు, హెచ్ఎండీఏ రికార్డులపై ఈడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. అదేవిధంగా అనుమతుల వ్యవహారాలు, అప్పటి మంత్రి కేటీఆర్ నుంచి వచ్చిన ఆదేశాలతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరించాల్సి వచ్చిందన్న కోణంలో ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ప్రశ్నించనున్నట్టు తెలిసింది. వీరి నుంచి సేకరించే అంశాల ఆధారంగానే కేటీఆర్‌ను ఈడీ అధికారులు విచారించే అవకాశం ఉంది.

పాట పాడుతున్న హిమాన్షు



కేటీఆర్ కొడుకు నోట ‘తండ్రి పాట’

- నా సూర్యుడివి.. నా చంద్రుడివి.. హిమాన్షు గానం
- సంక్లిష్ట ఏడాదిలో గొప్ప కానుక అంటూ కేటీఆర్ భావోద్వేగం

సాక్షి, హైదరాబాద్: తన పుట్టినరోజు సందర్భంగా కుమారుడు హిమాన్షు గానం చేసి రికార్డు చేసిన పాటను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా తన కుమారుడితో అనుబంధాన్ని చాటుకుంటూ చేసిన భావోద్వేగ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ‘అత్యంత సంక్లిష్ట ఏడాదిలో ఇదే నాకు అత్యుత్తమ కానుక. థ్యాంక్యూ బింకూ.. నీ గాత్రానికి మంత్రముగ్ధుడినయ్యా.. నా పుట్టినరోజు కోసం నా కుమారుడు హిమాన్షు గత జూలైలో ఈ పాటను రికార్డు చేశాడు. అయితే పాట అంతబాగా రాలేదనే ఉద్దేశంతో పాటను బయటపెట్టలేదు. కానీ నేను గతవారం మొదటిసారిగా ఈ పాటను విన్నా. తండ్రిగా ఎంతో గర్విస్తున్నా’అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 4 నిమిషాల 51 సెకన్ల నిడివి ఉన్న ఈ పాటలో ‘‘నా సూర్యుడివి.. నా చంద్రుడివి.. నా దేవుడివి నువ్వే.. నా కన్నులకు నువ్వు వెన్నెలవి.. నా ఊపిరివి నువ్వే.. నువ్వే కదా.. నువ్వే కదా.. సితార నా కలకు.. నాన్నా నువ్వు నా ప్రాణం అనినా సరిపోదట ఆ మాట.. నానా నీకై ప్రాణం ఇవ్వనా.. ఇదిగో ఇది నా మాట’’అంటూ హిమాన్షు గానం సాగింది. కేటీఆర్ సేవా కార్యక్రమాలు, తండ్రి, కుటుంబసభ్యులతో కలిసి ఉన్న ఫొటోలతో కూర్చిన వీడియోను పాటకు హిమాన్షు జత చేశాడు. సామాజిక మాధ్యమాల్లో హిమాన్షు గానం వైరల్‌గా మారింది. పుట్టినరోజు సందర్భంగా తండ్రికి కొడుకు ఇచ్చే అద్భుత కానుక అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

రాష్ట్రానికి ఎఫ్‌డీఐల వెల్లువ

- గత ఏడాదితో పోలిస్తే 33 శాతం వృద్ధి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ఈ ఏడాది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం గణనీయంగా పెరిగింది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఆరు నెలల్లో రాష్ట్రానికి రూ. 12,864 కోట్లు వచ్చాయి. గత ఏడాది ఇదే కాల వ్యవధిలో రూ.9,679 కోట్లు వచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాదితో పోలిస్తే రూ.3,185 కోట్లు అధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడంతో ఎఫ్‌డీఐలో సుమారు 33 శాతం వృద్ధి నమోదైంది. కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం విడుదల చేసిన జాబితా ప్రకారం ఈ ఆరు నెలల పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలలో దాదాపు 93 శాతం హైదరాబాద్‌లోనే వచ్చాయి. రాష్ట్ర రాజధానికి రూ.11,970 కోట్లు, రంగారెడ్డి జిల్లాకు రూ.680.5 కోట్లు, మహబూబ్‌నగర్‌కు రూ. 116.7 కోట్లు, మెదక్‌కు రూ. 96.99 కోట్లు పెట్టుబడులుగా వచ్చాయి.



గొర్రెపాటి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మానవహక్కుల వేదిక నాయకురాలు వసంతలక్ష్మి (ఇన్‌సెట్)లో మాధవరావు (ఫైల్)

హక్కుల నేత మాధవరావు ఇకలేరు..

- గుండెపోటుతో ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మృతి
- నివాళులు అర్పించిన వామపక్ష, పౌర, ప్రజాసంఘాల నేతలు

ఖలీల్‌వాడి: మానవ హక్కులు, పౌరహక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు (67) శనివారం ఉదయం నిజామాబాద్‌లో గుండెపోటుతో కన్నుమూశారు. శుక్రవారం ఆయనకు గుండెలో నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. మాధవరావు ఏపీలోని బాపట్ల జిల్లా రేపల్లె మండలం గుర్నాథపాలెంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి మండలం బస్వాపూర్‌కు వలసవచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఆయన హైస్కూల్ విద్య కోటగిరిలో జరిగింది. పీడీఎస్‌యూ ఏర్పాటు చేసిన జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌తో అక్కడే మాధవరావుకు పరిచయం ఏర్పడింది. గొర్రెపాటి మాధవరావుకు భార్య మీనా సహానీ, కూతుర్లు మానస, ఆదిత్య మధుమిత్ ఉన్నారు.

ఉచితంగా ఉద్యమకేసులు..

నిజామాబాద్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టిన మాధవరావు పేదల కేసులు, ఉద్యమ కేసులను ఉచితంగా వాదించేవారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై పెట్టిన కేసులను ఉచితంగా వాదించారు. మాధవరావు పౌరహక్కుల సంఘంలో చేరి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా 1983 నుంచి 1996 వరకు పనిచేశారు. మరో హక్కుల నేత బాలగోపాల్‌తో కలిసి 2004 నుంచి మానవహక్కుల వేదికలో భాగస్వామ్యం అయ్యారు. అనంతరం మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు.

నేడు మెడికల్ కాలేజీకి పార్థివదేహం..

మాధవరావు పార్థివదేహాన్ని ఆదివారం నిజామాబాద్ మెడికల్ కళాశాలకు, కళ్లను లయన్స్ క్లబ్‌కు అందించనున్నారు. కాగా, మాధవరావు పార్థివదేహం వద్ద పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. మానవహక్కుల వేదిక నాయకురాలు వసంతలక్ష్మి, శాస్త్రవేత్త బాబూరావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్యతోపాటు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.



బుద్ధి నిన్ను కాపాడును.
వివేచన నీకు కావలి కాయును.
– క్రైస్తవ ధర్మం

విభాత సంధ్యల ప్రభాత గీతం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



‘తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం’ అన్నారు శ్రీశ్రీ. కావచ్చు. కానీ, వాటికి ఉండే ప్రాధాన్యత వాటికున్నది. కొన్ని ముఖ్యమైన తేదీల శతాబ్దులూ, అర్ధ శతాబ్దుల సందర్భాలూ చాలా ప్రత్యేకమైనవి. అవి ఇప్పటి పరిస్థితులనూ, పరిణామాలనూ అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. నేర్చుకోవాలనుకుంటే పాఠాలు కూడా చెబుతాయి. ఇప్పుడు బలంగా ఊడలు దిగి కనిపిస్తున్న భావజాలాలపై అవగాహన కుదరాలంటే నాడు వాటికి నారుపోసి నీరు పెట్టిన తొలి కాపుల లక్ష్యాలేమిటో, స్వప్నాలేమిటో తెలుసుకోవాలి. ఈ సందర్భాలు అందుకు పనికొస్తాయి.

కొన్నిసార్లు ఇటువంటి చారిత్రక సందర్భాలు ఒకదాని వెంట ఒకటి వరుసకట్టి వచ్చిపడతాయి. ఈ డిసెంబర్ ఆఖరి వారం కూడా అటువంటి ఓ అరుదైన క్రమాన్ని ఆవిష్కరించింది. జాతిపిత మహాత్మాగాంధీ ఒకే ఒక్కసారి 1924 డిసెంబర్ 24వ తేదీన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. మేధావుల సమ్మేళనంలా ఉండే కాంగ్రెస్ పార్టీని ఆయన జనసామాన్యుల పార్టీగా, ఉద్యమ పార్టీగా పరుగులు పెట్టించారు. ఆ సందర్భాన్ని గుర్తుపెట్టుకొని అదే బెళగావి (కర్ణాటక)లో నేటి శిథిల కాంగ్రెస్ పార్టీ కూడా దాని వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నది. మీడియా ద్వారా వెల్లడైన సమాచారాన్ని గమనిస్తే ఇది మొక్కుబడి సమావేశంగానే అనిపించింది. దూరమైన ప్రజాశ్రేణుల దరిజేరే ఉపాయాన్ని గాంధీ స్ఫూర్తి నుంచి గ్రహించినట్టు కనిపించలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలి దశాబ్దాల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ కూడా డిసెంబర్ 26న వందో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. అప్పటికే వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఏర్పడిన కమ్యూనిస్టులను ఐక్యం చేసి ఆ రోజున కాన్పూర్‌లో జాతీయ పార్టీగా ప్రకటించారు. అయితే ఈ తేదీపై ఒక డజన్‌కు పైగా ఉన్న కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదు. 1920లోనే నాటి సోవియట్ యూనియన్‌లోని తాష్కెంట్ (నేటి ఉజ్బెకిస్తాన్)లో ఎమ్.ఎన్.రాయ్ తదితరులు పార్టీని ప్రకటించారు గనుక ఆ తేదీనే ఆవిర్భావ దినంగా భావించాలని కొందరి అభిప్రాయం. ముఖ్యంగా బిగ్ బ్రదర్ సీపీఎం తాష్కెంట్ తేదీకే కట్టుబడి ఉన్నది. పుట్టిన తేదీ వంటి ఒక సాధారణ సాంకేతిక అంశంపైనే రాజీ పడటానికి సిద్ధంగా లేని కమ్యూనిస్టులు క్లిష్టమైన సైద్ధాంతిక విషయాల్లో ఐక్యత సాధించగలరని ఆశించే వారి సహనాన్ని అభినందించ వలసినదే!

ఈ డిసెంబర్ 25నే ఆరెస్సెస్ కూడా తన వందో ఏడాదిలోకి అడుగుపెట్టింది. హిందూ రాష్ట్ర స్థాపన, హిందూ జాతీయతావాదం లక్ష్యాలుగా కేశవ బలిరామ్ హెడ్గేవార్ ఈ సంస్థను స్థాపించారు. సంస్థను స్థాపించిన తొలి రోజుల నుంచి సాంస్కృతిక రంగంపైనే ప్రధానంగా గురిపెట్టి ఈ సంస్థ పనిచేయడం ప్రారంభించింది. స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా జరుగుతున్న రోజుల్లో పుట్టినప్పటికీ రాజకీయ రంగంలో అది పరిమిత పాత్రనే పోషించింది. కానీ, ఈరోజున భారత రాజకీయాలను తన గుప్పెట్లో పెట్టుకొని ప్రభావితం చేయగలిగే స్థాయికి ఎదిగింది. ఆ సంస్థ స్థాపించిన పలు అనుబంధ సంఘాలు శాఖోపశాఖలుగా విస్తరించి వివిధ రంగాల్లో పనిచేస్తున్నాయి. దాని రాజకీయ వేదికైన భారతీయ జనతా పార్టీ దాదాపు పదికోట్ల మంది సభ్యులతో దేశంలో అతి బలీయమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది. అధికార పార్టీగా ఆ పార్టీ అనుసరిస్తున్న, అనుసరించబోయే విధానాలను ఆరెస్సెస్ వ్యవస్థాపకుల సిద్ధాంతాలు, ఆశయాలు ప్రభావితం చేయడం పెద్దగా ఆశ్చర్యపోయే విషయమైతే కాదు.

ఈ సంవత్సరమే అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి పూర్తి కావడం యాదృచ్ఛికమైనప్పటికీ ఆసక్తికరం కూడా! ఆరెస్సెస్ కంటే సరిగ్గా ఒక సంవత్సరం ముందు డిసెంబర్ 25వ తేదీనే అటల్ జీ జన్మించారు. ఆరెస్సెస్ తొలి రాజకీయ వేదిక జనసంఘ్‌లో కూడా ఆయన ప్రముఖ నాయకుడుగా ఉన్నారు. కొంతకాలం అధ్యక్షునిగా పనిచేశారు. జనసంఘ్ పార్టీ భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందిన తర్వాత పాతికేళ్ల పాటు దాని ముఖపత్ర చిత్రంగా వాజ్‌పేయి ఉన్నారు. మతతత్వ పార్టీగా ముద్రపడి ఉన్న బీజేపీని మధ్యేవాదులకు కూడా ఆమోదయోగ్యం చేయడంలో వాజ్‌పేయి బొమ్మ పనికొచ్చింది. ఆయనకున్న ఉదారవాద టైటిల్ సాయంతో తొలిసారి ఢిల్లీ సర్కార్‌ను ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఏర్పాటు చేయగలిగింది. ఆ కాలానికి వాజ్‌పేయి ఉపయోగపడ్డారు. ఈ కాలానికి కాదు! ఇప్పుడు మోదీయే అవసరమని సంఘ్ అభిప్రాయపడింది. కాలానుగుణంగా కవర్ పేజీ చిత్రాలను ఎంపిక చేయడంలోనే ఆరెస్సెస్ విజయ రహస్యం ఇమిడి ఉన్నది. అంతే తప్ప వాజ్‌పేయి వేరు, మోదీ వేరూ కాదు! ఈ రెండు రూపాల్లోని సారం ఒక్కటే!!

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మనుస్మృతిని దహనం చేసిన చారిత్రక ఘటనకు కూడా వందేళ్లు కావస్తున్నది. 1927లో సరిగ్గా డిసెంబర్ 25వ తేదీనే అంబేడ్కర్ ఈ పని చేశారు. వర్ణ వ్యవస్థ లేదా నేటి కులవ్యవస్థను మనుస్మృతి బలంగా సమర్థించింది. కుల వ్యవస్థ ముసుగులో జరిగిన దారుణమైన సామాజిక అణచివేతకు గురైన బలహీన వర్గాల్లోని చైతన్యవంతులైన ప్రజల మనోభావాలకు అంబేడ్కర్ చర్య సాంత్వన కలిగించింది. అప్పటికంటే ఇప్పుడు అంబేడ్కరిజానికి మద్దతు మరింత పెరుగుతున్నది.

వందేళ్ల నాటి భావాలూ, సంస్థలూ ఇంకా మన రాజకీయ యవనికపై కదలాడుతుండటం ఒక విశేషం. ఈ ప్రయాణంలో బలమైన శక్తులు బలహీనంగా మారడం, బలహీనశక్తులు బలంగా మారడం మరో విశేషం.

చారిత్రక ఘటనలు పునరావృతం అవుతున్నట్టు కనిపించడం కూడా మరో ఆసక్తికర పరిణామం. వెన్నుపోటు ఉదంతంతో తొలిసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆ తర్వాత వాజ్‌పేయి అండతో ‘కార్గిల్ గాలి’లో మరోసారి అధికారంలోకి వచ్చారు. ఇది జరిగి పాతిక సంవత్సరాలు. అప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాది కూడా గడవకముందే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఆయన కొనితెచ్చుకున్నారు. అడ్డగోలుగా బాదిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా మొదలైన ఆందోళనలు ఆయన పదవీకాలమంతా జరుగుతూనే ఉన్నాయి. చివరికి తిరుపతిలో మందుపాతర ప్రమాదం నుంచి బయటపడ్డ సానుభూతి కూడా ఆయన్ను గట్టెక్కించలేకపోయింది.

ఇప్పుడూ అదే పరిస్థితి. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ను అటకెక్కించడంతోనే తాము మోసపోయామన్న అభిప్రాయం జనంలో వచ్చేసింది. దానికితోడు పరిపాలనా వైఫల్యాలు, కక్షసాధింపు రాజకీయాలు, ప్రజావైద్యం పడకేయడం, నాణ్యమైన ప్రభుత్వ విద్యకు పాతరేయడం, వాడవాడనా పారుతున్న మద్యం కంపు, అంతకుమించి కంపు కొడుతున్న రాజకీయ నాయకుల అవినీతి బాగోతాలు, వెరసి ఆరు మాసాల్లోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వం అనేవి ఆధునికమైన ప్రజాస్వామిక భావనలుగా ప్రపంచవ్యాప్తంగా పరిగణన పొందాయి. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షునిగా డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ రచనలో ఈ భావనలకే పెద్దపీట వేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ఉన్న నాటి రాజ్యాంగ సభ ఈ ముసాయిదాకు ఆమోదముద్ర వేసింది. ఈ దేశంలోని కమ్యూనిస్టులకు కూడా సిద్ధాంతపరంగా ఈ ఆధునిక భావనలతో పేచీ లేదు. మరి దేశంలోనే పెద్ద పార్టీగా ఉన్న భారతీయ జనతా పార్టీ మాటేమిటి?

భారతీయ జనతా పార్టీ ఎదుగుదలను పరిశీలిస్తే కాలానుగుణమైన ఎత్తుగడలను అమలుచేస్తూ ఆరెస్సెస్ మూల సిద్ధాంతాలను హిడెన్ ఎజెండాగా పెట్టుకొని అవసరాన్ని బట్టి ఒక్కొక్కదాన్ని వెలికి తీస్తున్న పద్ధతి కనిపిస్తున్నది. భారత రాజ్యాంగం పట్ల ఆరెస్సెస్ వ్యతిరేకత రహస్యమేమీ కాదు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తొలిరోజే దాని అధికార పత్రిక వ్యతిరేక వ్యాసం రాసిన సంగతి అందరికీ తెలిసినదే. సంఘ్ సిద్ధాంతకర్త గురు గోల్వాల్కర్ రాజ్యాంగాన్ని ‘పలు దేశాల నుంచి అరువు తెచ్చుకున్న అతుకుల బొంత’గా వ్యాఖ్యానించడం కూడా రహస్యం కాదు. రాజ్యాంగ సభలో చర్చలు జరుగుతున్న రోజుల్లోనే పలువురు సంఘ్ ప్రముఖులు, హిందూ మహాసభ నాయకులు మనుస్మృతిని మన దేశ రాజ్యాంగంగా మలుచుకోవాలని కోరిన విషయాన్ని గుర్తు చేసుకోవడం అవసరం.

రాజ్యాంగంలో మార్పులు చేయాలనే ఆలోచన బీజేపీకి ఉన్నట్టు పలు వార్తలు వచ్చాయి. పీఠికలో ఉన్న ‘లౌకిక’, ‘సామ్యవాద’ పదాలను తొలగించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు ప్రచారం జరిగింది. తన హిడెన్ ఎజెండాలోని అంశాలను ముందుగా ప్రచారంలోకి వచ్చేలా చూడటం, పెద్దగా వ్యతిరేకత కనిపించకపోతే ఆచరణలో పెట్టడం బీజేపీకి కొత్త వ్యూహమేమీ కాదు. ఆధునిక భావనలైన స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వాలకు మనుస్మృతికి సాపత్యం కుదురుతుందంటే నమ్మడం కుదరదు. బీజేపీ ఎటువైపున నిలబడుతుందో చూడాలి. బీజేపీ తన గమ్యాన్ని చేరే యాత్రలో అద్వాణీ రథయాత్ర ఒక మజిలీ, వాజ్‌పేయి అధికారం ఒక మజిలీ, నరేంద్ర మోదీ మరో రెండు మూడు మజిలీలు దాటి ఉంటారు. రేపటి జమిలి ఎన్నికలు మరో మజిలీ అని పలువురి భావన. ఈ యాత్ర నిర్నిరోధంగా ఇలాగే సాగుతుందా? దీన్ని నిలువరించే శక్తులున్నాయా? అనేదే నేటి ప్రధాన రాజకీయ చర్చ.

సిద్ధాంత పరంగా చూస్తే బీజేపీ హిందూయాత్ర(?)ను ఎదిరించే బలం అంబేడ్కరిజానికి ఉన్నదని కొందరి అభిప్రాయం. కానీ దానికి ఒక సంస్థాగత రూపం లేదు. అందుకే ‘లాల్–నీల్’ అనే కొత్త నినాదం ముందుకొచ్చింది. అంబేడ్కరిస్టులు, కమ్యూనిస్టులు కలిసి పనిచేయాలని దీని భావం. కానీ, చిన్నచిన్న పట్టింపులతోనే చీలికలు పీలికలైన లాల్‌వాలాల్లో ఇంకా ఆ సామర్థ్యం మిగిలి ఉందని నమ్మేవారి సంఖ్య స్వల్పం. ఇక వ్యూహ రాహిత్యం, నాయకత్వ వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కునారిల్లిపోయిన స్థితి. ‘ఇండియా’ కూటమి పక్షాల దన్నుతో 99 లోక్‌సభ సీట్ల దాకా నెట్టుకొచ్చిన ఆ పార్టీని ఇప్పుడు కూటమి పక్షాలే గెటౌట్ అనే పరిస్థితి ఏర్పడింది. రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి. మొత్తానికి వందేళ్ల నాటి భావాలూ, సంస్థలూ ఇంకా మన రాజకీయ యవనికపై కదలాడుతుండటం ఒక విశేషం. ఈ ప్రయాణంలో బలమైన శక్తులు బలహీనంగా మారడం, బలహీన శక్తులు బలంగా మారడం మరో విశేషం.

చారిత్రక ఘటనలు పునరావృతం అవుతున్నట్టు కనిపించడం కూడా మరో ఆసక్తికర పరిణామం. వెన్నుపోటు ఉదంతంతో తొలిసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆ తర్వాత వాజ్‌పేయి అండతో ‘కార్గిల్ గాలి’లో మరోసారి అధికారంలోకి వచ్చారు. ఇది జరిగి పాతిక సంవత్సరాలు. అప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాది కూడా గడవకముందే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఆయన కొనితెచ్చుకున్నారు. అడ్డగోలుగా బాదిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా మొదలైన ఆందోళనలు ఆయన పదవీకాలమంతా జరుగుతూనే ఉన్నాయి. చివరికి తిరుపతిలో మందుపాతర ప్రమాదం నుంచి బయటపడ్డ సానుభూతి కూడా ఆయన్ను గట్టెక్కించలేకపోయింది.

ఇప్పుడూ అదే పరిస్థితి. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ను అటకెక్కించడంతోనే తాము మోసపోయామన్న అభిప్రాయం జనంలో వచ్చేసింది. దానికితోడు పరిపాలనా వైఫల్యాలు, కక్షసాధింపు రాజకీయాలు, ప్రజావైద్యం పడకేయడం, నాణ్యమైన ప్రభుత్వ విద్యకు పాతరేయడం, వాడవాడనా పారుతున్న మద్యం కంపు, అంతకుమించి కంపు కొడుతున్న రాజకీయ నాయకుల అవినీతి బాగోతాలు, వెరసి ఆరు మాసాల్లోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం నాడు వైసీపీ పిలుపు మేరకు జరిగిన ప్రదర్శనల్లో పది లక్షలమందికి పైగా పాల్గొనడం ప్రజాగ్రహానికి ఒక శాంపిల్ మాత్రమే! పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి జరిపిన పర్యటన జనసముద్రాన్ని చీల్చుకొని వెళ్తున్నట్టుగా కనిపించింది. అభిమాన సందోహం నడుమ పాతిక కిలోమీటర్ల ప్రయాణానికి ఏడు గంటల సమయం! పులివెందుల నుంచి బెంగళూరు వరకు ఆయన చేసిన రోడ్డు ప్రయాణం కూడా అంతే! దారి పొడవునా ఊళ్లు కాదు, జన జాతరలే దర్శనమిచ్చాయి. ఈ పరిస్థితి చూస్తుంటే కూడా గతమే గుర్తుకొస్తున్నది. మందుపాతర సానుభూతితో మళ్లీ గెలుస్తామని భావించిన బాబు నాలుగు మాసాలు ముందుగానే ఎన్నికలకు పోవాలని నిర్ణయించుకున్నారు. ఆయనతోపాటు కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌ను కూడా తీసుకెళ్లి వాజ్‌పేయి పుట్టి ముంచారు. ఇప్పుడు కూడా ముందుగానే జమిలి వార్తలు వస్తున్నాయి. ఈ జమిలిలో మోదీ పుట్టిని కూడా ముంచుతాడేమో!

vardhelli1959@gmail.com

స్వాతంత్ర్య ఫలాలను కాపాడుకోవాలి!



డాక్టర్ మన్మోహన్ సింగ్

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మనది. ఇప్పుడిక భూమ్మీద అత్యధిక జనాభా గల దేశంగానూ అవతరించనుంది. భారతావని 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటోంది. ఈ సమ యంలో మనందరిపై ప్రత్యేక బాధ్యత ఉంది. స్వాతంత్ర్యం మనకు ప్రసాదించిన స్వేచ్ఛలను పరిరక్షించుకుంటూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో వాటిని బలోపేతం చేసుకునేందుకు నడుం బిగించాలి. ఎంతో ఉన్నతంగా రెపరెపలాడే జాతీయ జెండాకు సగర్వంగా సెల్యూట్ చేసే ప్రతి భారతీయుడూ ఆ జెండాలోని మూడు రంగుల అంతరార్థాన్ని గ్రహించాలి. దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, దేశ సమైక్యతను ప్రతిఫలించే ఆ మువ్వన్నెలే మన ప్రజాస్వామ్యాన్ని అవని మీదే ఉన్నతమైందిగా రూపొందించాయి. భారత ప్రజల ఈ సమైక్యతను దెబ్బతీసే విద్వేష ప్రచారాలను అడ్డుకోవాలి. మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అహంకార పూరితమైన నిరంకుశ అధికారం ఎప్పటికీ కబళించకుండా కాపాడుకోవాలి. ఈ చారిత్రక సందర్భంగా ఇలా చేస్తామని మనమందరం ప్రతిన పూనాలి. ఇదే జాతీయ పతాకానికి మనం అర్పించగల ఘన నివాళి.

సమైక్యత మన సంపద

వలస పాలన మృత్యు కౌగిలి నుంచి విముక్తమైన భారత్ నాడు తక్షణం జాతి సమైక్యతకు నడుం బిగించింది. చెల్లాచెదురుగా ఉన్న బ్రిటిష్ పాలిత ప్రాంతాలను, సంస్థానాలను విలీనపరచి ఒక సమైక్య జాతిగా అవతరించింది. ఈ సమైక్యత రాత్రికి రాత్రే మంత్రం వేసినట్లు వచ్చింది కాదు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నేతృత్వంలో సాగిన స్వాతంత్ర్యోద్యమం, విదేశీ పాలనకు చరమగీతం పాడేందుకు భారతీయులందర్నీ ఏకం చేసింది. భాష, కులం, మతం, స్త్రీపురుష భేదం, సామాజిక అంతరాలు... వీటన్నిటికీ అతీతంగా భారతీయులను ఈ ఉద్యమం సమైక్యం చేసింది. ఈ సమైక్యత భారత్‌కు అమూల్య సంపద. కుల మత విభేదాలు, భాషా దురహంకారాలతో ఇది నాశనం కాకూడదు. ఇలాంటి కుట్రలతో భారతీయులను భారతీయుల మీదే ఉసిగొల్పి తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలను పొందితే పొందవచ్చు. కానీ, ఒక గొప్ప జాతిగా ఈ దేశం ప్రయాణం సాగించే ప్రగతి బాట మీద ఇవి అగాథాలను సృష్టిస్తాయి.

వలస పాలకులు మనల్ని నిలువునా దోచారు. వారి నుంచి స్వాతంత్ర్యం సాధించుకున్న మనం ఒక బీదదేశంగా కొత్త జీవితం ప్రారంభించాం. ఆ స్థాయి నుంచి నేడు ప్రపంచ అగ్రస్థాయి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగగలిగాం. 1991లో చేపట్టిన ఆర్థిక సరళీకరణ విధానం మన ఆర్థిక ప్రగతికి ఊతం ఇచ్చింది. పేదరికం తగ్గింపు, ఆర్థిక అసమానతల తొలగింపు ప్రభుత్వ విధానానికి దిశానిర్దేశం అయ్యాయి. అందరి ఆర్థిక ప్రయోజనమే మనకు పరమావధి అయ్యింది. ఒకవైపు ఆర్థిక అంతరాలు పెరుగుతూ, మరోవైపు ఎంపిక చేసిన కొద్ది మంది వ్యాపార దిగ్గజాలే సంపద ప్రయోజనాలను పొందడాన్ని మనం అనుమతించకూడదు.



వేర్పాటు రాజకీయాలు కూడదు!

ఉపాధి లేని వృద్ధి ఏ ఆర్థిక వ్యవస్థకూ క్షేమం కాదు. సామాజిక అసంతృప్తికి, ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు నిరుద్యోగ సమస్య దారితీస్తుంది. జనాభాలో చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్న యువజనులకు విద్య, నైపుణ్యం, తగు ఉపాధి కల్పించాలి. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు, ఆవిష్కర్తలకు మద్దతు ఇవ్వాలి. తద్వారా గరిష్ఠ ఆర్థిక ప్రయోజనం పొందాలన్నదే ధ్యేయంగా రానున్న 25 సంవత్సరాలకు బాటలు వేసుకోవాలి. ఇది సుసాధ్యం కావాలంటే విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రజలు దేశం నలుమూలలకు స్వేచ్ఛగా వెళ్లగలగాలి. మతం, భాష వంటివి ఈ స్వేచ్ఛా గమనానికి అడ్డంకులు కాకూడదు. దేశ పారిశ్రామిక సారథులు అవరోధాల ప్రమాదాన్ని గుర్తించి జాతీయ సమైక్యతకు గళం విప్పాలి. విచ్ఛిన్న రాజకీయాలు ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారుతుంటే వారు మౌన ప్రేక్షకుల్లా ఉండిపోకూడదు.

శాస్త్రీయ సంప్రదాయం నిలబెట్టాలి!

స్వాతంత్ర్యం తొలినాళ్ల నుంచీ దేశం శాస్త్ర విజ్ఞానానికి ప్రాధాన్యం ఇచ్చింది. ప్రగతి సాధనకు దాన్ని మార్గం చేసుకుంది. పురోగమన దృక్పథంతో నేషనల్ సైన్స్ పాలసీ రూపుదిద్దుకుంది. విజ్ఞానం, బోధన, పరిశోధనలకు గొప్ప గొప్ప సంస్థలు ఏర్పాటయ్యాయి. అనేక భారతీయ సాంకేతిక సంస్థలు ప్రపంచ గుర్తింపు పొందాయి. వాటిలో చదివిన పలువురు విద్యావంతులు నేడు ప్రపంచ ప్రఖ్యాత వ్యాపార సంస్థలకు సారథ్యం వహిస్తున్నారు. అంతరిక్ష, సాగర, అణుశక్తి కార్యక్రమాలు మనల్ని అంతటి సామర్థ్యం ఉన్న అతి కొద్ది దేశాల సరసన నిలిపాయి. శాస్త్రీయంగా, సాంకేతికంగా ప్రపంచ గుర్తింపు పొందిన మన వైజ్ఞానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల సారథ్య బాధ్యతల్లో సాంస్కృతిక పునరుజ్జీవనం పేరిట తక్కువ ప్రతిభావంతులకు చోటు కల్పిస్తే అంతకు మించిన దురదృష్టం ఉండదు. ప్రాచీనకాలం నుంచీ మనకు గర్వించదగిన సాంప్రదాయిక విజ్ఞానం ఉంది. అయితే అది ఆధునిక విజ్ఞానాన్ని మసకబరచి మేటి శాస్త్రవేత్తలకు అపఖ్యాతి తేకూడదు.

స్పష్టమైన విదేశీ విధానాలు

రెండు అధికార కూటములు ప్రపంచంపై పట్టు సాధించడానికి పోటీపడుతున్న సమయంలో... దేశాల మధ్య శాంతి సామరస్యాలు మెరుగుపరచడానికి మనం అవలంబించిన విలువలు, విధానాలు, మన అలీన ఉద్యమ నాయకత్వం భారత్‌కు ఎనలేని గౌరవం తెచ్చి పెట్టాయి. మన పొరుగున ఉన్న అత్యధిక దేశాలతో మనకు సహృద్భావ సంబంధాలు ఉండేవి. కొన్నిటితో ఘర్షణలు ఉన్నప్పటికీ శాంతి యుత సహజీవనానికి వీలుకల్పించేలా వాటితో అవగాహనా వారధులను నిర్మించుకునే ప్రయత్నం చేశాం. ప్రపంచ దేశాలు మనల్ని నమ్మదగిన గౌరవప్రదమైన మిత్రదేశంగా పరిగణించే స్థితి ఉండాలి. ముఖ్యంగా దక్షిణ ఆసియాలో ఈ విశ్వాసం పొందాలి. కేవలం కెమెరాల ముందు ఆప్యాయతా ప్రదర్శనలకు పరిమితమైతే మన విదేశాంగ విధానం బలహీనం అవుతుంది. సమర్థులయిన దౌత్యవేత్తల సహకారంతో విజ్ఞులైన నాయకులు సుస్పష్టమైన చర్యలు చేపట్టాలి.

యువత శ్రేయస్సు ముఖ్యం

యువజనుల ఆరోగ్యం, విద్య, నైపుణ్యం మీద తప్పనిసరిగా దృష్టి సారించాలి. మన చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బిడ్డల్ని కనే మహిళల్లో పోషణ లేమి, రక్తహీనత అధికంగా ఉన్నాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5) తేల్చి చెప్పింది. కాబట్టి పౌష్టికాహార కార్యక్రమాలను అమలు చేయాల్సిన అవ సరం ఉంది. అలాగే, మంచినీరు, పారిశుద్ధ్య రంగాల్లో కూడా సరైన చర్యలు, విధానాలు అమలు చేయాలి. మన ఆరోగ్య వ్యవస్థలో ఉన్న అనేక బలహీనతలను కోవిడ్ – 19 బట్టబయలు చేసింది. వ్యాధులపై నిఘా పెంచాలి. ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వెయ్యాలి. వైద్య సేవల రంగాన్ని విస్తరించాలి. ఈ దిశగా పరిశీలిస్తే ఆ యా రాష్ట్రాల మధ్య ఆరోగ్య వ్యవస్థల పనితీరు, వాటి విస్తరణల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయి. రాష్ట్రాలు ఆరోగ్యం మీద మరిన్ని నిధులను వెచ్చించాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్య సాధన కోసం రాష్ట్రాలకు ఇతోధికంగా మద్దతు అందించాలి. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించడం సార్వత్రిక ఆరోగ్య సేవల కల్పన విధానాల లక్ష్యం కావాలి. దేశవ్యాప్తంగా సమరీతిలో ఈ లక్ష్యాన్ని సాధించాలి.

పౌరుల బాధ్యత

అప్పట్లో నేను పధ్నాలుగేళ్ల కుర్రవాడిని. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆనంద పారవశ్యంతో మునిగిపోయాను. అదే సమయంలో దేశ విభజన అంతులేని విషాదం మిగిల్చింది. అలాంటి దుఃస్థితి తిరిగి ఎప్పటికీ రాని దృఢమైన దేశంగా భారత్ ఎదగాలని ఆశించాను. ఇండియా ఇన్నేళ్లల్లో సాధించింది చూసి నేనిప్పుడు గర్విస్తున్నాను. ఈ గొప్ప దేశం భవిష్యత్తు పట్ల నాకు ఎన్నో ఆశలున్నాయి. సమాజంలో సుహృద్భావ వాతావరణాన్ని కలుషితం చేస్తూ, ప్రజల్ని విభజిస్తున్న వేర్పాటు నినాదాలు, మత విద్వేషాలు చూసి నేను ఆందోళన కూడా చెందుతున్నాను. మరో వంక, ప్రజాస్వామ్య స్వేచ్ఛలను పరిరక్షించి తీరాల్సిన, సుపరిపాలన నియమ నిబంధనలను నిలబెట్టాల్సిన, ఎన్నికలకు ధనబలం, ప్రభుత్వ ఏజెన్సీల నుంచి రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు బలహీనమవటం కూడా జరుగుతోంది. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలను పరిరక్షించుకోవలసింది భారత పౌరులే! సగర్వంగా తల ఎత్తి మన జెండాకు వందనం చేసేటప్పుడు మనలో ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవలసిన గురుతర బాధ్యత ఇది!

(భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భంగా 2022 ఆగస్టు 15న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాసిన వ్యాసం ఇది. ‘ది హిందూ’ సౌజన్యంతో.)

14వ దలైలామా (బౌద్ధ గురువు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు


“ఎలా ఉన్నారు?” అనే ప్రశ్నకు సమాధానం ఆ ప్రశ్న వేయటం వెనుక ఉన్నది పలకరింపా, పరామర్శా, ఆందోళనా లేక ఆరా తీయటమా అనే దానిని బట్టి మారుతూ ఉండవచ్చు.

అయితే ఒక బౌద్ధ గురువు ఇలాంటి ఒక దైహికమైన ప్రశ్న ఎదుర్కొన్నప్పుడు ఆ గురువు ఇచ్చే సమాధానం... ప్రశ్న వేయటానికి వెనుక ఉన్న ఉద్దేశంతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థల్లో ఒకేలా ఉండాలి.

అంటే... ఆయన ధర్మశాల పట్టణంలోని తన హిమాలయ నివాసంలో ఉన్నా, న్యూయార్క్‌లోని మోకాళ్ల శస్త్ర చికిత్సా కేంద్రంలో ఉన్నా సమాధానం మారకూడదు. అది కూడా, “నాకేం! నిక్షేపంగా ఉన్నాను” అని కాకుండా, “నీకేం! నిశ్చింతగా ఉండు” అని... భరోసా ఇచ్చేలా ఆ సమాధానం ఉండాలి.

బౌద్ధాచార్యులైన ఒక దలై లామా ఎంతటి వృద్ధాప్యంలోనైనా ‘గుంభనం’గా ఉన్నప్పుడే ఆయన భక్తులు, అనుచరులు, పాలకులు ఆయన అంతిమ శ్వాసను గురించిన ఆలోచనలు చేయకుండా ఉంటారు.

జూన్‌లో శస్త్ర చికిత్స జరిగాక నా మోకాలి కదలికలు కాస్త మెరుగుపడ్డాయి. నలుగురు కలిసి నడిపిస్తే నడవ గలుగుతున్నాను. ఇద్దరు కలిసి కూర్చోబెడితే కూర్చోగలుగుతున్నాను.



ప్రపంచానికైతే నాకసలు చికిత్స జరిగింది కుడి కాలికా, ఎడమ కాలికా అన్న సంగతే తెలియదు. అదే ‘గుంభనత్వం’ అంటే! ఎవరికీ, ఏదీ తెలియనివ్వకపోవటం! ముఖ్యంగా మన ఆరోగ్యం గురించి!

దర్శనాలకు సమయమౌతుండగా మిస్ డోల్మా త్సెరింగ్ తేఖాంగ్ వచ్చి, “ఎలా ఉన్నారు ఆచార్యా?” అని నన్ను పరామర్శించారు! ఆమె అలా మంద్రస్థాయిలో ఇటీవల కొంతకాలంగా నన్ను పరామర్శిస్తూ వస్తున్నారు!

“ఎందుకు మీరలా పదే పదే సందేహిస్తున్నారు మిస్ తేఖాంగ్?” అన్నాను. ధర్మశాలలోని ప్రవాస టిబెటన్ ప్రభుత్వ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ ఆమె.

వచ్చే ఏడాది జూలై 6కు నాకు 90 ఏళ్లు నిండుతాయన్న ఆలోచన... ఆరామంలోని అందరితో పాటుగా మిస్ తేఖాంగ్‌నూ హృదయ శూన్యతకు గురిచేస్తోందా?! లేక, మునుపటి దలైలామా 57 ఏళ్లకే పరమపదించటం వల్ల, అది ఊహించుకుని ఆమె కలత చెందుతున్నారా?!

“ఇప్పటిలా వారానికి మూడుసార్లు కాకుండా, వారానికి ఒకసారి మాత్రమే సందర్శకులను అనుమతించటం వల్ల మీకు మరికాస్త విశ్రాంతి దొరుకుతుందని సిక్యోంగ్ పెన్పా త్సెరిన్ తలపోస్తున్నారు ఆచార్యా” అన్నారు తేఖాంగ్.

సిక్యోంగ్ పెన్పా త్సెరిన్... ప్రవాస టిబెటన్ ప్రభుత్వ ప్రధాని.

“వృద్ధాప్యంలో విశ్రాంతి అవసరమే మిస్ తేఖాంగ్. కానీ కలలకు వృద్ధాప్యం ఉంటుందా?! నా కల ప్రకారం నేను 110 సంవత్సరాలు జీవించబోతానని మునుపు నేను చెప్పిన మాటనే ఇప్పుడూ చెబుతున్నాను. మీరూ, మీ ప్రధానే నా కలపై విశ్వాసం లేక చింతాక్రాంతులై ఉన్నట్లున్నారు. నేనెలా ఉన్నాను అనే దానికన్నా, నా తర్వాత ఎవరున్నారు అన్నదే మీ ఆందోళనగా నాకు కనిపిస్తోంది” అన్నాను చిరునవ్వుతో.

తేఖాంగ్ కలవరంగా చూశారు.

“ఆచార్యా... మేము కేవలం సామాన్యులం. మీ జ్ఞానాన్ని అర్థం చేసుకోలేము. అందువల్లనే మీరేమైనా చెబుతారేమోనని ఎదురు చూస్తున్నాం...” అన్నారు మిస్ తేఖాంగ్!

నాకర్థమైంది. వారు నా పునర్జన్మ కోసం చూస్తున్నారు! 15వ దలైలామా ఆగమనం కోసం నిరీక్షిస్తున్నారు.

కానీ వారికి అర్థం కానిది ఏమిటంటే – మరణించాక మాత్రమే పునర్జన్మ ఉండదనీ, కర్తవ్య నిర్వహణ కాంక్ష అన్నది ఒకే జన్మలో అనేక పునర్జన్మల్ని ప్రసాదిస్తుందనీ!

“నా దగ్గరింకా 20 హ్యాపీ న్యూ ఇయర్‌లు మీ అందరి కోసం మిగిలే ఉన్నాయి మిస్ తేఖాంగ్. ధీమాగా ఉండండి...” అని ఆమెతో నవ్వుతూ చెప్పాను.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.3.48 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.11.37 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** సా.4.08 నుండి 4.56 వరకు, **అమృతఘడియలు:** ప.2.07 నుండి 3.46 వరకు, మాసశివరాత్రి; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.31.

‘మూడు మరణాల’పై వీడని సస్పెన్స్!

- సాంకేతిక ఆధారాల అన్వేషణలో పోలీసులు
- సైబర్ ఫోరెన్సిక్ పరీక్షలకు ముగ్గురి ఫోన్లు
- అడ్లూర్ చెరువు నీటి శాంపిల్స్ సేకరించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: భిక్కనూరు ఎస్‌ఐతోపాటు బీబీపేట పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు చెరువులో మునిగి చనిపోయిన ‘డెత్ మిస్టరీ’ని ఛేదించేందుకు కామారెడ్డి జిల్లా పోలీసులు సాంకేతిక అంశాలపై దృష్టి సారించారు. మొదట ముగ్గురి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలకు సంబంధించిన కాల్ డేటాను సేకరించి పరిశీలించారు. ఇప్పుడు వారి వాట్సాప్ చాటింగులను వెలికి తీసే ప్రయత్నం జరుగుతోంది. ఎస్‌ఐ సాయికుమార్‌కు సంబంధించిన ఒక ఫోన్ నీటిలో పడి పాడైంది. కారులో లభించిన ఐఫోన్ ఫేస్‌లాక్ వల్ల ఓపెన్ కాలేదు. అలాగే నిఖిల్‌కు చెందిన ఐఫోన్ కూడా ఓపెన్ కాలేదని తెలుస్తోంది. శ్రుతి ఫోన్ వాట్సాప్‌లో లభించిన సమాచారం ఆధారంగా నిఖిల్‌కు, శ్రుతికి మధ్య ప్రేమ వ్యవహారం ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ముగ్గురు చెరువులో మునిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవటం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఫోన్లు..

సాయికుమార్, శ్రుతి, నిఖిల్ వినియోగించిన ఫోన్లను పోలీసులు సైబర్ ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించినట్లు తెలిసింది. ముఖ్యంగా సాయికుమార్, నిఖిల్ ఫోన్లలోని డేటాను వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో మరే సాక్ష్యాలూ లేకపోవడంతో ఫోన్లలో ఉన్న డేటానే కీలకంగా మారింది. పోస్టుమార్టం చేసిన వైద్యులు ఇచ్చే నివేదికతోపాటు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిన ఫోన్లకు సంబంధించిన రిపోర్టులు కూడా కోర్టులో సమర్పించాల్సి ఉంటుంది. అడ్లూర్ చెరువులోని నీటి నమూనాలను పోలీసులు శనివారం సేకరించి లాబ్‌కు పంపించారు.



మా టీచర్లు మాకే కావాలి..

ఇబ్రహీంపట్నం: ‘మా టీచర్లు మా పాఠశాలలోనే ఉండాలి. ఇతర టీచర్లు మాకొద్దు..’ అంటూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు పాఠశాల ముందు బైఠాయించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం 19 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సమ్మెతో బోధన నిలిచిపోవడంతో.. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో మధు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన కొందరు ఉపాధ్యాయులను ఈ పాఠశాలకు పంపించారు. దీంతో విద్యార్థినులు తమ ఉపాధ్యాయులు మాత్రమే కావాలని, ఇతరులు వద్దని ఆందోళనకు దిగారు. ఎంఈవో మధు కేజీబీవీకి చేరుకుని విద్యార్థినులను సముదాయించారు. పాఠశాల ఉపాధ్యాయులు వచ్చేవరకు.. ఇతర ఉపాధ్యాయులే బోధిస్తారని స్పష్టం చేశారు. చదువు నష్టపోకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని నచ్చజెప్పడంతో విద్యార్థినులు శాంతించారు.



కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఉపాధ్యాయులు రావాలి.. తరగతులు జరగాలి

- కేజీబీవీ విద్యార్థినుల ధర్నా

చిన్నగూడూరు: ‘ఉపాధ్యాయులు రావాలి.. తరగతులు జరగాలి’.. అంటూ మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట విద్యార్థినులు బైఠాయించారు. సమ్మె నేపథ్యంలో 18 రోజులుగా ఉపాధ్యాయులు రాక.. తరగతులు జరగక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు వాపోయారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా ఇంతవరకు పాఠాలు పూర్తి కాలేదని, పాఠశాలలో 160 మంది విద్యార్థినులున్నా ఒక్కరే టీచర్ ఉండటంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు వచ్చినా తరగతులు చెప్పక.. ఫోన్ చూస్తూ గడుపుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రవికుమార్ పాఠశాలకు చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకొని.. తరగతులు జరిగేలా చూడాలని విద్యార్థినులు కోరుతున్నారు.

మళ్లీ సాగునీటి సంఘాలు!

- ప్రతి చెరువుకు సాగునీటి వినియోగదారుల సంఘం
- ఎన్నికలు లేకుండా రైతులతో ప్రభుత్వమే నియమించాలి
- గత 10 ఏళ్లలో చెరువుల నిర్వహణ అస్తవ్యస్తం
- 2025ను చెరువుల సంవత్సరంగా ప్రకటించాలి
- చెరువుల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టాలి
- ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ సాగునీటి వినియోగదారుల సంఘాల వ్యవస్థను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సిఫార్సు చేసింది. ప్రతి చెరువుకు ఒక సాగునీటి సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. గతంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కమిటీని ఎన్నుకునేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ వ్యవస్థను రద్దు చేసింది. ఇప్పుడు ఎన్నికలకు బదులు ప్రభుత్వమే చెరువు కింద సాగుచేసే రైతులతో సాగునీటి వినియోగదారుల సంఘాన్ని ఏర్పాటు చేయాలని రైతు కమిషన్ సూచించింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.



చిన్న నీటిపారుదల శాఖను ఏర్పాటు చేయండి

నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న నీటిపారుదల శాఖను నీటిపారుదల శాఖలో విలీనం చేసింది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వహణకే నీటిపారుదల శాఖలోని యంత్రాంగం పరిమితం కావడంతో గత 10 ఏళ్లలో చెరువుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రైతు కమిషన్ అభిప్రాయపడింది. రాష్ట్రంలో 46,531 చెరువులుండగా, వాటికింద 25.11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వం భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు చెరువులను అనుసంధానం చేసి.. వాటిని నింపినప్పటికీ, నిర్వహణను పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల పునరుద్ధరణ చేపట్టినా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దీంతో మళ్లీ చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయని రైతు కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ నుంచి చిన్న నీటిపారుదల శాఖను విభజించి పాత విధానంలో చెరువుల నిర్వహణను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి సూచించింది.

చెరువుల సంవత్సరంగా 2025!

2025 ఏడాదిని చెరువుల సంవత్సరంగా ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కూడా రైతు కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. చెరువుల తూములు, కట్టలు, కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని సూచించింది. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల కాలంలో రాష్ట్రంలో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ఉండేది. ఒక చెరువు నిండితే దాని కింద ఉన్న చెరువులను నింపుకుంటూ నీళ్లు ప్రవహించేవి. చెరువులు ఆక్రమణకు గురికావడం, లేఅవుట్లు రావడంతో గొలుసుకట్టు వ్యవస్థ దెబ్బతిన్నదని రైతు సంఘం పేర్కొంది. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరంలో చెరువుల పునరుద్ధరణ, మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, వాటి కింద చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సిఫార్సు చేసింది.

మొన్న తల్లి.. నేడు కొడుకు

- మైనర్ డ్రైవింగ్‌లో బాలుడి అరెస్ట్.. రాష్ట్రంలోనే తొలి కేసు

సిరిసిల్ల క్రైం: మైనర్ బాలుడు వాహనం నడుపుతూ ఒకరి మరణానికి కారణమైన సంఘటనలో రాజన్న సిరిసిల్ల పోలీసులు మూడు రోజుల కిందట తల్లిని రిమాండ్ చేయగా.. తాజాగా శనివారం కొడుకును జువెనైల్ హోమ్‌కు తరలించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఈనెల 18న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. మైనర్ బాలుడు బైక్ నడుపుతూ కంటే రాములు (72)ను ఢీకొట్టగా తీవ్ర గాయాలతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బాలుడిపై కేసు నమోదు చేసి జువెనైల్ హోమ్‌కు పంపారు. ఇలాంటి కేసు రాష్ట్రంలోనే మొదటిదని చర్చ సాగుతోంది. జిల్లాలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

రామయ్యకు రత్నాంగి కవచాలు

- 51 వేల రత్నాలు.. రూ.41 లక్షల వ్యయంతో తయారీ



ఈఓ రమాదేవికి రత్నాంగి కవచాలు అందజేస్తున్న బాలకృష్ణ, కుటుంబ సభ్యులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ఇక నుంచి వారంలో ఓ రోజు రత్నాంగి కవచాలతో దర్శనమివ్వనున్నారు. హైదరాబాద్‌కు చెందిన దాతలు ఈ కవచాలను ఆలయ అధికారులకు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన పిన్నమనేని బాలకృష్ణ–శాంతి దంపతులు రామయ్య కోసం బంగారం అచ్చుల్లో 51 వేల రత్నాలను పొదిగిన కవచాలను చేయించారు. ఇందుకోసం సుమారు రూ.41 లక్షల వ్యయమైనట్లు అంచనా. ఈమేరకు శనివారం వీటిని ఆలయ అర్చకులకు సమర్పించగా యాగశాలలో సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేశాక ఈఓ ఎల్.రమాదేవికి అందజేశారు. వీటిని ఆదివారం అభిషేకం అనంతరం మూలమూర్తులకు అలంకరణ చేయనున్నారు. ఇప్పటికే రామయ్యకు ప్రతీ సోమవారం ముత్యాలతో ముత్తంగి అలంకరణ, శుక్రవారం స్వర్ణ కవచాలతో అలంకరణ చేస్తున్నారు. ఇకపై ప్రతీ ఆదివారం రత్నాంగి కవచాల అలంకరణలో స్వామి దర్శనమిస్తారు.

చనిపోతున్నా బిడ్డా..!

- కూతురికి తండ్రి వీడియోకాల్
- అప్పులు పెరిగి.. కిస్తీలు కట్టలేక రైతు ఆత్మహత్య



జనార్దన్

ఇచ్చోడ: ‘‘చనిపోతున్నా బిడ్డా..’’ అంటూ ఓ తండ్రి కూతురికి వీడియో కాల్ చేశాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియజేసి.. వారు అతని ఆచూకీ కోసం ఆరా తీస్తూ వెళ్లేసరికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం జున్ని గ్రామంలో శనివారం ఈ విషాదకర ఘటన జరిగింది. అప్పులు పెరిగిపోవడంతోపాటు, ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఆ రైతు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. గ్రామస్తులు, ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. జున్ని గ్రామానికి చెందిన అడిగే జనార్దన్‌కు భార్య గంగబాయి, ముగ్గురు కూతుళ్లు లక్ష్మి, ప్రియ, గంగమణి, కుమారుడు విఠల్ ఉన్నారు. కూతుళ్ల పెళ్లిళ్లు అయ్యాయి. జనార్దన్ తనకున్న మూడెకరాల్లో పత్తి, సోయా సాగు చేశాడు. కొన్ని నెలల క్రితం ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అయితే ట్రాక్టర్ సరిగా నడవకపోవడంతో కిస్తీలు కట్టలేకపోయాడు. దీంతో కిస్తీలు కట్టాలని ఫైనాన్స్ వారు ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో జనార్దన్ మద్యానికి బానిసయ్యాడు. శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో పుణేలో ఉంటున్న కూతురికి వీడియో కాల్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే ఆమె గ్రామంలోని తన కుటుంబ సభ్యులకు ఈ సమాచారం అందించింది. వీడియో కాల్‌లో కనిపించిన ప్రదేశంలో సిమెంటు బెంచీలు ఉన్నాయని చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చోడ పార్కులో గాలించారు. అక్కడ కనిపించకపోవడంతో పొలం చుట్టుపక్కల ప్రదేశంలో గాలిస్తుండగా.. ఓ స్టోన్ క్రషర్ సమీపంలో చెట్టుకు జనార్దన్ (50) మృతదేహం వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

పంట దిగుబడి లేక రైతు ఆత్మహత్య



రాజేందర్

గుడిహత్నూర్: పంట దిగుబడి సరిగా లేక.. చేసిన అప్పు తీర్చే మార్గం లేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం టాకీగూడలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వాఘ్మోడే రాజేందర్ (53) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేందర్ తనకున్న మూడున్నర ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశాడు. సాగు నిమిత్తం రెండేళ్ల కిందట బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.2 లక్షలకు పైబడి రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం ఈ రుణం రూ.2 లక్షల 85 వేల బకాయి గా ఉంది. కాంగ్రెస్ సర్కారు అమలు చేసిన రుణమాఫీ ఈయనకు వర్తించలేదు. అప్పు తీర్చడం ఎలా అనే విషయమై మనోవేదనకు గురయ్యాడు. గురువారం చేనులో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా, శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

టీటీడీలో తెలంగాణ లైజన్ ఆఫీసర్ నియామకం

సాక్షి, హైదరాబాద్: తిరుమలలో తెలంగాణ ప్రభుత్వ పక్షాన లైజన్ ఆఫీసర్ (ఓఎస్డీ)గా సి.గణేశ్‌కుమార్‌ను కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వం నియమించింది. టీటీడీతో అనుసంధానంలో భాగంగా ఈ ఏర్పాటు చేసింది. ఈ పదవిలో ఆయన రెండేళ్లు కొనసాగనున్నారు. ఆయన జీతభత్యాల ఖర్చును యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భరించనున్నట్లు ఈమేరకు జారీ చేసిన ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది.


మన్మోహన్ సింగ్ పార్థివదేహంపై జాతీయ పతాకాన్ని కప్పుతున్న త్రివిధ దళాల సిబ్బంది


భద్రతా సిబ్బంది గన్ సెల్యూట్


మన్మోహన్ పార్థివదేహానికి దహన సంస్కారాలు

అల్విదా మన్మోహన్‌జీ

దివంగత మాజీ ప్రధానికి ఘనంగా తుది వీడ్కోలు

- నిగమ్‌బోధ్ ఘాట్‌లో అధికారిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు
- కడసారి నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ
- హాజరైన భూటాన్ రాజు వాంగుచుక్, మారిషస్ విదేశాంగ మంత్రి ధనుంజయ్
- తరలివచ్చిన కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు
- అంతిమయాత్రకు పోటెత్తిన నాయకులు, అభిమానులు, ప్రజలు
- మన్మోహన్ చితికి నిప్పంటించిన పెద్ద కుమార్తె ఉపీందర్ సింగ్


నిగమ్‌బోధ్ ఘాట్‌లో మన్మోహన్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, ప్రధాని మోదీ, భూటాన్ రాజు వాంగుచుక్, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ బిర్లా, కాంగ్రెస్ నేతలు ఖర్గే, సోనియా గాంధీ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ విధానాలతో భారతదేశ దశదిశను మార్చిన మహోన్నత నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్(92)కు జాతి యావత్తూ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు ముగిశాయి. దివంగత మాజీ ప్రధానమంత్రిని కడసారి దర్శించుకొని వీడ్కోలు పలకడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భూటాన్ రాజు జింగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగుచుక్, మారిషస్ విదేశాంగ మంత్రి ధనుంజయ్ రామ్‌ఫుల్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖులు తరలివచ్చారు. మన్మోహన్‌కు కన్నీటి వీడ్కోలు పలికిన అనంతరం పూర్తి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ హాజరయ్యారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖూ, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినోద్ కుమార్ సక్సేనా, వివిధ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు భూపీందర్ సింగ్ హుడా, అశోక్ గహ్లోత్, భూపేష్ భగేల్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ అమర్ రహే

శనివారం ఉదయం 9 గంటలకు మన్మోహన్ పార్థివదేహాన్ని పుష్పాలతో అలంకరించిన సైనిక వాహనంలో ఆయన నివాసం నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఆయనకు ఎంతో ఇష్టమైన నీలిరంగు తలపాగాను చివరి ప్రయాణంలోనూ ధరింపజేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కడసారి నివాళులర్పించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మన్మోహన్ భార్య గురుశరణ్‌కౌర్, ఒక కుమార్తె కూడా పుష్పాంజలి ఘటించారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభమైంది. 'మన్మోహన్ సింగ్ అమర్ రహే.. జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా, తబ్ తక్ తేరా నామ్ రహేగా' అనే నినాదాల మధ్య వేలాది మంది అనుసరిస్తుండగా యాత్ర ముందుకు సాగింది. ఉదయం 11.30 గంటల సమయానికి నిగమ్‌బోధ్ ఘాట్‌కు చేరుకుంది. మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులతోపాటు రాహుల్ గాంధీ సైతం యాత్రలో చివరివరకూ పాల్గొన్నారు. పాడెను సైతం మోశారు. త్రివర్ణ పతాకం చుట్టిన మన్మోహన్ భౌతికకాయాన్ని ప్రత్యేక వేదికపైకి చేర్చారు. సిక్కు మత సంప్రదాయం ప్రకారం కుటుంబ సభ్యులు, మత గురువులు పవిత్ర గుర్బానీ కీర్తనలు ఆలపించారు. భౌతికకాయం వద్ద పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. త్రివిధ దళాల సైనికులు 21 తుపాకులు గాల్లోకి పేల్చి గౌరవ వందనం సమర్పించారు. తర్వాత చితికి మన్మోహన్ పెద్ద కుమార్తె ఉపీందర్ సింగ్ నిప్పంటించడంతో అంత్యక్రియలు ముగిశాయి. మన్మోహన్ సింగ్ జ్ఞాపకాలతో అందరి హృదయాలు బరువెక్కాయి. అల్విదా మన్మోహన్‌జీ అంటూ కొందరు బోరున విలపించారు. సిక్కు సంప్రదాయం ప్రకారం మన్మోహన్ 'అఖండ్ పథ్'ను జనవరి 1న ఢిల్లీలోని నివాసంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జనవరి 3న 'భోగ్' కార్యక్రమం ఉంటుందన్నారు. అంతిమ్ అర్దాస్(చివరి ప్రార్థనలు) జనవరి 3న ఢిల్లీలో గురుద్వారా రికబ్ గంజ్ సాహిబ్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మన్మోహన్ సింగ్ శ్రద్ధాంజలి సభను సోమవారం నిర్వహించనున్నట్లు గుజరాత్ కాంగ్రెస్ నేతలు చెప్పారు.

ఇండియా ప్రగతికి బాటలు వేసిన నేత మన్మోహన్: లారెన్స్ వాంగ్

మన్మోహన్ సింగ్ మృతిపట్ల సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ సంతాపం ప్రకటించారు. భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చిన గొప్ప నాయకుడు మన్మోహన్ అని కొనియాడారు. దార్శనికత, అంకితభావంతో దేశ ప్రగతికి బాటలు వేశారని, ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.

ఆంటోనియో గుటెరస్ సంతాపం

మన్మోహన్ సింగ్ మృతిపట్ల ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ విచారం వ్యక్తంచేశారు. మన్మోహన్ కుటుంబ సభ్యులకు, భారతదేశ ప్రజలకు, ప్రభుత్వానికి సంతాపం ప్రకటించారు. ఇండియా ఆర్థిక వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. మన్మోహన్ హయాంలో ఐక్యరాజ్యసమితితో భారత్ బంధం బలోపేతమైందని ఉద్ఘాటించారు.

భూటాన్‌లో ప్రత్యేక ప్రార్థనలు

భారత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ ఆత్మశాంతి కోసం భూటాన్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రాజధాని థింపూలోని బౌద్ధ మందిరంతోపాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రార్థనలు నిర్వహించారు. 20 జిల్లాల్లో ప్రార్థనలు జరిగినట్లు భూటాన్ ప్రభుత్వం తెలియజేసింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో తమ జాతీయ పతాకాన్ని అవనతం చేసినట్లు వెల్లడించింది. ఢిల్లీలో జరిగిన మన్మోహన్ అంత్యక్రియలకు భూటాన్ రాజు హాజరయ్యారు. మన్మోహన్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

ధర్మరాజు స్థాపించిన శ్మశాన వాటిక!

మన్మోహన్ అంత్యక్రియలు జరిగిన నిగమ్‌బోధ్ ఘాట్ శ్మశానవాటిక ఢిల్లీలో యమునా నది ఒడ్డునే ఉంది. నగరంలో అది అత్యంత రద్దీగా ఉండే అతిపెద్ద శ్మశానవాటిక. ప్రాచీనమైన ఈ మరుభూమిని పాండవుల అగ్రజుడు, ఇంద్రప్రస్థ పాలకుడైన యుధిష్ఠరుడు(ధర్మరాజు) స్థాపించాడని చెబుతుంటారు. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. రకరకాల పక్షులు విహరిస్తుంటాయి. అందుకే పక్షులను కెమెరాల్లో బంధించడానికి ఫొటోగ్రాఫర్లు వస్తుంటారు. పక్షి ప్రేమికులకు ఇదొక చక్కటి వేదిక. కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ, జనసంఘ్ నేత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, మాజీ ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్, ఢిల్లీ మాజీ సీఎం షీలాదీక్షిత్ సహా పలువురు ప్రముఖుల అంత్యక్రియలు ఇక్కడే జరిగాయి. 5,500 సంవత్సరాల క్రితం మహాభారత కాలంలో సాక్షాత్తూ బ్రహ్మ ఇక్కడ యమునా నదిలో స్నానం ఆచరించాడని, దాంతో ఆయన పూర్వస్మృతి జ్ఞప్తికి వచ్చిందని, అందుకే దీనికి నిగమ్‌బోధ్ అనే పేరు స్థిరపడిందని కొన్ని పుస్తకాల్లో రాశారు. నిగమ్‌బోధ్ ఘాట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) నిర్వహిస్తోంది. 1950వ దశకంలో ఎలక్ట్రిక్ దహన వాటిక, 2000 సంవత్సరం తర్వాత సీఎన్‌జీ దహన వాటిక సైతం ఏర్పాటు చేశారు. అధికారికంగా 1898లో ఈ శ్మశానవాటిక ప్రారంభమైంది. అప్పట్లో ఈ ప్రాంతం పేరు షాజహానాబాద్. మన్మోహన్ స్మారకం నిర్మించే చోటే అంత్యక్రియలు నిర్వహించాలని కాంగ్రెస్ కోరినప్పటికీ కేంద్రం సానుకూలంగా స్పందించలేదు. ఈ పరిణామంపై కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశానికి తొలి సిక్కు ప్రధానమంత్రి అయిన మన్మోహన్‌ను కేంద్రం ఉద్దేశపూర్వకంగా అవమానించిందని మండిపడుతున్నారు.


ఆత్మీయునికి తుది వీడ్కోలు పలుకుతున్న భార్య గురుశరణ్ కౌర్, కుమార్తె దమన్


పాడె మోస్తున్న రాహుల్ గాంధీ


నివాళులు అర్పిస్తున్న భూటాన్ రాజు వాంగుచుక్

2024 రివైండ్ ▸ చేదెక్కువ... తీపి తక్కువ!

2024 ఏడాది మన స్మృతి పథం నుంచి మరలిపోతూ ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఎన్నెన్నో సంఘటనలను మనకు గుర్తులుగా మిగిల్చిపోతోంది. దశాబ్దాల బషర్ అసద్ నిరంకుశ పాలన నుంచి సిరియాకు తిరుగుబాటుదారులు స్వేచ్ఛ కల్పిస్తే అగ్రరాజ్యం అమెరికాలో ఓటర్లు దుందుడుకు డొనాల్డ్ ట్రంప్‌కు మరోసారి పాలనా పగ్గాలు అప్పజెప్పారు. బంగ్లాదేశ్ విమోచన పోరాటయోధుల కుటుంబాలకు రిజర్వేషన్లను కల్పించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ విద్యార్థుల చేసిన ఉద్యమం ధాటికి షేక్ హసీనాను అధికార పీఠం నుంచి దిగిపోయి భారత్‌కు పలాయనం చిత్తగించారు. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతం మరకలను భారత్‌కు పూసేందుకు కెనడా బరితెగించింది. అందుకు దీటుగా దౌత్యవేత్తలను బహిష్కరించి, భారత్ తీవ్ర నిరసన తెలపడంతో బాగా క్షీణించిన ఇరు దేశాల సత్సంబంధాలు వంటి ఎన్నో ఘటనలు ప్రపంచవ్యాప్తంగా జరిగాయి. రాజకీయ సంక్షోభాలు, ప్రకృతి విపత్తులేకాదు ప్రపంచవ్యాప్తంగా పలు సందర్భాల్లో తీపికబుర్లనూ 2024 మోసుకొచ్చింది. ప్లాస్టిక్‌భూతం భూమండలాన్ని చుట్టేస్తున్న వేళ పర్యావరణహిత ప్లాస్టిక్‌ను జపాన్ శాస్త్రవేత్తలు సృష్టించారు. సోషల్‌మీడియా, స్మార్ట్‌ఫోన్ వలలో చిక్కుకున్న చిన్నారులను దాని నుంచి బయటపడేసేందుకు ఆస్ట్రేలియా వంటి పలు దేశాలు టీనేజర్ల 'సోషల్'వినియోగంపై ఆంక్షలు విధించాయి. అసాధ్యమనుకున్న రాకెట్ టెక్నాలజీని స్పేస్‌ఎక్స్ సాధించి చూపింది. ప్రయోగించాక తిరిగొస్తున్న రాకెట్ సూపర్‌హెవీ బూస్టర్‌ను ప్రయోగవేదిక భారీ రోబోటిక్ చేతితో తిరిగి ఒడిసిపట్టి ఔరా అనిపించింది. 2024 ప్రపంచపుస్తకంలోని కొన్ని ముఖ్య పేజీలను తరచిచూస్తే...

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం

ఏప్రిల్‌లో సిరియాలోని తమ దౌత్యకార్యాలయంపైకి ఇజ్రాయెల్ జరిపిన దాడితో ఇరాన్ వీరావేశంతో ఇజ్రాయెల్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు రంగంలోకి దూకింది. నెలల తరబడి గాజా స్ట్రిప్‌లో హమాస్‌తో పోరాడుతున్న ఇజ్రాయెల్‌పైకి బాంబులేసి కొత్తగా ఇరాన్ యుద్ధంలో తలదూర్చింది. దీంతో హమాస్ నుంచి ఇజ్రాయెల్ తన దృష్టినంతా ఇరాన్‌పై నిలిపింది. దాని పర్యవసానాలను ఇరాన్ తీవ్రంగా చవిచూసింది. ఇజ్రాయెల్ భీకర దాడులను తట్టుకోలేక ఇరాన్ దాదాపు చేతులెత్తేసింది. తూర్పు అజర్‌బైజాన్ సరిహద్దు ప్రాంతంలో డొక్కు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తూ ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం రైసీ చనిపోయారు. కీలక నేత మరణంతో ఇజ్రాయెల్‌తో పోరులో అంతర్జాతీయంగా సైనికసాయం సాధించడంలోనూ ఇరాన్ విఫలమైంది.

పేజర్లు, వాకీటాకీల ధమాల్ ధమాల్

యుద్ధవ్యూహాల చరిత్రలో ఎన్నడూలేనంత వినూత్న శైలిలో శత్రువుల పీచమణచడంలో తమది అందవేసిన చేయి అని ఇజ్రాయెల్ మరోసారి నిరూపించుకున్న సంఘటన ఇది. హమాస్‌కు మద్దతుపలుకుతున్న హెజ్‌బొల్లా ఉగ్రమూలాలను ఇజ్రాయెల్ భారీగా దెబ్బకొట్టింది. తామే సృష్టించిన ఒక డొల్ల కంపెనీ ద్వారా వేలాదిగా పేజర్లు, వాకీటాకీలను హెజ్‌బొల్లాతో కొనిపించి, అవి డెలివరీ అయ్యేలోపే వాటిల్లో సూక్ష్మస్థాయిలో ప్లాస్టిక్ బాంబును అమర్చి హెజ్‌బొల్లా మిలిటెంట్లను ఇజ్రాయెల్ చావుదెబ్బతీసింది. సెప్టెంబర్ 17, 18 తేదీల్లో ఏకకాలంలో వేలాది పేజర్లు, వాకీటాకీలను పేల్చేసింది. దీంతో దాదాపు 4,000 మంది రక్తసిక్తమయ్యారు. డజన్ల మంది చనిపోయారు. ఈ దాడి దెబ్బకు లెబనాన్‌లో సామాన్యులు సైతం ఏసీలు, రేడియోలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను వాడేందుకు వణికిపోయారు.

కయ్యానికి కాలుదువ్విన కెనడా

ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతంలో భారత ప్రమేయం ఉందంటూ అక్కడి భారత హైకమిషన్‌కే నోటీసులిచ్చి విచారణ జరిపేందుకు కెనడా సాహసించి భారతదేశ ఆగ్రహానికి గురైంది. వెంటనే ఢిల్లీలోని కెనడా దౌత్యవేత్తలు, ఎంబసీలు, కాన్సులేట్ల సిబ్బందిని వెనక్కి పంపేసి, సొంత దౌత్యాధికారులను వెనక్కి రప్పించి భారత్ తన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేసింది. కెనడా సైతం అలాంటి దుందుడుకు చర్యకు పాల్పడటంతో ఇరుదేశాల మధ్య దౌత్య సత్సంబంధాలు దారుణంగా క్షీణించాయి.

బంగ్లాదేశ్‌లో కూలిన హసీనా ప్రభుత్వం

బంగ్లాదేశ్ విమోచనోద్యమకారుల కుటుంబాలకు ఉద్యోగాలు, ప్రవేశాల్లో రిజర్వేషన్లపై విద్యార్థి లోకం కన్నెర్ర జేయడంతో ప్రధాని షేక్ హసీనా కాళ్లకు పనిచెప్పాల్సి వచ్చింది. హుటాహుటిన ఢాకాను వదిలి ఢిల్లీకి చేరుకున్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు, హిందూ మైనారిటీలపై దాడులతో బంగ్లాదేశ్ ప్రభ అంతర్జాతీయంగా ఒక్కసారిగా మసకబారింది. పరిస్థితిని కాస్తంత చక్కబెడతానంటూ తాత్కాలికంగా పగ్గాలు చేపట్టిన యూనుస్ కూటమి ఇప్పుడేం చేస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉద్యమాలను అణచేస్తూ వేలమంది మరణాలకు బాధ్యురాలైన హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ కోరడం, భారత్ స్పందించకపోవడం చూస్తుంటే పొరుగుదేశంలో భారత్‌కు సఖ్యత చెడే విపరిణామాలే కనుచూపుమేరలో కనిపిస్తున్నాయి.

అగ్రరాజ్యంపై రిపబ్లికన్ జెండా రెపరెపలు

మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్ నినాదంతో దూసుకొచ్చి అలవోకగా అగ్రరాజ్య పీఠాన్ని కైవసం చేసుకున్న రిపబ్లికన్ల అగ్రనేత డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు 2025 ఏడాదికి హాట్‌టాపిక్ వ్యక్తిగా మారారు. ముఖాముఖి చర్చలో బైడెన్‌ను మట్టికరిపించి తన గెలుపును దాదాపు ఖాయం చేసుకున్న ట్రంప్ ఆతర్వాత రేసులో దిగిన కమలా హారిస్‌పై వ్యక్తిగత, విధానపర నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేసి నెగ్గుకురావడం విశేషం. అధికారంలోకి వస్తే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని వెంటనే ఆపేస్తానన్న ప్రతిజ్ఞను ట్రంప్ ఏమేరకు నెరవేరుస్తారో వేచిచూడాలి. తమపై ఎక్కువ పన్ను వేసే భారత్‌పై అధిక పన్నులు మోపుతానని, తమకు భారంగా మారిన కెనడాపై అధిక ట్యాక్స్ వేస్తానని ట్రంప్ చెప్పారు. అక్రమ వలసదారులను కట్టకట్టి బయటకు పంపేస్తానన్నారు. నైతిక నిష్ఠలేని వ్యక్తులను కీలక పదవులకు నామినేట్ చేస్తూ ట్రంప్ తన ఏకపక్ష ధోరణిని ఇప్పటికే బయటపెట్టుకున్నారు.

సిరియాలో బషర్‌కు బైబై

తండ్రి నుంచి వారసత్వంగా పాలన మాత్రమే కాదు నిరంకుశ లక్షణాలను పుణికిపుచ్చుకున్న బసర్ అల్ అసద్‌కు తిరుగుబాటుదారులు ఎట్టకేలకు చరమగీతం పాడారు. తిరుగుబాటుదారుల మెరుపు దాడులతో అసద్ హుటాహుటిన రష్యాకు పారిపోయారు. దీంతో సిరియన్ల సంబరాలు అంబరాన్ని తాకాయి. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాసనలు కొట్టే తిరుగుబాటుదారుల ఏలుబడిలో ఇకపై సిరియా ఏపాటి అభివృద్ధి ఫలాలను అందుకుంటుందోనని ప్రపంచదేశాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఎవరికి వారు కొంత ప్రాంతాలను పాలిస్తున్న వేర్పాటువాదులను ఏకం చేసి ఐక్యంగా దేశాన్ని పాలించాల్సిన బాధ్యత ఇప్పుడు హయత్ తహ్రీర్ అల్‌షామ్ అధినేత అబూ మొహమ్మద్ అల్ జులానీ మీద పడింది.

రష్యా నేలపైకి ఉక్రెయిన్ సేనలు

నెలల తరబడి జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో 2014లో కీలక ఘట్టం చోటుచేసుకుంది. ఆగస్ట్ ఆరున రష్యాలోని కుర్‌స్క్ ఒబ్లాస్ట్ ప్రాంతాన్ని ఉక్రెయిన్ సేనలు ఆక్రమించాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యా భూభాగాన్ని మరో దేశం ఆక్రమించడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్ సేనల దూకుడుకు కళ్లెం వేసేందుకు రష్యా భూతల, గగనతల దాడులకు తెగబడింది. మళ్లీ దాదాపు సగంభూభాగాన్ని వశంచేసుకోగల్గింది. ఇంకా అక్కడ రోజూ భీకర పోరు కొనసాగుతోంది. మరోవైపు రష్యా తరఫున పోరాడుతూ ఉత్తరకొరియా సైనికులు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమదేశాల నుంచి అందుతున్న దీర్ఘశ్రేణి మిస్సైళ్లతో ఉక్రెయిన్ వచ్చే ఏడాది యుద్ధాన్ని ఏ దిశగా తీసుకెళ్తుందోమరి.

దక్షిణకొరియాలో ఎమర్జెన్సీ

పార్లమెంట్‌లో మెజారిటీలేక, తెచ్చిన బిల్లులు ఆమోదం పొందక తీవ్ర అసహనంలో ఉన్న దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ డిసెంబర్ మూడోతేదీన మార్షల్ లా ప్రకటించారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన విపక్షపార్టీల సభ్యులు పార్లమెంట్ గోడలు దూకివచ్చిమరీ మెరుపువేగంతో పార్లమెంట్‌ను సమావేశపరచి మార్షల్ లాను రద్దుచేస్తూ సంబంధిత తీర్మానంపై ఓటింగ్ చేపట్టి నెగ్గించుకున్నారు. దీంతో కేవలం ఆరు గంటల్లోనే ఎమర్జెన్సీని ఎత్తేశారు. మార్షల్ లాను ప్రయోగించి దేశంలో అస్థిరతకు యత్నించారంటూ అధ్యక్షుడిపై విపక్షాలు అభిశంసన తీర్మానం తెచ్చాయి. తొలి తీర్మానం అధికార పార్టీ సభ్యుల గైర్హాజరుతో వీగిపోయింది.

బగ్ దెబ్బకు 'విండోస్' క్లోజ్

టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఒక చిన్న అప్‌డేట్ పెద్ద సమస్యను సృష్టించింది. జూలైలో విండోస్‌కు సెక్యూరిటీ సేవలు అందించే 'క్రౌడ్‌స్ట్రయిక్'సైబర్ సెక్యూరిటీ సంస్థ చేసిన ఫాల్కన్ సెన్సార్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో లోపం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌తో పనిచేసే కంప్యూటర్లలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పలు విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థలుసహా రైల్వే, టీవీ, రేడియో, ఆస్పత్రి సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. అయితే అవి క్రాంతంగా శ్రమించి సమస్యను మైక్రోసాఫ్ట్ పరిష్కరించింది.

పర్యావరణహిత ప్లాస్టిక్!

మనం వాడే ప్లాస్టిక్ తొలుత మురుగు నీటితో ఆ తర్వాత నదీజలాల్లో చివరకు సముద్రాల్లో కలుస్తోంది. ప్రపంచముప్పుగా మారిన ప్లాస్టిక్‌కు చెక్ పెట్టేందుకు జపాన్ శాస్త్రజ్ఞులు పర్యావరణహిత ప్లాస్టిక్‌ను సృష్టించారు. సముద్రజలాలకు చేరగానే కేవలం 10 గంటల్లో నాశనమయ్యే ప్లాస్టిక్ అణువులను వీళ్లు తయారుచేశారు. నేలలో కలిస్తే కేవలం 10 రోజుల్లో ఇది విచ్ఛిన్నమవుతుంది. సింగ్ యూజ్ ప్లాస్టిక్‌ల బదులు ఈ కొత్తతరహా ప్లాస్టిక్ త్వరలోనే వాణిజ్యస్థాయిలో ఉత్పత్తయి ప్రపంచదేశాలకు అందుబాటులోకి రావాలని అంతా ఆశిస్తున్నారు.

రోబోటిక్ చేయి అద్భుతం

అంతరిక్ష ప్రయోగాలకు వ్యోమనౌకలు, కృత్రిమ ఉపగ్రహాల ప్రయోగాలకు ఉపయోగించే వందల కోట్ల ఖరీదైన రాకెట్ బూస్టర్లను మళ్లీ వినియోగించుకునేలా తయారుచేసి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ అందర్నీ ఔరా అనిపించింది. ఇటీవల చేసిన ప్రయోగంలో నింగిలోకి దూసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేరుకుంటున్న భారీ రాకెట్‌బూస్టర్‌ను ప్రయోగవేదికపై అమర్చిన రోబోటిక్ చేయి జాగ్రత్తగా పట్టుకుని శెభాష్ అనిపించుకుంది. బూస్టర్ల పునర్వినియోగంతో ఎంతో డబ్బు ఆదాతోపాటు బూస్టర్ తయారీలో వాడే ఖరీదైన అరుదైన ఖనిజ వనరుల వృథాను తగ్గించుకోవచ్చు.

కృత్రిమ మేధ హవా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) దిగ్గజాలు జాన్ హాప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లకు భౌతికశాస్త్ర నోబెల్‌ను బహూకరించిన నోబెల్ కమిటీ సైతం ఈ ఏడాది కృత్రిమ మేధ ఆవశ్యకతను ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. ఏఐ చాట్‌బాట్‌లు దైనందిన జీవితంలో భాగమైపోయాయి. లక్షల రెట్ల వేగంతో పనిచేస్తూ పురోగమిస్తున్న ఏఐ రంగం ఇప్పుడు మానవ మేధస్సుకు సవాల్ విసురుతోంది. డిజిటల్ దుర్వినియోగం బారినపడకుండా ఏఐను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రపంచదేశాలు ఇటీవల హెచ్చరించాయి.

అత్యుష్ణ ఏడాదిగా దుష్కీర్తి

శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం, యథేచ్ఛగా జరుగుతున్న మానవ కార్యకలాపాలు, అడవుల నరికివేత, పారిశ్రామికీకరణతో భూగోళం ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనంతగా వేడెక్కింది. పారిశ్రామికవిప్లవం ముందునాటితో పోలిస్తే ఉష్ణోగ్రతలో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించిపోకుండా కాచుకోవాల్సిన జనం ఈ ఏడాదే అది మించిపోయేలా చేశారు. చరిత్రలో తొలిసారిగా ఒక్క ఏడాదిలోనే భూతాపంలో ఉన్నతి 1.5 డిగ్రీ సెల్సియస్‌ను దాటింది. ఎల్‌నినో కన్నా వాతావరణ మార్పులు, మానవ తప్పిదాల వల్లే అత్యుష్ణ ఏడాదిగా 2024 చెడ్డపేరు తెచ్చుకుందని తాజా అధ్యయనాల్లో తేలింది.

సూర్యుడి ముంగిట పార్కర్ సందడి

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన 'పార్కర్ సోలార్ ప్రోబ్'వ్యోమనౌక నూతన చరిత్ర లిఖించింది. భగభగ మండే భానుడికి అత్యంత దగ్గరగా వెళ్లింది. తర్వాత అక్కడి నుంచి సురక్షితంగా వెలుపలికి వచ్చింది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి వ్యోమనౌకగా రికార్డు నెలకొల్పింది. పార్కర్‌ను 2018లో ప్రయోగించారు. అంతరిక్ష వాతావరణం, సౌర తుపానులపై లోతైన అవగాహన కోసం దీనిని తయారుచేశారు. వచ్చే ఏడాది మార్చి 22వ తేదీన, మళ్లీ జూన్ 19వ తేదీన సైతం భానుడి చేరువగా వెళ్లనుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

టిక్‌టాక్‌పై నిషేధం వద్దు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో టిక్‌టాక్ నిషేధం విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేదాకా టిక్‌టాక్‌పై నిషేధం విధించకూడదని రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ అమెరికా సుప్రీంకోర్టును కోరారు. ఆయన వచ్చే ఏడాది జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అందుకే జనవరి 19వ తేదీదాకా నిషేధాన్ని వాయిదా వేయాలని ఆయన తరఫు లాయర్లు శుక్రవారం న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. చైనాకు చెందిన టిక్‌టాక్ యాప్ విషయంలో ఒక రాజకీయ తీర్మానం చేయాలన్న యోచనలో ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. టిక్‌టాక్‌ను నిషేధించాలని ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పట్టుబడుతున్నారు. ఈ మేరకు కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నాటికి టిక్‌టాక్‌ను నిషేధించేలా ఒక చట్టం సైతం తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ కంపెనీ యాజమాన్యం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వినియోగదార్ల సమాచారం సేకరించి, చైనాకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో పలు దేశాలు టిక్‌టాక్‌ను ఇప్పటికే నిషేధించిన సంగతి తెలిసిందే.

విమాన ప్రమాదంపై పుతిన్ 'సారీ'

మాస్కో: కజకిస్తాన్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ శనివారం అజెర్‌బైజాన్ అధ్యక్షుడు ఇలాహ్మ అలియేవ్‌కు క్షమాపణ చెప్పారు. అది అత్యంత విషాదకర ఘటన అని పేర్కొన్నారు. రష్యాలోని చెచెన్యా రిపబ్లిక్ రాజధాని గ్రోజ్నీలో ల్యాండవ్వాల్సిన విమానం బుధవారం అనూహ్యంగా కుప్పకూలి 38 మంది మరణించడం తెలిసిందే. దీనికి రష్యా గగనతల రక్షణ వ్యవస్థలోని క్షిపణి కారణమంటూ ఆరోపణలు వస్తున్న వేళ పుతిన్ క్షమాపణ చెప్పడం గమనార్హం. అయితే, విమాన ప్రమాదానికి బాధ్యత తమదేనంటూ ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అంగీకరించలేదు. 'అజెర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం గ్రోజ్నీ విమానాశ్రయంలో ల్యాండయ్యేందుకు పదేపదే ప్రయత్నించడంతో గగనతల రక్షణ వ్యవస్థలు కాల్పులు జరిపాయి' అని అంతకుముందు అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ కాల్పుల వల్లే విమానం కూలిందంటూ వేరుగా అందులో పేర్కొనలేదు. రష్యా గగనతలంలో ఈ ఘటన చోటుచేసుకున్న కారణంగా అధ్యక్షుడు పుతిన్ అజెర్‌బైజాన్ ప్రెసిడెంట్ అలియేవ్‌కు క్షమాపణ చెప్పారని క్రెమ్లిన్ వివరించింది. దీనిని అజెర్‌బైజాన్ అధ్యక్షుడి కార్యాలయం కూడా ధ్రువీకరించింది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



పబ్‌లపై డేగ కన్ను

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగరంలోని పబ్‌లపై పోలీసులు నిఘా పెంచారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

-8లో



కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం..

కొత్త ఏడాది.. కొత్త ఆశలు..సరికొత్త ఆలోచనలతో నగరవాసులు నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు సిద్ధపడుతున్నారు.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 28.0/18.0

వాతావరణం

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి పెరుగుతుంది.



శనివారం రాత్రి బుక్‌ఫెయిర్‌లో సందర్శకులు (ఏరియల్ వ్యూ)



వెలుగుల పుస్తకం

ఎన్టీఆర్ స్టేడియం వేదికగా ఈ నెల 19న ప్రారంభమైన బుక్‌ఫెయిర్ ముగింపు దశకు చేరింది. పుస్తక ప్రియులకు మరపురాని మధుర స్మృతులను మిగిల్చిన ఈ ప్రదర్శన ఆదివారం ముగియనుండగా..ఈ ఏడాది భారీ సంఖ్యలో ప్రజలు బుక్‌ఫెయిర్‌ను సందర్శించారు. దాదాపు 10 లక్షల మంది పుస్తక ప్రదర్శనకు విచ్చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఇక శనివారం రాత్రి చిన్నారులు, యువత, పెద్దలతో బుక్‌ఫెయిర్ ప్రాంగణం కిటకిటలాడింది. విద్యుత్ లైట్ల వెలుగుల్లో జిగేల్‌మంది.- సాక్షి, సిటీబ్యూరో

సమాజంలో వైద్యరంగానిది కీలకపాత్ర: గవర్నర్



డాక్టర్ మహేందర్‌రెడ్డికి అవార్డును అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాయదుర్గం: వైద్య రంగానికి, డాక్టర్లకు సమాజంలో కీలక పాత్ర ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఐఎంఏ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించగా..ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడారు. ప్రస్తుతం వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, అత్యాధునిక వైద్య సేవలు రోగులకు అందించేందుకు అవకాశం ఏర్పడుతోందన్నారు. వైద్య రంగంలో మంచి సేవలను అందించే వారికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. అందుకు డాక్టర్ పి. మహేందర్‌రెడ్డియే చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. డాక్టర్‌గా ఆయన వృత్తికి చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.మహేందర్‌రెడ్డికి గవర్నర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, ఐఎంఏ జాతీయ, రాష్ట్ర బాధ్యులు, పలువురు వైద్యులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

త్వరలో ప్రత్యేక వసతిగృహం: కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం త్వరలో వసతి గృహం ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యులు సాయిబాబా గౌడ్, గంగారం, నాగభూషణం, కొల్లి నాగేశ్వరరావు, మెంబర్ నాగేశ్వరరావు ,శాంతి వెంకట్ మాట్లాడుతూ అంధులకు బస్సులలో అన్ని విధాలుగా ప్రయాణానికి వీలుగా ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను గుర్తించి అర్హులైన దివ్యాంగులకు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ సూచనలపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల శాఖ సంచాలకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

200 ఎకరాలను పరిరక్షించాం!

అందులో 12 చెరువులు, 8 పార్కులు, ప్రభుత్వ స్థలాలు

- చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సాంకేతిక ప్రక్రియ అమలు
- అక్రమమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ జనావాసాల జోలికి వెళ్లం
- 'వార్షిక' సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి

'ఈ ఏడాది జూలై 19న హైడ్రా ఉద్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 200 ఎకరాలను పరిరక్షించాం. వీటిలో 12 చెరువులు, ఎనిమిది పార్కులతో పాటు ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి' అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. బుద్ధభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు అయినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ జనావాసాల జోలికి వెళ్లమని, హైడ్రా ఏర్పడిన తర్వాత వెలిసిన అక్రమ నిర్మాణాల పైనే చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. 2025 సంవత్సరంలో హైడ్రా అనుసరించే విధానాలపై రూట్ మ్యాప్ తయారు చేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



సమావేశంలో రంగనాథ్



హైడ్రా కూల్చివేతలు (ఫైల్)

ఆ డజను జలవనరులు ఇవే..	
చెరువు పేరు	ప్రాంతం
సున్నం చెరువు	గుట్టల బేగంపేట
ఎర్రకుంట	బాచుపల్లి
తమ్మిడికుంట	మాదాపూర్
ఈర్ల చెరువు	చందానగర్
నాల చెరువు	కూకట్‌పల్లి
నల్ల చెరువు	ఉప్పల్
బతుకమ్మకుంట	అంబర్‌పేట
తోతనికుంట	ఖాజాగూడ
బుమ్రుఖ్ దౌలా లేక్	రాజేంద్రనగర్
అప్పా చెరువు	గగన్ పహాడ్
ఎర్రకుంట	తార్నాక
కత్వా చెరువు	దుండిగల్

ఓఆర్ఆర్ పరిధిలో ఆయా నిర్మాణాలకు నోటీసులు ఇచ్చే అధికారం కూడా హైడ్రాకు వచ్చింది. సంజాయిషీ నోటీసులతో పాటు అవసరాన్ని బట్టి ఖాళీ చేయమని, కూల్చేస్తామని సైతం నోటీసులు జారీ చేస్తుంది. గడిచిన 5 నెలల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 2025కు రూట్ మ్యాప్ తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు హైడ్రాకు 5800 ఫిర్యాదులు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి ఓఆర్ఆర్‌కు ఆనుకుంటూ అవతలి వైపునకూ విస్తరించి ఉన్న 27 పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. పునరుద్ధరించిన 12 చెరువులకు 2025లో పునరుజ్జీవం కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న హైడ్రా వాటి వివరాలను ప్రభుత్వానికి నివేదించనుంది.

ఎవరి ప్రమేయం లేకుండా ఎఫ్‌టీఎల్...

ప్రస్తుతం నగరం పరిధిలో ఉన్న 1095 చెరువుల్ని హైడ్రా గుర్తించింది. వీటి ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నిర్ధారణ, పునర్ వ్యవస్థీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఏ దశలోనూ మానవ వనరుల ప్రమేయం లేకుండా పూర్తి సాంకేతికంగా దీన్ని తేల్చనున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లు, రికార్డులు, డేటా ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) డేటా, శాటిలైట్ ఇమేజ్‌తో పాటు అత్యంత రెజల్యూషన్ ఉన్న గూగుల్ డేటా తీసుకుంటున్నారు. 2006 నుంచి 2023 వరకు ఏరియల్, డ్రోన్స్ ఫొటోలతో పాటు రెవెన్యూ రికార్డులను అధ్యయనం చేస్తున్నారు. వీటి ద్వారా ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ మారడానికి కారణాలు స్పష్టంగా తెలుసుకోనున్నారు.

పెద్ద నాలాల ఆక్రమణలపైనా నజర్...

చెరువులతో పాటు నాలాల పైనా హైడ్రా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. దీనికోసం కిర్లోస్కర్ కమిటీ, ఓమెంట్స్ నివేదికలను పరిశీలిస్తోంది. చిన్న చిన్న నాలాలు కాకుండా మూడు, నాలుగు ఆర్డర్స్‌లో ఉండే పెద్ద వాటిపైనే ప్రధానంగా దృష్టి పెడుతోంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా నాలాలపై ఆక్రమణలను గుర్తిస్తున్నారు. చెరువులను మింగేస్తున్న వాటిలో భవన నిర్మాణ వ్యర్థాలు కూడా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో 2025లో వీటి డంపింగ్ కోసం ప్రత్యేక స్థలాల గుర్తింపుతో పాటు జలవనరులకు జియో ఫెన్సింగ్ చేయనున్నారు. జనవరి నుంచి ప్రతి సోమవారం హైడ్రా గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నారు. ప్రజలు, కాలనీ అసోసియేషన్లు ఇచ్చే ఫిర్యాదులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

యాప్, వెబ్‌సైట్ ద్వారా సమాచారం

- హైడ్రా 2025లో తమ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. వీటిలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ స్థలాలు, పార్కులు తదితరాలకు సంబంధించిన సమస్త సమాచారం జీపీఎల్ ఆధారంగా నిక్షిప్తం చేయనున్నారు.
- ఓ వ్యక్తి ఎక్కడైనా నిల్చుని హైడ్రా యాప్ ఓపెన్ చేస్తే..అది వీటిలో ఏ ప్రాంతం పరిధిలోకి వస్తుందో తెలిసేలా అభివృద్ధి చేస్తున్నారు. హైడ్రా ఆవిర్భావం తర్వాత వీటిపై అవగాహన పెరిగిన ప్రజలు ఆచితూచి వ్యవహరిస్తుండటంతో ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- త్వరలో ఏర్పాటుకానున్న హైడ్రా పోలీసు స్టేషన్ ప్రభుత్వ, చెరువుల భూముల కబ్జా కేసులను దర్యాప్తు చేస్తుంది. ఈ దందాల వెనుక ఉన్న సూత్రధారులు, అధికారులను గుర్తిస్తుంది.
- హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ డీ-మార్కేషన్‌ను 2025లో హైడ్రా పూర్తి చేయనుంది. మూసీలో ఉన్న ఆక్రమణల గుర్తింపునకు ప్రాధాన్యం ఇవ్వనుంది. వర్షపు నీరు పరిరక్షణ పైనా హైడ్రా అధ్యయనం చేయనుంది.

మెట్రో మార్గాల్లో 'డబుల్ డెక్కర్లు'

విప్రో సర్కిల్, ఆల్విన్ జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణం

- కింద ఫ్లై ఓవర్, పైన రైలుమార్గం
- ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద మరో ఫ్లై ఓవర్
- సిద్ధమవుతోన్న జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద నిర్మించబోయే ఫ్లై ఓవర్ల మార్గాల్లో మెట్రోరైలు వచ్చే ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరపనున్నారు. హై సిటీ ప్రాజెక్టులో భాగంగా గ్రేటర్ నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ తదితర పనులకు ప్రభుత్వం రూ.7,032 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సదరు పనులు ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఖాజాగూడ జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు రూ.837 కోట్లు పరిపాలన అనుమతులు జారీ చేశారు. వాటిల్లో విప్రో సర్కిల్ దగ్గర రెండు మార్గాల్లో నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. విప్రో గేట్ దగ్గర నుంచి ప్రారంభమయ్యే ఈ ఫ్లై ఓవర్ 'యాక్సెంచర్'కు ముందుగా దిగనుంది. ఇదే మార్గంలో మెట్రో రైలు రెండో దశలో భాగంగా రాయదుర్గం నుంచి కోకాపేట నియోపోలిస్ వెళ్లే మార్గం రానుంది. ఈ నేపథ్యంలో హై సిటీ పనులు చేస్తున్న జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం, మెట్రో అధికారులు జంక్షన్ వద్ద మెట్రోరైలు మార్గాన్ని ఫ్లై ఓవర్ పైనుంచి తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు. అందుకనుగుణంగా డిజైన్లు రూపొందించనున్నారు. అలాగే ఆల్విన్ క్రాస్‌రోడ్, మియాపూర్ జంక్షన్ల మధ్య 2.28 మీటర్ల మేర ఆరులేన్ల ఫ్లై ఓవర్, లింగంపల్లి వైపు నుంచి గచ్చిబౌలి వైపు 800 మీటర్ల మేర మూడు లేన్ల అండర్‌పాస్ రానుంది. ఈ పనుల కోసం రూ.530 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఇక్కడ ఫ్లై ఓవర్ మార్గంలోనే మియాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే మెట్రో మార్గం రానుంది. దీంతో ఇక్కడ కూడా మొదటి వరుసలో ఫ్లై ఓవర్, రెండో వరుసలో మెట్రోమార్గం నిర్మించాలనే ఆలోచనలో అధికారులున్నారు. దీనికి సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నాగోల్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు వెళ్లే మెట్రో మార్గంలోనూ ఫ్లై ఓవర్లు వచ్చే ప్రాంతాల్లో డబుల్‌డెక్కర్‌గా నిర్మాణాలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఇలా మెట్రో రెండోదశ మార్గాల్లో జీహెచ్ఎంసీ కొత్త ఫ్లై ఓవర్లు నిర్మించాల్సిన ప్రాంతాల్లో 'డబుల్' డెక్కర్ ఆలోచనలు చేస్తున్నారు.

ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్

నగరంలో ట్రాఫిక్ రద్దీ అత్యధికంగా ఉండే జంక్షన్లలో ఒకటైన పంజగుట్ట ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఒక ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఐటీ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్ వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతో వేగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు వస్తున్న వాహనాల వేగం అక్కడి నుంచి మందగిస్తోంది. ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్దకొచ్చేటప్పటికి ఇది మరింత తీవ్రమవుతోంది. దీంతో ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ దగ్గర ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి చట్నీస్ దగ్గర నుంచి జలగం వెంగళ్రావు పార్కు వరకు వన్‌వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. ఐటీ కారిడార్ల నుంచి బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నంల వైపు వెళ్లే వారికి ఈ ఫ్లైఓవర్ వల్ల సాఫీ ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.



- మెట్రో రెండోదశలో రాయదుర్గం-కోకాపేట నియోపోలిస్ మార్గంలో బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రోసర్కిల్, ఫైనాన్షియల్‌డిస్ట్రిక్ట్
- మియాపూర్ -పటాన్‌చెరు మార్గంలో ఆల్విన్‌క్రాస్‌రోడ్, మదీనగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్
- నాగోల్- ఎయిర్‌పోర్ట్ మార్గంలో ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ తదితర ప్రాంతాలు రానుండటం తెలిసిందే.

పాతబస్తీలో కొత్త పైపులైన్లు

డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం

- రూ.301 కోట్లతో జోన్-2 సీవరేజీ నెట్‌వర్క్ ప్రాజెక్ట్
- 156 కిలో మీటర్ల పొడవున పైప్‌లైన్ పనులు
- ఎస్టీపీల ద్వారా వంద శాతం వ్యర్థ జలాల శుద్ధి
- జనవరి రెండో వారంలో సీఎంతో శంకుస్థాపన



సాక్షి, సిటీబ్యూరో: మూసీ దక్షిణ భాగంలో సుమారు రూ.301 కోట్ల అంచనా వ్యయంతో మురుగు నీటి వ్యవస్థను మెరుగు పర్చేందుకు జోన్-2 సమగ్ర మురుగునీటి మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు అమలుకు జలమండలి సిద్ధమైంది. సమగ్ర మురుగునీటి ప్రణాళికలో భాగంగా పాతబస్తీలోని పురాతన పైప్‌లైన్లను మార్చి..వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్స్‌ నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జనవరి రెండో వారంలో ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వాస్తవంగా ఈ నెల 29న ముహూర్తం నిర్ణయించినప్పటికీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా వాయిదా పడింది. పాతబస్తీలో నిజాం కాలం నాటి పైప్‌లైన్లు తరుచూ పగలిపోవడం, రోడ్లలో పూడుకుపోతుండటంతో మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా తయారైంది. నిరంతరం రోడ్లపై మురుగు పొంగిపొర్లుతుండటంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక చిన్నపాటి వానకు డ్రైనేజీలు పొంగిపార్లి మురుగు నీరు ఇళ్లలో ప్రవేశిస్తోంది. మరోవైపు మంచినీటి పైప్‌లైన్లలోకి ముగురునీరు చేరి కలుషితం అవుతున్నాయి. ప్రతి నిత్యం పాతబస్తీ నుంచి జలమండలి కాల్‌సెంటర్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో పాతబస్తీలో మురుగు నీటి సమస్యకు చెక్ పెట్టేందుకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు.

156 కి.మీ మేర కొత్త పైప్‌లైన్

పాతబస్తీలో సుమారు 156.103 కిలో మీటర్ల పొడవునా కొత్త మురుగు కాలువలు, ప్రధాన కాల్వల నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. మొత్తం మీద 141.46 కిలోమీటర్ల పొడవునా 200, 250, 300 ఎంఎం డయా, 14.64 కిలోమీటర్ల పొడవునా 400 ఎంఎం నుండి 1800 ఎంఎం డయా పైప్‌లైన్లతో కాల్వలను మెరుగు పర్చనున్నారు. దీంతో లలితాబాగ్, రియాసత్‌నగర్, జంగమెట్, ఉప్పుగూడ, చాంద్రాయణగుట్ట, బార్కాస్, కంచన్‌బాగ్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న మురుగునీటి వ్యవస్థ మెరుగుపడనుంది.

24 నెలల్లో పనులు పూర్తి చేస్తాం

జోన్-2 సీవరేజ్ నెట్‌వర్క్ పనులను 24 నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాం. పాతబస్తీలోని మురుగు నీటి వ్యవస్థ మరింత మెరుగుపడుతోంది. ఆ పరిధిలో ఉత్పత్తయ్యే మురుగు నీటిని నేరుగా నాలాల్లో, మూసీలో వదలకుండా వంద శాతం సేకరించి ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తాం.

– అశోక్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం జోన్-2 పరిధిలో ఉత్పత్తయ్యే మురుగు నాగోల్ ఎస్టీపీలో శుద్ధి అవుతోంది. అయితే నాగోల్ పరివాహక ప్రాంతంలో మురుగునీటి ఉత్పత్తి వరుసగా 2036 - 2051 సంవత్సరానికి 494.46 ఎంఎల్డీ నుంచి 633.89 ఎంఎల్డీకి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న సరూర్‌నగర్ ఎస్టీపీ (2.5 ఎంఎల్డీలు) నాగోల్ (172 ఎంఎల్డీ)లను ఉపయోగించుకోవచ్చు. పెరుగనున్న మురుగు ఉత్పత్తి దృష్ట్యా నాగోల్ ఎస్టీపీ సామర్థ్యాన్ని 320 ఎంఎల్‌డీ నుంచి 459.50 ఎంఎల్‌డీకి పెంచేవిధంగా జలమండలి చర్యలు చేపట్టింది.

కొత్త సంస్కరణలకు శ్రీకారం

జలమండలి రౌండప్ 2024

సాక్షి, సిటీబ్యూరో: ఏడాది కాలంగా జలమండలిలో కొత్త సంస్కరణలు చోటు చేసుకున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జీఐఎస్ ఆధారంగా క్షేత్ర స్థాయి పనితీరుపై పర్యవేక్షణ ప్రారంభించారు. ఈ ఏడాదే బోర్డుకు కొత్త సారథులు వచ్చారు. దీంతో ఉన్నత స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు యంత్రాంగం పనితీరులో సరికొత్త మార్పులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-2కు పచ్చజెండా ఊపింది.

నగరాన్ని సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చడం, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తోంది. నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సివరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో నీటి కరువు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు చేపట్టింది. ఫలితంగా దినసరి ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయి.

- హైదరాబాద్ నగరంలో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని 100 శాతం శుద్ధి చేసే దిశగా జలమండలి అడుగులు వేగవంతమయ్యాయి. ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేస్తున్నారు. మరో 11 ఎస్టీపీలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మరో 9 ఎస్టీపీలు నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. అమృత్-2.0 మూడో దశ కింద మరో 39 ఎస్టీపీలు టెండర్ల దశలో ఉన్నాయి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లల్లో మురుగు చేరకుండా మరో నాలుగు ఎస్టీపీలు నిర్మించేందుకు సిద్ధమయ్యారు.



సత్ఫలితాలిస్తున్న సీవరేజీ స్పెషల్ డ్రైవ్

- గోదావరి రెండో దశకు పచ్చజెండా

- దీర్ఘకాలికంగా పెండింగ్ నల్లా బిల్లుల వసూళ్లకు వన్‌టైమ్ సెటిల్ మెంట్ పథకం-2024తో 1.17 లక్షల మంది వినియోగదారులు లబ్ధి పొందారు.
- నగరంలో చరిత్రాత్మక గండిపేట్ కాండూట్‌ను పదేళ్లుగా వేధిస్తున్న లీకేజీ సమస్యకు జలమండలి అడ్డుకట్ట వేసింది.
- వేసవిలో నగరంలో భూగర్భ జలాలు భారీగా పడిపోవడంతో తాగునీటి సరఫరాకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఒకవైపు ప్రధాన జలాశయాలు నాగార్జున సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీటి మట్టం అడుగంటడంతో అత్యవసర పంపింగ్ తప్పలేదు.
- నాగార్జునసాగర్ జలాశయంలోని డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు తలపెట్టిన సుంకిశాల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్ రక్షణ గోడ కుప్పకూలిన ఘటనలో ఉన్నతాధికారులపై బదిలీ, ఇంజనీరింగ్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

చేయని దొంగతనానికి వర్కర్‌ను కొట్టించారు

బాధ్యులపై చర్యలు తీసుకుని లింగయ్యకు న్యాయం చేయాలి

నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ వర్కర్ల ఆందోళన

బాధ్యులపై చర్యలు తీసుకుంటా: నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



నిమ్స్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రతినిధులతో సమావేశమైన డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్ : చేయని దొంగతనానికి పోలీసులతో కొట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడు లింగయ్యకు న్యాయం చేయాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం లింగయ్యకు మద్దతుగా యూనియన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓపీ పేషెంట్ బంగారు గొలుసు కనపడటంలేదని సెక్యూరిటీ సిబ్బందికి ఫిర్యాదు చేసిన వెంటనే ప్రాథమిక విచారణ చేయకుండానే ఆన్ డ్యూటీలో ఉన్న వర్కర్‌ను బాధ్యుడిని చేస్తూ పోలీసులకు అప్పగించడం దారుణమన్నారు. లింగయ్యను తీవ్రంగా కొట్టిన పంజాగుట్ట పోలీసులపై తగిన చర్యలు తీసుకునే విధంగా పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. బాధితుడు లింగయ్యకు రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని, అతను కోలుకునేంత వరకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. అనంతరం నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో జరిగిన సమావేశంలో ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది వ్యవహార సరళిపై డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. దీనిపై నిమ్స్ డైరెక్టర్ స్పందిస్తూ తనకు రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరారు. విచారణ కమిటీ వేసి కమిటీ నివేదిక మేరకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులతో పాటు మ్యాన్‌పవర్ కాంట్రాక్టర్లు సీతారామయ్య, రవికిరణ్, నిమ్స్ ఇంచార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్‌లపై డేగ కన్ను

- డ్రగ్ పెడ్లర్లపై నిఘా
- పబ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి



పబ్‌లో యువత సందడి...(ఫైల్)



న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమవుతున్న జూబ్లీహిల్స్ పబ్‌లు

బంజారాహిల్స్: పబ్‌లు అంటేనే గుర్తుకు వచ్చేది జూబ్లీహిల్స్... నగరంలో ఎక్కడా లేనంత హడావుడి, హంగామా జూబ్లీహిల్స్ పబ్‌లలోనే కనిపిస్తుంది. చుక్కేసినా... చిందేసినా జూబ్లీహిల్స్ పబ్‌లో ఉంటేనే ఆ కిక్కెక్కుతుంది. అందుకే యువత కళ్లన్నీ జూబ్లీహిల్స్ పబ్‌లపైనే ఉంటాయి. మామూలు రోజుల్లోనే హంగామా జరిగే ఈ పబ్‌లలో న్యూ ఇయర్ విషయం చెప్పనక్కర్లేదు...ఈ నెల 31న రాత్రి న్యూ ఇయర్ వేడుకలకు జూబ్లీహిల్స్‌లోని పబ్‌లన్నీ సరికొత్త వేదికలతో సిద్ధమవుతున్నాయి. ప్రత్యేక ఆకర్షన కోసం బాలీవుడ్, టాలీవుడ్ తారలను రప్పిస్తున్నారు. అయితే పబ్ నిర్వాహకులు న్యూ ఇయర్ వేడుకల్లో శ్రుతిమించితే ఊరుకునే ప్రసక్తే లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం హద్దు మీరినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఏం చేయాలి.. ఏం చేయకూడదన్న దానిపై పబ్‌ల నిర్వాహకులకు పోలీసులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఒక పబ్‌లో మద్యం సేవించి ఆ నిషాలో మరో పబ్‌కు వెళ్లి తాగుతామంటే ఇప్పుడు కుదరదు అని చెప్పాలని.. నిషాలో ఉన్న వ్యక్తికి మద్యం సరఫరా చేయకూడదని ఒక వేళ అలా చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పబ్‌ల నిర్వాహకులకు సమావేశాలు నిర్వహించిన పోలీసులు హద్దుమీరి ప్రవర్తిస్తే బాగుండదని హెచ్చరించారు. ప్రతి పబ్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పబ్ ముందు, పార్కింగ్ ప్లేస్‌లోనూ సీసీ కెమెరాలు ఉండాలని సూచిస్తున్నారు. పబ్‌లలో డ్రగ్స్ సరఫరా అయ్యే సూచనలు ఉండటంతో గత పది రోజులుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు గతంలో డ్రగ్స్ సరఫరా చేసిన పెడ్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారంతా ఇప్పుడు ఎక్కడున్నారు. ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎవరెవరితో మాట్లాడుతున్నారు అన్న అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో న్యూ ఇయర్ వేడుకలు జరిగే అన్ని పబ్‌లపై పోలీసులు డేగ కన్ను వేయనున్నారు. అనుమానితుల కదలికలపై ఇప్పటికే దృష్టి సారించారు. ప్రతి పబ్‌లోనూ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గంజాయి సరఫరాదారులపై నిఘా ఉంచిన పోలీసులు గతంలో గంజాయి కేసులు నమోదైన వారిపై దృష్టి సారించారు. న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత మద్యం సేవించే వారు జాగ్రత్తగా ఇంటికి వెళ్లేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో వారినే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

నాలుగు పబ్‌లకు అనుమతి నో...

జూబ్లీహిల్స్‌లోని హార్ట్‌కప్, అమ్నేషియా, బ్రాడ్‌వే, బేబీలాన్ పబ్‌లకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. గతంలో ఆయా పబ్‌లలో జరిగిన గొడవలు, పోలీసు కేసుల కారణంగా వాటిపై ఆంక్షలు విధిస్తూ వేదికలకు అనుమతులు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

సిద్ధమవుతున్న పబ్‌లు ఇవే...

జూబ్లీహిల్స్‌లో మొత్తం 36 పబ్‌లు ఉండగా ఇందులో నాలుగింటికి అనుమతులు నిరాకరించారు. కొన్నింట్లో మాత్రం ప్రత్యేక వేడుకలు జరగడం లేదు. అయితే న్యూ ఇయర్ వేడుకల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో లుఫ్ట్, క్లబ్ రోగ్, పోష్ నాష్, తబలారసా, జోరా, లార్డ్ ఆఫ్ డ్రింక్స్, ప్రోస్ట్, జిందగీ స్కై బార్, ఫోర్జ్ బ్రీవ్, 040 బ్రీవ్, హాలో, ఎల్యూజన్, ఎయిర్‌లైవ్, గ్రీజ్ మంకీ, పోర్ ఫాదర్స్, ఙైథుమ్, స్టోన్ వాటర్, పోయిస్ట్ తదితర పబ్‌లు వేడుకలకు అనుమతులు పొందాయి. యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన డీజేలను రప్పిస్తున్నారు. గోవా నుంచి పేరొందిన డీజేలతో పాటు గాయనీ, గాయకులను పిలిపిస్తున్నారు. కొన్ని పబ్‌లకు బాలీవుడ్ తారలు కూడా వస్తుండటం గమనార్హం.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



పబ్‌ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: నూతన సంవత్సర వేడుకలను నిర్వహించే ఈవెంట్ ఆర్గనైజర్లు, పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ అన్నారు. ఈ నెల 31న నూతన సంవత్సర వేడుకల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, స్టార్ హోటళ్ల నిర్వాహకులు మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అన్ని పబ్‌లు, బార్లు మైనర్లను అనుమతించరాదన్నారు. అర్ధరాత్రి ఒంటి గంటలోగా తమ ప్రాంగణాలను ఖాళీ చేయించాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వెస్ట్‌జోన్ అడిషనల్ కమిషనర్‌తో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

■ తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 94401 83778 [P-772891]

■ గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKCరోడ్ ఇన్నర్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ, మంగళగిరి, తాడికొండ రాజధానిలోని ప్లాట్లు అమ్మదలచినవారు సంప్రదించండి. 9948779955 [G-9857]

COMMERCIAL

■ Commercial building for sale besant road Bezawada 12000sft 400yrds Cont Bhavani Real estate Service. 7995153999 [SCA24000957]

HOUSE FOR SALE

■ Chintal, Prasoona Nagar : W/F, G+2 Inde House Sale in 200 Sq yards. : 8328604235 / 8686866637 [SCA24001002]

LAND FOR SALE

■ Mumbai Highway facing Land for Sale near Woxen University, Lingampally, 11 Acres. Contact: 9885271600, 9182559677 [SCA24000843]

PLOT FOR SALE

■ షాద్‌నగర్ పట్టణంలో రైల్వే స్టేషన్ పక్కన 100 గజాల ఇల్లు 35 లక్షలకు/వికారాబాద్ నుండి 10కి.మీలో 15 ఎకరాల వ్యవసాయ భూమి కలదు. Ph: 9573943211, 8125132949 [HA-15103]

■ కంపెనీ డైరెక్ట్ 3.6 లక్షలకే 121 గజాలు ప్లాట్, యాదగిరిగుట్ట దగ్గరలో నెమల Village 24 నెలల EMI కలదు. Ph: 7842408719 [HA-8204]

■ కేవలం గజం Rs.6,999/- మాత్రమే, DTCP లేఔట్ @ షాద్‌నగర్, రంగారెడ్డి గూడ, బెంగుళూర్ హైవే & గజం Rs. 23,000/- HMDA లేఔట్ @ రుద్రారం, ముంబై హైవే సంప్ర: 7981301969 [H-783651]

■ విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో 1210 గజాల (పావు ఎకరం) ఫాం హౌస్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ సేల్. సంప్ర: Ph: 9515438614 [HA-1186]

■ కడ్తాల్, తలకొండపల్లిలో ప్లాట్లు. DTCP, రేరా అప్రూవ్ గ.8,659/- YGT, మొత్కూర్ రోడ్ సర్వేపల్లిలో ఫామ్‌ల్యాండ్ గ. 3,655/- గుంట కూడా సేల్, 2 వీలర్ &1.5g గోల్డ్ ఫ్రీ. All EMI. Ph: 9666458910 [HA-996]

■ మన ఊరు రెసిడెన్షియల్ ప్లాట్లు DTCP & RERA అప్రూవ్డ్ లేఅవుట్ వెంచర్ నందు అన్ని డెవలప్‌మెంట్స్‌తో నారాయణఖేడ్ నందు చ॥గ॥ 4,500కు అవుట్ రేట్‌లో అమ్మబడును. ఫోన్: 7032715283 [HA-897]

■ Hyd అవుట్ స్కర్ట్స్‌లో ప్లాట్స్ గల వారు సం. శంషాబాద్, ఘట్కేసర్, రామోజీఫిలిం సిటీ, యాదగిరిగుట్ట, ఆదిభట్ల, ప్లాట్స్ అమ్మబడును/ కొనబడును. క్లియర్ నాన్ క్లియర్. 8897666388 [HA-99289]

■ Mokila - Commercial Land, Plots; Kollur-Flats; Shamshabad - Villas, Plots; Adibatla-Villas Contact: 7981325237 [HA-1583]

■ HMDA / DTCP / MUDA / RERA Approved, Bank loan Facility Plots for Sale @ Kothur, Shadnagar, Balanagar. Ph: 9849279304 [SCA24000840]

TO-LET

■ మియాపూర్, మయూరినగర్‌లో 2BHK, 1150-Sft, సెమీఫర్నిషెడ్ & విండోస్ విత్ మెష్ ఇల్లు అద్దెకు ఇవ్వబడును. Ph: 9963999252 [SCA24000952]

■ Secunderabad, Opposite Railway Station, Near Metro Station. Ground Floor Shutter For Rent. Size (11X23). Contact: 8309898119 [HA-99422]

■ *Bachupally* 3BHK Flat No. 101, 1630 sqft, Royal Sapphire Apt in Plot No. 26 & 27 IDPL Workers Co-op Hsng Society, Near Reddy labs & Vignan Engg. College. Cont. 9440077161 [HA-1039]

■ 2BHK Villas for Rent in Gated Community. Rent Rs. 10,000/-, Rampally, near Infosys. Sports facility. 24x7 water. Offering security and modern living. 9700554544 [HA-1025]

Services

■ మేము ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్, GST, కంపెనీ రిజిస్ట్రేషన్, TDS, DSC, అకౌంట్స్, లేబర్ లైసెన్స్, లేబర్ కార్డ్ మొదలగునవి చేయబడును. @ వాసవి అసోసియేట్స్. Ph: 9059102066/ 9618062109 [HA-1032]

INTERIOR DESIGNERS

■ Constructions/ Fabrications, RZ Interior/ Construction Carpenter Cuboids, Door, Sofa, Flat Interior, Moulder Kitchen, Wall Painting, Water Proofing, Interior Cleaning. Ph:9032109961. [HA-15105]

WATER PROOFING

■ Catta Associates (New Year Offers) *new Construction Rs.2100/- Sft. Valuations Rs.5000/- Water Proofing Rs.30/- Sft Ph: 9966888830 [SCA24000972]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800520]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6124]

CHITS & DEPOSITS

■ Commitment Available Long & Short term 1 Lakh to 1 Crore chits. For immediate lifting vacant chits Available. Ph: 9494813069 [HA-3765]

INSURANCE

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి లేదా ఏజెంట్‌గా చేరడానికి సంప్రదించండి. ఫోన్: 9000543747 [HA-14797]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, YALAMANCHILI ASHALATHA, H.No.: 1-6-27/302, Ganesh Residency, Curch Road, Dilsukhnagar, Hyderabad. T.S-60, HAVE Changed My Name AS MEKALA ASHALATHA. [SCA24000983]

■ I, Anupama Vinayak Ingale W/o. Upendra Udayarao Nadagouda. R/o B 805, Vamsiram Jyothi Cosmos, Whitefields, Hitech City Hyderabad - 500081. after marriage my name is Change as MAITHILI NADAGOUDA. [SCA24000998]

■ I, Bussa Kishan S/o. Bussa Rama Krishna R/o: 8-3-168/E/2/57 to 60 Flat no.202 Tarangaraju Towers Mothi Nagar, Rajeev Nagar Yousuf Guda Hyd Changed My Name From Venkata Sai Rishi Kishan Bussa To BUSSA KISHAN For All Purpose [SCA24000999]

■ I, Vissamsetty Radhika, W/o Chandolu Rambabu, R/o. Flat no: 101, Gayathri Residency Chandanagar. Changed my Name from Chandolu Radhika to Vissamsetty Radhika. As Per Aadhar for All Purposes. [HA-33628]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, [H-783366]

TOURS & TRAVELS

■ 8/5 చార్ధాంయాత్ర, సరస్వతి పుష్కరాలు. జూన్‌లో యమునోత్రి, గంగోత్రి, కేదార్, బద్రీనాథ్, జూలైలో పవిత్రకాశ్మీర్, అమర్నాథ్ యాత్ర.ఫోన్: 9849747093, 8121682275 [SCA24000980]

■ రామేశ్వరం యాత్ర- 05 Feb 10 రోజులు, 30 క్షేత్రాలు, బ+వ+భో SV టూర్స్ & ట్రావెల్స్ Call: 8074512593/ 7660890099. [SCA24000988]

■ మహాకుంభమేళ-18Jan 6జ్యోతిర్లింగాలు 3శక్తిపీఠాలు అయోధ్య నైమీషారణ్యం 11రోజులు వ+భో+బ SV టూర్స్ & ట్రావెల్స్. ఫోన్: 8074512593, 7660890099 [HA-1188]

Wanted

■ లేడీ టి,కా,,డే, ఎంట్రీ, (హోంబేస్డ్) DTP, వీ॥ ఎడిటర్లు కలెక్షన్స్, ఆ-బాయ్స్, యాంకర్స్, డ్రై, సూ॥వై, హెల్పర్స్, జీ: 10-18K ఫ్రీ హాస్టల్+ట్రైనింగ్. Ph: 7780468727 [SCA24001004]

■ డైరెక్ట్ హోటల్ జాబ్ ఫీజు లేదు Dec 31st రోజు Hyd లోని 5 స్టార్ హోటల్స్ కొరకు క్యాటరింగ్ బాయ్స్ కావలెను. పార్ట్ టైం 900 ఫుల్ టైం 1800ఫుడ్ ఫ్రీ స్పాట్ పేమెంట్ యూనిఫామ్‌తో డ్యూటీకి రావలెను Age: 18-34yrs Ph: 9989978685 [SCA24000979]

■ కాలేజ్ హాస్టల్‌లో పనిచేయుటకు వంట మాస్టర్స్, కటింగ్ మాస్టర్, ఆయాలు, క్లీనింగ్ వర్కర్స్ కావలెను. ఫోన్: 9849776822, 7013995991 [HA-15104]

■ స్కూల్ లో పనిచేయుటకు ఆయా, సెక్యూరిటీ కావలెను. రూ.12000/ 13000 నోట్ బుక్ స్కూల్. పిల్లర్ 179, అత్తాపూర్ సంప్ర: 9959711549 [HA-15106]

■ అమీర్‌పేటలో ఇంట్లో ఉండి పెద్దయినను చూసుకోవడానికి మగమనిషి కావలెను. వసతి సౌకర్యం + భోజనం. ఫోన్: 9848454499/ 8367679977 [SCA24001000]

■ షాద్‌నగర్‌లో పనిచేయుటకు అనుభవం గల ఐవి స్కూటి టెక్నీషియన్ కావలెను. Ph: 8886660998 [HA-1038]

■ వంట, ఇంటిపని, పిల్లలను పేషెంట్స్‌ని చూసుకోవటానికి కేర్ టేకర్స్ పంపబడును. 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [H-800522]

■ సికింద్రాబాద్, తాడ్‌బండ్ పెట్రోల్ బంకు కొరకు క్యాషియర్స్ & బాయ్స్ కావలెను. జీతం : 14000/- రోజుకి 100/- భత్త రూం ఫుడ్ వసతి ఫ్రీ. 9949822338 [SCA24000858]

■ శ్రీనివాస గ్రూపు, (నాగోల్, హైదరాబాద్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 99636 91122, 92814 65315 [B-1172528]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్. భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ✆ 91332 71122, 95534 61177 [B-1172531]


■ 30-60yrs, R/E రంగంలో భారత దేశంలోనే ప్రథమస్థానంలో గల పెద్ద సంస్థలో మేనేజర్స్ కావలెను. నె॥ 2Lac, GV రెడ్డి. Ph: 9491337309 [SCA24000727]

■ Required Good looking Experienced Female Telecaller cum Receptionist in a company. L.B Nagar 8639934895 [SCA24000991]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వీఎస్‌టీ ఎన్నికల్లో సంజీవరెడ్డి ఘన విజయం



ముషీరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన వజీర్ సుల్తాన్ టుబాకో(వీ.ఎస్.టీ) వర్కర్స్ యూనియన్ అధ్యక్ష స్థానం కోసం శనివారం జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున పోటీ చేసిన సంస్థ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి 55 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో సంజీవరెడ్డికి 172 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి నాయిని నర్సింహారెడ్డి గ్రూప్ తరఫున పోటీ చేసిన ఆయన అల్లుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డికి 115 ఓట్లు పోల్ అయ్యాయి. కొత్తగా బీజేపీ అనుబంధ ట్రేడ్ యూనియన్ బీఎంఎస్ తరఫున పోటీ చేసిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి 95 ఓట్లు పోల్ అయ్యాయి. కంపెనీలో మొత్తం 386 మంది ఓటర్లు ఉండగా 382 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. సంజీవరెడ్డిని గెలిపించినందుకు ఆయన గ్రూప్ కార్మిక నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్, ఏ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, సమద్, జానకీరామ్, కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసులు కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వీఎస్ఆర్ స్పీడ్‌కు బ్రేక్...

ఐదు దఫాలుగా ఘన విజయం సాధిస్తున్న నాయిని నర్సింహారెడ్డి అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి స్పీడ్‌కు సంజీవరెడ్డి బ్రేక్‌లు వేశారు. నాయిని నర్సింహారెడ్డి మంత్రిగా పని చేస్తున్న సమయంలో ఆయన పోటీ చేయకూడదనే ఉద్దేశంతో మొదటిసారిగా ఆయన అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం కల్పించారు. అప్పటి నుంచి ఓటమి ఎరగకుండా ఐదుసార్లు విజయఢంకా మోగిస్తూ వచ్చారు. ఈ సారి కొత్తగా బీఎంఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పోటీ చేయడంతో నాయిని వర్గంలో చీలిక ఏర్పడింది. నాయినికి సంబంధించిన ఓట్లు చీలి వెంకటరామిరెడ్డికి 95 ఓట్లు రావడంతో శ్రీనివాస్‌రెడ్డి విజయ అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపాయి.

కార్మికులను పట్టించుకోని వారిని తరిమి కొట్టాలి



జలమండలి కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా అనునిత్యం స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడే నేతలను తరిమి కొట్టాలని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (టీజేఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చవ్వ సతీష్ కుమార్, రాజిరెడ్డి, అల్లి శ్రవన్ కుమార్, రాఘవేందర్ రాజ్, చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు టీజేఈయూ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ -11 లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బోర్డు అధికారిక యూనియన్‌గా రాంబాబు విజయం సాధించినా కార్మిక వర్గానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, తన స్వలాభం కోసమే యూనియన్‌ను వాడుకున్నారని ఆరోపించారు. మరోసారి కార్మికుల పొట్టగొట్టేందుకు వస్తున్నా కార్మికులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఉద్యోగుల పదోన్నతులు- అప్ గ్రెడేషన్ చేయకుండా పక్కన పెట్టడంతో టీజేఈయూ గౌరవాధ్యక్షుడు మధుయాష్కీ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని బోర్డు ఎండీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకున్నారన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సైతం ఉద్యోగులందరికీ సమన్యాయం చేసేలా అంతర్గత బదిలీలు చేపట్టిన ఘనత మధుయాష్కీ గౌడ్‌కు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఆరోగ్య బీమా, హెల్త్ కార్డుల విషయంలో తీవ్ర అన్యాయం చేశారన్నారు. హెల్త్ కార్డు వాల్యూ రూ.3 నుంచి రూ.5 లక్షలకు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. రిటైర్ మెంట్ గ్రాట్యూటీ, డెత్ గ్రాట్యూటీ అమలు కావడం లేదని, బోర్డు ప్రొసీడింగ్స్ అమలు చేసినా కార్మికులకు రిటైర్‌మెంట్, డెత్ గ్రాట్యూటీలు నిల్చిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, హాశం, శంకర్ ప్రకాష్, అజయ్ నాథ్, నరసింహారెడ్డి, కృష్ణ ముదిరాజ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్, గౌస్ పాషా, రాములు ముదిరాజ్, బి.మహేష్, ఆంజనేయులు గౌడ్, మొగులయ్య, రవీందర్ తదితరుల పాల్గొన్నారు.

గంజాయి పెడ్లర్ల అరెస్ట్

10 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర పెడ్లర్లను అరెస్ట్ చేసిన రైల్వే పోలీసులు వారి నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శనివారం సికింద్రాబాద్ జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్ వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బరగాన్ ప్రాంతానికి చెందిన అరుణ్ కుమార్, దీపక్ కుమార్ మహారాష్ట్రలోని రత్నగిరిలో ఉంటూ ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి, వాటిని అమ్ముకుని జీవనం సాగించేవారు. మద్యం, గంజాయికి బానిసలైన వీరికి మోహిత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. దీంతో అతను తాను చేసే గంజాయి దందాకు సహకరిస్తే వాటా ఇస్తానని చెప్పడంతో అందుకు వారు అంగీకరించారు. ఈ నెల 25న ముగ్గురూ కలిసి కోరాపుట్ ప్రాంతంలో 10 కిలోల గంజాయిని కొనుగోలు చేసి విశాఖపట్నం చేరుకున్నారు. దానిని మహారాష్ట్రలోని కల్యాన్‌కు చేర్చాలని అరుణ్, దీపక్‌లకు చెప్పిన మోహిత్ తాను మహారాష్ట్ర వెళ్లిపోయాడు. అతడి సూచన మేరకు ఈ నెల 27న ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కిన వారు శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెం. 2లో దిగారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వారి కదలికలు అనుమానస్పదంగా ఉండటంతో వారి లగేజీని సోదా చేయగా 10.143 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మోహిత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని వ్యక్తి దుర్మరణం



గణేశ్ (ఫైల్)


మాదాపూర్: డ్యూటీ నుంచి ఇంటికి వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరి.ధిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, కే సముద్రం గ్రామానికి చెందిన గణేశ్(34) నగరానికి వలస వచ్చి హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం అతను డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మాదాపూర్ 100 అడుగుల రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నామినేటెడ్ పదవులు ఇప్పిస్తామని రూ. 20 లక్షలు టోకరా

తండ్రీ కొడుకులపై కేసు నమోదు

సైదాబాద్: నామినేటెడ్ పదవులు ఇప్పిస్తామని ఒక న్యాయవాది నుంచి రూ. 20 లక్షలు తీసుకుని మోసం చేసిన తండ్రి కొడుకులపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన న్యాయవాది పి.సోమశేఖర్‌కు సలీంనగర్‌కు చెందిన వ్యాపారి మల్కాపురం సంతోష్‌కుమార్, అతడి తండ్రి మల్కాపురం ప్రకాశరావుతో చాలా ఏళ్లుగా పరిచయం ఉంది. 2021 ఏప్రిల్‌లో వారు తమకు ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయని, న్యాయవాది కుమార్తెకు మలక్‌పేట మార్కెట్ కమిటీ చైర్మన్ లేదా, వైస్‌చైర్మన్ పోస్టు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన సోమశేఖర్ పలు దఫాలుగా వారికి రూ. 20 లక్షలు చెల్లించాడు. అప్పటి నుండి పదవి విషయమై అడిగితే నాన్చుతున్నారు. దీంతో ఆయన తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా అందుకు వారు నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సోమశేఖర్ శుక్రవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాపింగ్ మాల్‌లో యూ ట్యూబర్ హల్‌చల్



బౌన్సర్‌లతో శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోకి వస్తున్న యూ ట్యూబర్ పవర్ వంశీ

గచ్చిబౌలి: నా ఫాలోవర్స్ ఎవరైనా ఉంటే రండి డబ్బులు ఇస్తానంటూ ఓ యూ ట్యూబర్ హల్‌చల్ చేసిన సంఘటన కొత్తగూడలోని శరత్ సిటీ క్యాపిటల్ (ఏఎంబీ)మాల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..శుక్రవారం బౌన్సర్‌లతో మాల్‌లోకి వచ్చిన యూ ట్యూబర్ పవర్ వంశీ నా ఫాలోవర్స్ ఎవరైనా ఉంటే త్వరగా సెకండ్ ఫ్లోర్‌కు త్వరగా రండి ముందు వచ్చిన వారికే డబ్బులు వస్తాయని హల్‌చల్ చేశాడు. దీనిని గుర్తించిన శరత్‌సిటీ క్యాపిటల్ మాల్ సెక్యూరిటీ సిబ్బంది వీడియో తీసేందుకు అనుమతి లేదని చెప్పి సదరు యూ ట్యూబర్‌ను బయటికి పంపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి పోలీసులు తెలిపారు. కాగా మాల్‌లో యూ ట్యూబర్ వంశీ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతంలోనూ అతను కూకట్‌పల్లిలో రోడ్డుపై డబ్బులు విసిరిన ఘటనలో పోలీసులు అరెస్ట్ చేశారు.

సమీక్షకు రెండు నెలలు..!

- ముందుకుసాగని రూ.35 కోట్ల అభివృద్ధి పనులు
- కొత్త సంవత్సరంలోనైనా ప్రారంభమయ్యేనా..?
- ఇప్పటి వరకు ప్రతిపాదనలు కూడా రూపొందించని అధికారులు



అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ (ఫైల్)

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.35 కోట్లు కేటాయించారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చాలా గొప్పగా, ఆనందంగా చెప్పారు. అయితే ఈ రూ.35 కోట్లు ఎక్కడెక్కడ ఖర్చు పెట్టాలో వాటి వివరాలు ఇవ్వాలని, ప్రతిపాదనలు రూపొందించాలని వివిధ శాఖల అధికారులు, కార్పొరేట దానం నాగేందర్ సూచించా రు. ఇందుకోసం గత అక్టోబర్ 23వ తేదీన ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఎక్కడెక్కడ పనులు చేపట్టాలో వాటి వివరాలు అందించాలని, ప్రతిపాదించిన పనులకు అంచనాలు రూపొందించాలని చెప్పా రు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇందులో పాల్గొని ఏయే ప్రాంతంలో పనులు పెండింగ్‌లో ఉన్నాయో ఆ వివరాలను చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి రూ.35 కోట్లు మంజూరు చేశారని, వీటితో పనులు పూర్తిచేస్తే నియోజకవర్గం బాగా అభివృద్ధి చెందుతుందని దానం నాగేందర్ వారితో చె ప్పారు. అయితే ఈ పనుల్లో ఇప్పటిదాకా కదలిక కనిపించడంలేదు. అంచనాలు కూడా ఎక్కడా రూపొందించిన దాఖలాలు లేవు. సమీక్ష సమావేశం నిర్వహించి రెండు నెలలుదాటుతున్నా ఆ పనుల ఊసేలేదు. నెలరోజుల్లో మరోసారి కలిసి చర్చిద్దామని నాగేందర్ సంబంధిత ఇంజినీర్లకు సూచించారు. అయితే ఇంత వరకు సమావేశం నిర్వహించలేదు.

కొత్త సంవత్సంలోనైనా జరిగేనా..?

మరో రెండు రోజుల్లో 2024 సంవత్సరం ముగుస్తుంది. బుధవారం నుంచి 2025 సంవత్సరం ప్రారంభమవుతుంది. వచ్చే సంవత్సరంలోనైనా రూ.35 కోట్లకు సంబంధించి పనులు ప్రారంభమవుతాయా? అన్నది సందేహంగానే ఉంది. ఇప్పటి దాకా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, ఇంజినీర్లు ఎలాంటి అంచనాలు రూపొందించలేదు. దీంతో కొత్త ప్రాజెక్టులు పట్టా లెక్కే సూచనలు కూడా కనిపించడం లేదు. ఉన్నవాటిని పూర్తి చేసే పరిస్థితి కూడా లేకుండాపోయింది. తరచూ వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి వారితో ముఖాముఖి ఏర్పాటు చేస్తే పెండింగ్ పనులు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. కాగా ఈ దిశలో ఎలాంటి ముందు చూపు లేకుండాపోయిందనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి. వచ్చే సంవత్సరంలో ఈ పనులకు సంబంధించి కదలిక మొదలవుతుందన్న ఆశాభావంతో నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించి రెండు నెలల క్రితం చేపట్టిన సమీక్ష పురోగతి ఏలా ఉందో ఆయా శాఖల అధికారులను మరోసారి పిలిపించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడ వడ్డెరబస్తీ నుంచి శ్రీనగర్‌కాలనీ వైపుగా రూ. 16లక్షలతో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నేతలు వనం శ్రీనివాసయాదవ్, వడ్డెర లక్ష్మణ్, బస్తీ నేతలు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి ధనుర్మాస శోభ



ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీవారికి అలంకరణ

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం శ్రీనివాసుడికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీగోదా రంగనాథ స్వామి అలంకరణను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దీంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

సీవరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న స్థానిక కాంగ్రెస్ నేతలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-71లోని నవ నిర్మాణ్‌నగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో సీవరేజీ అండ్ వాటర్ బాక్స్ టైపు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ మాట్లాడుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ నిధులను మంజూరు చేయించారని, దీని ప్రారంభోత్సవంలో తాము కూడా భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇక్కడ సమస్యను తెలుసుకుని నిధులు మంజూరు చేసినందుకు దానం నాగేందర్‌కు కాలనీవాసులు తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

బుడిబుడి స్టెప్పులతో అలరించిన చిన్నారులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు బుడి, బుడి అడుగులతో స్టెప్పులు వేస్తూ అలరించారు. శ్రీనగర్ కాలనీ శ్రీసత్యసాయి నిగమాగమంలో ఈరో కిడ్స్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు జానపద, ఆధునిక, సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రతినిధులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో సర్కిల్-18 అధికారులు

బంజారాహిల్స్: వంట గది నుంచి వచ్చే కూరగాయల వ్యర్థాలతో వర్మీ కంపోస్టును ఏవిధంగా తయారు చేయవచ్చో జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 అధికారులు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. తమకు తాము తమ పెరట్లోనే ఎరువును తయారు చేసుకుని మొక్కలకు పోషకంగా అందించవచ్చని తెలియజేశారు. ముఖ్యంగా వంటింటి ద్వారా వచ్చే కూరగాయలు, ఇతరత్రా వ్యర్థాలను రోజూ బయట పడేస్తుంటారు. అలా కాకుండా తమ ఇంటి ఆవరణలో గొయ్యి తీసి దానిలో వేయడం ద్వారా కొన్ని రోజులకు వర్మీ కంపోస్టుగా మారుతుందని, దీనిని మొక్కలకు ఎరువుగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ప్రశాంతితో పాటు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సినీ కార్మికులపై వివక్ష

తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ 24 విభాగాల నేతలు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రం వచ్చి పదేళ్లు అవుతున్నా తెలుగు సినిమా ఇండస్ట్రీలో మాత్రం తెలంగాణ సినీ కార్మికుల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉన్నదని తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ 24 విభాగాల నేతలు, కార్మికులతో ఆయన ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ఫిలిం ఫెడరేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన 4వేలమంది కార్మికులు వివిధ విభాగాల్లో ఉపాధి పొందుతున్నారని అన్నారు. సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ కార్మికులు వెనుకబడి ఉన్నారని ఎన్నిమార్లు సినీ పెద్దలకు ఈ విషయాన్ని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సినీ నిర్మాత దిల్‌రాజ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కావడం ఆనందంగా ఉందని త్వరలోనే ఎఫ్‌డీసీ చైర్మన్‌తో పాటు సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి తెలంగాణ ప్రాంత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.

జీతాల కోసం కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీనగర్‌కాలనీ: చేసిన పనికి జీతాలు ఇవ్వలేదని, మా జీతాలు మాకు అందేలా చూడాలని కార్మికులు ధర్నా చేపట్టారు. ఎర్రగడ్డ కల్పతరు రెసిడెన్సీలో సెవెన్ హిల్స్ అనే ఏజెన్సీ కాంట్రాక్టుకు సంబంధించి సుమారు 80 మంది వివిధ పనుల్లో పనిచేశారు. అయితే ఈనెల 25 నుంచి మరొక ఏజెన్సీకి కాంట్రాక్టు ఇవ్వడంతో అక్కడ పనిచేసే 80 మంది పని మానివేయాల్సి వచ్చింది. అయితే డిసెంబర్ నెలకు సంబంధించిన జీతాలు మాకు ఇవ్వలేదని ఆరోపిస్తూ గేట్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నోటీస్ పీరియడ్ ప్రకారం మూడు నెలల ముందు చెప్పాలని, కానీ అలా కాకుండా నెలముందు చెప్పి మరొక ఏజెన్సీకి లేబర్ కాంట్రాక్ట్ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం త్వరగా మాకు జీతాలు అందేలా చూడాలని కల్పతరు యాజమాన్యాన్ని వారు కోరారు.

560 కేంద్రాలు..75 వేల మంది విద్యార్థులు

సుచిరిండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ పరీక్ష



సర్ సీవీ రామన్ ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: సుచిరిండియా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన సర్ సీవీ రామన్ ఒలింపియాడ్ పేరుతో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులకు పరీక్ష నిర్వహించింది. భారత్‌లోని దాదాపు 560 కేంద్రాల నుంచి 75 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ముందు వరుసలో నిలిచిన విద్యార్థులకు యంగ్ జీనియస్ అవార్డులను ఫిబ్రవరి 16న నాంపల్లిలోని లలిత కళా తోరణంలో అందించనున్నట్లు సుచిరిండియా సంస్థ వ్యవస్థాపకులు లయన్ డాక్టర్ వై.కిరణ్ తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు వారిని సిద్ధం చేసే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు సుచిరిండియా ఫౌండేషన్ సర్ సీవీ రామన్ ఒలింపియాడ్ పరీక్షలను గత 30 ఏళ్లుగా ప్రతియేటా నిర్వహిస్తోందన్నారు. శనివారం రోజున సర్ సీవీ రామన్ ఒలింపియాడ్ పరీక్షను దేశవ్యాప్తంగా 560 కేంద్రాల్లో నిర్వహించింది. ఈ పరీక్షకు 75 వేలకు పైగా విద్యార్థులు హాజరై, తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి బంగారు పతకాలు, మెమొంటోలు, నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. సుచిరిండియా ఫౌండేషన్ తరుపున నిర్వహించిన సర్ సీవీ రామన్ ఒలింపియాడ్ పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ, పరీక్షకు విద్యార్థులను తీసుకొచ్చిన విద్యా సంస్థలకు ఫౌండేషన్ చైర్మన్ లయన్ డాక్టర్ వై.కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించి, గోల్డ్ మెడల్స్ పొందే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖైరతాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్, సీబీడీ సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుస్సేన్‌సాగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, హస్‌మోల్ హోటల్, సహారా మంజిల్, మెట్రో రైల్వేభవన్, హాకా భవన్, నిజాంక్లబ్ ఏరియా, కళాంజలి, ఆల్ ఇండియా రేడియో కార్యాలయాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆంధ్రాబ్యాంక్ ఏరియా, పట్టాభిభవన్, ఫారెస్ట్ ఆఫీస్ ఏరియా, నవత్ పహాడ్ (కొంత భాగం), ఐసీఐసీఐ బ్యాంక్, షాదాన్ కళాశాల, ఫైగా ప్లాజా, ఖైరతాబాద్ షాపింగ్ మాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని దీనిని గమనించి సహకరించాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వెంగళరావునగర్: పేకాట ఆడుతున్న వారిని మధురానగర్ పోలీసులు శనివారం అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లోని బంగారుమైసమ్మ దేవాలయం సమీపంలోని ఒక గృహంలో కొంతకాలంగా పేకాట ఆడుతున్నట్టుగా మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు శనివారం ఆ గృహంపై దాడి చేయగా కార్పెంటర్‌గా పనిచేసే కె.సిద్దయ్య ఆయన నివాస గృహంలో పేకాట ఆడిస్తున్నట్టుగా గుర్తించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న సత్యనారాయణచారి, కె.రాము, పి.చంద్రశేఖరాచారిలతో పాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,790 నగదును స్వాధీనం చేసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ సంతకాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు






పోలీసులకు పట్టుబడిన నిందితులు

బంజారాహిల్స్: షేక్‌పేటలోని ఓయూ కాలనీలో ప్రభుత్వ మాజీ డిప్యూటీ కార్యదర్శి రఘురామశర్మ ప్లాట్‌ను నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటనలో నలుగురు నిందితులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఎర్రగడ్డలోని బంజారాహిల్స్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ కింద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంతోష్ యాదవ్‌కు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో ప్లాట్లపై మంచి పట్టు ఉంది. షేక్‌పేటలోని ఓయూ కాలనీలో 30 సంవత్సరాలుగా ఓ ప్లాట్ ఖాళీగా ఉందని, ఎవరూ దీని వైపు రావడం లేదని, దీనిని అమ్ముకుంటే కోట్లు సంపాదించవచ్చని ధూల్‌పేటకు చెందిన వికాస్ శ్రీవాత్సవ, క్రాంతికుమార్, శ్రీకాంత్, సవీన్ సక్సేనా, సునీత శర్మలతో సంప్రదింపులు జరిపాడు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించే పథకం వేసి రఘురామశర్మకు చెందిన ప్లాట్‌ను బంజారాహిల్స్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పలుకుబడిని ఉపయోగించి ఫోర్జరీ సంతకాలతో శాంతికుమార్ పేరు మీద ఈ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న బాధితుడు రఘురామశర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరి గుట్టు రట్టయ్యింది. ఈ ఘటనలో సంతోష్‌యాదవ్, వికాస్ శ్రీవాత్సవ, శాంతికుమార్, శ్రీకాంత్‌లను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు సునీతశర్మ, సవీన్ సక్సేనా పరారీలో ఉండగా వీరి కోసం గాలింపు చేపట్టారు. ఈ డాక్యుమెంట్ల తయారీ, ఓయూ కాలనీ సొసైటీ కార్యాలయం నుంచి ఒరిజినల్ డాక్యుమెంట్లు ఎలా బయటకు వెళ్లాయో పోలీసులు ఆరా తీస్తున్నారు.

'దేవాలయాల భూములు కాజేసే కుట్ర'

పంజగుట్ట: దేవాలయ భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సోలార్ ప్లాంట్ల ముసుగులో దేవాలయాల భూములను కాజేయాలనే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని దాన్ని తప్పకుండా అడ్డుకుని తీరుతామని వారు హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బి.నర్సింహమూర్తి, జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, మందిర్ ప్రబంధ పరిషత్ జాతీయ అధ్యక్షులు ఎమ్.రామరాజు, ఉపాధ్యక్షులు భాస్కర్‌రావు, సునితా రాంమోహన్ రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి విడతగా ఐదు జిల్లాల్లో దేవాలయ భూముల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అసలు దేవాదాయ శాఖను పూర్తిగా తొలగించి భారతదేశంలోని అన్ని దేవాలయాలను ధార్మికవేత్తలకు, పీఠాధిపతులు, హిందూ ధర్మాన్ని కాపాడే వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా దేవాలయాల్లో అన్యమతస్తులను ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నిరంతర సాధనతో విజయం తథ్యం



మాట్లాడుతున్న శ్రీదేవసేన

వెంగళరావునగర్: విద్యార్థులు నిరంతర సాధన చేయడం ద్వారా విజయం తథ్యమని రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ ఏ. శ్రీదేవసేన తెలియజేశారు. శ్రీనగర్‌కాలనీలోని బ్రైట్ హైస్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకలు (ఐక్యత) శనివారం సాయంత్రం స్థానిక మధురానగర్ కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీదేవసేన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పోటీతత్వానికి అలవాటు కావాలని, అయితే ఒత్తిడిలేని విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షులు కె. ఉమామహేశ్వరరావు, బ్రైట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎస్. ప్రసాద్, ప్రిన్సిపాల్ గిరిజ, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి.

అసఫ్ జాహీ రాజవంశంపై అంతర్జాతీయ సెమినార్

సాక్షి, సిటీబ్యూరో: నిజాం చరిత్ర కేవలం రాజుల కథ కాదు, ఇది భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న నగర గుర్తింపునకు సజీవ నిదర్శనమని అసఫ్ జాహీ రాజవంశీయుడు, నిజాం వారసులు నవాబ్ రౌనక్ యార్ ఖాన్ తెలిపారు. నగరంలోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వేదికగా శనివారం మున్సిఫ్ టీవీ అండ్ ప్రింట్ ఆధ్వర్యంలో 'ది నిజాం ఎరా' పేరుతో 300 సంవత్సరాల అసఫ్ జాహీ రాజవంశం (1724–2024) అంశం పైన అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు జనాబ్ మొహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించిన ఈ సదస్సులో నవాబ్ రౌనక్ యార్ ఖాన్, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌనక్ యార్ ఖాన్ మాట్లాడుతూ., 1724లో వ్యవస్థాపకుడు ఖమరుద్దీన్‌తో ప్రారంభమైన అసఫ్ జాహీ రాజవంశం చరిత్ర మొదలు 1948లో హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేసే వరకు ముఖ్యమైన అంశాలను ఇందులో చర్చించడం మన చరిత్రకు ఇచ్చిన గౌరవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనాబ్ మౌలానా ఖాలీద్ సైఫుల్లా రెహ్మానీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

టీజీఓ మహిళా శిశుసంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడిగా అక్కేశ్వరరావు



టీజీవో రాష్ట్ర కమిటీని సన్మానిస్తున్న టీఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

వెంగళరావునగర్: తెలంగాణా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (మహిళా శిశుసంక్షేమ శాఖ) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా సంక్షేమ అధికారి ఈ. అక్కేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంగళరావు నగర్‌లోని మధురానగర్‌లో ఉన్న మహిళా శిశు సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీజీవో సెంట్రల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ జి.దీపారెడ్డి వ్యవహరించారు. కాగా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా (ఆర్‌జేడీ) ఎస్.మోతీ, ఉపాధ్యక్షులుగా (సీడీపీఓలు) కె.సబిత, బి.నాగమణి, ఎన్.కనకదుర్గ, కార్యదర్శిగా (సీడీపీఓ) శోభనా హుస్సేన్, జాయింట్ సెక్రటరీలుగా (సీడీపీఓలు)ఎన్.స్వరూప రాథోడ్, సీహెచ్.అనంతలక్ష్మి, జి.కె.సంతోషిబాయి, కోశాధికారిగా డాక్టర్ జె.స్వప్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.జ్యోత్స్న, పబ్లిసిటీ కార్యదర్శిగా సంధ్య రుక్సానా, ఆఫీస్ కార్యదర్శిగా ఐ.నీలిమ కిరణ్, కల్చరల్ కార్యదర్శిగా వి.హేమభార్గవి, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యదర్శిగా ఎం.కవిత, ఈసీ మెంబర్లుగా శాంతిరేఖ, ఆర్.మమత, ఈ.రోజ, సీ.హెచ్. శ్రీమతిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా అక్కేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాలకు చెందిన వారితో సమన్వయంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీతో సెంట్రల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీని టీఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షులు టి.సత్య సురేందర్ తదితరులు ఘనంగా సన్మానించారు.

పీజేఆర్‌కు ఘన నివాళి



పీజేఆర్‌కు నివాలర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత డి.బిక్షపతిగౌడ్

బంజారాహిల్స్: మాజీ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్‌లోని పీజేఆర్ చౌరస్తాలో శ్రీకృష్ణానగర్-ఇందిరానగర్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత డి.బిక్షపతిగౌడ్, డి.సింహ, దీపాదేవిగౌడ్ తదితరులు పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పీజేఆర్ నివాసంలో..

దోమలగూడలోని పీజేఆర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోమలగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కూడా తెలిపారు. అదే విధంగా రహమత్‌నగర్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో పీజేఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు.



నివాళ్లు అర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, విజయారెడ్డి



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పీజేఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు రమేష్‌నాయక్, శంకర్‌నాయక్



నిమ్స్‌లో అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు



పీజేఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



ఎజేఆర్ ఆలయంలో సీఎన్ రెడ్డి



రహమత్‌నగర్‌లో భవాని శంకర్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు రూ.కోట్లు దోచుకున్నాడు

- స్వచ్ఛంద సంస్థ ముసుగులో మోసం చేశాడని ఆగ్రహం
- బీఎస్పీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు
- ప్రభుత్వం, పోలీసులు స్పందించాలని ఫిర్యాదు


బీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

లక్డీకాపూల్: స్వచ్ఛంద సంస్థ ముసుగులో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పేద ప్రజలను, సొంత పార్టీ కార్యకర్తలను మోసం చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపించారు. సంక్షేమ పథకాలు అందిస్తామని కోట్లాది రూపాయలను మంద ప్రభాకర్, మాల్యావి కరుణోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కొండ కృష్ణమ్మ వసూలు చేసి మోసం చేశారంటూ ధ్వజమెత్తారు. న్యాయం చేయాలంటూ పోలీసులకు, ప్రభుత్వానికి బాధితులు విజ్ఞప్తి చేశారు. స్థానిక బీఎస్పీ రాష్ట్ర కార్యాలయాన్ని వందలాది బాధితులు శనివారం ముట్టడించారు. బాధితులు పల్లేటి రవీందర్, గుర్రాల నాగయ్య, ముడిగి భిక్షపతి, నాతూరామ్, గ్యార జంగయ్య, పూదరి నరసింహ, జిల్లా రవి, వంగ కృష్ణయ్య, అజ్జాల పురం శ్రీనివాస్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇళ్లు కట్టిస్తామని, రైతులకు డెయిరీ ఫామ్, చేపల చెరువుల ఏర్పాటుకు నాబార్డు నుంచి రుణాలు ఇప్పిస్తామని మాల్యావి కరుణోదయ సొసైటీ పేరుతో రైతులు, పేద ప్రజలు, పార్టీ కార్యకర్తల దగ్గర ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. మునుగోడు నియోజకవర్గంలోనే రూ.42 లక్షలు వసూలు చేశారన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

కులగణనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన ఇంటింటి సర్వే కార్యక్రమం 98శాతం పూర్తయ్యిందని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు తప్పుడు లెక్కలు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. దోమలగూడ బీసీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సొంత ఇంటికి మాత్రమే స్టిక్కర్లు అంటించి నామమాత్రంగా అధికారులు సర్వే చేశారని, హైదరాబాద్ నగరంలో అద్దెకు ఉంటున్న వారి ఇళ్లలో సర్వే చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో కులగణన పూర్తయ్యిందంటూ 30వ తేదీన ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిల్లు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, పూర్తిస్థాయిలో కులగణన జరిగిన తర్వాతే అసెంబ్లీలో బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, గంగపుత్ర సంఘం నాయకులు దీటి మల్లయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి, బీసీ సంఘాల నేతలు జాజుల లింగంగౌడ్, మల్లికార్జున్ యాదవ్, పానుగంటి విజయ్ కుమార్, మహిళా నేతలు శ్యామల, గౌతమి, సంధ్య, విజయలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

పక్కాగా వెదర్ అలర్ట్!

అదనంగా డాప్లర్ రాడార్‌ను ఏర్పాటు చేయాలి

ప్రతి చదరపు కిలో మీటర్‌కు ఒక వెదర్ స్టేషన్ ఉండాలి

ముందస్తు సమాచారం ఆధారంగా సరైన చర్యలు

వాతావరణ శాఖకు ప్రతిపాదించిన ఏవీ రంగనాథ్



"‘వానోస్తే వరద.. రోడ్డెక్కితే రోత’ ఇది ప్రస్తుతం హైదరాబాద్ దుస్థితి. ఏమాత్రం పెద్ద వర్షం కురిసినా ఎక్కడిక్కడ గో‘దారులు’ కనిపిస్తుంటాయి. ఈ పరిస్థితులకు వాతావరణ శాఖ హెచ్చరికలు పక్కాగా లేకపోవడం కూడా ఓ కారణంగా మారుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్‌కు కీలక ప్రతిపాదనలు పంపారు. అదనంగా మరో డాప్లర్ రాడార్ ఏర్పాటు, ఆటోమేటెడ్ వెదర్ స్టేషన్స్(ఏడబ్ల్యూఎస్) సంఖ్య పెంపు తదితరాలు వీటిలో ఉన్నాయి." –సాక్షి, సిటీబ్యూరో

వాతావరణ శాఖ నుంచి డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్)కు నిత్యం హెచ్చరికలు వస్తూనే ఉంటాయి. ప్రస్తుతం బేగంపేట కేంద్రంగా పనిచేస్తున్న డాప్లర్ రాడార్ ఆధారంగా ఈ అలర్ట్స్‌ను వాతావరణ శాఖ ఇస్తోంది. ఇటీవల నగరం పశ్చిమ భాగానికి ఎక్కువగా విస్తరించింది. సైబరాబాద్ సహా ఐటీ హబ్ మొత్తం అక్కడే విస్తరించి ఉంది. ఆ ప్రాంతంలో కురవబోయే వర్షానికి సంబంధించి బేగంపేటలో ఉన్న రాడార్ పక్కా సమాచారం ఇవ్వలేకపోతోంది. బేగంపేటకంటే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఎత్తులో ఉండటంతో పాటు కొండలతో కూడి ఉంటున్నాయి. ఈ కారణంగానే అక్కడి మేఘాల కదలికల్ని బేగంపేటలోని డాప్లర్ రాడార్ పక్కాగా గుర్తించలేకపోతోంది.


హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

ఆయా నగరాల్లో అవసరానికి తగ్గట్టు..

ప్రస్తుతం బేగంపేటలో ఉన్న డాప్లర్ రాడార్ కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నగరం విస్తరిస్తూనే పోతోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాల్లో అవసరానికి తగ్గట్టు రాడార్ల సంఖ్యను పెంచుకుంటూ పోతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం ఢిల్లీలో మూడు, ముంబైలో ఆరు రాడార్లు ఉన్నాయి. నగరంలో మాత్రం ఏళ్లుగా బేగంపేటలోని రాడార్ ఆధారంగానే వెదర్ అలర్ట్స్ ఇవ్వాల్సి రావడం ఇబ్బందులకు కారణం అవుతోంది. దీన్ని గమనించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కనీసం నగరానికి పశ్చిమ భాగంలో ఒక డాప్లర్ రాడార్ ఏర్పాటు చేయాలని వాతావరణ శాఖకు ప్రతిపాదించారు. ఈ రెండింటితో వచ్చే సమాచారాన్ని క్రోడీకరించుకుని ముందుకు వెళ్తేనే మెరుగైన ఫలితాలు ఉంటాయని నివేదించారు.

ఏడబ్ల్యూఎస్ సంఖ్యనూ పెంచండి..

హైడ్రా నుంచి వాతావరణ శాఖకు మరో కీలక ప్రతిపాదన సైతం చేరింది. నగరంలో ఉన్న 157 ఏడబ్ల్యూఎస్‌ల సంఖ్యను కనీసం నాలుగు రెట్లు చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. కేవలం వర్షాలే కాకుండా వాతావరణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని లెక్కించి, నివేదిక ఇచ్చే ఈ ఏడబ్ల్యూఎస్‌లు ప్రస్తుతం నగరంలో ప్రతి నాలుగు చదరపు కిలో మీటర్‌కు ఒకటి చొప్పున ఉంది. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులు, క్లౌడ్ బరస్ట్, మినీ క్లౌడ్ బరస్ట్‌లను పరిగణలోకి తీసుకున్న హైడ్రా ప్రతి చదరపు కిలో మీటర్‌కు ఒక ఏడబ్ల్యూఎస్‌ను ప్రతిపాదించింది. మరోపక్క ప్రస్తుతం హైడ్రా ఆధీనంలో 30 డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్స్(డీఆర్ఎఫ్) ఉండగా.. వీటి సంఖ్యను 72కు పెంచడంతో పాటు నాగోల్‌లోని డీఆర్ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆధునీకరించనున్నారు.

ప్రత్యేక విభాగంతో పాటు ఎఫ్ఎం..

వాతావరణ శాఖతో పాటు ఏడబ్ల్యూఎస్‌ల నుంచి వచ్చే డేటా దాదాపు సాంకేతికంగా ఉంటుంది. దీన్ని విశ్లేషించడంతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బందికి అవగతమయ్యేలా అందించడానికి హైడ్రా ఆధీనంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ఇందులో మాజీ శాస్త్రవేత్తలు, వాతారణ శాఖ నిపుణులను భాగస్వాముల్ని చేయనున్నారు. మరోపక్క వాతావరణానికి సంబంధించిన అంశాలను ప్రచారం చేయడంతో పాటు ఇతర అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి హైడ్రా ఆధీనంలో ఓ ఎఫ్ఎం రేడియో ఉండాలని ఆయన భావిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయడమా లేక ప్రస్తుతం ఉన్నదాంట్లో కొంత సమయం లీజుకు తీసుకోవడమా అనేది ప్రభుత్వ అనుమతి ఖరారు చేయనున్నారు.

నగరంలో నేడు

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగుతాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శకులకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ కొనసాగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'నక్సలిజం నాకేం నేర్పింది' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: పేద ప్రజల గూడు కోసం పోరాడిన వ్యక్తి జి.రాములని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. 'నక్సలిజం నాకేం నేర్పింది' పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరంగల్‌లో పేదల కోసం కొట్లాడిన జి.రాములు తన జీవిత అనుభవాల సారాన్ని, నక్సలైట్ ఉద్యమంలో తన అనుభవాలను ఈ పుస్తకంలో పొందుపరిచారని ఆయన అన్నారు. పుస్తకావిష్కరణలో అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి సీతారామారావు, రచయిత జి.రాములు, తెలంగాణ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వినూత్న విధానాలు

మార్స్ మీడియా వ్యవస్థాపకుడు రాజ్ సావంకర్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మార్స్ మీడియా వ్యవస్థాపకుడు రాజ్‌సావంకర్ తదితరులు

రాయదుర్గం: మానసిక, శారీరక ఆరోగ్యానికి అందరూ వినూత్న విధానాలను అలవర్చుకోవాలని మార్స్ మీడియా వ్యవస్థాపకుడు రాజ్‌సావంకర్ సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'సత్వ వెల్‌నెస్ కాంక్లేవ్-2024' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ, అందం, ఫిట్‌నెస్, సమగ్ర శ్రేయస్సుకు అంకితమైన స్ఫూర్తిదాయక కార్యక్రమంగా సత్వ వెల్‌నెస్ కాంక్లేవ్-2024 నిలవడమే కాకుండా విజయవంతమైందన్నారు. ప్రజలు తమ జీవితంలోని ప్రతి అంశంలో ఆరోగ్యకరమైన అలవాట్లు స్వీకరించాలన్నారు. ఆ దిశగా వారిని ప్రేరేపించే ఒక వేదికను సృష్టించడమే లక్ష్యమన్నారు. టీహబ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ ఫణి కొండేపూడి, టీహబ్ వైస్ ప్రెసిడెంట్ తాలూకా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రాణాయామ శ్వాస పద్ధతులపై ప్రశాంతమైన సెషన్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వెల్‌నెస్ రంగానికి విశేష సేవలందించిన ప్రముఖులను సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నిపుణులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



విజయనగర్‌కాలనీ: తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు విజయనగర్‌కాలనీ శాంతినగర్ ఐటీఐలో శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు అధికారిగా కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా పుసుపులేటి శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కేవీ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, కేపీ.జయ, సెక్రెటరి పి.వెంకటేశ్వర్‌రావు, జాయింట్ సెక్రెటరీలుగా బి.హరికృష్ణ, జి.రమేష్‌కుమార్ తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు హాజరై కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

మచ్చలేని మనిషి రతన్ టాటా

సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్

పంజగుట్ట: జీవించినంత కాలం చిన్న మచ్చ కూడా లేకుండా వ్యాపారం చేసి, చనిపోయిన తర్వాత కూడా స్మరించుకునేలా సేవలందించిన రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలని సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్ అన్నారు. రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని ఈఫిల్ లైఫ్ ఆర్ట్స్ క్రాఫ్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా, వైద్య, సామాజిక, వాణిజ్య, పాత్రికేయ, సినీ, సేవా రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి రతన్ టాటా స్మారక పురస్కారాలు అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకులు కలవకొలను శివరాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ దేశంలో సీఎస్ఆర్ ఫండ్ తీసుకువచ్చింది టాటా అని గుర్తుచేశారు. వ్యాపారం అంటేనే అవినీతి, ఇతరులను మోసం చేయడం, ప్రజాధనాన్ని కొల్లగొట్టడం, రుణాలు తీసుకుని విదేశాలకు పారిపోవడం అనుకుంటున్న సమాజంలో ఒక చిన్న మచ్చలేకుండా గొప్ప వ్యాపారస్తుడిగా ఎదిగిన రతన్ టాటా అభినందనీయుడన్నారు. సామాజికవేత్తలు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, వర్మ తదితరులు పాల్గొన్నారు.


రతన్ టాటా స్మారక పురస్కారం అందజేస్తూ..

ముత్యాలుకు ఘనంగా నివాళి

జగద్గిరిగుట్ట: అమరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. సీపీఐ నేత ముత్యాలు 30వ వర్ధంతిని గుబురుగుట్ట శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ ముత్యాలు సీపీఐ జెండా పట్టి ఎన్నో వీరోచిత పోరాటాలు నిర్వహించి బలహీన వర్గాలకు అండగా నిలబడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేత కత్తుల దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, హరినాథరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, మండల అధ్యక్షుడు దొరవి బాబు, డప్పు రామస్వామి, తొండా వెంకట్, గుబురుగుట్ట బస్తీ ప్రెసిడెంట్ బి.నారాయణ, గౌస్ పాషా, మల్లయ్య, కొండయ్య, జాఫర్, బాలరాజు, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న మాస్టర్స్ అథ్లెట్ పోటీలు ప్రారంభం


వివరాలను వెల్లడిస్తున్న జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి

గచ్చిబౌలి: మాస్టర్స్ అథ్లెట్ స్టేట్ మీట్ వచ్చేనెల 4వ తేదీన ప్రారంభమవుతుందని జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను ఆయన వెల్లడించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ మాస్టర్స్ అథ్లెట్ పోటీలో 30 ఏళ్ల నుంచి మొదలు ఏ వయసు వారైనా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో వెయ్యి మంది పాల్గొంటారని, గెలుపొందిన వారు కేరళలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రన్నింగ్, త్రో, జంపింగ్స్ వివిధ రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కొండా విజయ్ మాట్లాడుతూ గచ్చిబౌలి స్టేడియానికి వచ్చే క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 23 జిల్లాల నుంచి ఎంట్రీలు వచ్చాయన్నారు. మాస్టర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు, ట్రెజరర్ పద్మ, రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు నూనె సురేందర్‌రెడ్డి, స్వాతిగౌడ్ పాల్గొన్నారు.

సామాజిక ప్రగతికి ఇంజినీరింగ్ విద్య దోహదం


సదస్సులో పలువురు ప్రొఫెసర్లు, డాక్టర్లు, స్టాన్లీ కళాశాల అధ్యాపకులు

అబిడ్స్: ఇంజినీరింగ్ విద్య సామాజిక ప్రగతికి ఎంతో దోహదపడుతుందని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెక్రెటరి శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. అబిడ్స్ చాపల్ రోడ్డులోని స్టాన్లీ ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో రెండవ రోజు శనివారం ఆర్ఐసీఈ-2024 అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కంప్యూటర్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌తో పాటు పలు విభాగాల్లో కృత్రిమ మేధ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా కృత్రిమ మేధను అభివృద్ధి చేయడానికి అన్ని రంగాల్లో చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఒక్కో విభాగానికి ఒక్కో ప్రాధాన్యత ఉందన్నారు. గౌరవ అతిథి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పరిశోధనల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఇంజినీరింగ్‌లో పరిశోధనలను కళాశాలలు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఇక ముందు భవిష్యత్ అంతా కృత్రిమ మేధపైనే ఉందన్నారు. పారిశ్రామిక రంగంలో కృత్రిమ మేధ చేత బహుళ ఉత్పత్తులను సృష్టించగలమని అన్నారు. అన్ని విభాగాల్లో జ్ఞానాన్ని సంపాదించినప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమని విద్యార్థులకు, అధ్యాపకులకు సూచించారు. స్టాన్లీ ఇంజినింగ్ కళాశాల సెక్రెటరి, కరస్పాండెంట్, కె.కృష్ణారావు మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవానికి అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కృత్రిమ మేధను తమ కళాశాలలో బోధిస్తున్నామన్నారు. సదస్సుకు డాక్టర్ విజయేందర్ కుమార్ సోలంకి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ వి.అనురాధ, ప్రిన్సిపల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ.రమణమూర్తి, డీన్ డాక్టర్ వినయ్‌బాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేష్, కన్వీంగ్ టీమ్ డాక్టర్ ఎం.స్వప్న, డాక్టర్ శివానియాదవ్, డాక్టర్ కార్తిక్‌తో పాటు పరిశోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత గ్రంథాలకంటే రాజ్యాంగమే దేశానికి అవసరం

అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గంటా చక్రపాణి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఘంటా చక్రపాణి, రియాజ్ తదితరులు

కవాడిగూడ: దేశంలోని అన్ని మతాల గ్రంథాల కంటే రాజ్యాంగమే ఈ దేశానికి అవసరమైన గ్రంథమని, ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గంటా చక్రపాణి అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా ప్రముఖ సామాజిక వేత్త కత్తి పద్మారావు రచించిన మన దేశం మన రాజ్యాంగం పుస్తకావిష్కరణ శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లార్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇందులోని ప్రతి వ్యాసం రాజ్యాంగ అవసరం ఏమిటనేది తెలియజేస్తుందన్నారు. కత్తి చేతన్ మాట్లాడుతూ.. ఈ సభలో పాల్గొనడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. 70 ఏళ్ల తర్వాత భారత రాజ్యాంగం మీద దేశంలో ప్రధానంగా చర్చ జరుగుతోందని, భారత రాజ్యాంగాన్ని పాటించినవారే అసలైన దేశ పౌరులు అన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, ప్రముఖ కవి విమర్శకులు కోయి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గణేష్


పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న గణేష్

లక్డీకాపూల్: పద్మశాలి సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన గుండు గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కుందన్‌బాగ్‌కు చెందిన గణేష్‌కు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కమరతపు మురళి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇరావత్రి అనిల్, పద్మశాలి సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబరి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో గణేష్ మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం బలోపేతానికి మరింత శక్తివంచన లేకుండా పాటుపడతానని స్పష్టం చేశారు. ముఖ్యంగా పద్మశాలిల ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

విప్లవకారులంతా ఐక్యం కావాలి

దర్శన్‌సింగ్ కట్కర్



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రెండు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విలీన సభ శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. సభకు ముందు రాష్ట్రవ్యాప్తంగా హాజరైన వందలాది మంది న్యూడెమోక్రసీ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యూడెమోక్రసీ పార్టీ అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు వక్కవంతుల కోటేశ్వర్‌రావు ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కర్ మాట్లాడుతూ.. దేశానికి ఫాసిస్ట్ ప్రమాదం పొంచి ఉన్నందున్న విప్లవకారులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 10 సంవత్సరాల కాలంగా రెండు పార్టీల ఐక్యత ప్రయత్నాలు జరిగాయని, ఐక్యత కోసం సాగించే ప్రతి ప్రయత్నం విశ్వాసంతో ముందుకు తీసుకుపోతోందన్నారు. దేశ ప్రజల మధ్య ఉన్న సోదరభావాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ శక్తులు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. బీజేపీ పాలన కార్పొరేట్లకు కొమ్ముకాసి పేదల ప్రజలపై పన్ను భారం వేయడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా దాడిని కొనసాగిస్తోందన్నారు. దీన్ని నిలువరించాల్సిన ఇండియా కూటమి దృఢంగా నిలబడలేకపోతోందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బలమైన వర్గ పోరాటాలు నిర్మించాలన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ నాయకులు వేముల పల్లి వెంకట్రామయ్య, సాధినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. న్యూడెమోక్రసీ పార్టీ చేపట్టిన పోరాటాల వల్లనే ఏజెన్సీ ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంచామన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర నాయకులు వై.సాంబశివరావు, జేవీ చలపతిరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పి.ప్రసాద్, కె.గోవర్ధన్, జి.ఝాన్సీ, వి.సంధ్య, ఆవునూరి మధు, సీఎస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 29, డిసెంబర్, 2024



అపురూపం.. నృత్యరూపకం..

కూచిపూడి నృత్యాంశాలతో ఆకట్టుకున్న చిన్నారులు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ప్రవల్లిక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో రంగపూజ, ఆనందనర్తన గణపతిం అమ్మనీరాజనం, రామయణ నృత్యరూపకం, శివపార్వతీ నృత్యం, రుక్మిణీ ప్రవేశం వంటి అంశాలను కళాకారులు యుక్త, సహస్ర, మేధా, నక్షత్ర, హంసిని, చిన్మయి, వేదిక, ధృతి, మాన్య, యశస్వీ, అనన్య ప్రదర్శించారు. నాసాలో సైంటిస్ట్‌గా వృత్తి నిర్వహిస్తు హౌస్టన్ నుంచి విచ్చేసిన స్పేస్ సైంటిస్ట్ భరతనాట్య కళాకారిణి డాక్టర్ కావ్య భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, ఓంకారకారిణి, జయ్ మాధవ మదన, తిల్లాన అంశాలను ప్రదర్శించారు.



అన్నమయ్యపురంలో..

అన్నమాస్వరార్చన కార్యక్రమంలో నృత్యార్చన నిర్వహించారు. సమయ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గురువు రాధిక కొప్పల శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నారు. నటనం ఆడినార్ వేగు, అలరులు కురియగా, ముద్దుగారే యశోధ, తిరుతిరు జవరాల, శ్రీమన్నారాయణ అన్నమయ్య కీర్తనలను భరతనాట్య రూపంలో ప్రదర్శించారు. కళాకారులు స్ఫూర్తి, అక్షయ, నిశిత, సాయిలక్ష్మి, అవంతిక, రిషిత, ప్రియాంక నీలకంఠన్, పరిస్పంద, స్వర, శ్రీనిదిలకు సంస్థ నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.





స్టైలిష్.. సన్‌గ్లాసెస్..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన హెల్వేటికా ఐవేర్ బొటిక్ స్టైలిష్ లుక్‌ని అందించే హుబ్లోట్ – మైబాక్ సన్‌గ్లాసెస్ నగరవాసులకు అందుబాటులోకి తెచ్చింది. బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 2లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో వీటిని ప్రముఖ సోషలైట్ సుధారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంతో పాటు సంస్థ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకలను జాజ్ అండ్ ఫ్యాషన్ గ్లార్స్ ఈవెనింగ్ పేరిట నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డాక్టర్ శశికళ రెడ్డి తదతర నగర ప్రముఖులు, పేజ్ త్రీ సోషలైట్స్ హాజరయ్యారు. హెల్వేటికా గ్రూప్ ఛైర్మన్ అశోక్ దోషి పాల్గొన్నారు.

కత్రియాలో వన్ లాస్ట్ నైట్..



హోటల్ కత్రియా వేదికగా పోస్టర్ ఆవిష్కరించిన తారలు నవీనా రెడ్డి, భవ్య

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సరానికి కలర్‌ఫుల్ వేడుకలతో ఆహ్వానం పలకడానికి నగరం ముస్తాబవుతుంది. ఈ నెల 31న సోమాజిగూడ రాజ్ భవన్ రోడ్డులోని కత్రియా హోటల్ అండ్ టవర్స్ వేదికగా 'వన్ లాస్ట్ నైట్' పేరుతో ఇయర్ ఎండ్ వేడుకలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమాజిగూడలోని తమ హోటల్లో శనివారం నిర్వహించారు. ప్రముఖ నటీమణులు నవీనా రెడ్డి, భవ్య, హైదరాబాద్ మోడల్స్ వ్యవస్థాపకులు వంశీ పల్లె పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. మధురమైన 2024 ఏడాదికి వైభవంగా వేడుకలతో వీడ్కోలు పలకడానికి డీజే మ్యూజిక్ కాన్సర్ట్‌తో పాటు, టాప్ మోడల్స్‌తో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని వంశీ పల్లె తెలిపారు. నూతన సంవత్సరానికి కౌంట్‌డౌన్‌తో పాటు విభిన్న రుచుల ఆహారం, డ్రింక్స్, లైవ్ సింగర్స్, మ్యాజిక్ షో, సెల్ఫీ బూత్‌లు, బెస్ట్ కపుల్ అవార్డులు వంటి అంశాలతో అలరించనున్నామని పేర్కొన్నారు. రిజర్వేషన్లు, పాస్‌ల కోసం 9291551917లో సంప్రదించవచ్చని అన్నారు.













06 హెల్త్ ఈజ్ వెల్త్..

ఎంత సంపాదించినా సరైన ఆరోగ్యం లేకపోతే ఉపయోగం ఉండదు. ఉద్యోగం, సంపాదన వేటలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు. సో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ గంట సమయం కేటాయించడం ఎంతో ముఖ్యం. ఉదయం లేవగానే కొద్దిసేపు వ్యాయామం, చిన్నపాటి బరువులు ఎత్తడం, నడక వంటివి ఎంత ముఖ్యమో.. సరైన ఆహారం తీసుకోవడమూ అంతే ముఖ్యం.

01 స్క్రీన్ టైమింగ్ తగ్గాలి..

చిన్న పిల్లల నుంచి పెద్ద వారి దాకా ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మొబైల్ ఫోన్ లేనిదే గడవట్లేదు. కొత్త సంవత్సరంలో అయినా స్క్రీన్ టైమింగ్ తగ్గించుకోవాలని నిర్ణయించుకుంటే మంచిది. కళ్లతో పాటు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో స్క్రీన్ టైమింగ్ కాస్త తగ్గించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలి.

05 పరులకు సహాయం..

పరులకు సాయం చేస్తే మనకు తిరిగి ప్రకృతి సహాయం చేస్తుంది. అందుకే ఉన్నదాంట్లో తోచినంత పరులకు, అవసరం ఉన్న వారికి సహాయం చేయాలనే ఆలోచన చేస్తే మంచిది. మీ టు డూ లిస్ట్ లో ఇది చేర్చుకోవడం మర్చిపోవద్దు. తద్వారా ఎదో ఒక రోజు మనం ఊహించని రీతిలో తిరిగి సహాయం అందుతుందని మర్చిపోవద్దు.

కొత్త ఏడాది.. కొత్త ఆశలు.. సరికొత్త ఆలోచనలతో నగరవాసులు నూతన సంవత్సరానికి వెల్కం చెప్పేందుకు సిద్ధపడుతున్నారు. ఎన్నో ఆలోచనలు.. ఎన్నో ఊహలతో కొంగొత్త సంవత్సరంలో అయినా మంచి జరుగుతుందని సరికొత్త ఆశలతో ముందుకు వెళ్లేందుకు అడుగులు వేస్తున్నారు. నూతన సంవత్సరంలో సిటిజనులు ఎలాంటి రిజల్యూషన్స్ తీసుకోవాలో.. ఎలాంటివి పాటిస్తే మంచి నడవడికతో పాటు.. మంచి జీవన విధానం అలవడుతుందో తెలుసుకుందాం..

– సాక్షి, సిటీబ్యూరో

02 సైబర్ వలలో పడకుండా..

సైబర్ నేరాలకు అంతులేకుండా పోతోంది. ఏ అవకాశం దొరికినా అందిపుచ్చుకునేందుకు సైబర్ నేరస్తులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి. సోషల్ మీడియాలో బ్యాంకు వివరాల గోప్యత పాటించడం, కొన్ని జాగ్రత్తలు వహించడం మనకే మంచిది.

04 డ్రగ్స్‌కు దూరం..

ప్రస్తుతం డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సమాజానికి చీడపురుగులా తయారయ్యాయి. డ్రగ్స్ రహిత సమాజం కోసం మన వంతు కృషి చేద్దాం. డ్రగ్స్ తీసుకోవడమే కాదు.. దానికి బానిసైన వారిని దూరంగా ఉంచేందుకు ప్రయత్నిద్దాం. దీనిపై పోలీసులకు సహకరిద్దాం.

03 పొదుపు మంత్రం..

ఆర్థిక వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించడం నేర్చుకుంటే మంచిది. ఇప్పుడు చేసే పొదుపే రేపు వచ్చే ఇబ్బందుల నుంచి బయటపడేస్తుందనే విషయాన్ని మర్చిపోకూడదు. దుబారా ఖర్చులు తగ్గించుకొని జాగ్రత్తగా ఖర్చు చేస్తూ పొదుపు మంత్రం పాటిస్తే ఎలాంటి ఒడిదుడుకులైనా ఎదుర్కొనే శక్తి మనకు ఉంటుంది. సంపాదనలో కొంత ఇన్సూరెన్స్‌లోనో, మ్యూచువల్ ఫండ్స్‌లోనో దాచుకోవడం మంచిది.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం..

కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు

- సామాజిక స్పృహ, సమయపాలనే ప్రధానం
- స్క్రీన్ టైమింగ్ తగ్గించుకుంటే అన్నింటికీ మంచిది
- ఒక్క సెకనుతో వచ్చే మార్పులను గ్రహించాలి
- ఆరోగ్యకరమైన ఆలోచనలతో ఆరోగ్యకరమైన సమాజం
- నూతన సంవత్సరంలో నగర వాసుల ముందు కొత్త రిజల్యూషన్స్

ప్రస్తుతం తరుణంలో ఉరుకుల, పరుగుల జీవన విధానంలో మనలో చాలా మందికి సామాజిక స్పృహ లేకుండా పోతోందని విశ్లేషకులు చెబుతున్న మాట..! ఇటీవల రోడ్ రేజ్ పెద్ద ఇబ్బందిగా పరిణమించింది. కనీసం ఓపిక లేకుండా ప్రజలు వ్యవహరిస్తున్నారు. రోడ్డుపై వెళ్తుండగా ఎవరితో అయిన ఘర్షణ జరిగితే కాస్త సంయమనం పాటించి.. చిన్న చిరునవ్వు చిందిస్తే ఎలాంటి సమస్యకూ తావులేకుండా ఉంటుంది. లేదంటే గొడవలు, ముష్టి యుద్ధాలకు దారితీసి తీవ్ర పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉందని గ్రహించాలి.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ.. 7

ఒత్తిడి ప్రపంచంలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం. చిన్నవాటికే చిరాకు పడడం.. కోపం తెచ్చుకోవడం.. అసహనం వ్యక్తం చేయడం.. తగ్గించుకోవడం ఎంతో మంచిది. ఇందుకోసం యోగా, మెడిటేషన్ ప్రాక్టీస్ చేయడం ఆరోగ్యకరమైన అలవాటు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం, తద్వారా సమాజం బాగుంటుంది.

ఫ్యామిలీ టైం.. 8

ఎంత బిజీగా ఉన్నా కుటుంబంతో కొంత సమయం గడపడం మర్చిపోవద్దు. ఎందుకంటే ఎంత సంపాదించినా అది కుటుంబం కోసమే. ఇంతా చేసి కుటుంబానికి సమయం కేటాయించకపోతే కుటుంబ సభ్యులు మనల్ని మిస్ అవుతారనే విషయాన్ని మర్చిపోకూడదు. ప్రతిరోజు కాకపోయినా.. వారంలో ఒకసారి కలిసి కూర్చుని భోజనం చేయడం ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. ఒకరి గురించి ఒకరు ఆరా తీసుకునే వీలు కలుగుతుంది.

ట్రాఫిక్ రూల్స్ విషయంలో.. 9

ట్రాఫిక్ రూల్స్ పాటించే విషయంలో మిగతా నగరాల పౌరులతో పోల్చుకుంటే మనం వెనుకబడ్డట్టే. రూల్స్ పాటించడం వల్ల ప్రమాదాల నివారణకు దోహదం చేయవచ్చు. దీనిని మన వంతు బాధ్యతగా పాటించాలని ఇప్పటి నుంచే నిర్ణయం తీసుకుందాం.. మనలో ఈ చిన్న మార్పు 10 మందికి స్ఫూర్తిగా నిలిచి, సమాజాభివృద్ధికి దోహదం చేస్తుంది.

టైం సెన్స్ ముఖ్యం.. 10

మనం చిన్నప్పటి నుంచీ వినే మాట సమయపాలన. అయినా.. ఎన్నోసార్లు ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఉంటాం. ఒక్క సెకండ్‌తో ఎన్నో మార్పులు జరగవచ్చు. ఒక్క నిమిషం వల్ల ఎన్నో ప్రమాదాల నుంచి బయటపడవచ్చు. సమయం పోతే తిరిగి రాదు.. అనే విషయాన్ని గుర్తిస్తే మంచిది. ఒలింపిక్స్‌లో ఎన్నో పతకాలు చేజారిపోయేదా ఆ సెకను తేడాతోనే అనే విషయం గ్రహించాలి. సమయం అనేది ఒక్కో వ్యక్తికి ఒక్కోలా ఉండదు.. ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా ఉంటుంది. అందుకే విధిగా సమయపాలన పాటించడం అనేది వచ్చే ఏడాది మన డైరీలో భాగం కావాలి. అదే మనల్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది. ఆల్ ది వెరీ బెస్ట్.

రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవ్

జనవరి 2 నుంచి 13 వరకూ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: పర్యాటక నిలయంగా ప్రసిద్ధి చెందిన బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సందర్శకులకు నూతన సంవత్సర కానుకగా జనవరి 2 నుంచి 13 వరకూ ఉద్యాన్ ఉత్సవ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రకటించిన ఈ కార్యక్రమం వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మద్దతుతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శన పుష్పాలు, ఇతర ప్రదర్శనలకు వేదిక కానుందని, ఉద్యానవన స్పృహను పెంపొందించేందుకు రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా శనివారం వెల్లడించారు. మొదటి సారి నిర్వహించే ఈ ఉద్యాన్ ఉత్సవ్ పన్నెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని, ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ కొనసాగుతుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు, కంపోస్టింగ్, గార్డెనింగ్ టూల్స్, గార్డెన్ డెకర్, హార్టికల్చర్ డొమైన్‌లు ఉంటాయని, ఇందులో 50 స్టాళ్ళతో గ్రాండ్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద, గిరిజన ప్రదర్శనలు, వంటకాలు, ఇంటరాక్షన్ సెషన్లు ఉంటాయని తెలిపారు. పలువురు ఎగ్జిబిటర్లు, ప్రభుత్వ, కమ్యూనిటీ సంస్థలు, ఎన్‌జీవోలు, ప్రైవేటు కంపెనీలు భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. ఒడిశ్సా శంఖ్ వదన్ నృత్యం, మధ్యప్రదేశ్ యుద్ధ కళ నృత్యం వంటి ప్రదర్శనలు ఉన్నాయని, సందర్శకులకు ప్రవేశం పూర్తిగా ఉచితమని చెప్పారు.



వడకట్టి.. ఒడిసిపట్టి..





దుమ్ములో బంగారం కోసం వెదుకులాట • పాతబస్తీ కేంద్రంగా ఏళ్ల తరబడి ప్రక్రియ

చార్మినార్: మట్టిలో మాణిక్యాలేమో కానీ.. పాతబస్తీలో ఏళ్ల తరబడి ఓ కుటుంబం మట్టిలో బంగారం, వెండిని వెదుకుతున్నారు. బంగారు, వెండి ఆభరణాలను తయారు చేసే ఖార్ఖానాల్లో మట్టిని ఏకం చేసి అందులో ఏమైనా చిన్న చిన్న తుకడలు (ముక్కలు) దొరుకుతాయేమోననే ఆశతో వడపోస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఒక్కోసారి కంటికి కనిపించని సూక్ష్మంగా పౌడర్ తరహాలో కూడా దొరుకుతుందని చెబుతున్నారు. మట్టిలో నుంచి వడపోత ద్వారా మట్టి లాంటి పసుపు, తెలుపు రంగు పౌడర్ రూపంలో బంగారం, వెండి లభిస్తుందంటున్నారు.

పాతబస్తీ కేంద్రంగా...

నిజాం కాలం నుంచి పాతబస్తీలోని చార్మినార్ పరిసరాలు బంగారు, వెండి ఆభరణాల క్రయ విక్రయాలకు పెట్టింది పేరు. ఆభరణాల దుకాణాలతో పాటు ఆర్డర్లపై ఆభరణాలను తయారు చేసే ఖార్ఖానాలు కూడా ఇక్కడి గల్లీల్లో అధికంగా ఉన్నాయి. దాదాపు 250–300 వరకూ దుకాణాలున్నాయి. కొనుగోలుదారుల ఆర్డర్ మేరకు దుకాణ దారులు అర్చుల రూపంలో వసువు తయారీకి బంగారం అందజేస్తారు.



తరుగు, మజూరీ నుంచే...

ఆభరణాల తయారీ సమయంలో ముద్ద లాంటి బంగారపు కడ్డీని కరిగించి, మరిగించి ఆభరణాలను తయారు చేస్తారు. ఇలా చేసే క్రమంలో సూక్ష్మాతి సూక్ష్మమైన రేణువుల రూపంలో బంగారం కింద పడి దుమ్ము, మట్టిలో కలుస్తుంది. దీన్నే బంగారపు షాపుల వారు తరుగు కింద లెక్కగడతారు. (తరుగు అంటే వేస్టేజ్, మజూరీ అంటే చేత కూలి) ఈ రోజువారీ తయారీ ప్రక్రియలో వందల సంఖ్యలో బంగారపు వస్తువులు తయారవుతుంటాయి. ఈ క్రమంలో తయారీ దారులు ఎక్కువ శాతం ఆ రజన్‌లోని ప్రధాన భాగాన్ని వారే వడపోసుకుంటారు. వారు కూడా సేకరించలేని రేణువులనే వడపోతకు అప్పగిస్తారు.

ఇది నిరంతర ప్రక్రియ..

ఈ ప్రకిర్రయ కోసం ముందుగా డబ్బులు చెల్లించి మట్టి, చెత్త సేకరిస్తారు. గుల్జార్‌హౌజ్–కాలికమాన్ వద్ద ఈ బంగారం, వెండి వడపోత కార్యక్రమం ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగుతుంది. లాల్‌దర్వాజకు చెందిన విజయ్ కుటుంబం దశాబ్దాలుగా తాత ముత్తాతల నుంచి ఈ పని చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పురానాపూల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ చార్మినార్, కాలికమాన్, గుల్జార్‌హౌజ్, మామాజుమ్లా పాఠక్, కోకర్‌వాడి, రికాబ్‌గంజ్, ఆనంద్ గల్లి, ఘాన్సీబజార్ తదితర ప్రాంతాల్లోని ఖార్ఖానాల నుంచి ఈ చెత్తను వడపోస్తున్నారు. ఈ ప్రక్రియలో ఒక్కోసారి బంగారం దొరికినా, దొరక్కపోయినా నెలవారీ డబ్బులు మాత్రం చెల్లించాల్సిందే..

అణువణువూ గాలించాలి..

వడపోత సమయంలో అణువణువూ జాగ్రత్తగా శోధించాలి. చివరికి అయస్కాంతంతోనూ వేరు చేస్తాం. ఈ పౌడర్‌ను మళ్లీ వేడి చేసి చిన్న ముద్దలాగా తయారు చేస్తాం. ఒక్కో రోజు పావు గ్రాము నుంచి అర గ్రాము వరకూ దొరుకుతుంది. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం గ్రాము రూ.7500..అదృష్టం బాగుంటే ఒక గ్రాము జమవుతుంది. ఎప్పుడైనా అనుకోకుండా తులం (10 గ్రాములు) లభిస్తే..దుకాణాల యజమానులు వచ్చి ఇది మాదే అని లాక్కుపోతారు.

– ప్రేమ్ కుమార్, పురానాపూల్

క్లుప్తంగా...



పీజేఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పీజేఆర్‌కు సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్: పేద ప్రజానీకానికి అన్ని వేళలా అండగా నిలిచిన నాయకుడు మాజీ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. శనివారం పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రేవంత్ నివాళులర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా పనిచేసిన పీజేఆర్.. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడారని తెలిపారు. తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం గుర్తు చేశారు.




ఎక్కడైనా పత్తి మొక్క సాధారణంగా మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తు పెరుగుతుంది. ఈ పత్తి మొక్క మాత్రం దాదాపు 10 అడుగుల ఎత్తు వరకు పెరిగి కాయలు విరగ్గాస్తోంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల శివారు గాజా తండా గ్రామ పరిధిలోని టేకుల తండాలో డీఎస్ శంకర్ అనే రైతు పత్తి చేనులో ఒక మొక్క పెద్దగా పెరిగి ఆకర్షణగా నిలిచింది. - కురవి



ఆ నంబర్ ఏ పేరుతో సేవ్ చేసుకున్నానబ్బా..!

అత్యవసర సందర్భాల్లో మొబైల్‌లో సన్నిహితులు, తెలిసిన వారి ఫోన్ నంబర్‌లు ఏ పేరుతో సేవ్ చేసుకున్నది ఎంత గింజుకున్నా గుర్తుకు రాదు. అంతెందుకు.. మన ఫోన్ నంబర్ తప్ప కుటుంబ సభ్యులందరి ఫోన్ నంబర్లు చెప్పలేని పరిస్థితి. కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువుల పుట్టిన తేదీ ఎప్పుడన్నది గుర్తుండదు. చిన్న లెక్క వేయడానికి మెదడు గజిబిజిగా మారి సెల్ ఫోన్‌లోని క్యాల్‌క్యులేటర్‌ను ఓపెన్ చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు చాలా మందిని వేధిస్తున్నాయి. ఇది తరచూ జరుగుతూ ఉంటే మాత్రం 'డిజిటల్ డిమెన్షియా' అయ్యిందొచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత సాంకేతిక ఆధిపత్య యుగంలో మొబైల్ ఫోన్, ట్యాబ్, కంప్యూటర్, టీవీ ఇతర సాంకేతిక పరికరాల వినియోగం పెరిగిపోయింది. ఫలితంగా ఒకప్పుడు వృద్ధుల్లో సహజంగా కనిపించే డిమెన్షియా (చిత్త వైకల్యం) బారిన ఇప్పుడు చిన్న పిల్లలు, యువత పడుతున్నారు. దైనందిన జీవితంలో చాలా మంది మేల్కొని ఉండే సమయంలో 40 శాతం, ఆపై కూడా స్క్రీన్ చూడటానికి కేటాయిస్తున్నారు. దీంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. ముఖ్యంగా చిన్నారుల్లో విజ్ఞానం, సృజనాత్మకతను సెల్ ఫోన్‌లు చిదిమేస్తున్నాయనే చెప్పాలి.

\- సాక్షి, అమరావతి



కొందరి పేర్లు గుర్తుకు రాక కొన్నిసార్లు సతమతం

- జ్ఞాపక శక్తికి ముప్పు తెస్తున్న సెల్ ఫోన్ అతి వినియోగం
- కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు సైతం చెప్పలేని పరిస్థితి
- చిన్నపాటి లెక్కలకు, తేదీల కోసం సెల్ తెరవాల్సిందే..
- చాప కింద నీరులా విస్తరిస్తున్న డిజిటల్ డిమెన్షియా సమస్య
- చదువుకునే పిల్లల్లో తీవ్ర ప్రభావం.. ఎంత చదివినా ముఖ్యాంశాలు గుర్తుండక కుంగుబాటు

డిమెన్షియా ప్రారంభ దశ

సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో డిమెన్షియా వస్తుంటుంది. సాంకేతికతను అతిగా వినియోగించడం ద్వారా జ్ఞాపక శక్తిలో వచ్చే సమస్యలను డిజిటల్ డిమెన్షియా అని 2012లో జర్మన్ న్యూరో శాస్త్రవేత్తలు అభివర్ణించారు. దీన్ని డిమెన్షియాకు ప్రారంభంలో వచ్చే మైల్డ్ కాగ్నిటివ్ ఇంపైర్‌మెంట్ అని కూడా కొందరు వైద్యులు చెబుతున్నారు. డిజిటల్ డిమెన్షియా మీద ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ఆధారంగా ఎక్కువ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడంతో జ్ఞాపక శక్తిపై ప్రభావం పడుతుందని తేలింది.

మెదడు డీయాక్టివ్

సాధారణంగా రాయడం, చదవడం, ఇంకా మరేదైనా పనుల్లో ఉన్నప్పుడు చుట్టూ ఏం జరుగుతుందో కూడా తెలుస్తుంది. ఆ అంశాలను మెదడు యాక్టివ్‌గా పరిశీలిస్తూ ఉంటుంది. అదే మొబైల్ ఫోన్‌లో సోషల్ మీడియా, సినిమాలు చూడటం, వీడియో గేమ్స్ ఆడటం చేస్తున్నప్పుడు పూర్తిగా అందులోనే నిమగ్నం అవుతారు. చుట్టూ ఏం జరుగుతుందో కూడా గ్రహించకుండా మెదడు డీ యాక్టివ్ అయిపోతుంటుంది. ఈ నేపథ్యంలో రోజూ గంటల తరబడి స్క్రీన్ చూడటంతో మెదడు పనితీరుపై ప్రభావం పడుతోందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇక చిన్న పిల్లల్లో అయితే ఆటిజం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తలెత్తుతున్నట్టు వెల్లడిస్తున్నారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో లాక్‌డౌన్ కారణంగా డిజిటల్ తరగతుల రూపంలో విద్యార్థుల్లో స్క్రీన్ వినియోగం గణనీయంగా పెరిగింది. పాఠశాలలు, కళాశాలల్లో సైతం ప్రాజెక్ట్ వర్క్‌ల పేరిట ఇంటర్నెట్‌లో శోధించే అంశాలనే పిల్లలకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు మెదడుకు పని చెప్పడం లేదు. ఇది కూడా జ్ఞాపక శక్తి మీద ప్రభావం చూపుతోంది.



ఇలా నివారించొచ్చు..

- మొబైల్, ల్యాప్ ట్యాప్, ఇతర డిజిటల్ స్క్రీన్ వినియోగం తగ్గించాలి. సుదీర్ఘంగా స్క్రీన్‌పై ఉండాల్సి వచ్చినప్పుడు మధ్య మధ్యలో విరామం తీసుకోవాలి.
- జ్ఞాపక శక్తి, మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపేలా వ్యాయామాలు చేయాలి. వ్యాయామంతో మెదడు కణాల ఎదుగుదలకు తోడ్పడే హార్మోన్లు విడుదల అవుతాయి. వాకింగ్, జాగింగ్, ఏరోబిక్ వంటి వ్యాయామాలు మెదడులోని హిప్పో క్యాంపస్ భాగం వృద్ధికి తోడ్పడతాయి.
- రోజుకు 7 నుంచి 8 గంటల తప్పనిసరిగా నిద్ర పోవాలి. తీపి పదార్థాలను ఎక్కువగా తీసుకోకూడదు. ఇవి మెదడు పనితీరుపై ప్రభావం చూపుతాయి.
- మద్యం సేవించడం, ధూమపానం విడనాడాలి.
- గ్రీన్ టీ, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినే ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

మెదడు ఎదుగుదలపై ప్రభావం



మాకు వస్తున్న 100 ఓపీల్లో 30–40 మొబైల్ అతి వినియోగం ద్వారా వచ్చిన సమస్యలవే ఉంటున్నాయి. సాధారణంగా చిన్న పిల్లల్లో ఐదున్నరేళ్ల వరకూ మెదడు ఎదుగుతుంది. ప్రస్తుత రోజుల్లో పిల్లలు అల్లరి చేస్తున్నారని తల్లిదండ్రులు మొబైల్ ఇచ్చేస్తున్నారు. ఏడాదిలోపు నుంచే స్క్రీన్ చూడటం మొదలు పెట్టడం చిన్న పిల్లల్లో మెదడు ఎదుగు దల మీద తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫోన్, టీవీల్లో చూసే కార్టూన్‌లు, గేమ్‌లనే వాస్తవ ప్రపంచంగా పిల్లలు భావిస్తున్నారు. వయసుతో పాటు ఈ సమస్య పెరిగి చదువులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు..

\- డాక్టర్ ఎస్.ప్రసన్నకుమార్, ప్రొఫెసర్, చైల్డ్ సైకియాట్రి, మానసిక వైద్యశాల విశాఖపట్నం

పెద్దపులి కనిపిం'చేను'!

పంట చేలల్లో పెద్దపులి సంచారం



సఫారీ ప్రయాణికులకు కనిపించిన పెద్దపులి

నల్లబెల్లి/మన్ననూర్: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, ఒల్లేనర్సయ్యపల్లి, రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాల శివారులో పెద్దపులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతాలను వదిలి గ్రామాల సమీపంలోని పంటచేలల్లో పెద్దపులి సంచరించడంతో.. రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. కొండాపూర్ అటవీ ప్రాంతం నుంచి ఆడపులి, పిల్ల పులి మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కోనాపురం వైపు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. కొండాపూర్ అటవీ ప్రాంతం నుంచి మగ పెద్దపులి మూడుచెక్కలపల్లి, ఒల్లేనర్సయ్యపల్లి గ్రామాల మీదుగా రుద్రగూడెం, కొండాయిపల్లి గ్రామాల మధ్యలోని పలుగుఏనె (గుబురు చెట్లతో కూడుకున్న అటవీ ప్రాంతం) వరకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ, ఒల్లేనర్సయ్యపల్లి, రుద్రగూడెం గ్రామాల్లో శనివారం తిరుగు ప్రయాణంలో పెద్దపులి సంచరించినట్లు పలువురు చెబుతున్నారు. కాగా పోలీసులు, అటవీ శాఖ, స్ట్రైక్‌ఫోర్స్ అధికారులు పంట చేలలో పులి కదలికలను పరిశీలించి పాదముద్రలను సేకరించారు. మొక్కజొన్న చేనులో సేదదీరిన ప్రాంతాన్ని గుర్తించారు. అవన్నీ పెద్దపులి పాదముద్రలేనని, తిరిగి వెళ్లలేదని నిర్ధారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సఫారీలో పెద్దపులి సందడి

అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం సఫారీ వాహన సందర్శకులకు శనివారం ఉదయం పెద్దపులి కనిపించింది. ఫర్హాబాద్ సఫారీ పాయింట్ నుంచి వ్యూ పాయింట్‌కు సందర్శకులు వాహనంలో వెళ్తుండగా.. మార్గమధ్యలో పెద్దపులి అటవీశాఖ ఇంటర్నల్ రోడ్డు దాటుతూ కనిపించింది. అకస్మాత్తుగా చెట్ల మధ్యనుంచి వాహనం సమీపంలోకి పెద్దపులి రావడంతో సందర్శకులు కొంత భయపడినా.. దగ్గరి నుంచి చూశామని సంతోషపడ్డారు.

సంగీతఝురిలా.. తెలుగు భాష

- సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

పన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): తెలుగు భాష వినసొంపైనదే కాకుండా.. సంగీతంలా మనసులను పరవశింపజేస్తుందని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కితాబిచ్చారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణాజిల్లా రచయితల సంఘం, విజయవాడ కాకరపర్తి భావనారాయణ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ మహాసభలను ప్రారంభించి మాట్లాడుతూ.. తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవాలన్నారు. జాతి మనుగడకు, వికాసానికి భాష ప్రధానమైన పాత్ర పోషిస్తుందన్నారు. తెలుగు భాషా వికాసానికి అడ్డంకిగా ఉన్న జీవోలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలుగు వారిలో అద్భుత ప్రతిభ..

శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగువారు అద్భుతమైన ప్రతిభను కనబరిచి సమాజానికి స్ఫూర్తినిచ్చారని భారత రక్షణ మంత్రిత్వశాఖ ముఖ్య సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ నూతన సాంకేతిక మాధ్యమాలను వినియోగించుకుని తెలుగు రచనలను మరింత విస్తృతం చేసుకోవాలని సూచించారు. హోసూరు (తమిళనాడు) ఎంపీ గోపీనాథ్ మాట్లాడుతూ తెలుగు భాష పరిపుష్టికి తెలుగు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్ మాట్లాడారు. తొలుత 'మార్పు' పేరుతో ముద్రించిన మహాసభల సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



పునరుత్పాదక వ్యవసాయ విధానంలో సాగవుతున్న శనగ, పొద్దుతిరుగుడు, సజ్జ, కంది పంటలు

నేలమ్మకు కొత్త శక్తి.. చీడపీడల విముక్తి

- ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఆరోగ్యకరమైన నేలలు
- మెట్ట పంటల్లో మెరుగైన వంగడాల కోసం ఇక్రిసాట్‌లో పరిశోధనలు
- ఎన్నో ప్రయోజనాలంటున్న పరిశోధకులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మన ఆహారం ఆరోగ్యానికి మేలు చేసేదిగా ఉండాలంటే ఆహార ఉత్పత్తులు పండే నేల కూడా ఆరోగ్యంగా ఉండాలి. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడిన నేలల్లో పండే పంటలు ఆరోగ్యానికి హాని చేస్తాయి. అలాంటిది ఆరోగ్యానికి మేలు చేసే, అధిక దిగుబడులనిచ్చే ఆధునిక వంగడాల అభివృద్ధికి మెట్ట ప్రాంత పంటల అంతర్జాతీయ పరిశోధన కేంద్రం (ఇక్రిసాట్) కొత్త దారిలో పరిశోధనలు చేస్తోంది. ఇందుకోసం పునరుత్పాదక వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తోంది. ఈ దిశగా ముందడుగు సైతం వేసింది. భారత్ తోపాటు వివిధ దేశాల్లో ఎక్కువగా సాగయ్యే వేరుశనగ, కంది, సజ్జ, పొద్దుతిరుగుడు, శనగ వంటి మెట్ట పంటల్లో మెరుగైన వంగడాల కోసం ఈ విధానంలో పరిశోధనలు జరుగుతున్నాయి.

ఏడాదంతా ఏదో పంట..

ఈ పునరుత్పత్తి వ్యవసాయం పద్ధతిలో.. ఒకే కమతంలో పక్కపక్కనే వివిధ రకాల పంటలు విత్తుకుంటారు. ఒక్కో పంట ఒక్కో దశలో ఉంటుంది. ఏడాదంతా వాటి అనుకూల కాలానికి తగ్గట్లుగా ఈ పంటలు వేసుకుంటున్నారు. ఒక పంట కోతకొచ్చే దశలో మరో పంట కాయ దశలో ఉంటుంది. ఇంకో పంట పూత దశకు వస్తుంది.

రెండు బ్లాకుల్లో సాగు..

ఇక్రిసాట్‌లో మొత్తం నాలుగు రకాల నేలలు ఉండగా అందులో ఎర్ర, నల్లరేగడి నేలల్లోని రెండు బ్లాకుల్లో పునరుత్పత్తి వ్యవసాయ విధానంపై పరిశోధనలు సాగుతున్నాయి. ఎర్ర నేలతో కూడిన బ్లాకులో వేరుశనగ, పొద్దుతిరుగుడు, సజ్జ, కంది పంటలను ఒకే కమతంలో సాగు చేస్తున్నారు. నల్లరేగడి నేలతో కూడిన మరో బ్లాక్‌లో శనగ, పొద్దుతిరుగుడు, సజ్జ, కంది పంటలు వేశారు.

ఇవీ ప్రయోజనాలు..

రీజనరేటివ్ అగ్రికల్చర్ విధానంలో అనేక ప్రయోజనాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. సాగవుతున్న పంటల్లో దేనికైనా చీడపీడలు ఆశిస్తే ఆ ప్రభావం పక్కనే ఉన్న మరో పంటకు వ్యాపించేందుకు వీలుండదు. ఆ పంటకే పరిమితమవుతుంది. అదే ఒకే పంట పూర్తి విస్తీర్ణం వేస్తే చీడపీడలు పూర్తి విస్తీర్ణంలో పంటలను ఆశించే ప్రమాదం ఉంటుంది. దీన్ని ఈ విధానం ద్వారా అధిగమించేలా పరిశోధనల ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే ఆరోగ్యవంతమైన బ్యాక్టీరియా, పంటలకు ఉపయోగకరమైన ఫంగస్‌ను నాశనం కాకుండా కాపాడుకోవచ్చు. హానికరమైన రసాయనాలు, కలుపు మందులు, పురుగు మందులపై ఆధార పడాల్సిన అవసరం ఉండదు. ఆరోగ్యకరమైన నేలపై పర్యావరణానికి అనుకూలమైన రీతిలో ఈ వ్యవసాయం ఉంటుంది. విలువైన ప్రకృతి వనరులు క్షీణించకుండా, వనరులు మరింత బలోపేతం అయ్యేందుకు ఈ విధానం దోహదపడుతుంది. సాధారణంగా ఏటా అధిక మోతాదుల్లో ఎరువుల వాడకం వల్ల నేల స్వభావాన్ని కోల్పోతూ ఉంటుంది. కానీ పునరుత్పాదక వ్యవసాయ విధానం ద్వారా నేల పునరుజ్జీవం చెందుతుంది. డీగ్రేడ్ అయిన నేల రీస్టోర్ అవుతుందని రీసెర్చ్ స్కాలర్ కల్పన పేర్కొన్నారు.

పవన్‌కళ్యాణ్ పర్యటనలో నకిలీ ఐపీఎస్

- ఇటీవల మన్యం జిల్లా పర్యటనకు వచ్చిన ఏపీ డిప్యూటీ సీఎం
- ఐపీఎస్ యూనిఫామ్‌లో నకిలీ పోలీస్ అధికారి హడావుడి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన.. అప్రమత్తమైన పోలీసులు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

సాలూరు: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ నెల 20న పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలంలో పర్యటించారు. దుగ్గేరు పంచాయతీ బాగుజోలకు రోడ్డు మార్గంలో చేరుకున్న పవన్‌కళ్యాణ్ గిరి శిఖర గ్రామమైన సిరివర రహదారి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ గ్రామం ఏజెన్సీలో అతి సమస్యాత్మక ప్రాంతం. దీంతో అక్కడ పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అయితే, ఆ పర్యటనలో భద్రతా లోపం వెలుగు చూసింది. ఏకంగా భద్రతా దళాల కళ్లుగప్పి.. ఐపీఎస్ అధికారినంటూ ఓ డూప్లికేట్ పోలీస్ హల్‌చల్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విజయనగరం జిల్లా అంబటివలస గ్రామానికి చెందిన బి.సూర్యప్రకాశ్ 2003 నుంచి 2005 వరకు పంజాబ్ రెజిమెంట్‌లో సిపాయిగా పనిచేసి మానేశాడు. తరువాత బీటెక్, ఎంబీఏ పూర్తిచేసి పలు వ్యాపారాలు సాగించాడు. తన తండ్రి తవిటిబాబు కరోనాతో 2020లో మృతి చెందారు. ఆ సమయంలో తన తండ్రి ఎకరాకు రూ.30 వేల చొప్పున చెల్లించి దత్తిరాజేరు మండలం గడసాం రెవెన్యూ పరిధిలో సుమారు 9.79 ఎకరాలను అగ్రిమెంట్ చేసుకున్నట్టు ఇంట్లో లభ్యమైన పత్రాల ద్వారా సూర్యప్రకాశ్ తెలుసుకున్నాడు. తండ్రి మరణంతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు రావాలని సదరు రైతులను సూర్యప్రకాశ్ కోరగా నిరాకరించారు. దీంతో ఆయన ఐపీఎస్ అధికారిగా నమ్మించి ఈ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని పథకం వేశాడు. తను ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యానని డిసెంబర్ 2023లో కుటుంబీకులు, బంధువులను నమ్మించాడు. ట్రైనింగ్ కోసమంటూ 2024 జనవరిలో హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ హాస్టల్‌లో ఉండి పోలీస్ యూనిఫాం, నకిలీ ఐడీ కార్డులు తయారు చేయించాడు. తను ట్రైనింగ్‌లో ఉన్నట్టు ఫొటోలు తీయించుకుని బంధువులకు పంపించాడు. ఆ ఫొటోలు, ఐడీ కార్డులను చూపించి ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయాలంటూ రైతులపై ఒత్తిడి తెచ్చినా ముందుకు రాలేదు.

పోలీస్‌నని నమ్మించేందుకే..

దీంతో సదరు రైతులందరినీ తాను పోలీస్ అయినట్టు నమ్మించాలని ప్లాన్‌చేసి.. ఈ నెల 20న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మక్కువ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఉదయం 9.30 గంటలకు ముడిదాం నుంచి డ్రైవర్‌తో కలిసి సూర్యప్రకాశ్ కారులో మక్కువకు చేరుకున్నాడు. దుగ్గేరు వద్ద పోలీసులు మంత్రి కాన్వాయ్ వెహికల్స్ తప్ప మిగిలిన వాహనాలను నిలిపివేశారు. సూర్యప్రకాశ్ కారును కూడా అక్కడే ఆపేశారు. దీంతో అతడు కారు దిగి కొంతదూరం కాలినడకన వెళ్లి, అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ అడిగి బాగుజోలకు చేరుకున్నాడు. అప్పటికే శంకుస్థాపన కార్యక్రమం పూర్తికావడం, అక్కడ ఎవరూ లేకపోవడం చూసి శిలాఫలకం దగ్గర ఫొటో తీసుకున్నాడు. అక్కడ బందోబస్తులో ఉన్న పలువురు పోలీసులతో ఫొటోలు దిగి ఇంటికి వెళ్లిపోయాడు. వాటిని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న మక్కువ పోలీసులు అతడిని నకిలీ ఐపీఎస్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. సూర్యప్రకాశ్‌ను అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని అడిషనల్ ఎస్పీ తెలిపారు.



రోడ్డెక్కిన 'ఉత్తర రింగు'

▶ మొదటి పేజీ తరువాయి


కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. తొలుత బీఓటీ (బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్), హామ్ వంటి విధానాలను పరిశీలించినా.. ఈ రోడ్డుపై వాహన ట్రాఫిక్ ప్రస్తుతానికి తక్కువగా ఉంటుందన్న అంచనాతో ఈపీసీ వైపు మొగ్గు చూపింది. మిగతా రెండు పద్ధతుల్లో నిర్మాణ సంస్థ తొలుత నిర్మాణ ఖర్చు మొత్తాన్ని భరించి, టోల్ రూపంలో వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గంలో ప్రస్తుతం టోల్ ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండే అవకాశం లేదని, నిర్మాణ సంస్థలు ముందుకురాకపోవచ్చని భావనకు వచ్చింది. దీంతో నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించేలా ఈపీసీ వైపు మొగ్గు చూపింది. నిర్మాణం పూర్తయ్యాక టోల్‌ను ఎన్‌హెచ్‌ఏఐ సొంతంగా వసూలు చేసుకుంటుంది.

మొత్తం వ్యయం రూ.17,080 కోట్లు

నెల రోజుల క్రితం కన్సల్టెన్సీ సంస్థ టెండర్ డాక్యుమెంటును సిద్ధం చేసి ఎన్‌హెచ్ఏఐకి సమర్పించింది. ఆ వెంటనే ఎన్‌హెచ్ఏఐ రీజనల్ ఉత్తర భాగం డీపీఆర్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖకు సమర్పించింది. రీజనల్ ఉత్తర భాగం నిర్మాణ వ్యయం రూ.17,080 కోట్లుగా (రాష్ట్ర ప్రభుత్వ వాటా సహా) ప్రతిపాదించింది. ఇందులో రోడ్డు నిర్మాణ వ్యయం రూ.8,500 కోట్లు, భూసేకరణ వ్యయంలో కేంద్రం వాటా రూ.2,580 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,580 కోట్లు, ఇతర వ్యయం రూ.3,420 కోట్లుగా పేర్కొంది. మొత్తంగా ఎనిమిది లేన్లతో ఈ రోడ్డును ప్రతిపాదించారు. అందుకు సరిపడా భూసేకరణ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం నాలుగు లేన్ల రోడ్డును నిర్మించి, భవిష్యత్తులో మిగతా నాలుగు లేన్లను నిర్మించనున్నారు.

రెండింతలు అయిన వ్యయం

రీజనల్ రింగురోడ్డును ప్రతిపాదించిన సమయంలో ఉత్తర భాగానికి రూ.9 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రతిపాదించిన ఏడేళ్ల తర్వాత డీపీఆర్ సిద్ధమైంది. ప్రస్తుత ధరలు, పరిస్థితుల మేరకు అంచనా వ్యయం సుమారు రెండింతలై ఏకంగా రూ.17 వేల కోట్లు దాటింది. రోడ్డు నిర్మాణం పూర్తయ్యే నాటికి ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.



ప్రతిపాదిత రీజనల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగం

11 చోట్ల భారీ ఇంటర్‌చేంజ్ కూడళ్లు

రీజనల్ ఉత్తర భాగంలో 11 చోట్ల భారీ ఇంటర్ చేంజ్ కూడళ్లను నిర్మించనున్నారు. జాతీయ/రాష్ట్ర రహదారులను ఈ రోడ్డు దాటే ప్రాంతాల్లో ఇవి ఉంటాయి.

- **మొదటి కూడలి:** సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్.. ఇక్కడ ఎక్స్టెండెడ్ డంబెల్ ఆకృతిలో భారీ ఇంటర్‌చేంజ్ స్ట్రక్చర్ ఉంటుంది. దీని నిడివి 3 కిలోమీటర్లు ఉంటుంది.
- **రెండో కూడలి:** సంగారెడ్డి తర్వాత వచ్చే రెండో కూడలి 161 జాతీయ రహదారిని క్రాస్ చేసే శివంపేట వద్ద నిర్మిస్తారు. ఇక్కడ డబుల్ డంబెల్ డిజైన్‌లో ఉంటుంది.
- **మూడో కూడలి:** నర్సాపూర్–మెదక్ రోడ్డుపై నర్సాపూర్ వద్ద నిర్మిస్తారు. అక్కడ డంబెల్ మోడల్‌ను ఎంపిక చేశారు.
- **నాలుగో కూడలి:** హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై తూప్రాన్ వద్ద. ఇక్కడ క్లీవర్ లీఫ్ డిజైన్ ఎంపిక చేశారు.
- **ఐదో కూడలి:** తూప్రాన్–గజ్వేల్ దారిలో మజీద్‌పల్లి వద్ద. ఇక్కడ రోటరీ డిజైన్‌ను ఖరారు చేశారు.
- **ఆరో కూడలి:** రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ సమీపంలో ఉంటుంది. ఇక్కడ పాక్షిక క్లీవర్ లీఫ్ డిజైన్ ఎంపిక చేశారు.
- **ఏడో కూడలి:** జగదేవ్‌పూర్–తుర్కపల్లి మధ్య పీర్లపల్లి వద్ద నిర్మిస్తారు. ఇక్కడ రోటరీ డిజైన్‌ను ఎంపిక చేశారు.
- **ఎనిమిదో కూడలి:** తుర్కపల్లి–యాదగిరిగుట్ట రోడ్డుపై తుర్కపల్లి వద్ద ఉంటుంది. ఇక్కడ రోటరీ డిజైన్‌లో నిర్మిస్తారు.
- **తొమ్మిదో కూడలి:** హైదరాబాద్–వరంగల్ హైవేపై రాయగిరి వద్ద.. డబుల్ ట్రంపెట్ డిజైన్‌లో నిర్మించనున్నారు.
- **పదో కూడలి:** భువనగిరి–వలిగొండ రోడ్డుపై వలిగొండ వద్ద ఉంటుంది. ఇక్కడ రోటరీ డిజైన్‌ను ఖరారు చేశారు.
- **11వ కూడలి:** చౌటుప్పల్ సమీపంలో నిర్మిస్తారు. ఇది ఎక్స్‌టెండెడ్ డంబెల్ నమూనాలో 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది.

దక్షిణ భాగం డీపీఆర్ టెండర్లకు కానరాని స్పందన

మరోవైపు రీజనల్ రింగురోడ్డు దక్షిణ భాగాన్ని కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో.. ఈ భాగాన్ని సొంతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం నిర్ణయించింది. ఈ మేరకు ఓ ప్రాథమిక అలైన్‌మెంట్‌ను రూపొందించింది. తుది అలైన్‌మెంట్ తయారీ కోసం అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. డీపీఆర్ తయారీ కోసం కన్సల్టెన్సీ సంస్థను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. దాన్ని రోడ్లు భవనాల శాఖ అధికారులు శనివారం తెరిచారు. అయితే ఒక్క సంస్థ కూడా బిడ్లు దాఖలు చేయలేదని తెలిసింది. మరోవైపు రోడ్డు నిర్మాణాన్ని తొలుత ప్రతిపాదించిన మేరకు ఎన్‌హెచ్ఏఐతోనే చేపట్టాలని కోరుతూ ఇటీవల రోడ్లు భవనాల శాఖ కేంద్రానికి లేఖ రాసింది. దీంతో ఆ రోడ్డు నిర్మాణంపై సందిగ్ధత చోటు చేసుకుంది.

మొత్తం ఐదు ప్యాకేజీలు ఇవే..

రీజనల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగాన్ని ఐదు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు.

- **ప్యాకేజీ-1:** సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ గ్రామం నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్లు. దీని నిర్మాణ వ్యయ అంచనా రూ.1,529.19 కోట్లు.
- **ప్యాకేజీ-2:** రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ గ్రామం వరకు 26 కిలోమీటర్లు. అంచనా వ్యయం రూ.1,114.80 కోట్లు.
- **ప్యాకేజీ-3:** ఇస్లాంపూర్ నుంచి రాజీవ్ రహదారి మీద ఉన్న ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్లు. అంచనా వ్యయం రూ.1,184.81 కోట్లు.
- **ప్యాకేజీ-4:** ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి మీద ఉన్న రాయగిరి గ్రామం వరకు 43 కిలోమీటర్లు. నిర్మాణ వ్యయం రూ.1,728.22 కోట్లు.
- **ప్యాకేజీ-5:** రాయగిరి నుంచి చౌటుప్పల్ సమీపంలోని తంగడపల్లి గ్రామం వరకు 35 కిలోమీటర్లు. వ్యయ అంచనా రూ.1,547.04 కోట్లు.

సూపర్ గేమ్ చేంజర్: కోమటిరెడ్డి

ఔటర్ రింగ్ రోడ్డు గేమ్ చేంజర్ అయితే రీజనల్ రింగ్ రోడ్డు తెలంగాణకు సూపర్ గేమ్ చేంజర్ కాబోతోందని ఆర్‌అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. అవసరమైతే యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని.. అయితే ఆ భారాన్ని కూడా కేంద్రమే భరిస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండేళ్లలో రీజనల్ ఉత్తర భాగం పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 29-12-2024



'సోషల్' ఘోషలో స్నేహమే సమ్మోహానం

'చరిత్రని మరచిపోని వాళ్ళు.. ఆ పొరపాట్లు కచ్చితంగా మళ్ళీ చేస్తారు' అని ఎవరో పెద్దమనిషి అన్నాట్ట. గతం, వర్తమానం, భవిష్యత్తు అనేవి మన మనసు సృష్టించే భ్రమలే అనుకున్నా.. గతం గుర్తుంచుకోవడం మంచిదే. కొత్త భ్రమల్ని, అపోహల్ని సృష్టించుకోకుండా అది మనల్ని అదుపులో పెడుతుంది.

ప్రతి సంవత్సరాంతంలో ఆ సంవత్సరం మనం ఏం సాధించాం, శోధించాం అని మనల్ని మనం ప్రశ్నించుకుంటాం. కొత్త సంవత్సరం కేవలం ఓ తారీఖు మారటమే అని హేతువాదులన్నా.. అదేదో కొత్త ప్రారంభం అనుకోవడం మనకో ఉత్సాహాన్నిస్తుంది. అందుకే కొత్త నిర్ణయాలు, సరికొత్త ఆశయాలు, ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతాం. వాటిలో ఎన్ని అమలు చేస్తాం? ఎన్ని సాధిస్తాం? అనేది మళ్లీ ఆ సంవత్సరాంతంలో బేరీజు వేసుకుంటాం. ఈ చక్రం కొంత సరదాగా ఉంటుంది. కొంత నిజంగా ఉపయోగపడుతుంది.

నా వరకూ నాకు '2023' ఒక విచిత్రమైన సంవత్సరం. 2018లో కోవిడ్‌కి ముందు 'సమ్మోహనం' థియేటర్లలో విడుదలై ఘనవిజయాన్ని అందుకున్న తర్వాత, కోవిడ్‌లో 2020లో ఓటీటీలో విడుదలైన 'వి', ఆ తర్వాత 2022లో థియేటర్లలో విడుదలైన 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' నన్ను కొంత గజిబిజికి గురి చేశాయి. 'వి' మిశ్రమ ఫలితాలు, 'ఆ అమ్మాయి..' వైఫల్యం నా కళా దృక్పథాన్ని గట్టిగా కుదిపాయి. అయితే ఆ సమయంలో సద్విమర్శకులు, శ్రేయోభిలాషులు కొన్ని విషయాలని గట్టిగా విమర్శిస్తూనే, కొన్ని విషయాలలో నాకు అండగా నిలిచి, నా అభిరుచిని బలపర్చారు. 2024లో మళ్లీ ఆత్మస్థైర్యంతో అడుగిడేలా చేశారు. నా 2023 అనుభవాలు 2024 లో నా నిర్ణయాలని గాఢంగా కానీ, ప్రొడక్టివ్ గా కానీ ప్రభావితం చేశాయి అనిపిస్తోంది.

గతమైనా, వర్తమానమైనా, భవిష్యత్తైనా మనల్ని నిలబెట్టేది మన స్నేహితులు. నిష్కర్షగా, ద్వేషరహితంగా మన జీవితాన్ని మనకి ప్రతిబింబించగలిగే నిజమైన స్నేహితులు. అందుకే ఈ రోజుల్లో ఉన్న సామాజిక మాధ్యమాల్లో ఎగసిపడుతున్న అకారణ ద్వేషం, నెగిటివిటీ, సంచలన వాదం, పోటీతత్వం, వేలం



ఇంద్రగంటి మోహన కృష్ణ

> కొత్త సంవత్సరం కేవలం ఓ తారీఖు మారటమే అని హేతువాదులన్నా.. అదేదో కొత్త ప్రారంభం అనుకోవడం మనకో ఉత్సాహాన్నిస్తుంది. అందుకే కొత్త నిర్ణయాలు, సరికొత్త ఆశయాలు, ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతాం.

వెర్రి సొంతడబ్బాల మధ్య నిజమైన స్నేహితుల్ని వెతుక్కోవడమే కొత్త సంవత్సరంలో మన నిర్ణయం, ఆశయం కావాలి. ఈ యూట్యూబ్ ట్రోల్స్, ఇన్‌స్టా రీల్స్‌, గొడవల్కుటి అరుపులు, దైనందిన జీవితపు రణగొణధ్వని మధ్య నిజమైన నిష్కల్మషమైన స్నేహాన్ని వెతుక్కుని పట్టుకోవడం కష్టమే. ఉన్న స్నేహితుల్లో ఎవరు హితులో, ఎవరు శత్రువులో తెలుసుకుని, శత్రువుల్ని పాము కుబుసం విడిచినట్టు విడిచి కొత్త సంవత్సరంలో సరికొత్త సహచర్య సౌందర్యంలో ముందుకు వెళ్లడమే ఆశయం కావాలి. నిజానికి ప్రతి సంవత్సరం ఈ నిర్ణయాన్ని మళ్లీ మళ్లీ కొత్తగా తీసుకోవాలి. మన స్నేహ సంపదని నలుగురికి పంచి, మన స్నేహిత సంపదని ప్రతి సంవత్సరం పెంచుకోవాలి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, లార్జర్ దాన్ లైఫ్, వన్స్ ఇన్ ఏ లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ లాంటి నూతన ఆవిష్కారాలు, భావనలూ, ప్రచారాల నుండి మనల్ని మనం సంరక్షించుకోవాలంటే మంచి స్నేహితులే మనకి దిక్కు.

2024లో ప్రతి సినిమాలో దాదాపు హీరో అంటే ఊచకోతకి మారుపేరయ్యాడు. నోట్లోంచి గొప్పగొప్ప ఉదాత్తమైన మానవత్వపు ఉపన్యాసాలిస్తూనే, రెండు చేతుల్తో వందలమందిని చంపుతున్నాడు. సున్నితమైన హాస్యం, ప్రేమ, సన్నిహితమైన సంభాషణలు, మానవ సంబంధాలు ట్రెండ్ కాదనే దుష్ప్రచారం మొదలై, బలం పుంజుకుంటోంది. ఈ సమయంలో ఈ కొత్త సంవత్సరంలో మనం ఆ ఒరవడికి కొంత అడ్డుకట్ట వేసి, మామూలు మనుషుల మానవత్వపు గుబాళింపు, తోటి మనిషి ఆనందాన్ని, అభ్యుదయాన్ని, కోరుకునే కొత్తరకం స్నేహితులని వెతుక్కుందాం. అలాంటి సరికొత్త కథానాయకుల్ని సృష్టిద్దాం, ఆదరిద్దాం.

– ఇంద్రగంటి మోహన కృష్ణ,
సినీ దర్శకుడు

2025 ఆల్ హ్యాపీస్



2024 ఉమెన్ పవర్

వనితదే చరిత

చరిత్ర సృష్టించిన విజేతలు కాలం దారిలో వెలిగే దీపాలు అవుతారు. ఎంతోమందిని తమ బాటలో నడిపించే ఉత్తేజం అవుతారు. క్రీడల నుంచి సైన్యం వరకు వివిధ రంగాలలో 2024లో 'శభాష్' అనిపించుకోవడమే కాదు చరిత్ర సృష్టించారు మహిళలు...

పట్టుదల ఉంటే ప్రతికూలతలు పారిపోతాయి



ప్రతికూల పరిస్థితులు ఎన్ని ఎదురైనా సరే... దృఢ సంకల్పం, నిబద్ధత ఉంటే తిరుగులేని విజయాలు సాధించవచ్చని నిరూపించింది రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన అవని లేఖర. 2012లో రోడ్డు ప్రమాదానికి గురైన ఆమె వీల్‌చైర్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. నిరాశ నిండిన ఆ చీకటిలో అవని విల్‌పవర్ కోల్పోయి ఉంటే విజయాలు సాధించి ఉండేది కాదు. స్తబ్దత నుంచి బయటపడడానికి తండ్రి సలహాతో క్రీడల వైపు వచ్చింది. పారిస్‌లో జరిగిన 2024 పారాలింపిక్ గేమ్స్‌లో 10 మీటర్‌ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలో స్వర్ణపతకం గెల్చుకొని మన దేశంలోని ప్రసిద్ధ పారాలింపియన్‌లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. టోక్యో పారాలింపిక్స్‌లో తొలిసారి స్వర్ణం గెలుచుకున్న అవని రెండోస్వర్ణం సాధించి చరిత్ర సృష్టించింది.

పవర్‌ఫుల్ బుల్లెట్



హరియాణలోని ఝజ్జర్ జిల్లాకు చెందిన మను బాకర్ చిన్న వయసులోనే వివిధ ఆటల్లో అద్భుత ప్రతిభాసామర్థ్యాలు చూపింది. షూటింగ్‌లోకి అడుగు పెట్టడానికి ముందు మార్షల్ ఆర్ట్స్, టెన్నిస్, బాక్సింగ్, స్కేటింగ్ లాంటి వివిధ విభాగాలలో రాణించింది. 'షూటింగ్'లో ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా మను బాకర్ చరిత్ర సృష్టించింది. ప్రఖ్యాత షూటర్‌ల వరుసలో చేరింది.

పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 10 మీటర్‌ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో కాంస్య పతకం సాధించి దేశం మొత్తం గర్వపడేలా చేసింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి మన దేశానికి మరో కాంస్య పతకాన్ని సాధించింది. స్వాతంత్య్రం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది.

స్ఫూర్తినిచ్చే తేజం



భారత స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా ఫైటర్‌పైలట్‌గా స్క్వాడ్రన్ లీడర్ మోహనా సింగ్ చరిత్ర సృష్టించింది. జోద్‌పూర్‌లో జరిగిన 'తరంగ్ శక్తి' సైనిక విన్యాసాల్లో ఈ అద్భుతం చోటుచేసుకుంది. సాయుధ దళాలలో జెండర్ బ్యారియర్స్‌ను విచ్ఛిన్నం చేసిన అద్భుతం అది.

రాజస్థాన్‌లోని ఝున్‌ఝును‌లో సైనిక కుటుంబంలో పుట్టిన మోహనాసింగ్‌కు ఫైటర్ పైలట్ కావాలని కోరిక. భారత వైమానిక దళం ఫైటర్ పైలట్ ప్రోగ్రామ్(2016)లో అవనీచతుర్వేది, భావనా కాంత్‌తో కలిసి చేరిన మొదటి మహిళల్లో మోహన ఒకరు. ఐఏఎఫ్ హాక్ ఎంకే.132 అడ్వాన్స్‌డ్ జెట్ ట్రెనర్‌లలో పూర్తిస్థాయి ఆపరేషన్ స్టేటస్ సాధించిన తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా రికార్డ్ సృష్టించింది. ఎయిర్ టు ఎయిర్, ఎయిర్ టు గ్రౌండ్ కాంబాట్ మోడ్స్‌లో ప్రావీణ్యం సాధించింది.

హెల్త్

ఈ అలవాట్లు ఉంటే! 50లో హెల్దీ అండ్ హ్యాపీ



**న్యూ ఇయర్‌తో 50 ఏళ్లు నిండుతాయా...
ఎంతో హుషారుగా, మరెంతో శ్రమతో
లేదంటే.. గడిచిన నాలుగు పదులనూ
ఓ జ్ఞాపకంలా మార్చుకుంటూ
ఐదు పదుల్లోకి అడుగుపెట్టి ఉంటారు.
ఇప్పటివరకు ఒక లెక్క...
ఇక నుంచి ఒక లెక్క అన్నట్టు
50 ఏళ్ల నుంచి మహిళల శరీరంలోనూ, మనస్తత్వంలోనూ
ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి.
ఇంటా బయట ఎదురయ్యే ఒత్తిళ్లు,
తమ పట్ల తాము పట్టించుకోని విధానం ఎప్పుడూ ఉంటుంది.
పర్లేదు అని నిర్లక్ష్యం చేసే రోజువారీ అలవాట్లను వదిలేసి
కొత్తగా ఈ అలవాట్లను అలవరచుకోండి.
50 ఏళ్లలోనూ ఫిట్ అండ్ హెల్తీగా ఉండండి.**

రొటీన్‌గా చేసే పనుల్లో చేసుకోదగిన చిన్న చిన్న మార్పులు

తరచూ నీళ్లు

డీహైడ్రేషన్ ప్రభావాలు చర్మం సాగే గుణం, అజీర్తి, శక్తి స్థాయిలపై పడుతుంది. దాహం వేయడం అనే సంకేతాలు వయస్సుతో పాటు తగ్గుతుంటాయని గ్రహించి, తరచూ నీళ్ల తాగుతుండాలి.

అభిరుచులు

ఈ వయసులో తలెత్తే మానసిక ఒత్తిడి, ఆందోళన లేదా డిప్రెషన్‌ని విస్మరిస్తే అవి దీర్ఘకాలం నష్టం జరగవచ్చు. అందుకని మానసిక శ్రేయస్సును ప్రోత్సహించే శ్రద్ధ, అభిరుచుల కోసం సమయం కేటాయించుకోవాలి.

ప్రొటీన్స్

ఇన్నిరోజులు రుచిగా ఉండే ఆహారంపైన దృష్టి పెట్టి ఉంటారు. కానీ, తినే ఆహారంలో ప్రొటీన్ తక్కువ ఉంటే కండరాలకు వేగంగా నష్టం వాటిల్లడమే కాదు రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. అందుకని నట్స్, గుడ్లు, మొక్కల నుంచి లభించే ప్రొటీన్లు గల ఆహారాన్ని భోజనంలో చేర్చండి.

హాయిగొలిపే నిద్ర

నిద్రలేమి జీర్ణక్రియ, మానసిక స్థితి, జ్ఞాపకశక్తిపైన ప్రభావం చూపుతుంది. ఈ రోజుల్లో మొబైల్, టీవీ స్క్రీన్ల వల్ల అర్ధరాత్రి తర్వాత నిద్రకు ఉపక్రమించేవాళ్లే ఎక్కువ. ఈ జాబితాలో మీరుంటే, స్క్రీన్లను త్వరగా కట్టిపెట్టి రోజూ 6–8 గంటల సమయాన్ని నిద్రకు కేటాయించండి. రాత్రివేళ కెఫీన్ వంటి పానీయాలకు దూరంగా ఉంటే నిద్ర లేమి సమస్య తలెత్తదు.

చురుకుగా ఉండటానికి..

50 లలో ఊబకాయం వచ్చే అవకాశం ఉంది. గంటల తరబడి కూర్చుంటే గుండె జబ్బుల రిస్క్ పెరగవచ్చు. ఊబకాయం వల్ల కీళ్లపై భారం పడి మోకాళ్ల నొప్పులు వస్తుంటాయి. అందుకని శరీరం, మైండ్ చురుకుదనానికి రెగ్యులర్ మూవ్‌మెంట్స్ ఉండేలా చూసుకోవాలి.

చర్మం పట్ల జాగ్రత్త!

చర్మ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే వృద్ధాప్యం వేగంగా వచ్చేస్తుంది. చర్మ క్యాన్సర్ ప్రమాదాన్నీ పెంచుతుంది. వయసుతో పాటు చర్మమూ పొడిబారుతుంటుంది. ఎండవేళలో బయటకు వెళ్లినప్పుడు ఈ సమస్య మరీ పెరుగుతుంది. అందుకని, ఎండ నేరుగా చర్మంపై పడకుండా ఎస్‌పిఎఫ్ ప్రొటెక్షన్ ఉన్న క్రీమ్స్ ఉపయోగించాలి..

వ్యాయామాలు

కార్డియో ఎక్సర్‌సైజులు చేయాలనుకోకండి. శరీరానికంతటికీ శక్తినిచ్చే వ్యాయామం కండర కణజాలాన్ని సంరక్షిస్తుంది. ఎముక నష్టం కాకుండా పోరాడుతుంది. సమతుల్యతను కాపాడుతుంది. సడెన్‌గా పడిపోయే ప్రమాదాలను నివారిస్తుంది.

నిల్వ పదార్థాలకు 'నో'

ఉప్పు, చక్కెర మోతాదు నిల్వ పదార్థాలలో ఎక్కువ. అంతేకాదు, వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకని మైదాతో పాటు ఇతర నిల్వ ఉండే పదార్థాలను పక్కనపెట్టండి.

సెల్ఫ్‌కేర్

ఎప్పుడూ తమ కన్నా ముందు ఇతరులకు ఇవ్వడానికే శక్తిని ఖర్చు చేస్తూ ఉంటారు. ఇక నుంచి రోజులో కొంత సమయం 'నా కోసం నేను' అనేలా మిమ్మల్ని మీరు సంతోషపరుచుకునే మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అలవాట్లు, కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వండి.

డాక్టర్ రోబో 2.025



వైద్యరంగం అనేక రకాలుగా పురోగతి సాధించింది. ముఖ్యంగా రోబోటిక్ సర్జరీ, ఎండోవాస్క్యులార్ చికిత్సలు, మార్పిడి ప్రక్రియల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైంది.

రోబోటిక్ సర్జరీలో పురోగతి

రోబోటిక్ సర్జరీ ఇప్పుడు వైద్యుల సామర్థ్యాలను అనేక రెట్లు పెంచడంతో పాటు, ఈ చికిత్స వల్ల రోగులు చాలా వేగంగా కోలుకునేలా చేయడమూ సాధ్యమైంది.

1. **టోటల్ నీ ఆర్థోప్లాస్టీ (టీకేఏ) :** ఈ శస్త్ర చికిత్సల కోసం ఉపయోగించే రోబోలు (వేలిస్, మాకో, కువిస్ వంటివి) అధిక ఖచ్చితత్వాన్ని అందిస్తున్నాయి. ఇది రోగులు చాలా వేగంగా కోలుకునేందుకు దోహదపడుతోంది.

2. **మృదుకణజాలం రోబోటిక్స్:** మృదుకణజాలానికి సంబంధించిన చికిత్సల్లో కణజాలం నాశనం కాకుండా అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు సైతం అత్యంత సులువుగా చేయడం సాధ్యమవుతోంది.

ఎండోవాస్క్యులార్ వాల్వ్ మార్పిడి

ఎండో వాస్క్యులార్ టెక్నాలజీ ద్వారా గుండె వాల్వ్ మార్పిడి (టావీ / టావీర్) అత్యంత సులభంగా, రక్తస్రావం లేకుండా జరుగుతున్నాయి. దాంతో ఈ అంశం వృద్ధుల ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఈ పద్ధతిలో చిన్న గాటు ద్వారానే పూర్తి వాల్వ్ మార్పిడి చేయడమన్నది ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సాంకేతికతకు ఓ మైలురాయి.

మార్పిడి ప్రక్రియలు (ట్రాన్స్‌ప్లాంట్స్)

కృత్రిమ అవయవాలను రూపొందించడం, వాటిని మరింత మెరుగ్గా ఉండేలా అభివృద్ధితో పాటు, అవయవ మార్పిడి (ట్రాన్స్‌ప్లాంట్) శస్త్ర చికిత్సల్లో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించడం అద్భుతమైన ఫలితాలను తెచ్చిపెట్టింది. ఈ అవయవ మార్పిడి శస్త్రచికిత్స వల్ల చాలామంది పేషెంట్స్ కొత్త జీవితాన్ని పొందారు.

భవిష్యత్తులో వైద్యరంగం...

రానున్న రోజుల్లో వైద్యరంగం అభివృద్ధిలో ఏఐ, జీనోమిక్ మెడిసిన్, అలాగే వ్యక్తిగత చికిత్సా విధానాలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి.

■ **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)**

ఏఐ సాంకేతికతలు వ్యాధినిర్ధారణను మరింత ఖచ్చితంగానూ, చాలా వేగంగా చేయడమూ, అలాగే శస్త్రచికిత్సల్లో సహాయక పాత్ర పోషించడం అనే అంశాలు వైద్య చికిత్స విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నాయి. ముఖ్యంగా...

1. వ్యాధిని ముందుగానే గుర్తించగలిగే అధునాతన స్కానింగ్ పద్ధతులు.

2. డేటా అనలిటిక్స్ ద్వారా రోగులకు వ్యక్తిగత చికిత్స అందించడం.

■ **జీన్ థెరపీ**

జీన్ ఎడిటింగ్ టెక్నాలజీ (సీఆర్ఐఎస్‌పీఆర్) ద్వారా...

1. జన్యుసంబంధ వ్యాధుల నివారణ

2. క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధుల చికిత్సల్లో దీర్ఘకాలిక పరిష్కారాలు.

బయోనిక్, కృత్రిమ అవయవాలు నవీన బయోనిక్ టెక్నాలజీతో కృత్రిమ అవయవాలు ఇకపై పూర్తిగా సొంత అవయవాల్లాగానే పనిచేస్తాయి. ఇవి పేషెంట్స్ తాలూకు జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తాయి.

■ **ఇమ్యూనోథెరపీ, మెడిసినల్ నానో టెక్నాలజీ**

వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇమ్యూనోథెరపీ ప్రక్రియ చాలా కీలకం కానుంది. అలాగే నానో టెక్నాలజీతో వ్యాధి సంబంధ మందులను కణజాలంలోకి ఖచ్చితంగానూ, సునిశితంగానూ పంపడం సాధ్యమవుతుంది.

మానవ జీవితకాలం పెంపు...

విజ్ఞానం, టెక్నాలజీ, అలాగే జన్యుమార్పిడి సాంకేతికతల సహాయంతో మానవుల ఆయుర్దాయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

చివరగా... 2024లో సాధించిన వైద్య రంగం విజయాలు భవిష్యత్తులో మరిన్ని వైద్య ప్రక్రియల అభివృద్ధికి పునాది వేశాయి. పేషెంట్స్‌కు మెరుగైన జీవనప్రమాణాలు అందించడంలో వైద్యశాస్త్రం నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటుందని అనేకమంది వైద్య నిపుణుల నమ్మకం.

కృత్రిమ మేధస్సు
(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ - ఏఐ)

కృత్రిమ మేధస్సు వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తోంది. ముఖ్యంగా ఔషధాలను మెరుగు పరచడం, వాటిని మరింతగా అభివృద్ధి చేయడం, వ్యాధుల నిర్ధారణ, చికిత్స ప్రక్రియల్లో ఏఐ ముఖ్య భూమిక పోషిస్తోంది. కొత్త ఔషధాల రూపకల్పన, మందులను మరింత ప్రభావపూర్వకంగా అభివృద్ధి చేయడమనే ప్రక్రియలో ఏఐ భారీ భారీ డేటాలను వేగంగా విశ్లేషించడంతో పాటు, మరిన్ని వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమైన సరికొత్త ఔషధ సమ్మేళనాలను త్వరగా రూపొందించడంలో ఏఐ బాగా సహాయపడుతుంది. ఇది మానవ శ్రమను గణనీయంగా తగ్గించడమే కాకుండా, ఖర్చులనూ చాలావరకు తగ్గిస్తుంది. కొత్త ఔషధాల క్లినికల్ ట్రయల్స్ కోసం సరైన రోగులను నిర్దిష్టంగా గుర్తించడానికి ఏఐ మీద ఆధారపడటం వల్ల క్లినికల్ ప్రయోగాలు వేగంగా, సమర్థంగా జరుగుతాయి.

క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల నిర్ధారణలో ఏఐ విశేష పాత్ర పోషిస్తోంది. మానవ నేత్రాలు గుర్తించలేని చిన్న చిన్న మార్పులను మెషిన్ లెర్నింగ్ మోడల్స్ సులభంగా కనిపెట్టగలవు. రేడియాలజీ, ప్యాథాలజీ ఇమేజెస్‌ను విశ్లేషించడం ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభదశలోనే నిర్ధారణ చేయడం ఏఐ కారణంగా సాధ్యమవుతుంది. రోగులకు నిర్దిష్టమైన చికిత్స అందించడం ద్వారా అది వారి ప్రాణాలను కాపాడగలదు. మెషిన్ లెర్నింగ్ మోడల్స్ నిరంతరం కొత్త డేటాతో తమను తాము మెరుగుపరుచుకోవడమే కాకుండా, వ్యాధి నిర్ధారణ వేగాన్ని పెంచడమూ, అత్యంత ఖచ్చితత్వంతో ఈ పనులు జరగడానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్ల నిర్ధారణ అన్నది వేగంగా జరిగితే, పేషెంట్స్‌కు చాలా త్వరితంగా చికిత్స అందించవచ్చు. దీంతో అనేక మంది ఆయుర్దాయాలను సమర్థంగా పెంచడం సాధ్యమవుతుంది. ఇలా కృత్రిమ మేధస్సు అనేక మంది ఆయుష్షును పెంచడం, వారిని సంపూర్ణారోగ్యవంతులను చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.





డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి
Sr. knee replacement surgeon

నితీశ్ రెడ్డి 'వైల్డ్ ఫైర్'

మెల్‌బోర్న్ మైదానంలో సూపర్ సెంచరీ





రూ. 25 లక్షల నజరానా

మెల్‌బోర్న్ టెస్టులో అద్భుత సెంచరీతో భారత్‌ను ఆదుకున్న నితీశ్ కుమార్ రెడ్డికి ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నజరానాను ప్రకటించింది. అతనికి రూ.25 లక్షల నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ వెల్లడించారు. ఆంధ్ర ఆటగాడి ఈ ప్రదర్శన తమకు గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు.

- జట్టును ఆదుకున్న ఆంధ్ర బ్యాటర్
- వాషింగ్టన్ సుందర్ అర్ధ సెంచరీ
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358/9
- మరో 116 పరుగులు వెనుకంజ



ఇక తగ్గేదేలే...

దేశం తరపున ఆడుతూ కెరీర్‌లో తొలి సెంచరీ అంటే ఎలా ఉండాలి...జీవితకాలం ఇలాంటి క్షణాల కోసమే శ్రమించే కష్టాన్ని మరచిపోయేలా ఉండాలి...ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక మైదానంలో ఎందరో కలలు గనే చోట సాధించినట్లుగా ఉండాలి... అన్నీ అనుకూలించినప్పుడు కాదు...జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటూ తానేంటో చూపించాలి... అత్యుత్తమ బౌలర్లను ఎదుర్కొంటూ, శరీరానికి తగిలే దెబ్బలను తట్టుకుంటూ, వేలాది మంది తనకు జేజేలు పలికేలా శతకం బాదాలి...వీటన్నింటికీ ఒక్కటే సమాధానం! మన ఆంధ్ర కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి కొట్టినట్లుగా సెంచరీ ఉండాలి.

మెల్‌బోర్న్ టెస్టులో భారీ ఆధిక్యంపై కన్నేసి విజయంపై గురి పెట్టిన ఆస్ట్రేలియాను మన నితీశ్, వాషింగ్టన్ సుందర్ సమర్థంగా అడ్డుకున్నారు. శతక భాగస్వామ్యంతో జట్టును గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కించారు. ముందుగా ఫాలో ఆన్ ప్రమాదాన్ని తప్పించడంతో పాటు ఆపై ఆధిక్యాన్ని తగ్గిస్తూ వచ్చారు. నితీశ్ అద్భుత బ్యాటింగ్‌కు సుందర్ సమన్వయం తోడవడంతో కంగారూలు నిస్సహాయంగా చూస్తుండిపోయారు. వీరిద్దరు కలిసి 47.3 ఓవర్ల పాటు ఆసీస్ బౌలర్లను నిలువరించారు. ఈ ఇద్దరు బ్యాటర్ల పోరు తర్వాత ప్రస్తుతానికి భారత్ ఓటమి ప్రమాదంనుంచి దాదాపుగా తప్పించుకున్నట్లే.

మెల్‌బోర్న్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ నాలుగో టెస్టు మ్యాచ్‌ను భారత యువ ఆటగాళ్లు ఆసక్తికరంగా మార్చారు. ఒక దశలో తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం కోల్పోయి ఓటమికి బాటలు వేసుకునేటట్లు కనిపించిన టీమిండియా కోలుకొని మెరుగైన స్థితికి చేరింది. మ్యాచ్ మూడో రోజు వెలుతురులేమితో ఆటను నిర్ణీత సమయానికి ముందే అంపైర్లు నిలిపి వేశారు. అప్పటికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ రెడ్డి (176 బంతుల్లో 105 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా...వాషింగ్టన్ సుందర్ (162 బంతుల్లో 50; 1 ఫోర్) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం నితీశ్‌తో పాటు సిరాజ్ (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు. భారత్ మరో 116 పరుగులు వెనుకబడి ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 164/5తో ఆట కొనసాగించిన భారత్ శనివారం 70 ఓవర్లు ఆడి మరో 194 పరుగులు జోడించింది. ప్రస్తుతానికి ఆసీస్‌కు ఆధిక్యం ఉన్నా...నాలుగో రోజు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఎన్ని పరుగులు చేసి సవాల్ విసురుతుందనేది ఆసక్తికరం. మిగిలిన సమయం, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే రెండు రోజుల్లో రెండు ఇన్నింగ్స్‌లు పూర్తి కావడం అంత సులువు కాదు. అదే జరిగితే ఈ మ్యాచ్ కూడా 'డ్రా'గా ముగియవచ్చు.

భారీ భాగస్వామ్యం...

తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు వెనుకబడి ఉన్న స్థితినుంచి రిషభ్ పంత్ (37 బంతుల్లో 28; 3 ఫోర్లు), రవీంద్ర జడేజా (17) మూడో రోజు ఆటను కొనసాగించారు. వీరిద్దరు మరింత బాధ్యతాయుతంగా ఆడి జట్టును రక్షించాల్సి ఉన్నా...ఎక్కువ సేపు నిలబడలేకపోయారు. ముఖ్యంగా పంత్ చెత్త షాట్‌తో తన వికెట్ సమర్పించుకోగా, జడేజా ఎల్బీగా దొరికిపోయాడు. 30 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. జడేజా అవుటయ్యాక సుందర్ బ్యాటింగ్‌కు రాగా, మరో ఎండ్‌లో నితీశ్ 22 పరుగుల వద్ద ఆడుతున్నాడు. మరో మూడు వికెట్లు తీసి భారత్ ఆట ముగించవచ్చని భావించిన ఆసీస్‌కు ఇక్కడే అసలు ప్రతిఘటన ఎదురైంది. నితీశ్, సుందర్ చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ మెల్లగా స్కోరును పెంచుతూ పోయారు. లంచ్ సమయానికి స్కోరు 244/7 వద్ద నిలిచింది. రెండో సెషన్‌లో పూర్తిగా వీరిద్దరిదే హవా సాగింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా 24 ఓవర్ల పాటు ఈ జోడీని విడదీయడంలో ఆసీస్ బౌలర్లు విఫలమయ్యారు. మూడో సెషన్‌లో కూడా వీరిద్దరు గట్టిగా నిలబడ్డారు. ఆసీస్ తొలి 15 ఓవర్లలో 22 పరుగులే ఇచ్చినా వికెట్ మాత్రం తీయలేకపోయింది. ఎట్టకేలకు 127 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యం తర్వాత సుందర్‌ను అవుట్ చేసి లయన్ ఈ జోడీని విడదీశాడు. మరో రెండు పరుగులకే బుమ్రా (0) కూడా వెనుదిరిగాడు. అయితే మరో 15 బంతుల పాటు చివరి వికెట్ చేజార్చుకోకుండా భారత్ మూడో రోజును ముగించింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 474; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలండ్ (బి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; కోహ్లి (సి) క్యారీ (బి) బోలండ్ 36; ఆకాశ్ దీప్ (సి) లయన్ (బి) బోలండ్ 0; పంత్ (సి) లయన్ (బి) బోలండ్ 28; జడేజా (ఎల్బీ) (బి) లయన్ 17; నితీశ్ రెడ్డి (బ్యాటింగ్) 105; సుందర్ (సి) స్మిత్ (బి) లయన్ 50; బుమ్రా (సి) ఖ్వాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (116 ఓవర్లలో 9 వికెట్లకు) 358. వికెట్ల పతనం:** 1–8, 2–51, 3–153, 4–154, 5–159, 6–191, 7–221, 8–348, 9–350. **బౌలింగ్:** స్టార్క్ 25–2–86–0, కమిన్స్ 27–6–86–3, బోలండ్ 27–7–57–3, లయన్ 27–4–88–2, మార్ష్ 7–1–28–0, హెడ్ 3–0–11–0.

సుందర్ సంయమనం...


సుందర్

దాదాపు నాలుగేళ్ల క్రితం వాషింగ్టన్ సుందర్ బ్రిస్బేన్ టెస్టుతో అరంగేట్రం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 161/5తో కష్టాల్లో ఉన్న స్థితిలో అతను బ్యాటింగ్‌కు దిగి జట్టును గట్టెక్కించాడు. అతను చేసిన 62 పరుగులు ఆ తర్వాత భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు మరోసారి అతను అలాంటి పాత్రనే పోషించాడు. ఈ టెస్టు కోసం ప్రధాన బ్యాటర్ గిల్‌ను పక్కన పెట్టి ఆల్‌రౌండర్ సుందర్‌ను తీసుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ తప్పుడు నిర్ణయం జట్టు ఓటమికి కారణం కావచ్చని విశ్లేషకులు అన్నారు. అయితే సుందర్ తన బ్యాటింగ్‌తో వారి అనుమానాలను పటాపంచలు చేశాడు. ముఖ్యంగా ఏ రెగ్యులర్ బ్యాటర్‌కు తగ్గని రీతిలో అద్భుతమైన డిఫెన్స్‌తో జట్టు ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. సుందర్ పట్టుదల, ఓపికతో అండగా నిలవడం వల్లే మరో వైపు నితీశ్ సెంచరీ సాధ్యమైంది. ఎంతో జాగ్రత్తగా ఆడిన సుందర్ ఏకంగా 162 బంతులు ఎదుర్కొన్నాడు. కమిన్స్ ఓవర్లో అతను కొట్టిన సింగిల్‌తో భారత్ ఫాలో ఆన్ ప్రమాదంనుంచి తప్పించుకుంది. తాను ఎదుర్కొన్న 103వ బంతికి గానీ సుందర్ ఏకైక ఫోర్ కొట్టలేదు. టీ విరామం తర్వాత 146 బంతుల్లో సుందర్ అర్ధసెంచరీ పూర్తయింది. మళ్లీ ఆస్ట్రేలియాను నిలువరించడంలో సఫలమైన తర్వాత చివరకు లయన్ బౌలింగ్‌లో అతను వెనుదిరిగాడు. బ్రిస్బేన్ విజయం తర్వాత తన కుక్క పిల్లకు అక్కడి మైదానం 'గాబా' పేరును సుందర్ పెట్టుకున్నాడు. ఇప్పుడు ఇక్కడి ప్రదర్శన తర్వాత రెండో కుక్క పిల్ల ఏమైనా ఉంటే 'ఎంసీజీ' అంటాడేమో!


అర్ధ సెంచరీ చేశాక...


పెర్త్ టెస్టులో 73/6 నుంచి జట్టును 150 వరకు అతనే తీసుకెళ్లాడు...అడిలైడ్‌లో 87/5, 105/5 వద్ద ఉన్నప్పుడు 42, 42తో రెండు చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడాడు. మెల్‌బోర్న్‌లో 191/6 నుంచి స్కోరును 300 దాటించాడు...ఈ సిరీస్‌లో తొలి రోజునుంచి తనదైన ముద్ర వేసిన నితీశ్ కుమార్ రెడ్డి 284 పరుగులతో ప్రస్తుతం టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ టెస్టుకు ముందు అతని ప్రదర్శన చూస్తే ఒక భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నట్లుగా కనిపించింది. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక ఎంసీజీలో అతను ఆ లోటును తీర్చుకున్నాడు. ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లు, బంగ్లాదేశ్‌తో టి20లో 34 బంతుల్లో 74 పరుగుల ఆటతో తానేంటో చూపించినా...నితీశ్‌ను టెస్టు ఆటగాడిగా ఎవరూ చూడలేదు. 23 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 674 పరుగులు, బౌలింగ్‌లో 56 వికెట్ల అతని రికార్డు ప్రతిష్ఠాత్మక బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి అర్హతగా మారుతుందని, తుది జట్టులో స్థానం దక్కుతుందని ఊహించలేదు. మీడియం పేస్ బౌలింగ్ చేసే బ్యాటర్‌గా హార్దిక్ పాండ్యా తరహాలో గుర్తింపు తెచ్చుకోవాలని ఉందని నితీశ్ తన గురించి తాను చెప్పుకున్నాడు. కానీ ఈ సిరీస్‌కు ముందు దులీప్ ట్రోఫీలో ఐదు ఇన్నింగ్స్‌లలో రెండు డకౌట్‌లు బ్యాటింగ్‌పై కూడా సందేహాలు రేపాయి. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ నితీశ్‌పై నమ్మకముంచింది. అతడిని తమ ట్రంప్ కార్డ్‌గా వాడి అద్భుత ఫలితాలు సాధించింది. ఇప్పుడు సెంచరీతో నితీశ్ తన స్థాయిని ప్రదర్శించాడు. అతను ఎనిమిదో స్థానంలో క్రీజ్‌లోకి వచ్చే సమయానికి భారత్ మరో 283 పరుగులు వెనుకబడి ఉంది. ఇలాంటి సమయంలోనూ ఎలాంటి తడబాటు లేకుండా అతను స్వేచ్ఛగా ఆడిన తీరు మాజీ క్రికెటర్లు, దిగ్గజాలను సైతం ఆకట్టుకుంది. షాట్ల ఎంపిక మాత్రమే కాదు, అతనిలో కనిపించిన ఆత్మవిశ్వాసం ఎంతో అనుభవం ఉన్నవాడిలా చూపించింది. ముఖ్యంగా క్రీజ్‌లో పట్టుదలగా నిలబడిన తీరు, పోరాటతత్వం ఈ 21 ఏళ్ల కుర్రాడిని మరో మెట్టు ఎక్కించాయి. స్టార్క్ బౌలింగ్‌తో ఆఫ్ డ్రైవ్ బౌండరీతో 81 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న అనంతరం అతను 'పుష్ప'లా తగ్గేదేలే అంటూ సంకేతం చూపించాడు. ఆ తర్వాత పరిస్థితికి తగినట్లుగా తనను తాను మార్చుకున్నాడు. 85 స్కోరు వద్దనుంచి 97కు చేరేందుకు 48 బంతులు తీసుకున్నాడు. చివరకు ఆ క్షణం రానే వచ్చింది. సెంచరీ తర్వాత బ్యాట్‌ను మైదానంలో జెండా తరహాలో పాతి ఇది ఆరంభం మాత్రమే అన్నట్లుగా తన రాకను నితీశ్ ఘనంగా చూపించాడు. 21 ఏళ్ల 214 రోజుల వయసులో సెంచరీ బాది ఆస్ట్రేలియా గడ్డపై అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వారిలో మూడో స్థానంలో అతను నిలవడం విశేషం.

కమిన్స్‌తో తలపడి... నిలబడి...

నితీశ్ ఇన్నింగ్స్‌లో చూడచక్కటి షాట్లు ఎన్నో ఉన్నాయి. అతని పది ఫోర్లు కూడా ఎంతో నియంత్రణతో, ఎలాంటి తడబాటు లేకుండా పూర్తి సాధికారతతో వచ్చాయి. ఆరంభంలో లయన్ బౌలింగ్‌లో ముందుకు దూసుకొచ్చి కొట్టిన సిక్స్, ఆ తర్వాతి బౌండరీలో చక్కటి ఫుట్‌వర్క్ కనిపించింది. అయితే సెంచరీని అందుకునే క్రమంలో అతను కొన్ని కఠిన క్షణాలను కూడా దాటాడు! ముఖ్యంగా ఆసీస్ కెప్టెన్, తన సన్‌రైజర్స్ సారథి కమిన్స్ బౌలింగ్‌ను అతను ఎదుర్కొన్న తీరు శనివారం ఆటలో హైలైట్‌గా నిలిచింది. ఎన్ని ప్రమాదకరమైన బంతులు వచ్చినా... నితీశ్ తలవంచి కాడి పడేయలేదు. వాటికి ఎదురొడ్డి నిలబడ్డాడు. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ 68వ ఓవర్ అతనిలోని మొండితనాన్ని చూపించింది. ముఖ్యంగా బౌన్సర్‌గా వచ్చిన మూడో బంతిని ఆడలేకపోయిన నితీశ్ అదృష్టవశాత్తూ చివరి క్షణంలో దాని నుంచి తప్పించుకోగలిగాడు. ఆఖరి బంతి కూడా దాదాపు ఇదే తరహాలో అతడిని వెంటాడింది. మరికొద్ది సేపటికి కమిన్స్ బౌలింగ్‌లోనే బంతి మోచేయి కింది భాగంలో బలంగా తగలడంతో అతను విలవిల్లాడుతూ బ్యాట్ వదిలేశాడు. ఫిజియో వచ్చి చికిత్స చేయాల్సి వచ్చింది. అయితే ఈ కుర్రాడు ఎక్కడా తగ్గకుండా దూసుకుపోయి తానేంటో చూపించాడు.


నితీశ్ రెడ్డి

జింక్ మైదానం నుంచి ఎంసీజీ సెంచరీ వరకు...


మైదానం బయట నితీశ్ తల్లిదండ్రులు ముత్యాల రెడ్డి, మానస...చెల్లి తేజస్వి

సాక్షి, క్రీడావిభాగం

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం...మరో 25 ఏళ్ల సర్వీస్ మిగిలి ఉంది. కానీ కొడుకు భవిష్యత్తు కోసం దానిని వదిలేసేందుకు ఆయన సిద్ధమయ్యాడు. దానికి ఎంత ధైర్యం కావాలి? తన అబ్బాయి ఆటపై ఎంత నమ్మకం ఉండాలి. విశాఖపట్నానికి చెందిన ముత్యాల రెడ్డికి ఆ నమ్మకం ఉంది. అందుకే ఆయన వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. మున్ముందు ఎన్నో ఆర్థిక సమస్యలు వస్తాయని తెలిసినా అన్నింటినీ తట్టుకునేందుకు రెడీ అన్నాడు. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత తన కొడుకు టెస్టు క్రికెటర్‌గా మారి ఎందరో కలలు గనే మెల్‌బోర్న్ మైదానంలో సెంచరీ సాధించిన క్షణం ఆయన ఆనందం కన్నీళ్లుగా మారి కనిపించింది! తన కష్టం ఫలించిన రోజు ఆ పుత్రోత్సాహం గురించి చెప్పేందుకు ఎన్ని విశేషణాలు కూడా సరిపోవేమో.

ఆరేళ్ల వయసులో మొదలైన నితీశ్ రెడ్డి క్రికెట్ ఆట 12 ఏళ్లు వచ్చే సరికి పూర్తి స్థాయి క్రికెటర్‌గా మారాలనే కల వైపు అడుగులు వేసింది. ఏసీఏకు చెందిన కడప అకాడమీలో అండర్–14 విభాగంలో శిక్షణకు ఎంపికైన తర్వాత గమ్యంపై మరింత స్పష్టత వచ్చేసింది. ఇదే సమయంలో ముత్యాల రెడ్డి అనూహ్యం నిర్ణయం తీసుకున్నాడు. ఉద్యోగరీత్యా రాజస్తాన్‌కు బదిలీ కాగా...అలా వెళితే తన కొడుకును తీర్చిదిద్దడం కష్టమవుతుందని ఆయన భావించాడు. అందుకే హిందుస్తాన్ జింక్ కంపెనీలో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి సమయంలో కొడుకు కోసం కేటాయించేశాడు. బీసీసీఐ అండర్–16 టోర్నీ విజయ్‌మర్చంట్ ట్రోఫీలో ఒకే సీజన్‌లో రికార్డు స్థాయిలో ఏకంగా 1237 పరుగులు చేయడంతో అతని సత్తా అందరికీ తెలిసింది. 176.71 సగటుతో 4 సెంచరీలు, 2 అర్ధ సెంచరీలతో చేసిన ఆ పరుగులు బీసీసీఐ ఉత్తమ ఆటగాడి అవార్డును అందించాయి. నాగాలాండ్‌తో జరిగిన పోరులో 366 బంతుల్లో 60 ఫోర్లు, 7 సిక్స్‌లతో చేసిన 441 పరుగులు నితీశ్ ధాటిని చూపించాయి. అలా మొదలైన ప్రస్థానం అండర్–19 జట్టుతో పాటు ఆ తర్వాత ఆంధ్ర సీనియర్ టీమ్‌లో కూడా అవకాశం కల్పించాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున నితీశ్ దూకుడును అభిమానులంతా చూశారు. గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఆంధ్ర తరపున 25 వికెట్లు తీయడంతో అతని బౌలింగ్ పదును కూడా సెలక్టర్లకు అర్థమైంది. అందుకే జాతీయ జట్టులో అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.



సెంచరీ సాధించిన క్షణాన...

నితీశ్ తాజా ప్రదర్శన టెస్టు జట్టులో అతని స్థానాన్ని సుస్థిరం చేయడం ఖాయం. ఇదే జోరు కొనసాగిస్తే మూడు ఫార్మాట్‌లలో కూడా ఈ అబ్బాయి అద్భుతాలు చేయడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆ మూడు బంతులు!

లయన్ వేసిన ఇన్నింగ్స్ 112వ ఓవర్ తొలి బంతికి సింగిల్ తీసి నితీశ్ మరో ఎండ్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో అతని స్కోరు 97. అదే ఓవర్ తర్వాత ఐదు బంతులు ఆడిన సుందర్ చివరి బంతికి అవుటయ్యాడు. తర్వాతి ఓవర్ చివరి బంతికి మరో రెండు పరుగులు తీసిన అతను 99 వద్ద నిలిచాడు. అయితే మరుసటి ఓవర్లో ఒక్కసారిగా ఉత్కంఠ చోటు చేసుకుంది. తొలి మూడు బంతులు ఎదుర్కొన్న బుమ్రా డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ సమయంలో సిరాజ్ క్రీజ్‌లోకి వచ్చాడు. కమిన్స్ బంతులను అతను ఆడగలడా అని అన్ని వైపులనుంచి సందేహం. మైదానంలో ఫ్యాన్స్ కూడా మునివేళ్లపై నిలిచారు. ఎలాగో అతను ఆ గండాన్ని దాటాడు. ఆఖరి బంతిని సిరాజ్ డిఫెండ్ చేసినప్పుడు ఎంసీజీ మొత్తం ఊగిపోవడం విశేషం! అయితే బోలండ్ తర్వాతి ఓవర్ మూడో బంతిని లాఫ్టెడ్ ఆన్‌డ్రైవ్‌గా ఆడటంతో నితీశ్ శతకం పూర్తయింది. అభిమానుల ఉత్సాహంతో 'జి' దద్దరిల్లగా...ప్రేక్షకుల మధ్య ఉన్న తండ్రి ముత్యాల రెడ్డి కన్నీళ్లపర్యంతమయ్యాడు. ఆ సమయంలో కామెంటరీలో ఉన్న మాజీ క్రికెటర్ రవిశాస్త్రి...'ఈ భావోద్వేగ క్షణం గురించి ఏం చెప్పినా తక్కువే. అక్కడ ఏడుస్తోంది నితీశ్ తండ్రి మాత్రమే కాదు. మైదానంలో ఉన్న సగటు భారత అభిమానులకు కూడా అదే భావన వచ్చి ఉంటుంది. నా కళ్లల్లో కూడా కన్నీళ్లు తిరిగాయంటే ఆశ్చర్యపోవద్దు' అని వ్యాఖ్యానించాడు.



5 ఎనిమిది లేదా అంతకంటే కింది స్థానంలో బ్యాటింగ్‌కు దిగి సెంచరీ సాధించిన ఆటగాళ్లలో నితీశ్ ఐదోవాడు. భారత ఆటగాళ్లలో అతనే మొదటివాడు.

8 ఈ సిరీస్‌లో నితీశ్ సిక్సర్ల సంఖ్య. గతంలో ఆస్ట్రేలియా గడ్డపై ఒక సిరీస్‌లో మైకేల్ వాన్ (8; ఇంగ్లండ్), క్రిస్ గేల్ (8 ;వెస్టిండీస్) మాత్రమే ఎనిమిది సిక్స్‌లు బాదారు.

'విశాఖపట్నం యువకుడు నితీశ్ కుమార్‌రెడ్డికి నా అభినందనలు. అండర్-16 స్థాయిలో, రంజీ ట్రోఫీలో ఎన్నో విజయాలతో అతను సత్తా చాటాడు. ఇలాంటి ఘనతలు మున్ముందు మరిన్ని సాధించాలని, భారత జట్టులో సభ్యుడిగా దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' –నారా చంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

'బాక్సింగ్ డే టెస్టులో సెంచరీ సాధించిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డికి నా అభినందనలు. జట్టు కష్టాల్లో ఉండి ఫాలో ఆన్ ప్రమాదం పొంచి ఉన్న సమయంలో పరిస్థితి చక్కదిద్దడంలో అతను కీలక పాత్ర పోషించాడు. రాబోయే ఎన్నో ఘనతల్లో ఇది మొదటిది కావాలి. మైదానంలో అతని విజయాలు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా.'
–వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుల ప్రసక్తి లేదు, 37 సం॥ గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-782729]

SC హిందూమాల/B.Tech/C.Govt. SSA / EPFO / 80,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15367]

యాదవ/కట్నప్రసక్తి లేదు/B.Tech (సివిల్)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/80,000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9515755529, 9676995093 [HA-15367]

వధువు కావలెను. కుల పట్టింపు లేదు. M.Tech చదివి Business Construction field లో ఉన్న వరుడికి వధువు కావలెను. Ph: 7013433214 [HA-15367]

★

మాల హిందూ/A:30, Ht:5'10"/ B.Tech (IIT) Sal: 55 లక్షలు. A:30, Ht"5'8" / B.Tech / Income Tax Inspector. 7396915712 [HA-15366]

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల సంబంధము లేదు మరియు రెండో పెండ్లి వారు కూడా సంప్రదించవచ్చును.సెల్: 8790197318 [Y-1145857]

No Brokers: Divorced, 43, BC(D), M.A, B.Ed, ప్రైవేట్, 30,000/-, పిల్లలు లేరు. ఒక Shutter ఉన్న వరునికి పిల్లలు లేని 2వ వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. Warangal. 9392850846. [W-1264165]

SC మాల, 40yrs, పెళ్లి కాని ఒంటరి వరునకు మనీ సపోర్ట్ చేయగల వధువు కావలెను. ఇల్లరికం ఓకే, డైరెక్ట్. ఫోన్ 8121718883 [HA-15371]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Business/B.Tech/ MS/1994/ 6'/800Cr *96/6'/500Cr *95/5'7"/ 2000Cr *98/6'/300Cr *95/5'10"/300Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Business *B.Tech / MBA * 1994/ 5'10"/100Cr *95/5'8"/500Cr *94/5'11"/ 300Cr *95/6'/100Cr *90/ 6'/1000Cr *89/ 5'11"/ 400Cr *Cont: K.C. Reddy - Hyd- Ph: 9849321309

Reddy/Business/MBA/1996 / 5'11"/65Cr *94/6'/70Cr *95/6'/150Cr *97/5'11"/100Cr *97/6'/400Cr *91/6'/150Cr *95/5'10"/80Cr * Cont. K.C. Reddy- Hyd-Ph: 9347807015

Reddy/MBBS/PG/Doctors *1992 / 5'10"/ 150Cr *95/5'10"/400Cr *96/6'/ 50Cr *94/ 5'10"/70Cr *93/5'10"/50Cr *89/5'9"/30Cr * Cont : K.C. Reddy- Hyd. Ph: 9849321309

Reddy/MBBS/PG/USA Doctors *1992/6' *95/5'8" *95/5'11" *89/5'9" *83/5'6" *90/ 6'/50Cr *89/5'9"/30Cr *98/5'8"/ * Cont: K.C. Reddy Mar Bureau-Hyd-Ph: 9347807015

Reddy /B.Tech/MS/H1/USA *1998/6'/ 300 Cr *97/6'/400Cr *91/5'11"/200Cr *95/ 5'10"/ 230K/100Cr *94/5'11"/150Cr * Cont : K.C. Reddy -Hyd. Ph : 9347807015/9849321309

Reddy/IIT/B.Tech/MS/H1 /USA *1998/ 5'11"/ 230K/30Cr *94/5'11"/450K/30Cr *93/ 5'11"/ 350K/100Cr *93/5'9"/230K/20Cr *95/ 5'7"/300K * Cont : K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/IIT/B.Tech / SWE/India *1994 / 5'11"/ 70L/yr/25Cr *94/5'9"/1Cr/yr/30Cr *96/ 5'7"/ 50L/yr 74/30Cr *98/5'11"/50L/yr/8Cr *97/5'11"/50L/yr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Divorcee (India)/ B.Tech/ SWE/ 1986/ 5'11"/70L/yr/15Cr *94/5'11"/400Cr *81/5'8"/ 500Cr *93/5'10"/200Cr *MD/94/5'9"/80Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divercee/USA Citizen *B.Tech/ MS/ 1991/5'5"/150K *MD/88/5'7"/700K *90/ 5'9"/ 300K/ 40Cr *90/5'11"/75K *95/5'9"/200K/30Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech/Most Beautiful *1995/ 5'5"/100Cr *99/5'7"/100Cr *93/ 5'3"/ 500Cr *94/5'3"/300Cr *96 / 5'7"/50Cr * Cont:K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/MBBS / PG *1997/5'6"/500Cr *1994/5'6"/100Cr *2000/5'6"/100Cr *98/ 5'7" 100Cr *96/5'8"/40Cr *95/5'3"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/IIT / B.Tech / SWE / India *1997/ 5'4"/25L/yr/6Cr *98/5'3 1/2"/ 70L/yr/ *2000/ 5'7"/45L/yr/10Cr *96/ 5'4"/ *99/5'4"/32L/yr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/IIT/B.Tech/MS/ H1/ USA *98/5'7" *96/5'4" *94/5'4"/10Cr *96/5'7" *97/ 5'4"/ 200K *95/5'6"/200K *94/5'4" / 260K * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1 / USA *1997/ 5'4"/ 100Cr *89/5'6"/170K/30Cr *99/5'6"/ 100Cr *97/5'5"/10Cr *96/5'8"/15Cr *96/5'5"/15Cr * Cont : K.C. Reddy -Hyd- Ph: 9347807015

Reddy/MBBS/USA-Doctors *1995/5'5" *1995 / 5'7" *1996/5'2" / 20Cr *96/ 5'8"/ 40Cr *96/5'5"/100Cr *87/5'4"/10Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/2002/5'6" / 20Cr *94/5'4"/ 20Cr *2001/5'3"/20Cr *95/5'5"/70Cr *97/ 5'4"/150Cr *94/5'10"/60Cr *97/5'5"/25Cr * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/USA-Citizen *MBBS/MD/1995/5'7" *1995 /5'2" / 92/5'4"/15Cr *92/5'4"/50Cr *81/5'1" *99/5'6"/100Cr *MS/1996/5'3"/30Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: /9849321309

Reddy/Divorcee (India) *MBBS/MD *1993/ 5'8"/40Cr *86/5'6"/50Cr *94/5'5"/50Cr *B.Tech/ 96/5'4"/10Cr *85/5'5"/400Cr *93/5'6"/50Cr. * Cont K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Divorcee / USA * B.Tech/MS / 1993/ 5'7"/15Cr *86/5'6"/30Cr *92/5'5"/50Cr *89/ 5'3"/40Cr *86/5'6"/15Cr *92/5'6"/ *95/5'5"/10Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9849321309

[D-561]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 2", Engineer, 120 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 8", SWE, Amazon, 200 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 29, 6', 30 L P/A, 15 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 30, 5' 11", Sr. SWE, 11 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి CCitizen, BS, MHA, 26, 5' 5", Project Manager, 33 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 5", Wipro, 25 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 25, 5' 6", SWE, 100 K, H1, USA, Rich, Fair &Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి CA, 30, 6' 2", Associate, 15 L P/A, 10 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 27, 5' 6", Manager, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 11", PG Doctor, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 10", SWE, 100 K, 50 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 29, 5' 6", Dental Doctor, 2 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 28, 5' 7", Sr. Associate, 30 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 8", PG Doctor, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", Strategy Consultant, 16 L P/A, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC-Mala-Hindu/2nd Marriage/ 40/PG/ 5'10"/SWE/1.6L PM/Wants Hindu Bride only from Hyderabad & Telangana Areas only. 8187861989. (Direct No Brokers) [H-782793]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు. జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్, 6 కోట్ల ప్రాపర్టీ అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను ఇల్లరికం OK, అని వయస్సుల వారికి సంబంధాలు కలవు. త్వరగా కుదుర్చబడును. Ph: 8309968531 [H-783513]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి పట్టింపు లేదు/30Y, H:5'4"/సొంత బిజినెస్సు, అందమైన వధువుకి వరుడు కావలెను. 1st/2nd అన్ని కులాలు & వయస్సుల వారికి సంబంధాలు కలవు. (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-15367]

2వ పెళ్లి, ఎలాంటి కుల ప్రసక్తి లేదు, 3,50,000/-PM కోట్ల ప్రాపర్టీ కల్గి, బాగా స్థిర పడిన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. ఇల్లరికం, పిల్లలు ఉన్నా OK. Ph: 9381696641 [H-783609]

రెడ్డి /విడో/Govt.Rtd పెన్షనర్ & సొంత ఇల్లు / 29 ఎకరాల పొలం, రైస్ మిల్ / బిజినెస్/ 4L/PM /వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-783513]

వైశ్య /విడో/50/5'3"/ MBA / బిజినెస్/ సొంత ఇల్లు/ 80,000/-PM/కోట్ల స్థిరాస్తి కలిగిన వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 7416249467 [H-783513]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/ విజయవాడ/ Hydలో సొంత ఇల్లు/ల్యాండ్స్ పిల్లలులేని వెల్ సెటిల్డ్ ఏ బాదరబందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782729]

రెడ్డి/విడో/49y/C.Govt.జాబ్/VRS90K PM/ట్రాన్స్‌పోర్ట్ & గ్రానైట్ బిజినెస్/30ఎ॥ పొలాలు/కమర్షియల్ కాంప్లెక్స్, రెంట్స్/కోట్ల ప్రాపర్టీ, పూర్తి ఫ్యామిలీ కోల్పోయిన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. పిల్లలున్నా OK. Ph: 7702043224 [H-782729]

SC మాల/24/5'5"/B.Tech(CSC), MS, USA, SWE, MNC, Hyderabad/60,000/-PM/వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15367]

కాపు/2వ పెళ్లి, 50 Yrs, ఫ్యామిలీ పెన్షన్/65000/-PM, Own House గల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9550613499 [HA-15367]

వడ్డెర/B.Tech/C.Govt. Asst. మేనేజర్ /ఆంధ్రాబ్యాంక్ /60,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15367]

రెడ్డి/2nd విడో(కుల-ఆస్తి) పట్టింపు లేదు Age: 31/ డిగ్రీ (సొంత ఇల్లు వ్యాపారం-వ్యవసాయ భూమి) వధువుకి వరుడు కావలెను, (ఇల్లరికము OK) అన్ని వయస్సుల వారికి 1వ/2వ సంబంధాలు కలవు. Ph: 9059607176 [HA-15367]

కాపు/43/5'6", డిగ్రీ, విడో, పేయిర్, C.Govt, పెన్షనర్, 8L PA, 25Cr ప్రాపర్టీ బాగా స్థిరపడిన ఏకైక వధువుకి మంచి సాంప్రదాయ కుటుంబం వరుడు కావలెను. Ph: 9573943211, 8125132949 [HA-15367]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/Age: 35/B.Com/Pvt Job, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 8121347478 [HA-15367]

బలిజ, శెట్టిబలిజ, మొదటి సంబంధం, 25 to 35 సం॥లు ఉన్న సొంత ఇల్లు, 10 to డిగ్రీ చదివిన అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సంప్ర: 9100579008. [A-1457]

కమ్మనాయుడు, 1st మ్యారేజ్. 25 to 34 సం॥లు. డిగ్రీ to B.Tech. సొంత ఇల్లు. సాఫ్ట్‌వేర్ గా ఉన్న అమ్మాయికి ఏదయినా బిజినెస్ లేదా జాబ్ ఉన్న వరుడు కావలెను. సంప్ర: 9100579008. [A-1457]

రెడ్డి, మొదటి సంబంధం, రెండవ సంబంధం. వయస్సు 28 to 35 సం॥లు. 10 to B.Tech. సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. 9100579008. [A-1457]

దేవాంగులు, పద్మశాలి, పట్టుశాలి, మొదటి సంబంధం, రెండవ సంబంధం. 10 to డిగ్రీ, సొంత ఇల్లు, సంస్థ ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సంప్ర: 9100579008. [A-1457]

విశ్వబ్రాహ్మణ్స్ (ఆచారులు), మొదటి సంబంధం, సొంత ఇల్లు, Inter, డిగ్రీ, 10th. వయస్సు 25 to 32 సం॥లు ఉన్న అమ్మాయికి సంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సంప్ర: 9100579008. [A-1457]

★★

కులం మాల, హిందూ 2nd మ్యారేజ్, వయస్సు 39 సం॥లు H-5'3" M-Tech., సాఫ్ట్‌వేర్, జీతం : లక్ష/నెలకు వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. (హిందూ/క్రిస్టియన్స్) ✆ : 77949 11019 [R-1260847]

వేదికలు



కాపు, మున్నూరు కాపు, కమ్మ వెల్ సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్స్ వధూవరులకు పెళ్ళి సంబంధాలు చూడబడును. సంప్ర॥ Ph: 7416094972, 9502216460 [H-783513]

వనస్థలిపురం (Hyd) "దుబ్బాక మాట్రిమోని" రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్ర : Verified Profiles (కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, లోకల్) సంప్రదించండి. Ph: 8187060996 [H-783513]

రజక/డాక్టర్స్, ఇంజినీర్స్, లాయర్స్, ఇండియా, అబ్రాడ్, గవర్నమెంట్ జాబ్ వధూ వరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్. Ph: 9391265304/8106303155 [H-782729]

అన్ని కులాల, డాక్టర్స్, ఇంజినీర్స్ / Govt. Jobs/ బిజినెస్/ Abroad సంబంధాలకై సంప్రదించండి. Ph: 9100357969, 9640876803 [H-782729]

Fast Settelement-సాఫ్ట్‌వేర్స్,సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్, అబ్రాడ్,గ్రూప్ ఆఫీసర్స్, VIP వారికి 1st, 2nd పెళ్ళి సంబంధాలు చూడబడు ను. పూర్ణ మాట్రిమోని,తిరుపతి, 7093722724. [T-3233]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26.01. 2025వ తేదీ ఉ॥ 10 గం॥లకు 66వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 21వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, కె.వి.ఎస్. కాలేజీలో జరుగును ✆ 99895 00130 [B-1110]

కురువ/కురుమ/కురబ: వివాహ వేదిక 05-01-2025, ఉ॥ 9.00 గంటలకు, జిల్లా పరిషత్‌లో, కర్నూలు, ఆంధ్ర. బయోడేటా, కలర్ ఫోటోలు. రిజిస్ట్రేషన్ ఫీజు: 800/-. 90327 41194, 94407 56199 [L-783231]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1260]

సినిమా

మీకు తెలుసా మార్కో ఎవరని?



● ఉన్ని ముకుందన్

'జీవితంలో మనల్ని వెంటాడే విషయం ఏంటో తెలుసా? మనకు ఎంతో ఇష్టమైన వాళ్లని మన కళ్ల ముందే చిత్రహింసలు పెట్టి చంపడం' అంటూ ఉన్ని ముకుందన్ చెప్పే డైలాగ్‌తో 'మార్కో' ట్రైలర్ ప్రారంభమైంది. మలయాళ హీరో ఉన్ని ముకుందన్ నటించిన తాజా చిత్రం 'మార్కో'. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో యుక్తి తరేజా, కబీర్ దుహన్ సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న మలయాళంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని ఎన్వీఆర్ సినిమా తెలుగులో జనవరి 1న రిలీజ్ చేస్తోంది. శనివారం 'మార్కో' తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'మార్కోతో మాట్లాడే ప్రతీ మాట జాగ్రత్తగా మాట్లాడాలి, మీకు తెలుసా మార్కో ఎవరని?' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

అందమైన ప్రేమకథ



● నాగ ప్రణవ్, కావేరి

నాగ ప్రణవ్ హీరోగా, కావేరి కర్ణిక, ఆద్య హీరోయిన్లుగా నటుడు అజయ్ ఘోష్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఓ చెలియా'. నాగ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో రూపా శ్రీ, చంద్రమౌళి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నటులు కుడితి శ్రీనివాస్, సతీష్ సారిపల్లె రిలీజ్ చేశారు. ''మా సినిమాని మార్చిలో విడుదల చేస్తాం'' అని చెప్పారు రూపా శ్రీ, చంద్రమౌళి. ''కుమార్ మంచి మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు నాగ రాజశేఖర్ రెడ్డి. ''బాలనటిగా చాలా సినిమాల్లో నటించిన నాకు హీరోయిన్‌గా చాన్స్ ఇచ్చిన రాజశేఖర్ సార్‌కి థ్యాంక్స్'' అని కావేరి కర్ణిక చెప్పారు. ''అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు నాగ ప్రణవ్.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే 'సాక్షి యూట్యూబ్' ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది 'గోల్డెన్ మెమొరీస్' రూపంలో. ఈ వారం 'గోల్డెన్ మెమొరీస్'లో ఓ ఆణిముత్యం అయిన 'అహ! నా పెళ్ళంట!' గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

హిట్ జాతర



● అల్లు అర్జున్



● ఎన్టీఆర్

తెలుగు సినిమాల్లో జాతర ఎపిసోడ్స్ ప్రేక్షకులను థియేటర్స్‌కు వచ్చేలా ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జాతర జోరు బాగా కనిపించింది. కొన్ని చిత్రాల్లో జాతర ఎపిసోడ్స్ కీలకంగా నిలవగా, కొన్ని చిత్రాలు జాతర నేపథ్యంలోనే సాగాయి. సినిమా హిట్‌కి జాతర ఓ కారణంగా నిలిచింది. ఇక 2024లో వెండితెరపై జాతర హైలైట్‌గా నిలిచిన తెలుగు చిత్రాల గురించి తెలుసుకుందాం.

అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగ రాస్తోంది. డిసెంబరు 5న విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా రూ. 1700 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను మించిందని ఈ సినిమా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా ఇంకా ప్రదర్శితమవుతోంది. దీంతో 'పుష్ప: ది రూల్' వసూళ్లు ఇంకాస్త పెరిగే అవకాశం ఉందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా ఈ సినిమా విజయానికి ఓ ముఖ్య కారణం జాతర ఎపిసోడ్ అన్నది కొందరి అభిప్రాయం. ఈ ఎపిసోడ్‌లో కొత్త గెటప్‌లో అల్లు అర్జున్ నటన, దర్శకుడు సుకుమార్ టేకింగ్, కొరియోగ్రాఫర్ విజయ్ నృత్యరీతులకు ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. ఈ జాతర ఎపిసోడ్ లుక్‌తోనే ఈ సినిమా క్లైమాక్స్ లోనూ అల్లు అర్జున్ ఫైట్ ఉండటం విశేషం. ఈ ఎపిసోడ్‌ని దాదాపు మూడు నెలలు డిజైన్ చేసుకుని, నెల రోజుల పాటు, భారీ బడ్జెట్‌తో చిత్రీకరించారని తెలిసింది. ఈ సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ స్వరకర్త. మరో సంగీత దర్శకుడు సామ్‌సీఎస్ ఈ జాతర ఎపిసోడ్‌కు ఆర్ఆర్ అందించారని తెలిసింది.

ఇక ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన 'దేవర'లోనూ జాతర ఎపిసోడ్ హైలైట్ అయింది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీని రెండు భాగాలుగా ప్లాన్ చేశారు. ఎన్టీఆర్ తండ్రీ కొడుకుగా (తండ్రి దేవర, కొడుకు వర పాత్రల్లో ఎన్టీఆర్ నటించారు) నటించిన ఈ సినిమా తొలి భాగం 'దేవర పార్టు 1' సెప్టెంబరు 27న విడుదలైంది. ఈ సినిమాలో జాతర నేపథ్యంలో వచ్చే రెండు సన్నివేశాలు (ఒక సన్నివేశం దేవరతో, మరొక సీన్ వరతో) కథను మలుపు తిప్పుతాయి. ఇలా జాతర ఎపిసోడ్స్ 'దేవర పార్టు 1'లో కీలకంగా కనిపిస్తాయి. అలాగే జాతర సమయంలో 'వీరాధి వీరుల తిరునాళ్ల జరుపుకోవాల... రారా వీర' అంటూ లిరిక్స్‌తో సాగే 'ఆయుధ పూజ' పాట కూడా ఆడియన్స్‌ను బాగా ఆకట్టుకుంది. 'దేవర' సినిమాకు అనిరుధ్ సంగీతం అందించారు.



● కిరణ్ అబ్బవరం

అలాగే ఈ ఏడాది వచ్చిన హిట్ మూవీస్‌లో 'క' చిత్రం ఒకటి. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రంతో సుజీత్ – సందీప్ ద్వయం దర్శకులుగా పరిచయం అయ్యారు. ఈ చిత్రంలోని జాతర ఎపిసోడ్ కథకు కీలకంగా ఉంటుంది. అలాగే 'ఆడు ఆడు ఆడు... అమ్మోరే మురిసేలా ఆడు' అంటూ వచ్చే జాతర పాట ప్రేక్షకులను అలరించింది. 'పుష్ప: ది రూల్' సినిమా జాతర ఎపిసోడ్‌కు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇచ్చిన సంగీత దర్శకుడు సామ్ సీఎస్‌యే 'క' సినిమాకు స్వరకర్త. ఇలా జాతర ఎపిసోడ్స్‌తో కథ మలుపు తిరిగిన సినిమాలు కొన్నైతే, జాతర నేపథ్యంలోనే మరికొన్ని సినిమాలు తెలుగు తెర పైకి వచ్చాయి.



● అజయ్

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ ఫిల్మ్ 'పొట్టేల్' ఈ కోవలోకే వస్తుంది. తెలంగాణలోని ఓ ఊర్లో పుష్కరానికి ఒకసారి జరిగే జాతర నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. జాతర నేపథ్యమే కాకుండా చదువు ప్రాముఖ్యతను కూడా తెలిపేలా దర్శకుడు సాహిత్ మోత్ఖురి తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించింది. అలాగే నూతన నటీనటులు సందీప్ సరోజ్, త్రినాథ్ వర్మ, ఈశ్వర్ రచిరాజు, పెండ్యాల యశ్వంత్ తదితరులు నటించిన 'కమిటీ కుర్రోళ్ళు' హిట్ ఫిల్మ్‌గా నిలిచింది. నూతన దర్శకుడు యదు వంశీ తెరకెక్కించిన ఈ సెమీ పీరియాడికల్ ఫిల్మ్ పురుషోత్తంపల్లి అనే గ్రామంలో జరిగే సంఘటనలు, రాజకీయాలు, స్నేహం నేపథ్యంలో ఉంటుంది. పన్నెండేళ్లకొకసారి పురుషోత్తంపల్లిలో జరిగే భరింకాళమ్మ తల్లి జాతర ఈ సినిమాకు కీలకంగా ఉంటుంది. ఈ జాతర ఎపిసోడ్ అలరించింది. ఇంకా ధ్రువ వాయు నటించి, దర్శకత్వం వహించిన 'కళింగ' సినిమాలో కూడా జాతర ప్రస్తావన, జాతర సాంగ్ ఉంటాయి. ఇలా జాతర టచ్‌తో ఈ ఏడాది వచ్చిన అన్ని సినిమాలూ ఆడియన్స్ మెప్పు పొందడం విశేషం. 2024తో ఈ జాతర ఆగడంలేదు... 2025లో రానున్న చిత్రాల్లో కొన్నింటిలో 'జాతర' సందడి కనిపించనుంది.

– ముసిమి శివాంజనేయులు



● కమిటీ కుర్రోళ్లులో ఓ దృశ్యం

వైవిధ్యమైన కథతో...



● ప్రవీణ్

బిగ్ బాస్ ఫేమ్ పృథ్వీ, ప్రవీణ్ కేవీ, వైష్ణవి, యషికా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మహిష'. ప్రవీణ్ కేవీ దర్శకత్వంలో రమణా రెడ్డి, మధుసూదన్ రావు నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'మహిష'. సినిమా చాలా బాగా వచ్చింది. నటుడిగా, దర్శకుడిగా ఈ చిత్రం నాకు సంతృప్తినిచ్చింది. జనవరిలో మా సినిమా రిలీజ్ కానుంది'' అన్నారు ప్రవీణ్ కేవీ. ''ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా రెండు బాధ్యతలు నిర్వర్తించాను'' అని మధుసూదన్ రావు చెప్పారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

జాగ్రత్త... టోర్నడోల్లో ఎగిరిపోతారు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ట్విస్టర్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎంత పెద్ద విపత్తయినా, వివాదమైనా ముందుగా అమెరికా హాలీవుడ్ దర్శకుల మెదళ్లలో పుట్టి, దాని తరువాత వీలైతే అది జరుగుతుంది, లేదంటే ఆ హాలీవుడ్ దర్శకుడి ఊహల్లోనే ఉండిపోతుంది. చిన్నపాటి ఈగ నుండి ఇప్పటిదాకా కనీసం ప్రత్యక్షంగా కనిపించని గ్రహాంతరవాసి దాడుల వరకు హాలీవుడ్ దర్శకుల ఊహకు కాదేదీ అనర్హం, ఇది జగమెరిగిన సత్యం. కానీ ప్రకృతి మాత్రం అమెరికాలో భౌగోళిక ప్రాతిపదికన నిజంగానే కాస్తంత ప్రచండంగానే ఉంటుంది. వాటిలో ముఖ్యంగా తరచూ కనిపించే టోర్నడోలు. మన పరిభాషలో చెప్పాలంటే సుడిగుండపు తుఫానులు. వీటి మీద హాలీవుడ్ దర్శకుల కన్ను దాదాపు 28 సంవత్సరాల క్రితమే పడింది. 1996లో జెన్ డి బాంట్ 'ట్విస్టర్' అనే సంచలనాత్మక సినిమా తీశారు. ఆ రోజుల్లో ఈ సినిమా ప్రపంచ సినీ పరిశ్రమలో పెద్ద హాట్ టాపిక్. అప్పట్లో 88 మిలియన్లు పెట్టి ఈ సినిమా తీస్తే దాదాపు 500 మిలియన్లు సంపాదించి పెట్టింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా జోసెఫ్ కోసిన్స్కి కథ ఆధారంగా మార్క్ ఎల్. స్మిత్ స్క్రీన్‌ప్లేతో లీ ఐజాక్ చుంగ్ దర్శకత్వం వహించిన 2024 అమెరికన్ చిత్రం 'ట్విస్టర్స్'. ప్రస్తుతం ఈ సినిమా జియో సినిమా ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. 'ట్విస్టర్స్' సినిమా పూర్తిగా టోర్నడోల కథాంశంతోనే తెరకెక్కింది. అమెరికా దేశంలో ఒక్లాహోమా రాష్ట్రం ఎక్కువగా టోర్నడోలు ప్రభావితమయ్యే ప్రాంతం. ఓ టోర్నడో వస్తుందంటే దాని ప్రభావం ఎంతవరకు ఉంటుంది? అది ఎప్పుడు ఆగిపోతుంది అన్న లోతైన విశ్లేషణలు చేయడానికి ప్రభుత్వంతో పాటు అనేక ప్రైవేటు సంస్థలు పని చేస్తుంటాయి. 'ట్విస్టర్స్' సినిమా కథ అటువంటి సంస్థ గురించే. స్ట్రామ్ పార్ అనే ఈ సంస్థలో ఎంతో అవగాహన ఉన్న కేట్ తన సహచరుడు జావి ద్వారా చేరుతుంది. ఓ టోర్నడో ఆపరేషన్‌లో కేట్ తన ప్రియుడిని పోగొట్టుకుంటుంది. ఆ బాధలో ఉన్నా ఓ వారం వరకు తాను జావీకి తోడుగా ఉంటానని స్ట్రామ్ పార్ టీమ్‌లోకి వస్తుంది. కానీ జావి ఇదంతా ఓ స్వార్థం కోసం చేస్తున్నాడని తెలిసి ఇదే టోర్నడో ఆపరేషన్‌లో భాగంగా టోర్నడో వ్రాంగ్లర్ అనే యూట్యూబ్ సంస్థలోకి టైలర్ ఆహ్వానిస్తే వెళుతుంది. టోర్నడో ప్రమాదకర కేటగిరీ ఈయఫ్ 5ని వీళ్ళు ఛేజ్ చేస్తూ చిక్కుకుంటారు. మరి... వాళ్ల ఆ టోర్నడో నుండి బయటపడ్డారా? లేదా అన్నది మాత్రం సినిమాలోనే చూడాలి. మంచి ఇన్ఫర్మేషన్‌తో చక్కటి థ్రిల్లింగ్ మూడ్‌లోకి తీసుకువెళ్లే సినిమా ఈ 'ట్విస్టర్స్'. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నేరాల్లో మరో కోణం!

ఈ ఏడాది హైదరాబాద్‌లో ఘరానా నేరాలకు తోడు విచిత్ర ఉదంతాలు ● పోలీసులకు తలనొప్పులు తెస్తున్న ఈ తరహా కేసులు

చిల్లర దొంగతనాలు మొదలు రూ.కోట్లు కాజేసిన సైబర్ కేటుగాళ్ల ఉదంతాల వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ ఏడాది కాలంలో వివిధ నేరాలు చోటుచేసుకున్నాయి. అందుకు సంబంధించి బోలెడు ఎఫ్‌ఐఆర్‌లు సైతం నమోదయ్యాయి. కానీ వాటిలో కొన్ని విచిత్రమైన కేసులు పోలీసులను ఆశ్చర్యపరిచాయి. ఇంతకీ ఆ విచిత్ర కేసులేమిటంటే...

- సాక్షి, హైదరాబాద్

మద్యంపై మక్కువతో..



పనిచేస్తున్న సంస్థలకు సున్నం పెట్టే వాళ్లు.. అన్నం పెట్టిన ఇంట్లోనే కన్నం వేసిన వాళ్ల గురించి అప్పుడప్పుడూ చూస్తూనే ఉంటాం. సాధారణంగా ఆయా నేరాల్లో సొమ్ము కాజేయడమే నిందితుల ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది. కానీ జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని ఆర్‌యూ పబ్‌లో పనిచేసే వినీత్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డు వెరైటీ చోరీకి పాల్పడ్డాడు. ఖరీదైన విదేశీ మద్యం తాగడం కోసం ఇద్దరు స్నేహితులతో కలిసి అర్ధరాత్రి దాటాక పబ్‌లోకి ప్రవేశించి రాయల్ సెల్యూట్, చివాస్ రీగల్, మొహిట్ చాన్ దాన్ బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. పనిలో పనిగా పారిపోవడానికి ఉపయోగపడుతుందని రూ. 2 లక్షల నగదు కూడా కొట్టేశాడు.

మాస్టార్‌కు ఎదురైన ప్రేమ వేధింపులు



బస్టాప్‌ల లాంటి ప్రదేశాల్లో రోడ్‌సైడ్ రోమియోల ఆగడాల గురించి.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే కీచకులుగా మారిన ఉదంతాల గురించి అప్పుడప్పుడూ వింటుంటాం. కానీ హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఓ గురువుపై మనసు పారేసుకున్న ఓ యువతి తన ప్రేమను నిరాకరించాడన్న కోపంతో ఆయనపై క్షక్షగట్టింది. లెక్చరర్‌తోపాటు ఆయన కుమార్తె ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసింది. దీనిపై బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో ఆ యువతి చివరకు జైలుపాలైంది.

హుస్సేన్‌సాగర్‌లో '90 ఎంఎల్'స్టోరీ



నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ కాలుష్యానికే కాదు.. ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడం తెలిసిందే. సాధారణంగా ప్రేమ వ్యవహారాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగా అవి జరుగుతుంటాయి. కానీ ఓ మందుబాబు మాత్రం మద్యం మత్తులో హుస్సేన్‌సాగర్‌లోకి దిగి 'చుక్క'కావాలంటూ పోలీసులకు చుక్కలు చూపించాడు. నగరానికి చెందిన ఓ యువకుడు నిషాలో హుస్సేన్‌సాగర్‌లోకి దిగాడు. నడుము లోతు నీళ్లున్న ప్రాంతంలో అతడు నిల్చుని ఉండటాన్ని చూసిన పర్యాటకులు ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నాడనుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకున్న ఓ కానిస్టేబుల్ నీటిలోకి తాడు విసిరి, దాన్ని పట్టుకుని పైకి రావాల్సిందిగా యువకుడిని కోరాడు. కానీ అందుకు నిరాకరించిన మందుబాబు.. తనకు '90 ఎంఎల్'ఇస్తేనే బయటకు వస్తానంటూ మొండికేశాడు. చివరకు గంటన్నరపాటు సాగిన డ్రామా అనంతరం పోలీసులు అతన్ని బయటకు రప్పించారు.

భర్తపైనే అట్రాసిటీ కేసు



ఎస్సీ, ఎస్టీ అత్యాచార (నిరోధక) చట్టం ప్రకారం ఆయా వర్గాలకు చెందిన వ్యక్తుల్ని కులం పేరుతో దూషించడం తీవ్రమైన నేరం. సామాన్యులే కాదు.. కొన్ని సందర్భాల్లో ప్రముఖులు, పోలీసులు సైతం ఈ తరహా కేసుల్లో ఇరుక్కున్నారు. అయితే శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ బ్యూటీషియన్ ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న భర్తపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సంచలనం సృష్టించింది. కుమార్తె పుట్టాక భర్త వేధింపులు, భౌతికదాడులను మౌనంగా భరిస్తున్న ఆమెపై 2018 నుంచి కులం పేరుతో దూషించడం కూడా మొదలుపెట్టాడు. దీంతో సహనం నసించిన ఆమె.. భర్తపైనే కులంపేరుతో దూషణ కేసు పెట్టింది. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'అతడి'పైనా అత్యాచారయత్నం



యువతులు, మహిళలపై అత్యాచారాలు, అత్యాచారయత్నాలకు సంబంధించిన కేసులు నేటికీ నమోదవుతుండటం చాలవన్నట్లు ఇద్దరు మహిళలు ఓ పురుషుడిపై అత్యాచారయత్నం చేయడం, నగ్నంగా వీడియోలు తీసి అతన్ని బెదిరించడం సనత్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సదరు వ్యక్తికి మసాజ్ థెరపిస్టుగా పరిచయమైన ఓ మహిళ.. భరత్‌నగర్ కాలనీకి చెందిన మరో మహిళను పరిచయం చేసింది. ఇద్దరూ కలిసి అతన్ని భరత్‌నగర్ కాలనీలోని మహిళ ఇంటికి తీసుకెళ్లి మసాజ్ పేరుతో దుస్తులు విప్పించి అత్యాచారానికి యత్నించారు. అతడు నిరాకరించడంతో నగ్న వీడియోలను తీసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి కొంత డబ్బు గుంజారు. ఆపై ఇంకా డబ్బివ్వాలని డిమాండ్ చేయడంతో ఈ 'లైంగిక వేధింపులు'తట్టుకోలేక బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

ఆమె అలా... అతడు ఇలా



భిన్న మనస్తత్వాలుగల భార్యభర్తల్ని మనం చూస్తూనే ఉంటాం. రామంతాపూర్‌లో నివసించే ఓ 'విపరీత'జంట వ్యవహారం ఉప్పల్ ఠాణా అధికారుల దృష్టికి వచ్చింది. గతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హౌస్ కీపర్‌గా పనిచేసిన సదరు మహిళ మద్యానికి బానిసగా మారింది. నిత్యం మద్యం తాగి రోడ్లపై న్యూసెన్స్ చేస్తూ పోలీసులకు చిక్కడం పరిపాటిగా మార్చుకుంది. అంతటితో ఆగకుండా ఏకంగా పోలీసుస్టేషన్‌కే వచ్చి న్యూసెన్స్ చేసి వెళ్తుండటం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఆమె భర్త కూడా తక్కువేం కాదు.. చుట్టుపక్కల కాలనీల్లోని ఇళ్ల గోడలు దూకి చెప్పులు, బూట్లు చోరీ చేసేవాడు. సీసీ కెమెరాల ఆధారంతో వన్ ఫైన్ మార్నింగ్ అతని ఇంటిపై దాడి చేసిన స్థానికులు వందల జతల పాదరక్షలు గుర్తించి పోలీసులకు అప్పగించారు.

శిక్షల శాతం పెంపే లక్ష్యం

వార్షిక నివేదిక విడుదలలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ కేసుల్లో శిక్షలను 25 శాతానికి పెంచాలని కొత్త ఏడాదిలో లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎక్సైజ్‌శాఖ వార్షిక నివేదిక-2024ను ఉన్నతాధికారులతో కలిసి ఆయన విడుదల చేశారు. మత్తుపదార్థాల రవాణా, వినియోగానికి సంబంధించి ఈ ఏడాది ఎన్‌డీపీఎస్ చట్టం కింద 29 శాతం కేసులు పెరిగినట్లు నివేదికలో ఎక్సైజ్‌శాఖ వెల్లడించింది. 2023లో 809 కేసులు నమోదవగా 2024లో కేసుల సంఖ్య 1,045కు చేరిందని పేర్కొంది. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.48.54 కోట్ల విలువైన 20,904 కిలోల గంజాయి, ఇతర మత్తుపదార్థాలను నాశనం చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం రూ. 12.22 కోట్ల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి కట్టడిలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపరేషన్ ధూల్‌పేట్ చేపట్టినట్లు కమలాసన్‌రెడ్డి చెప్పారు. కీలక ముఠాల కట్టడితోపాటు 71 కేసులలో 317 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. బెల్ట్‌షాప్‌లపై రాష్ట్రవ్యాప్తంగా 6,915 కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించిన టానిక్ లిక్కర్ మార్ట్ లైసెన్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ కేసుల దర్యాప్తులో కీలకాంశాలు, సీజర్ పంచనామా నమోదుపై తమ సిబ్బంది, అధికారులకు టీజీయాంటీ నార్కోటిక్స్ బ్యూరో, తెలంగాణ పోలీస్ అకాడమీ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు.

న్యూఇయర్ వేడుకల్లో మత్తు పదార్థాల కట్టడికి చర్యలు..

నూతన సంవత్సర వేడుకల్లో మత్తుపదార్థాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమలాసన్‌రెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పబ్బులు సహా వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీల కోసం 40 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రి, డిప్యూటీ కమిషనర్ దశరథ్, అదనపు ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, ప్రణవి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్‌లో తండ్రి ప్రతిమ

తండ్రిని మరిచిపోలేక తయారుచేయించిన కుమారుడు



బాలరాజు ప్రతిమతో ఆయన భార్య, కుమారుడు, స్నేహ దంపతులు

సింగరేణి (కొత్తగూడెం): ఇంటిపెద్ద మృతి చెందితే చాలామంది ఇంట్లో ఫొటో ఏర్పాటుచేసి సరిపెట్టుకుంటారు. కానీ ఓ యువకుడు రూ.లక్షలు వెచ్చించి తన తండ్రి ప్రతిమ చేయించి సోదరి వివాహ రిసెప్షన్ వేదికపై ఏర్పాటుచేసి మమకారాన్ని చాటుకున్నాడు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో ఐటీ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన పెరికం బాలరాజు 2019లో అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత ఆయన కుమార్తె స్నేహకు యాజమాన్యం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో ఉద్యోగావకాశం కల్పించింది. ఆమెకు శ్రీరాంపూర్ ఏరియాలో అండర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అవినాష్‌తో పెళ్లి కాగా.. కొత్తగూడెంలో శనివారం రాత్రి రిసెప్షన్ నిర్వహించారు. ఈమేరకు ముంబైలో రూ.4 లక్షల వ్యయంతో వీల్‌చైర్‌లో కూర్చున్న రూపంలో చేయించిన బాలరాజు విగ్రహాన్ని వేదికపై ఏర్పాటుచేయగా.. స్నేహ దంపతులతో పాటు ఆమె సోదరుడు, తల్లి ఫొటోలు దిగారు. తండ్రి జ్ఞాపకాలు పదిలంగా ఉండాలనే భావనతో విగ్రహాన్ని తయారుచేయించినట్లు కుటుంబీకులు తెలిపారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌ల్లో రెండో స్థానంలో తెలంగాణ

సాక్షి, అమరావతి: పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించే లక్ష్యంతో రిలయన్స్ గ్రూపు ప్రతి ఏటా అందించే స్కాలర్‌షిప్‌లకు రాష్ట్ర విద్యార్థులు ఎంపికయ్యారు. రిలయన్స్ ఫౌండేషన్ అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌ల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో లక్షమంది పోటీపడగా అందులోంచి 5,000 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ధీరుభాయ్ అంబానీ 92వ జయంతి సందర్భంగా 2024-25 బ్యాచ్‌కు చెందిన ఫలితాలు ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 850 మంది విద్యార్థులు ఎంపికై మొదటిస్థానంలో నిలవగా.. తెలంగాణ నుంచి 411 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల్లో తెలుగురాష్ట్రాల నుంచి 25.22 శాతం మంది ఉన్నట్లు రిలయన్స్ గ్రూపు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్, ఇతర విద్యా ఖర్చుల కింద గరిష్టంగా రూ.2 లక్షలు ఆర్థిక సహాయం ఇస్తారు. ఫలితాల కోసం https://scholarships.reliance foundation.org/ UGScholarship&ApplicationStatus.aspx సందర్శించి మీ 17-అంకెల అప్లికేషన్ నంబర్/ఈమెయిల్ ఐడీతో చూసుకోవచ్చన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

భద్రగిరి.. ప్రకృతి సోయగాల సిరి

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం క్షేత్రం వైకుంఠ ముక్కోటి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. అయితే, భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకునే భక్తులు కొద్దిపాటి సమయం కేటాయిస్తే.. చుట్టుపక్కల ఎన్నో ఆలయాలు, సహజ సిద్ధమైన ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. నూతన సంవత్సరం సెలవులు, పర్యాటకానికి అనువైన శీతాకాల సీజన్ కావడంతో భద్రాచలం.. భక్తులు, పర్యాటకులకు సాదరంగా స్వాగతం పలుకుతోంది. భద్రాచలంలో బసచేసి నలువైపులా ఉన్న పర్యాటక ప్రాంతాలను వీక్షించవచ్చు. ఇక్కడి సందర్శనీయ స్థలాలు, పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలపై కథనమిది.

భద్రాచలం చుట్టుపక్కల ఎన్నెన్నో పర్యాటక ప్రాంతాలు

ముక్కోటి వేళ పెరుగుతున్న భక్తులు, పర్యాటకుల రాక

కొద్ది సమయం కేటాయిస్తే పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం



పర్ణశాల..

భద్రాచలం వచ్చిన భక్తులు.. భద్రాచలం తర్వాత అధికంగా దర్శించుకునే ప్రాంతం ఇదే. ఈ ప్రాంతాన్ని శ్రీరామాయణంలో పంచవటిగా వ్యవహరించారు. రామాయణానికి ప్రాణప్రదాలైన ముఖ్య ఘట్టాలన్నీ ఇక్కడే జరిగాయని అభివర్ణిస్తారు. శ్రీ సీతారామలక్ష్మణులు వనవాస కాలంలో ఎక్కువ రోజులు (11 మాసాల 10 రోజులు) పర్ణశాలలో నివాసం ఉన్నారట. శూర్పణఖ చెవి, ముక్కును లక్ష్మణ స్వామి కోసింది ఇక్కడేనని, 14 వేల మంది రాక్షసుల వధ, సీతాపహరణం, మాయలేడిగా మారీచుడు రావడం, జటాయువు రావణుడిని ఎదుర్కొనడం వంటి ప్రధాన ఘట్టాలన్నీ ఇక్కడే జరిగినట్లు స్థల పురాణం చెబుతోంది. వీటికి సంబంధించిన ఆనవాళ్లు ఇప్పటికీ ఇక్కడ దర్శనమిస్తాయి.

ఇలా చేరుకోవచ్చు..

భద్రాచలం నుంచి పర్ణశాల 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పర్ణశాలకు భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిత్యం బస్సులు తిరుగుతాయి. ఉత్సవాల సమయంలో ప్రతీ పది నిమిషాలకు ఒక బస్సును అధికారులు సిద్ధం చేస్తారు. బస్సులే కాకుండా.. ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి.

కిన్నెరసాని..

భద్రాచలానికి దగ్గరగా ఉన్న మరో పర్యాటక ప్రాంతం కిన్నెరసాని. ఇక్కడ ఉన్న అభయారణ్యం పార్కులో అందమైన జింకలను చూడొచ్చు. ఇక్కడ కేటీపీఎస్ కర్మాగారం కోసం కిన్నెరసానిపై నిర్మించిన ప్రాజెక్టును వీక్షించవచ్చు. బోటింగ్ అనుభూతిని ఆస్వాదించవచ్చు.

ఇలా వెళ్లవచ్చు

కిన్నెరసానికి వెళ్లాలంటే పాల్వంచ పట్టణం నుంచి 9 కిలోమీటర్లు లోపలికి వెళ్లాలి. భద్రాచలం నుంచి వెళ్లాలనుకునే వారు పాల్వంచ బస్టాండ్‌లో దిగి అక్కడ బస్సు మారాలి. సరాసరిగానైతే ప్రైవేట్ వాహనాలు, సొంత కార్లలో చేరుకోవచ్చు.

బొగత జలపాతం

ఇది ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరాన అటవీ ప్రాంతంలో ఉంది. ఈ మండలం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకే వస్తుంది. పచ్చని కొండల నడుమ సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం ఇది. తెలంగాణ నయాగారాగా అభివర్ణించే దీని అందాలు వర్షాకాలంలో చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుండగా, శీతాకాల సీజన్‌లో సైతం వీక్షించవచ్చు.



ఇలా చేరుకోవచ్చు..

భద్రాచలం నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనిని భద్రాచలం నుంచి వెళ్లాలంటే తప్పనిసరిగా ప్రైవేట్, సొంత వాహనాల్లో వెళ్లాలి. ఇక హైదరాబాద్, వరంగల్ నుంచి వచ్చే పర్యాటకులు దీనిని నేరుగా సందర్శించి.. అటునుంచి భద్రాచలం చేరుకునే అవకాశం ఉంది.

మోతుగూడెం..

మోతుగూడెంలో పొల్లూరు జలపాతం, పొల్లూరు పవర్ స్టేషన్, పవర్ కెనాల్, అటునుంచి కొద్దిదూరంలో తూర్పుగోదావరి జిల్లా డొంకరాయి ప్రాజెక్టు తదితర చూడదగ్గ ప్రదేశాలున్నాయి. సహజసిద్ధంగా ఏర్పడ్డ పొల్లూరు జలపాతం ప్రకృతి ప్రేమికులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. శీతాకాల సీజన్‌లో కొండల మీదుగా నేలమీదకి వచ్చాయా? అన్నట్లు తెల్లటి మేఘాల అందాలు కట్టిపడేస్తాయి.

ఇలా చేరుకోవచ్చు..

భద్రాచలం నుంచి మోతుగూడెం సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ ప్రాంతానికి వెళ్లాలనుకునే వారు ఆర్టీసీ బస్సులున్నా సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లటానికి మొగ్గు చూపుతారు. ప్రయాణాల నడుమ ఉన్న అటవీ అందాలు, ప్రకృతి అందాలను చూడాలనుకుంటే.. కచ్చితంగా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లటం ఉత్తమం.



శ్రీరామగిరి క్షేత్రం..

ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంటుంది. గోదావరి – శబరి నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఉందీ ప్రాంతం. నిండుగా ప్రవహించే గోదావరి నదీ తీరాన ఎత్తయిన కొండపై నెలకొన్న క్షేత్రమిది. ఆ కొండ పేరే శ్రీరామగిరి. కొండపై శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించాడని స్థలపురాణం చెబుతోంది. పర్ణశాలలో సీతాపహరణ తర్వాత శ్రీరాముడు సీతాన్వేషణ చేస్తూ దండకవనం (వనక్షేత్రం) చేరి సేదదీరి, మళ్లీ సీతమ్మను వెతుకుతూ ఈ ప్రాంతానికి చేరుకున్నారు. ఇది అప్పుడు మాతంగముని ఆశ్రమ ప్రాంతం. ఇక్కడే శబరిని కలిసి ఆమె ఆతిథ్యమైన ఎంగిలి పండ్లను స్వీకరించి, ముక్తిని ప్రసాదించాడని భక్తుల నమ్మిక. ఈ ప్రాంతానికి సమీపంలో రేఖపల్లిలో (రెక్కపల్లి – జటాయువు రెండో రెక్క పడిపోయిన చోటు) రెక్క పడిన జటాయువును చూశారట. రామలక్ష్మణుల ప్రాణవిశిష్టగా ఉన్న జటాయువు ద్వారా సీత వృత్తాంతాన్ని తెలుసుకుని మరణించిన జటాయువుకు శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు చేశారని చెబుతారు. గోదావరి తీరంలో ఓ పెద్ద శిలపై దానికి పిండ ప్రధానం చేసినట్లు స్థల చరిత్ర చెబుతోంది.

ఇలా చేరుకోవచ్చు..

భద్రాచలం నుంచి శ్రీరామగిరి 62 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శ్రీరామగిరికి భద్రాచలం బస్టాండ్ నుంచి ప్రతీ గంటకు ఒక బస్సు ఉంది. బస్సులే కాకుండా ప్రైవేట్ వాహనాలు కూడా సిద్ధంగా ఉంటాయి.

పాపికొండలు..

భద్రాచలం వచ్చిన ప్రతీఒక్కరు చూడదగ్గ పర్యాటక ప్రాంతం పాపికొండలు. సహజసిద్ధమైన ప్రకృతి అందాలను లాంచీ ప్రయాణంలో ఆస్వాదించడం ఈ యాత్ర ప్రత్యేకత. లాంచీలోనే గోదావరి అందాలను వీక్షిస్తూ గిరిజనుల సంప్రదాయాలను వీక్షించవచ్చు. పాపికొండల యాత్రలో పేరంటాలపల్లి వద్ద మఠాన్ని కూడా దర్శించే అవకాశముంది.

ఇలా చేరుకోవచ్చు..

పాపికొండలకు వెళ్లాలంటే ముందుగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పోచవరానికి చేరుకోవాలి. భద్రాచలం నుంచి పోచవరానికి 85 కిలోమీటర్ల దూరం ఉండగా.. బస్టాండ్ నుంచి ఉదయం 5.30, 11.30 గంటలకు బస్సులు ఉన్నాయి. అయితే, పాపికొండలు వెళ్లాలనుకునే వారు సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాలైతే సమయానుకూలంగా మధ్యలో ప్రకృతి అడవి అందాలు, కూనవరం వద్ద శబరి, గోదావరి సంగమం చూడడానికి అనుకూలంగా ఉంటుంది. పోచవరం నుంచి లాంచీ టికెట్ ధర పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750గా ఉంది.

మారేడుమిల్లి..

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారేడుమిల్లి ఉంటుంది. ఇటీవలి కాలంలో పర్యాటకుల ఆదరణ అత్యధికంగా ఉన్న ప్రాంతం ఇది. 'పుష్ప', 'ఆచార్య', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'తదితర సినిమాల చిత్రీకరణ జరిగిన పర్యాటక ప్రాంతం ఇది. ఘాట్ రోడ్డు అనుభూతులు, వాటర్ ఫాల్స్, పాము మెలికలు తిరిగినట్లుండే విహంగ వీక్షణం, పలు వ్యూ పాయింట్లను ఇక్కడ వీక్షించవచ్చు. ఇక్కడి నుంచి అత్యంత ఎత్తయిన 'గుడిసె'అనే ప్రాంతానికి రాత్రి వేళలో బస చేసి.. సూర్యోదయాన్ని అతి దగ్గరగా చూసే అదృష్టం పర్యాటకులకు మాత్రమే సొంతం.




ఇలా చేరుకోవచ్చు..

భద్రాచలం నుంచి నేరుగా మారేడుమిల్లికి 118 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో సుమారు 40 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు మీదుగానే ప్రయాణం సాగుతుంది. ఘాట్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రకృతి అందాలు, వాటర్ ఫాల్స్, ఇతర వ్యూ పాయింట్లను చూడాలంటే తప్పనిసరిగా ప్రైవేట్ వాహనాల్లోనే వెళ్లాలి. భద్రాచలం నుంచి మోతుగూడెం, మారేడుమిల్లి ప్రాంతాలకు వెళ్లి అక్కడే బస చేసి.. రెండు, మూడు రోజులు వీక్షించే అవకాశమూ ఉంటుంది.







భద్రాచలం వచ్చేందుకు..

- భద్రాచలం వచ్చే రైల్వే ప్రయాణికులు విజయవాడ - సికింద్రాబాద్ మార్గంలో ఖమ్మం స్టేషన్‌లో దిగి బస్సుల్లో భద్రాచలం రావచ్చు. ఖమ్మం నుంచి భద్రాచలానికి రోడ్డు మార్గం 120 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- నేరుగా భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) వరకు సికింద్రాబాద్ నుంచి రైలు సౌకర్యం ఉంది. ఆపై కొత్తగూడెం నుంచి భద్రాచలానికి 40 కిలోమీటర్లు బస్సుల్లో వెళ్లొచ్చు.
- ఇవి కాక హైదరాబాద్ నుంచి రోజూ ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు స్లీపర్, నాన్ స్లీపర్ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

29 శాతం పెరిగిన ఎన్‌డీపీఎస్ కేసులు

- ఈ ఏడాదిలో 12.22 కోట్ల విలువైన మత్తుపదార్థాల స్వాధీనం
- 6,330 కిలోల గంజాయి స్వాధీనం
- కేవలం ఆరు కేసుల్లోనే శిక్షలు ఖరారు
- ఎక్సైజ్‌శాఖ వార్షిక నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మత్తుపదార్థాల రవాణా, వినియోగానికి సంబంధించి నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టెన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్ కింద నమోదైన కేసుల్లో ఈ ఏడాది 29 శాతం పెరుగుదల కనిపించింది. 2023లో 809 కేసులు నమోదవగా 2024లో కేసుల సంఖ్య 1,045కు పెరిగింది. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు కలిపి మొత్తం రూ. 12.22 కోట్ల విలువైన మత్తు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో ఈ ఏడాది కేవలం ఆరు కేసుల్లోనే శిక్షలు ఖరారైనట్లు తెలంగాణ ఎక్సైజ్‌శాఖ శనివారం విడుదల చేసిన వార్షిక నివేదిక వెల్లడించింది.

నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు

- గంజాయి, ఇతర మత్తుపదార్థాల కేసులు జీహెచ్ఎంసీతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా, మెదక్ జిల్లాల పరిధిలో ఎక్కువగా నమోదయ్యాయి.
- ఈ ఏడాది జూలై 16 నుంచి చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా 71 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో 317 నిందితులు ఉండగా 321 కిలోల గంజాయి, 4 కిలోల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్)కు సంబంధించి ఈ ఏడాది డిసెంబర్ 24 వరకు 854 కేసులు నమోదు చేశారు. 464 మందిని అరెస్టు చేశారు. మొత్తం రూ. 1.35 కోట్ల విలువైన 11,329 లీటర్ల మద్యం, 80 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- డ్రగ్స్ కేసుల్లో నిందితుల ప్రొఫైల్స్‌ను డ్రగ్ అఫెండర్స్ ప్రొఫైలింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం (డీఓపీఏఎంఎస్)లో నమోదు చేస్తున్నారు.

శిక్షల ఖరారు ఇలా..

ఏడాది	శిక్షపడిన కేసులు
2022	06
2023	14
2024	06

గంజాయి పట్టివేత (కిలోల్లో..)

ఏడాది	పట్టుబడిన గంజాయి
2022	4,551.23
2023	6,354.56
2024	6,330

అల్ప్రాజోలం పట్టివేత (కిలోల్లో..)

ఏడాది	పట్టుబడిన అల్ప్రాజోలం
2022	8.55
2023	38.25
2024	30.22

పీడీ యాక్ట్ కింద నమోదైన కేసులు..

ఏడాది	కేసుల సంఖ్య
2022	41
2023	14
2024	02

ఎక్కడున్నా మొక్కపై నిఘా!

- ప్రపంచంలో ఎక్కడి నుంచైనా పరిశోధనకు వీలు
- శాస్త్రవేత్తలు పొలాల్లోకి రావాల్సిన అవసరం లేదు
- ఇక్రిశాట్‌లో 'హైత్రోపుట్ ఫినోటైపింగ్ ఫెసిలిటీ'సెంటర్
- పంటలపై పరిశోధనకు ఆధునిక సాంకేతికత



హైత్రోపుట్ ఫినోటైపింగ్ ఫెసిలిటీ సెంటర్‌లో జొన్న పంట

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల కోసం పంట పొలాల్లో తిరగాల్సి ఉంటుంది. ప్రత్యక్షంగా వెళ్లి మొక్కల తీరును పరిశీలించి డేటాను సేకరించాలి. కానీ, పంటలను ప్రపంచంలో ఎక్కడి నుంచైనా అధ్యయనం చేయగల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్రిశాట్‌లో ఉన్న ప్రత్యేక పరిశోధన క్షేత్రంలో వినియోగిస్తున్నారు. పంటల వద్దకు వెళ్లకుండానే తామున్న చోట నుంచే పంటల తీరును పరిశీలించేందుకు వీలుండే ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. 'హైత్రోపుట్ ఫినోటైపింగ్ ఫెసిలిటీ'అనే అధునాతన ల్యాబ్ ద్వారా ఇతర దేశాల్లో ఉన్న సైంటిస్టులు కూడా ఇక్కడి పంటల తీరును ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతోంది. ప్రస్తుతానికి ఈ ఆధునిక ప్రయోగశాలలో జొన్న పంటపై పరిశోధన జరుగుతోంది.

అంతర్జాతీయ పంటల పరిశోధన సంస్థ..

ఇక్రిశాట్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని రామచంద్రాపురంలో ఉన్నప్పటికీ.. దీని ప్రాంతీయ కార్యాలయాలు కెన్యా, మాలి, నైజీరియా, మలావీ, ఇథియోఫియా, జింబాబ్వే తదితర ఆఫ్రికా దేశాల్లో ఉన్నాయి. ఆయా దేశాల్లో ఉన్న శాస్త్రవేత్తలు సైతం ఇక్కడి పరిశోధన క్షేత్రంలో పెరుగుతున్న మొక్కలను వీక్షించేందుకు, పరిశీలించేందుకు ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు.

మొక్క ప్రతిస్పందనపై క్షణక్షణం నిఘా

హైత్రోపుట్ ఫినోటైపింగ్ ఫెసిలిటీ కేంద్రంలో ప్రస్తుతం జొన్న పంటకు సంబంధించి ఐదు వేల మొక్కలను పెంచుతున్నారు. ఈ సెంటర్ మొక్క ప్రతి స్పందనను క్షణక్షణం రికార్డు చేస్తుంది. ఈ డేటాను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తుంది. మొక్క పత్రహరితానికి సంబంధించిన ఫ్లోరోసెన్స్, మొక్క 3డీ మాడలింగ్, ఆర్‌జీబీ ఇమేజింగ్, హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్, థర్మల్ ఇమేజింగ్.. ఇలా మొక్కను పూర్తిస్థాయిలో స్కాన్ చేయగల ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు.

నీటి వాడకానికి లెక్క ఉంటుంది..

మొక్క ఎప్పుడు ఎంత నీటిని వాడుకుంటుందనే వివరాలు కూడా ఈ ల్యాబ్‌లో రికార్డు అవుతాయి. మొక్క ట్రే కింద ప్రత్యేకంగా లోడ్ సెన్సార్ ఉంటుంది. మొక్కకు పట్టిన నీళ్లు ఎన్ని ఆవిరయ్యాయి? ఎంత వినియోగమైంది? అనే వివరాలను సేకరిస్తుంది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మొక్క ఎంత ఒత్తిడికి గురవుతుంది? మొక్కల ఎదుగుదల ఎలా ఉంటుంది? అనే అంశాలను ఇమేజ్, వీడియో రూపంలో కూడా రికార్డు చేస్తుంది. మొక్కలు ఎంత నీళ్లు ఇస్తే తట్టుకోగలవు. నీళ్లు లేకపోతే ఎంత మేరకు అనుగడ సాధించగలవు? అనే అంశాలను పరిశీలించేందుకు వీలుంటుంది. తద్వారా నీటి కొరతను తట్టుకునే వెరైటీలు, అధిక వర్షాలకు తట్టుకునే వెరైటీలను కనుగొనే అవకాశం ఉంటుందని ఇక్రిశాట్ రిసెర్చ్ స్కాలర్ కల్పన తెలిపారు.



హైత్రోపుట్ ఫినోటైపింగ్ ఫెసిలిటీ సెంటర్‌లో మొక్కల ట్రేలు



మొక్క ప్రతిస్పందనను పసిగట్టే పరికరాలు

క్లుప్తంగా...

'క్రియ'పిల్లల పండగ ప్రారంభం



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడకి చెందిన క్రియ స్వచ్ఛంద సంస్థ ఏటా నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండగ స్థానిక జేఎన్‌టీయూ(కే)లో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగ 11వ రాష్ట్ర స్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. తొలి రోజు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 4,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, డిబేట్, సైన్స్, కథా రచన వంటి 15 విభాగాల పోటీల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రియ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



బత్తలపల్లి: గోమాతను హిందువులు పవిత్రంగా పూజిస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో చెరుకూరి వెంగమనాయుడు దంపతులు(పోస్టల్ నాయుడు) తమ ఇంటిలో పెంచుకుంటున్న గోమాతకు సీమంతం నిర్వహించారు. ఏడు నెలల తొలిచూరి గర్భంతో ఉన్నటువంటి గోమాతను ఇంటి ఆడపడుచుగా భావించి ఘనంగా సీమంతం చేశారు. బంధువులు, స్నేహితుల సమక్షంలో వేదపండితులు మంజునాథశర్మచే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు నిర్వహించిన విధంగానే గోమాతకు కూడా పసుపు, కుంకుమ, పుష్పాలతో నూతన దుస్తులను సమర్పించారు. విచ్చేసిన అతిథులకు అన్నదానం చేశారు.

విశాఖ అభివృద్ధిపై ఢిల్లీ కేంద్రంగా కుట్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



పెందుర్తి: 'మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లేశారు. కానీ ఈ ఆరు నెలల్లో కూటమి అడుగులు సరిగా పడలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చాక అతని అసలు స్వరూపం బయటపడింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాల్సిందిగా కోరకుండా.. మిట్టల్ కడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు లైసెన్సులు ఇవ్వాలని అడగడం ఏంటి. మీరు మిట్టల్ కోసం గెలిచిన బ్రోకర్లా' అంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా మహాసభలు శనివారం విశాఖలోని సుజాతనగర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సుజాతనగర్‌లోని సభ ప్రాంగణం వరకు పార్టీ ముఖ్యనేతల సారథ్యంలో సీపీఎం భారీ ర్యాలీ చేపట్టింది. ఎర్రజెండాలు చేతబూని కవాతు నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిపై ఢిల్లీ కేంద్రంగా కుట్రలు జరుగుతున్నాయని.. దానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే వంత పాడుతున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్రకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రధాన నరేంద్రమోదీ గత పదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు.

నెలకు ఒక జిల్లాలో పవన్‌కళ్యాణ్ పర్యటన

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జనవరి నుంచి ప్రతినెల ఒక జిల్లాలో పర్యటించనున్నట్టు జనసేన పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సమస్యలు, ప్రజల స్థితిగతులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ఆయన ప్రత్యక్షంగా పరిశీలిస్తారని పేర్కొంది.

చిన్నారి పెళ్లికూతుళ్లు

విరిసీ విరియని.. తెలిసీ తెలియని వయస్సులోనే పసిమొగ్గలకు 'మాంగల్యం తంతునానేనా..' అంటున్నారు.. యుక్త వయస్సు రాకుండానే తాళిబొట్టు మెడలో వేయించేస్తున్నారు.. కొద్ది నెలలకే తల్లులవుతున్న ఆ అమ్మాయిలు రకరకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.. అవగాహనా రాహిత్యమో.. గుండెల మీద కుంపటి దింపేసుకోవాలనే అమాయకత్వమో తెలీదు కానీ.. రాజానగరం మండలంలోని పలు గ్రామాల్లో తరచుగా జరుగుతున్న బాల్య వివాహాలు కలవరపెడుతున్నాయి.



కలకలం రేపుతున్న బాల్య వివాహాలు | అమలుకు నోచని చట్టం | గ్రామ కమిటీల ప్రేక్షక పాత్ర

రాజానగరం: యుక్త వయస్సు రాకుండా బాల్య దశలోనే వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరం, అయినప్పటికీ వీటిని నిరోధించడంలో తరచూ అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలు, తీసుకుంటున్న చర్యలు ప్రకటనలకే పరిమితమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజానగరం మండలంలోని పలు గ్రామాల్లో తరచుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న బాల్య వివాహాలే దీనికి సాక్షిగా నిలుస్తున్నాయి. మండలంలోని భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, కొత్తతుంగపాడు, పాత తుంగపాడు తదితర గ్రామాల్లో తరచుగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. అవగాహన లేకనో.. ఓ పనైపోతుందనే ఉద్దేశమో కానీ.. యుక్త వయస్సు రాకుండానే కొంత మంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు వివాహాలు చేసి, అత్తారిళ్లకు పంపించేస్తున్నారు. వీటిని అరికట్టేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు.

గుట్టు చప్పుడు కాకుండా..

కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు దొడ్డ మణికంఠ, 16 సంవత్సరాల బాలిక పక్క పక్క ఇళ్లల్లో ఉంటున్నారు. వరుడు రోజువారీ పనులు చేస్తుండగా.. వధువును ఆమె తల్లిదండ్రులు 9వ తరగతి వరకూ చదివించి, మాన్పించేశారు. ఇంటి వద్దనే ఉంటున్న ఆ బాలికతో ఆ యువకుడికి ఏర్పడిన పరిచయం కాస్తా పెళ్లి వరకూ వెళ్లింది. వారి వివాహానికి బాలిక తల్లిదండ్రులు తొలుత అంగీకరించలేదు. అయితే, అతడు లేకపోతే తాను బతకలేనంటూ ఆ బాలిక తరచూ అతడి ఇంటికి వెళ్లి వస్తుండేది. ఈ నేపథ్యంలో ఇరువైపుల పెద్దలు అయిష్టంగానే వారిద్దరికీ గుట్టు చప్పుడు కాకుండా బుధవారం రాత్రి ముక్కినాడ గ్రామంలోని దేవాలయంలో సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. ఆపై వారిద్దరినీ తిరుపతి పంపించేశారు. అధికారులకు తెలియకుండా ఇరు వర్గాల పెద్దలు ఈ వివాహం జరిపించినా.. సంబంధిత వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాల్య వివాహం గుట్టు రట్టయింది.

గతంలోనూ..

- మండలంలోని పలు గ్రామాల్లో గతంలో కూడా ఇదేవిధంగా బాల్య వివాహాలు జరిగాయి.
- పుణ్యక్షేత్రం గ్రామంలో గత ఏడాది అధికారులను బురిడీ కొట్టించి మరీ ఇరు వర్గాల పెద్దలకు బాల్య వివాహం జరిపించేందుకు ప్రయత్నించారు. దీనిపై స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు వెంటనే పోలీసులతో కలిసి ఆ గ్రామానికి చేరుకుని, బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. యుక్త వయస్సు రాకుండా పిల్లలకు వివాహం చేయబోమంటూ పెద్దల నుంచి రాతపూర్వకంగా హామీ కూడా తీసుకున్నారు. అంతటితో తమ డ్యూటీ అయిపోయిందని సంబరపడుతూ వెనుదిరిగిన అధికారులు ఆ మర్నాడు అందుకున్న మరో సమాచారంతో షాకయ్యారు. రాతపూర్వక హామీ ఇచ్చిన పెద్దలే.. తమ పిల్లలను వేరొక ప్రాంతానికి తీసుకువెళ్లి, వివాహం చేశారని తెలిసి నిర్ఘాంతపోయారు.
- గడచిన నాలుగేళ్లలో భూపాలపట్నంలో 4, పుణ్యక్షేత్రంలో 6, కొత్త తుంగపాడులో 9, పాతతుంగపాడులో 6 బాల్య వివాహాలు జరిగినట్లు సమాచారం.



చట్టం ఏం చెబుతోందంటే..

బాల్య వివాహాలను అరికట్టేందుకు స్వాతంత్య్రం రాక ముందు నుంచే చట్టాలున్నాయి. మొదటిసారిగా 1929లో చైల్డ్ మ్యారేజ్ రిస్ట్రిక్ట్ యాక్ట్‌ను బ్రిటిష్ వారు తీసుకువచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్–2006 రూపొందించారు. దీని ప్రకారం 18 సంవత్సరాలలోపు అమ్మాయిలు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలను బాలల కిందే పరిగణిస్తారు. ఈ యాక్ట్ ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారి తల్లిదండ్రులతో పాటు ఆ సమయంలో అక్కడున్న వారు, వివాహ తంతు జరిపించే వారు (ప్రోత్సహించినట్టుగా భావిస్తారు) కూడా శిక్షార్హులే అవుతారు. వీరికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష వరకూ జరిమానా విధించవచ్చు. దీనిలో నేరస్తులైతే బెయిల్ కూడా లభించదు.



అధికారుల నిర్లక్ష్యమే కారణం



సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొత్తతుంగపాడులో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, గ్రామ కమిటీకి విషయం ముందుగా తెలిసినా కానీ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. బాల్య వివాహం జరుగుతున్న సమాచారాన్ని పై అధికారులకు సకాలంలో ఇవ్వడం లేదు. బుధవారం రాత్రి జరిగిన బాల్య వివాహం గురించి, తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశాను.

– యాళ్ల మాచరయ్య, కొత్తతుంగపాడు

ఫలితమివ్వని గ్రామ కమిటీలు



బాల్య వివాహాలను నిరోధించండి.. అమ్మాయిల జీవితాలను కాపాడండి.. అంటూ ఎంతగా ప్రచారం చేస్తున్నాగానీ, ప్రజల్లో సరైన స్పందన రావడం లేదు. వీటిని ఏవిధంగానైనా అరికట్టాలనే ఉద్దేశంతో గ్రామ మహిళా కార్యదర్శి (పోలీసు), ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, అంగన్‌వాడీ కార్యకర్తలతో గ్రామ కమిటీలు కూడా వేశాం. అయినప్పటికీ బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం ముందుగా అందడం లేదు. స్థానికంగా ఉండే మొహమాటాలతో తమ ప్రాంతంలో బాల్య వివాహం జరుగుతోందని తెలిసి కూడా చూసీ చూడనట్లు వదిలేసి, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు.

– టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, రాజానగరం

గ్లోబల్ వార్మింగ్‌కు చెక్



యూఎస్ కాన్సులేట్‌కు ప్రాజెక్టు వివరిస్తున్న విద్యార్థులు



యూఎస్ కాన్సులేట్ నుంచి బహుమతులు అందుకున్న విద్యార్థులు

గోబల్‌వార్మింగ్‌ను తగ్గించేలా పరిశోధన చేసిన విశాఖ విద్యార్థులు

- 'బ్లూ కార్బన్ ఎకో సిస్టం పయనీరింగ్' పరిశోధనకు దేశంలో తొలి స్థానం
- ఫెలోషిప్‌కు 10 రోజుల పాటు యూఎస్‌కు వెళ్లనున్న విద్యార్థులు

సీతంపేట: విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు ఆవిష్కరిస్తారని మరొకసారి రుజువైంది. విశాఖలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల లైఫ్ సైన్స్ విద్యార్థుల పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. డిగ్రీ స్థాయిలోనే అంతర్జాతీయ ప్రతిభ చాటారు బుల్లయ్య కళాశాల విద్యార్థులు. ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న గ్లోబల్‌వార్మింగ్‌కు విద్యార్థులు తమ పరిశోధన ద్వారా చక్కటి పరిష్కారం చూపారు. వాతావరణం వేడెక్కడానికి కారణం అవుతున్న కార్బన్ డయాక్సైడ్ శాతాన్ని వాతావరణంలో తగ్గించేలా తమ పరిశోధనతో పరిష్కారం చూపారు. కళాశాలలో బీఎస్సీ లైఫ్ సైన్స్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హర్షిత, తేజాంబిక్, కార్తికేయ, అశ్విని తమ పరిశోధనల్లో విజయం సాధించారు. విశాఖ సముద్ర తీరంలో సముద్రపు గడ్డి పచ్చిక భూములను పునరుద్ధించే 'బ్లూ కార్బన్ ఎకో సిస్టం పయనీరింగ్'అను అంశంపై పరిశోధన చేసారు. స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ ఛేంజ్ అవేర్‌నెస్ (ఎస్ఎస్‌సీసీఏ) , సీడ్స్ ఆఫ్ పీస్ (యూఎస్ఏ) సంస్థలు సంయుక్తంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీలో 33 టీమ్‌లు పాల్గొనగా, బుల్లయ్య కళాశాల విద్యార్థులు చేసిన పరిశోధనలకు క్లైమేట్ ట్యాంక్ యాక్సిలరేటర్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి వెయ్యి డాలర్ల బహుమతిగా గెలుపొందారు. ప్రాజెక్టు తదుపరి అధ్యయనాల కోసం విద్యార్థులను 2025 ఫిబ్రవరిలో10 రోజుల ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు యూఎస్ఏ వెళ్లనున్నారు.

పరిశోధన ఎలా సాగిందంటే..

హైదరాబాదుకు చెందిన ఎన్జీవో సంస్థ ఎస్ఎస్‌సీసీఏ, న్యూయార్క్ కు చెందిన సీడ్స్ పీస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి ఆరు అంశాలపై పరిశోధనలకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. బుల్లయ్య విద్యార్థులు గ్లోబల్‌వార్మింగ్ తగ్గించడానికి క్లైమేట్‌కి సంబంధించిన టాపిక్ ఎంపిక చేసుకున్నారు. ఈ విధంగా దేశంలో వివిధ కళాశాలల నుంచి 33 టీమ్స్ ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈపోటీలో బుల్లయ్య కళాశాల నుంచి 3 టీమ్స్ పాల్గొనగా, ఒక టీమ్‌లో డిగ్రీ (బయోటెక్నాలజీ) ఫైనలియర్ చదువుతున్న నలుగురు విద్యార్థులు , వారికి గైడెన్స్‌గా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఉన్నారు. మొదటి అంచెలో ఎంపిక చేసుకున్న టాపిక్‌పై పరిశోధన ఎలా చేలాయన్న విషయంపై ఓరియెంటేషన్ జరిగింది. రెండవ ఫేజ్‌లో ఎంపిక చేసిన టాపిక్‌పై డిస్క్రిప్టివ్ ఐడియాను సిద్ధం చేసారు. పరిశోధన నిమిత్తం సీడ్స్ సంస్థ 200 డాలర్లు అందజేసింది. మొదటి రెండు ఫేజ్‌లు పూర్తి అయిన తర్వాత పరిశోధనకు వాస్తవ రూపం కలిప్ంచారు. తాము ఎంపిక చేసుకున్న గ్లోబల్‌వార్మింగ్ తగ్గించడానికి విద్యార్థులు ఎన్నో పరిశోధన పత్రాలు చదవి ఒక ఐడియాకు వచ్చారు. విశాఖ సముద్రతీరంలో అంతరించిపోయిన 2 గడ్డి జాతిమొక్కలను మరల ఇక్కడ పునరుద్ధించి తద్వారా కార్బన్ డయాక్సైడ్ శాతాన్ని తగ్గించేలా నమూనాలు తయారు చేసారు. ఒరిస్సాలోని చిలికా సరస్సు నుంచి 'హాలోఫిలా ఓవాలిస్, హాలోడ్యూల్ ఫీనిఫోలియా'అను రెండు గడ్డి జాతి మొక్కలను తెచ్చారు. సాధారణ మొక్కల కంటే 33 శాతం అధికంగా వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ పీల్చుకోవడం వీటి ప్రత్యేకత. తెచ్చిన గడ్డి మొక్కలను కళాశాల ల్యాబ్‌లలో అవి పెరిగేలా సముద్ర వాతావరణం కల్పించారు. దీని కోసం చెక్కతో తయారు చేసిన ట్రేలలో కొబ్బరిపీచు, సముద్రపు నీరు,ఇసుక, గడ్డి ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. స్కూబా డ్రైవర్స్ సాయంతో తీరంలో మంగమారిపేట బీచ్‌లో 8 మీటర్ల లోతులో నాటారు.

వెయ్యి డాలర్లు బహుమతి

డిసెంబరు 12న హైదరాదులో జరిగిన సమావేశంలో విద్యార్థులు రూపొందించిన వర్కింగ్ మోడల్‌ను యూఎస్ కాన్సులేట్ నుంచి వచ్చిన జడ్జిలు పరిశీలించారు.ప్రాజెక్టు పని చేసే తీరును విద్యార్థులు వారికి ప్రెజెంట్ చేసారు. ఈపోటీలో పాల్గొన్న 33 టీమ్‌లలో తుది దశకు 8 టీమ్‌లు చేరుకోగా అందులో బుల్లయ్య కళాశాల టీమ్ మొదటి స్థానంలో నిలిచి వెయ్యి డాలర్లు బహుమతి గెలుచుకున్నారు.



రచయితల సంఘం పేరుతో భజన సమాజం

- విజయవాడలో రెండు రోజులపాటు ప్రపంచ తెలుగు రచయితల మహా సభలు
- కవులు, రచయితల నుంచి సభ్యత్వం పేరుతో వసూలు
- కనీసం సరైన భోజన వసతి కూడా కల్పించని నిర్వాహకులు
- వేదికలకు రామోజీరావు పేరు

సాక్షి, అమరావతి: భాషకు కులం ఉండదు. మతం ఉండదు. రాజకీయం పార్టీ అసలే లేదు. కానీ.. కొందరు పెద్ద మనుషులమనే ముసుగు వేసుకుని.. తెలుగు భాషకు తామే ఉద్ధారకులమనే ప్రచారం చేసుకుంటూ పాలకులకు కొమ్ము కాస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉంటే తమకు, తాము చెప్పిన వారికి మాత్రమే ప్రభుత్వ పురస్కారాలు వస్తుండటం వల్ల ఓ నలుగురు వ్యక్తులు తమ స్వామి భక్తిని చాటుకునేందుకు తెలుగు భాషను, రచయితలను వాడుకుంటున్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం కలిసి విజయవాడలో శని, ఆది వారాల్లో 2 రోజులపాటు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనే కవులు, రచయితల నుంచి సభ్యత్వం పేరుతో రూ.500 చొప్పున వసూలు చేశారు. సభకు 1,200 మంది హాజరవుతున్నట్టు నిర్వాహకులు చెప్పారు. నగదు చెల్లించిన వారికి మాత్రమే సభల్లో పాల్గొని తమ రచనలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారు. నగదు తీసుకునేది రచయితలకు భోజనం, శాలువా, మెమెంటో, ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకేనని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ.. కనీసం సరైన భోజనం కూడా కల్పించడం లేదు. ఉదయం అల్పాహారంతో సరిపెట్టారు. ఈ బాధ్యత కూడా టీడీపీ నేతకే అప్పగించడంతో ఆయన ఓ సంస్థ ద్వారా భోజనాలు పెట్టిస్తున్నారు. ఇక ఈ సంఘం గతంలో జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేసేది. ఒక్కో పురస్కారానికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ గ్రహీతల నుంచి నిర్వహకులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలనుకున్నప్పటికీ ఎందుకో చివరి నిమిషంలో విరమించుకున్నారు. ఈ సంఘాలు టీడీపీ భజన సమాజంగా మారాయి. సభల ప్రారంభం నుంచీ టీడీపీని, చంద్రబాబుని పొగడ్తలతో ముంచెత్తుతున్నాయి. కార్యక్రమం జరిగే ప్రధాన వేదికకు రామోజీరావు పేరు పెట్టాయి. ఈ చర్యలు సాహిత్యాభిమానులను విస్మయానికి గురిచేశాయి.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

యర్రగొండపాలెంలో రెండువర్గాలుగా చీలిన పార్టీ



త్రిపురాంతకం నుంచి తరలి వెళుతున్న వాహనాలు

త్రిపురాంతకం: టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఒక వర్గం వారికే పనులు చేస్తున్నారంటూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు ఆ పార్టీ నాయకులు అమరావతి తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తమ గోడు విన్నవించుకుని సముచిత న్యాయం చేయాలని అసమ్మతి నాయకులు మొరపెట్టుకున్నారు. త్రిపురాంతకం నుంచి 42 వాహనాల్లో 200 మందికి పైగా టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకుడు వర్ల రామయ్యలను కలిశారు. అధికారంలోకి వచ్చినా పార్టీని నమ్ముకున్న వారికి ఎలాంటి ప్రయోజనం లేదని వారు వాపోయారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఎరిక్షన్‌బాబు అత్యవసర సమయంలో కార్యకర్తలు, నాయకులు ఫోన్‌చేసినా పలకడం లేదన్నారు. తమ నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత లేకుండా ఇతరులకు పనులను కట్టబెట్టారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంకుల నిర్వహణ ఎరిక్షన్‌బాబు స్వంత ప్రాంతానికి చెందిన వారికి కేటాయించారని, పార్టీ వారిని విస్మరించారని ధ్వజమెత్తారు.



రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. శనివారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

బాలాజీ దర్శనానికి పోటెత్తిన భక్తులు


మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీ స్వామి దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జామున తొలి హారతి, మేలు కొలుపు సేవలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా గోదావరి నుంచి జలాలు తీసుకు వచ్చి గోదాదేవితో పాటు బాల బాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి సన్నిధిలో నిత్యం నిర్వహించే లక్ష్మీనారాయణ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2.12,910 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు 65,750 విరాళాలుగా అందించారన్నారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.39,780 ఆదాయం వచ్చిందన్నారు. 3,518 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,429 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.



ఆలస్యంగా ప్రాకార సేవ

అన్నవరం: ప్రతి శనివారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే సత్యదేవుని ప్రాకారసేవ ఈసారి గంట ఆలస్యంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పండితులు తిరుచ్చి వాహనంపై వేంచేయించి, పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులు ప్రాకార సేవ ప్రారంభించారు. ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రధానాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ధనుర్మాసం సందర్భంగా కొండ దిగువన స్వామి, అమ్మవార్లను ఊరేగించడంతో ప్రాకార సేవ ఆలస్యమైందని అధికారులు తెలిపారు.





3 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో జనవరిర 3వ తేదీ నుంచి పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి మొదలు కావాల్సిన పరీక్షలను 3వ తేదీకి వాయిదా వేశామని, దీనిపై అన్ని కళాశాలల యాజమాన్యాలకు సమాచారం సైతం అందించినట్లు వెల్లడించారు.

స్టూడెంట్ కిట్స్ కోసం రూ. 953.71 కోట్లతో టెండర్లు

సాక్షి, అమరావతి: 2025–26 విద్యాసంవత్సరానికిగాను స్టూడెంట్ కిట్స్ తయారీ కోసం ఈ ఏడాది ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర సర్వశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్న ఈ కిట్‌లలో నోట్ బుక్స్, బెల్టు, బూట్లు ,బ్యాగు ,డిక్షనరీ, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు, 3జతల యూనిఫామ్ క్లాత్ ఉంటాయన్నారు. ఈ కిట్స్ తయారీకి రూ.953.71 కోట్లకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల సైజుకు తగ్గ బూట్లు తయారీ కోసం జనవరి 5 లోగా విద్యార్థుల పాదాల కొలతలు తీసుకుని విద్యార్థి మిత్ర యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు.

నాణ్యత పెంచాలి: ఏపీటీఎఫ్ అమరావతి

విద్యార్థులకు ఇచ్చే బ్యాగు, బూట్ల నాణ్యత పెంచి స్టూడెంట్ కిట్స్ తయారీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు. కొలతలు తీసుకున్నప్పటికీ కొంతమంది విద్యార్థులకు బూట్లు సరిపోవడంలేదన్నారు. యూనిఫామ్ కుట్టుకూలీ మార్కెట్ ధరను అనుసరించి పెంచాలని, సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.

వెటర్నరీలో 'యూత్ పార్లమెంట్'



తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువ మంథన్ యూత్ పార్లమెంట్ అండ్ యూఎన్ఓ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా దేశ ఆర్థిక వ్యవస్థలో పశువైద్యం, వ్యాధి నివారణ, మౌలిక అవసరాల ప్రాముఖ్యత, గ్లోబలైజేషన్‌లో పశువైద్య పాత్రపై సుదీర్ఘంగా విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, డాక్టర్ వేణు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

Gold Memories



అహా! నా పెళ్ళంట!

కథలో పిసినారితనం... కలెక్షన్లు ఫుల్లు



అహా! నా పెళ్ళంట! హాస్యబ్రహ్మ జంధ్యాల దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్ 1987లో నిర్మించిందీ చిత్రాన్ని. పిసినారితనాన్ని ఆధారంగా చేసుకుని హాస్యాన్ని సృష్టించిన ఈ సినిమా పూర్తి స్థాయి కామెడీ సినిమాల విషయంలో టాలీవుడ్‌లో ఓ చరిత్ర సృష్టించింది. మొదట్నుంచి చివరి వరకూ హాస్యాన్ని పండించిన ఈ సినిమా సంచలన విజయాన్ని నమోదు చేసింది. అప్పుడప్పుడే హీరోగా ఎదుగుతున్న రాజేంద్ర ప్రసాద్ ఇందులో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఆయన సినీ కెరీర్‌లో 'అహా! నా పెళ్ళంట!' ఓ మైలురాయిగా నిలిచింది. ఈ సినిమాతో రాజేంద్రప్రసాద్‌కు వెనుతిరిగి చూసుకునే పరిస్థితి రాలేదంటే అతిశయోక్తి కాదేమో. కోట శ్రీనివాసరావు పిసినారిగా కీలకమైన పాత్ర పోషించారు. హీరోయిన్‌గా రజని, ఇంకా నూతన్ ప్రసాద్, రాళ్ళపల్లి వంటి సీనియర్ నటులు ముఖ్యమైన పాత్రలు పోషించారు.

పిసినారులకే పిసినారి

సినిమాలో గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన హీరో రాజేంద్రప్రసాద్. తాను ప్రేమించిన అమ్మాయి కోసం పరమ పిసినారిగా నటించాల్సి వస్తుంది. హీరోయిన్ రజని తండ్రి కోట శ్రీనివాస రావు పిసినారులకే పిసినారి. అటువంటి వ్యక్తిని మెప్పించి అతని కూతుర్ని పెళ్లి చేసుకునేందుకు పిసినారిగా మారిన రాజేంద్ర ప్రసాద్ పడే పాట్లు కడుపుబ్బా నవ్విస్తాయి. అందులో భాగంగా హీరో తాను ఇంకా వెయ్యి రెట్లు పిసినారినని నిరూపించుకోడానికి నానా తంటాలు పడుతుంటాడు. అలా కొంత కాలానికి హీరో ఆ పిసినారి మామకు బాగా దగ్గరవుతాడు. ఇదే సమయంలో.. తన కొడుకు పిసినారి కూతుర్ని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని హీరో తండ్రి నూతన్ ప్రసాద్ కూడా ఆ ఊరొచ్చి ఆ ఇంట్లోనే దిగి తన కొడుకు ప్లాన్లను చెడగొట్టే ప్రయత్నాలు చేస్తుంటాడు. దీంతో ఆరంభం నుంచి ముగింపు వరకూ పగలబడి నవ్విస్తాడు డైరెక్టర్. చివరికి పిసినారి భార్య, కూతురు కలసి తిరగబడి కోటకు బుద్ధి చెప్పి ఈ పెళ్ళికి ఒప్పిస్తారు.

కళ్ళజోడుని రాయితో కొట్టి మరీ...


'అహా! నా పెళ్ళంట!' సినిమా కథను ప్రముఖ కథా రచయిత ఆది విష్ణు రాసిన 'సత్యం గారి ఇల్లు' నవల ఆధారంగా అభివృద్ధి చేశారు. ఇక కాస్టింగ్ విషయానికొస్తే... కథలో కీలకమైన పాత్ర పిసినారి, హీరోయిన్ తండ్రి లక్ష్మీపతిది. ఈ పాత్రను తొలుత రావు గోపాల రావు పోషిస్తే బావుంటుందని భావించారు. కానీ పాత్ర స్వభావం ప్రకారం ఆయన ఎంపిక సరి కాదని ఎవరో సూచిస్తే ఆయన్ను కాదనుకుని కోట శ్రీనివాసరావును అనుకున్నారు. అప్పటికి కేవలం రెండంటే రెండే సినిమాల్లో నటించిన కోటను ఈ పాత్రకు తీసుకున్నారు. అందుకు తగ్గట్టే కోట అద్భుతమైన నటనతో కట్టిపడేశారు. రాజేంద్రప్రసాద్, కోట శ్రీనివాసరావులు పోటీ పడి నటించారు. లక్ష్మీపతి పాత్ర కోసం కోట తన జుట్టు చాలా వరకూ తీసేయించుకుని చిన్న తలకట్టుతో క్రాఫ్ చేయించుకోవాలి. అప్పటికే మరికొన్ని సినిమాల్లో నటిస్తుండడంతో ఈ సినిమాలోని పాత్ర ప్రాధాన్యత, విశిష్టత దృష్ట్యా దీన్ని వదులుకోలేక విగ్గు పెట్టుకుని నటిస్తానని ఇతర సినిమాల దర్శక-నిర్మాతలను ఒప్పించి మరీ 'అహా! నా పెళ్ళంట!'లో ఆ పాత్ర చేశారు. ముతక పంచె, చిరిగిన బనీను, పగిలిన కళ్ళద్దాలతో కనిపించే ఈ రోల్ ఆహార్యాన్ని జంధ్యాలే స్వయంగా తీర్చిదిద్దారు. పంచె, బట్టలు మాసిపోయి ఉండాలని, పనిగట్టుకుని దుమ్ములో దొర్లించి మరీ ఇచ్చేవారట. కళ్ళజోడు మామూలుదే తెప్పించి తర్వాత జంధ్యాల రాయిపెట్టి పగలగొట్టి మరీ పగిలిన కళ్ళద్దాలతో నటింపజేశారు.

అరగుండు బ్రహ్మానందంగా...

బ్రహ్మానందంకు ఈ సినిమాతో అరగుండు బ్రహ్మానందంగా బాగా పేరు వచ్చింది. తన జీతాన్ని కోసేసినప్పుడల్లా ఆయన కోట శ్రీనివాస రావును తిట్టే తిట్లు కడుపుబ్బా నవ్విస్తాయి. ఈ సినిమాను హైదరాబాద్, దేవర, యామిజాల గ్రామాల్లో తీశారు. ఈ గ్రామాల్లో ఉన్న కొన్ని ఇళ్ళలో వేరే సెట్లు వెయ్యకుండానే తియ్యడం ఈ సినిమా మరో ప్రత్యేకత. దాదాపు రూ. 16 లక్షలతో రూపొందిన ఈ చిత్రం దాదాపు రూ. 5 కోట్లు వసూలు సాధించడం విశేషం. సినిమా కథలో 'పిసినారితనం' కీలకం... కానీ కలెక్షన్ల విషయంలో ప్రేక్షకులు చాలా ధారాళం చూపించారు. ఈ స్థాయి పిసినారితనం ఉన్న సినిమాలు 'అహా! నా పెళ్ళంట!' తర్వాత ఇప్పటివరకూ రాలేదనే చెప్పాలి. భవిష్యత్తులో వస్తాయా? అంటే ప్రశ్నార్థకమే.

– దాచేపల్లి సురేష్‌కుమార్





సల్మాన్ ఖాన్

యాక్షన్ సికందర్

ప్రత్యర్థులకు గన్స్‌తోనే సమాధానం చెబుతున్నాడు సికందర్. సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'సికందర్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్యరాజ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. కాగా శుక్రవారం (డిసెంబరు 27) సల్మాన్ ఖాన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'సికందర్' సినిమా టీజర్‌ను విడుదల చేయాలనుకున్నారు. కానీ డిసెంబరు 26 రాత్రి భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి చెందారు. దీంతో 'సికందర్' సినిమా టీజర్‌ను డిసెంబరు 28న విడుదల చేసింది యూనిట్. ఓ యాక్షన్ సన్నివేశంతో 'సికందర్' సినిమా టీజర్ విడుదలైంది. తనపై దాడి చేయడానికి వచ్చిన ప్రత్యర్థులపై సికందర్ ఎదురు దాడి చేసినట్లుగా టీజర్‌లో తెలుస్తోంది. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ కానుంది.

గోదారి గట్టు మీద సరికొత్త రికార్డు

వెంకటేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. కాగా ఈ మూవీ నుంచి విడుదలైన తొలి పాట 'గోదారి గట్టు మీద రామ సిలకవే...' ఫాస్టెస్ట్ 50 మిలియన్ వ్యూస్‌తో సరికొత్త రికార్డు సృష్టించినట్లు ప్రకటించారు మేకర్స్. ''గోదారి గట్టు మీద రామ సిలకవే... గోరింటాకు ఎట్టుకున్న నందమామవే...' అంటూ సాగే ఈ పాటని రమణ గోగుల, మధు ప్రియ అద్భుతంగా పాడారు. భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యంతో మెస్మరైజింగ్ మెలోడీగా ఈ సాంగ్ నిలిచింది. సినిమాలో భార్యాభర్తలుగా నటించిన వెంకటేశ్, ఐశ్వర్యా రాజేశ్‌ల మధ్య అందమైన కెమిస్ట్రీని చూపించే పాట ఇది. వెంకటేశ్‌గారి కెరీర్‌లో ఫాస్టెస్ట్ రికార్డ్ సాధించింది. సీనియర్ హీరోల్లో కేవలం 3 వారాల్లోనే 50 మిలియన్ వ్యూస్‌ను రీచ్ అయిన ఫాస్టెస్ట్ సాంగ్‌గా నిలిచింది. వెంకటేశ్ స్వయంగా పాడిన మూడో పాటని ఈ నెల 30న విడుదల చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. రాజేంద్రప్రసాద్, సాయికుమార్, వీకే నరేశ్, ఉపేంద్ర లిమాయే తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.



వెంకటేశ్, ఐశ్వర్యా రాజేశ్



ఖుషీ కపూర్

ప్రేమికుల దినోత్సవానికి...



జునైద్ ఖాన్

ఆమిర్ ఖాన్-రీనా దత్తాల తనయుడు జునైద్ ఖాన్, బోనీ కపూర్-శ్రీదేవిల రెండో కుమార్తె ఖుషీ కపూర్ సిల్వర్ స్క్రీన్ కోసం ప్రేమలో పడ్డారు. ఈ ఇద్దరూ జంటగా రానున్న రొమాంటిక్ కామెడీ మూవీ టైటిల్‌ని అధికారికంగా ప్రకటించారు. 'లవ్‌యాపా' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి అద్వైత్ చందన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్యాంథమ్ స్టూడియోస్, ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఈ చిత్రం రూపొందుతోంది. లవ్‌యాపా' ప్రేమకథా చిత్రం కావడంతో ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) టార్గెట్‌గా ఈ సినిమా విడుదలను ప్లాన్ చేశారు. ఓ వారం రోజుల ముందే... అంటే ఫిబ్రవరి 7న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. ప్రేమ... ఇష్టం... ఈ రెండింటి మధ్యలో ఉండే భావోద్వేగాల సమాహారంతో ఈ చిత్రం రూపొందుతోందని సమాచారం. ఇదిలా ఉంటే జునైద్, ఖుషీ... ఈ ఇద్దరికీ ఇది రెండో చిత్రం. 'మహారాజా' చిత్రం ద్వారా జునైద్ ఈ ఏడాది పరిచయం కాగా... గత ఏడాది నటించిన 'ది ఆర్చీస్' చిత్రంతో ఖుషీ పరిచయం అయ్యారు. అయితే ఈ రెండు చిత్రాలూ ఓటీటీ వేదికగా విడుదలయ్యాయి.



త్రిష, అజిత్

యాక్షన్ ఎంటర్‌టైనర్

అజిత్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'విడాముయర్చి'. మగిళ్ తిరుమేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించగా, అర్జున్ ప్రధాన పాత్ర పోషించారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జీకేఎం తమిళ్ కుమరన్ నేతృత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాగా ఈ మూవీ నుంచి 'సవదీక..' అంటూ సాగే ఫాస్ట్ బీట్ ఎనర్జిటిక్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటను అరివు రాయగా, ఆంథోని దాసన్ పాడారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'విడాముయర్చి'. అజిత్, త్రిషలపై వచ్చే ఈ పాట ఎనర్జిటిక్‌గా సాగుతుంది. ఇటీవల విడుదలైన మా సినిమా టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో మా మూవీపై అంచనాలు మరింతగా పెరిగాయి'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఆరవ్, రెజీనా కసండ్రా, నిఖిల్ నాయర్ ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమేరా: ఓం ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుబ్రమణియన్ నారాయణన్.

గోల్డెన్ స్టార్ కొత్త చిత్రం



గణేశ్

'కార్తికేయ 2, వెంకీ మామ, ఓ బేబీ, ధమాకా' వంటి చిత్రాలను తెలుగు ఇండస్ట్రీకి అందించిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కన్నడ మూవీకి శ్రీకారం చుట్టింది. గోల్డెన్ స్టార్ గణేశ్ హీరోగా కన్నడలో ఓ సినిమా చేయనున్నట్లు ప్రకటించారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. 'పీఎమ్ఎఫ్ 49' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ రూపొందనుంది. ఈ చిత్రం ద్వారా ప్రముఖ కొరియోగ్రాఫర్ బి. ధనంజయ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ''హై క్వాలిటీ స్టోరీ టెల్లింగ్, అత్యాధునిక నిర్మాణం ద్వారా కన్నడ సినిమాను మరో లెవల్‌కి తీసుకువెళ్లడానికి అంకిత భావంతో ఉన్నాం. గోల్డెన్ స్టార్ గణేశ్‌తో మేము నిర్మించబోయే సినిమా యూనిక్ అండ్ లార్జర్ దెన్ లైఫ్ స్టోరీగా ఉంటుంది. ఈ సినిమా టైటిల్, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

మహిళలకు టికెట్లు ఉచితం

– ధర్మ



ధర్మ, ఐశ్వర్యా శర్మ

''మా 'డ్రింకర్ సాయి' చిత్రం మహిళలకు, ఫ్యామిలీస్‌కు నచ్చడం సంతోషంగా ఉంది. సినిమాని హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నాకు ఈ మూవీలో హీరోగా చేసే అవకాశం ఇచ్చిన మా ముగ్గురు నిర్మాతలకు థ్యాంక్స్... వాళ్లను జీవితంలో మరచిపోను. ఈ సినిమాతో యువతని చెడగొట్టలేదు అనే పేరొచ్చింది... అది చాలు. మా మూవీని ఆదరిస్తున్న మహిళా ప్రేక్షకుల కోసం టికెట్లను ఉచితంగా ఇవ్వబోతున్నా'' అని హీరో ధర్మ అన్నారు. కిరణ్ తిరుమల శెట్టి దర్శకత్వంలో ధర్మ, ఐశ్వర్యా శర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల అయింది. శనివారం నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో కిరణ్ తిరుమల శెట్టి మాట్లాడుతూ– ''మా చిత్రాన్ని సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ప్రేక్షకుల నుంచే రివ్యూస్ తీసుకోబోతున్నాం. ఈ కాంటెస్ట్‌లో ఎంపికైన వారికి డ్రింకర్ సాయి ఈ నెల 31న మంచి పార్టీ ఇస్తాడు'' అని చెప్పారు. ''తొలి ప్రయత్నంగా ఒక మంచి సందేశాత్మక సినిమా చేశామనే సంతృప్తి ఉంది'' అన్నారు బసవరాజు శ్రీనివాస్. ''యువతతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా మా సినిమా బాగుందని చెప్పడం సంతోషంగా ఉంది'' అని బసవరాజు లహరీధర్, ఇస్మాయిల్ షేక్ చెప్పారు. ''ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్నీ మా మూవీలో ఉన్నాయి. ఇంకా మూవీ చూడని వారు వెంటనే వెళ్లి చూడాలి'' అని ఐశ్వర్యా శర్మ తెలిపారు. ఈ సక్సెస్‌మీట్‌లో కెమేరామేన్ ప్రశాంత్ అంకిరెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీవసంత్, డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, నటుడు రాజేశ్ వుల్లి మాట్లాడారు.

నా ముద్దు పేరు స్వాతి రెడ్డి!

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా నటిస్తున్న తాజా చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 2023లో విడుదలై ఘన విజయం సాధించిన 'మ్యాడ్' సినిమాకి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రూపొందుతోంది. 2025 ఫిబ్రవరి 26న ఈ సినిమా విడుదలకానుంది. తొలి భాగానికి సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో ద్వితీయ భాగానికి కూడా స్వరాలు అందించారు. ఈ మూవీ నుంచి 'స్వాతి రెడ్డి...' పాటని శనివారం రిలీజ్ చేశారు మేకర్స్. సురేష్ గంగుల సాహిత్యం అందించిన ఈ పాటని స్వాతి రెడ్డితో కలిసి ఆలపించారు భీమ్స్. 'నా ముద్దుపేరు పెట్టుకున్న స్వాతి రెడ్డి.. నే ముట్టుకుంటే భగ్గుమంది పచ్చ ఎండుగడ్డి..' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటలో రెబా మోనికాతో కలిసి సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హుషారైన స్టెప్పులు వేశారు. ''మ్యాడ్' ని మించి 'మ్యాడ్ స్క్వేర్'తో వినోదాలు పంచడానికి సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ వస్తున్నారు. ఈ మూవీ గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్‌దత్.



నార్నే నితిన్, రామ్ నితిన్, రెబా మోనికా, సంగీత్ శోభన్

బిజినెస్ రీల్

రిలయన్స్ చేతికి కార్కినోస్..



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ కార్కినోస్ హెల్త్‌కేర్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువ రూ.375 కోట్లు. కార్కినోస్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ కంపెనీ రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ (ఆర్‌ఎస్‌బీవీఎల్) దక్కించుకుంది. కార్కినోస్ 2020లో ప్రారంభం అయింది. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నిర్ధారణ చేయడం, వ్యాధి నిర్వహణ కోసం సాంకేతికతతో కూడిన వినూత్న పరిష్కారాలను అందిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.22 కోట్ల టర్నోవర్‌ను ఆర్జించింది. కంపెనీ 2023 డిసెంబర్ వరకు దాదాపు 60 ఆసుపత్రులతో భాగస్వామ్యం కలిగి ఉంది. అనుబంధ కంపెనీ ద్వారా మణిపూర్‌లోని ఇంఫాల్‌లో 150 పడకల మల్టీస్పెషాలిటీ క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తోంది. కార్కినోస్ దివాళా పరిష్కార ప్రణాళికకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై బెంచ్ ఆమోదించింది. ఆర్‌ఎస్‌బీవీఎల్ సమర్పించిన పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదించినట్టు డిసెంబర్ 10న రిలయన్స్ ప్రకటించింది.

పబ్లిక్ ఇష్యూకు క్రెడిలా

Credila
The Education Loan Specialist

న్యూఢిల్లీ: విద్యా రుణాల సంస్థ క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్ (గతంలో హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్) ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా కాన్ఫిడెన్షియల్ ఫైలింగ్ పద్ధతిలో సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించింది. ఈ కంపెనీలో ఈక్వ్యాటీ, క్రిస్‌క్యాపిటల్‌లతో కూడిన ప్రైవేటు ఈక్విటీ కన్సార్షియం 90.01 శాతం వాటాను రూ.9,060 కోట్లకు 2023-24లో కైవసం చేసుకుంది. క్రెడిలా ఫైనాన్షియల్‌ను రూ.10,350 కోట్లుగా విలువ కట్టారు. కంపెనీలో 2024 మార్చి 31 నాటికి ఈక్వ్యాటీకి 72.01 శాతం, క్రిస్‌క్యాపిటల్ 18, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 9.99 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. దేశ, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు క్రెడిలా ఫైనాన్షియల్ విద్యా రుణాలను అందిస్తోంది. ఇప్పటివరకు 1.24 లక్షల మందికి రుణాలను మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,771 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

రామ్‌కీ ఇన్‌ఫ్రాకు రూ.215 కోట్ల కాంట్రాక్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగంలో ఉన్న హైదరాబాద్ సంస్థ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.215 కోట్ల కాంట్రాక్ట్ దక్కించుకుంది. హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ నుంచి దీనిని చేజిక్కించుకున్నట్టు కంపెనీ ఎండీ వై.ఆర్.నాగరాజ తెలిపారు. ఇందులో భాగంగా 20 మురుగునీటి నిర్వహణ ప్లాంట్ల కార్యకలాపాలు, నిర్వహణ సేవలను అయిదేళ్లపాటు రామ్‌కీ నిర్వహించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ ప్లాంట్ల విస్తరణ

- రూ.58 కోట్లు వెచ్చిస్తున్న కంపెనీ
- రెండింతలు కానున్న త్రీవీలర్ల ఉత్పత్తి
- తమిళనాడులో బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ లైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహనాల తయారీలో ఉన్న గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ, ఉత్తరప్రదేశ్ ప్లాంట్లలో త్రీ-వీలర్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని నిర్ణయించింది. ఆంపియర్, ఈలీ, గ్రీవ్స్, ఈల్ట్రా బ్రాండ్స్‌లో ఎలక్ట్రిక్, ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) వాహనాలను విక్రయిస్తున్న ఈ సంస్థకు తెలంగాణలోని తూప్రాన్, ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా, తమిళనాడులోని రాణిపేట్ వద్ద తయారీ కేంద్రాలు ఉన్నాయి. గ్రేటర్ నోయిడా ప్లాంట్‌లో త్రిచక్ర వాహనాల తయారీ సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 21,514 యూనిట్ల నుంచి 45,896 యూనిట్లకు, తూప్రాన్ ప్లాంట్‌లో 13,538 నుంచి 34,800 యూనిట్లకు పెంచాలని కంపెనీ యోచిస్తోంది. 'విస్తరిస్తున్న మార్కెట్‌కు అనుగుణంగా అదనంగా ఉత్పత్తి చేయడానికి, అలాగే కొత్త మోడళ్ల తయారీని కూడా ఈ విస్తరణ అనుమతిస్తుంది' అని కంపెనీ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది.

ఐపీవో ద్వారా వచ్చే నిధులతో..

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ గ్రేటర్ నోయిడాలో ఫెసిలిటీ విస్తరణ కోసం రూ.20 కోట్లు, తూప్రాన్ ప్లాంటుకు రూ.38 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ప్రతిపాదిత ఐపీవో ద్వారా వచ్చే నికర ఆదాయం నుండి ఈ పెట్టుబడులకు నిధులు సమకూర్చనున్నారు. రాణిపేట్ ప్లాంట్‌లో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను, గ్రేటర్ నోయిడా కేంద్రంలో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లను, తూప్రాన్ ఫెసిలిటీలో ఎలక్ట్రిక్‌తోపాటు ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ త్రీ-వీలర్లను సంస్థ తయారు చేస్తోంది. గ్రీవ్స్ ఎలక్ట్రిక్ అనుబంధ సంస్థలు బెస్ట్‌వే ఏజెన్సీస్ గ్రేటర్ నోయిడా కేంద్రాన్ని, ఎంఎల్ఆర్ ఆటో తూప్రాన్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం వార్షికంగా 4.80 లక్షల ద్విచక్ర వాహనాల సామర్థ్యం కలిగిన రాణిపేట ప్లాంట్‌లో తయారీ సామర్థ్యాన్ని పెంచే ఆలోచనలో కంపెనీకి ప్రస్తుతానికి లేదు.

త్రీ-వీలర్ల వాటా 28 శాతం..

2023-24లో గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొత్తం ఆదాయంలో త్రీ-వీలర్ల వాటా 28 శాతం కైవసం చేసుకుంది. సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో 13,470 యూనిట్ల త్రిచక్ర వాహనాలను విక్రయించింది. 2022-23లో ఈ సంఖ్య 6,870 యూనిట్లు. ఆంపియర్ బ్రాండ్ క్రింద ఎలక్ట్రిక్ టూ-వీలర్ వ్యాపారం దాదాపు 68 శాతం వాటాతో ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ఆంపియర్ ద్విచక్ర వాహనాల అమ్మకాల పరిమాణం 2022-23లో 1.09 లక్షల యూనిట్ల నుంచి గత ఆర్థిక సంవత్సరంలో 47,820 యూనిట్లకు పడిపోయాయి. బెంగళూరుకు చెందిన గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్ అనుబంధ కంపెనీయే గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.

బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ లైన్..

రాణిపేటలో గ్రీవ్స్ ఎలక్ట్రిక్ బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనుంది. ఇది 4,00,000 యూనిట్ల వార్షిక స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రతిపాదిత నూతన కేంద్రాన్ని 2026 మే నెలలో ప్రారంభించనున్నారు. 2026 జూలైలో వాణిజ్యపరంగా ఉత్పత్తి కార్యకలాపాలను మొదలు పెట్టాలని గ్రీవ్స్ ఎలక్ట్రిక్ భావిస్తోంది. ఈల్ట్రా బ్రాండ్ పోర్ట్‌ఫోలియో ప్రస్తుతం రూ.3.80 లక్షల నుండి ప్రారంభం. ప్యాసింజర్స్ లేదా వస్తువులను రవాణా చేయగల రెండు మీడియం స్పీడ్ త్రీ-వీలర్ మోడళ్లను విక్రయిస్తోంది. డీజిల్, సీఎన్‌జీ త్రీ-వీలర్లు గ్రీవ్స్ బ్రాండ్ ద్వారా రూ.2.90 లక్షల ప్రారంభ ధరకు విక్రయిస్తున్నారు. ఈ బ్రాండ్ కింద నాలుగు మోడళ్లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ రిక్షా బ్రాండ్ ఈలీ కింద మూడు మోడళ్లు కొలువుదీరాయి. ధరల శ్రేణి రూ.1.30 లక్షల నుండి ప్రారంభం.

సుజుకీ యాక్సెస్ 125 రికార్డు



- 60 లక్షల స్కూటర్ల తయారీ
- తొలిసారిగా 2006లో ఎంట్రీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా సరికొత్త రికార్డు సాధించింది. సుజుకీ యాక్సెస్ 125 మోడల్‌లో కంపెనీ 60 లక్షల స్కూటర్ల తయారీ మార్కును దాటింది. ఈ ఘనతను సాధించడానికి సంస్థకు 18 ఏళ్లు పట్టింది. సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా నుంచి అత్యధికంగా అమ్ముడు అవుతున్న మోడల్ కూడా ఇదే. దీర్ఘకాలిక మన్నిక, మెరుగైన పనితీరు, మైలేజీ, నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉండడంతో యాక్సెస్ 125 స్కూటర్‌కు కస్టమర్ల నుంచి దేశ విదేశాల్లో మంచి స్పందన ఉంది. భారత్‌తోపాటు అంతర్జాతీయంగా కస్టమర్ల నమ్మకానికి ఈ గణాంకాలే నిదర్శనమని కంపెనీ ఎండీ కెనిచి ఉమెద తెలిపారు. యాక్సెస్ 125 తొలిసారిగా భారత్‌లో 2006లో అడుగుపెట్టింది. భారత రోడ్లపై 125 సీసీ ఇంజన్ సామర్థ్యంతో పరుగెత్తిన తొలి స్కూటర్ కూడా ఇదే కావడం విశేషం.

మూడవ స్థానంలో కంపెనీ..

దేశవ్యాప్తంగా 2024 ఏప్రిల్-నవంబర్ మధ్య వివిధ కంపెనీలకు చెందిన 47,87,080 స్కూటర్లు రోడ్డెక్కాయి. ఇందులో సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా 14 శాతం వాటాతో మూడవ స్థానంలో ఉంది. గతేడాదితో పోలిస్తే 2024 ఏప్రిల్-నవంబర్‌లో కంపెనీ 18 శాతం దూసుకెళ్లి 6,84,898 యూనిట్ల స్కూటర్ల అమ్మకాలను సాధించింది. సుజుకీ ఎకో పెర్ఫార్మెన్స్ టెక్నాలజీతో 125 సీసీ ఎయిర్‌కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజన్‌తో ఇది రూపుదిద్దుకుంది. 5,500 ఆర్‌పీఎం వద్ద 10 ఎన్ఎం గరిష్ట టార్క్ అందిస్తుంది. బ్లూటూత్ ఆధారిత డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ ఏర్పాటు చేశారు. కాల్స్, ఎస్ఎంఎస్, వాట్సాప్ అలర్ట్స్, మిస్డ్ కాల్ అలర్ట్స్ అందుకోవచ్చు. స్పీడ్ వార్నింగ్, ఫోన్ బ్యాటరీ లెవెల్ డిస్‌ప్లే, గమ్యస్థానానికి చేరుకునే సమయం వంటివి తెలుసుకోవచ్చు. 22.3 లీటర్ల స్టోరేజ్, ఈజీ స్టార్ట్ కీ సిస్టమ్, పొడవైన సీటు వంటివి అదనపు హంగులు.

హీరో ఎలక్ట్రిక్‌పై దివాలా చర్యలు

ఎన్‌సీఎల్‌టీ ఢిల్లీ బెంచ్ ఆదేశాలు

న్యూఢిల్లీ: హీరో ఎలక్ట్రిక్ పై దివాలా చర్యలకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), ఢిల్లీ బెంచ్ ఆదేశించింది. మెట్రో టైర్స్ అనే ఆపరేషనల్ క్రెడిటర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ట్రిబ్యునల్ తాజా చర్య తీసుకుంది. హీరో ఎలక్ట్రిక్ రూ. 1.85 కోట్లు బకాయి పడినట్లు మెట్రో టైర్స్ తన పిటిషన్‌లో పేర్కొంది.

దివాల ప్రక్రియ ప్రకారం, హీరో ఎలక్ట్రిక్ బోర్డును సస్పెండ్ చేసి భూపేష్ గుప్తాను మధ్యంతర పరిష్కార అధికారి (ఐఆర్‌పీ)గా ఎన్‌సీఎల్‌టీ నియమించింది. దివాలా ప్రక్రియ కింద కంపెనీపై ఇతర కోర్టులు, ట్రిబ్యునల్స్ లేదా ఆర్బిట్రేషన్ ప్యానెల్స్ నుండి ఆదేశాలను నిలిపి వేయాలని ఆదేశించిన ఎన్‌సీఎల్‌టీ, ఈ కంపెనీ ఆస్తులను బదిలీ చేయడం, నిలిపివేయడం, విక్రయించడం లేదా ఏ విధమైన మార్పులు చేయడం పై నిషేధాన్ని విధించింది.



హీరో ఎలక్ట్రిక్ అభ్యంతరాల తిరస్కరణ

మెట్రో టైర్స్‌తో తన వివాదం ''లిమిటేషన్‌లోలేని గత ఎంతో కాలానికి సంబంధించినదని'' హీరో ఎలక్ట్రిక్ చేసిన వాదనను ఎన్‌సీఎల్‌టీ తిరస్కరించింది. దివాలా పరిష్కార చట్టాల ప్రకారం, ఇలాంటి వాదన న్యాయ సమ్మతమైనది కాదని స్పష్టం చేసింది. టైర్లు, ట్యూబులు సరఫరా చేసిన మెట్రో టైర్స్‌తో ఉన్న బకాయిల పరిష్కారానికి హీరో ఎలక్ట్రిక్ గత తొమ్మిది నెలలుగా ఎటువంటి చర్చలూ జరప లేదని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది.

వివాద నేపథ్యం

తాను సరఫరా చేసిన టైర్లు, ట్యూబులకు సంబంధించి రూ.1.85 కోట్ల బకాయిల కోసం మెట్రో టైర్స్ 2022 ఆగస్ట్ 9 నుండి డిసెంబర్ 3 మధ్య హీరో ఎలక్ట్రిక్‌కు పలు డిమాండ్ నోటీసులు పంపింది. అయితే సరఫరా నాణ్యత వల్ల దీనిపై స్పందించదలేదన్నది హీరో ఎలక్ట్రిక్ వాదన. కాగా, సరఫరా నాణ్యతపై మెట్రో టైర్స్ వద్ద హీరో ఎలక్ట్రిక్ నుండి అసలు ఎటువంటి వివాదం లేవనెత్తలేదని నిర్ధారణ అయినట్లు ఎన్‌సీఎల్‌టీ బెంచ్ పేర్కొంది. బ్యాలెన్స్ కన్ఫర్మేషన్ లెటర్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నట్లు పేర్కొంది. పైగా హీరో ఎలక్ట్రిక్ యూజర్ మాన్యువల్ ప్రకారం టైర్లు అలాగే ట్యూబులు వారంటీ కింద రావని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మెట్రో టైర్స్ చేసిన క్లెయిమ్ ప్రామాణికమైనదిగా పరిగణించి హీరో ఎలక్ట్రిక్‌పై ఇన్సాల్వెన్సీ చర్యలు ప్రారంభించాలని ఎన్‌సీఎల్‌టీ నిర్ణయించింది.

బడ్జెట్ పర్యటనలకు జై



- దక్షిణాసియా దేశాలకు ప్రాధాన్యం
- సులభతర చెల్లింపుల పట్ల సానుకూలం
- క్లియర్ ట్రిప్ నివేదికలో ఆసక్తికర అంశాలు

ముంబై: మారుమూలనున్న సాహస కేంద్రాలు, అందుబాటు ధరల్లో ఉన్న కేంద్రాలను సందర్శించేందుకు దేశీ పర్యాటకులు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాసియాలోని పేరొందిన ప్రదేశాలు పర్యాటకుల ప్రముఖ ఎంపికగా ఉంది. ట్రావెల్ బుకింగ్ సేవల్లోని 'క్లియర్‌ట్రిప్' నివేదికను పరిశీలించగా.. జెనరేషన్ జెడ్ (1996-2009 మధ్య జన్మించిన వారు), వృద్ధులు అందుబాటు ధరల్లోని ప్రాంతాలకు ఈ ఏడాది ఎక్కువగా బుకింగ్ చేసుకున్నారు. సులభతర చెల్లింపుల విధానాలకు సైతం ఆమోదనీయం పెరుగుతోంది. ఈ విషయంలో జెనరేషన్ జెడ్‌లో 1.4 రెట్ల అధిక ఆమోదం కనిపించింది. ''వీసా రహిత విధానాలు, ట్రావెల్ నిబంధనలను సడలించడంతో దక్షిణాసియా ప్రాంతాలు ట్రావెలర్ల ముఖ్య ఎంపికగా మారాయి. అందుబాటు ధరల్లో ఉన్న ప్రాంతాలను సందర్శించేందుకు ఈ ఏడాది పర్యాటకులు ప్రాధాన్యం ఇచ్చారు''అని క్లియర్ ట్రిప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అనుజ్‌రాతి తెలిపారు.

- బాలిలోని డెన్‌ప్యాసర్‌కు బుకింగ్‌లు 2023తో పోల్చితే 73 శాతం పెరిగాయి. బాలికి బెంగళూరు నుంచి ఇండిగో డైరెక్ట్ ఫ్లయిట్ సేవలను ప్రారంభించడంతో దేశీయ పర్యాటకులకు ఇది అందుబాటులోకి వచ్చింది.
- టిబిలిసికి 27%, తాష్కెంట్‌కు 100%, ఆల్మెటీకి 73%, డానాంగ్‌కు 60%, బాకుకు 133% చొప్పున బుకింగ్‌లు ఈ ఏడాది అధికంగా నమోదయ్యాయి.
- దేశీయంగా పెరుంబాకం, పంగాల, టెక్కుమురి ప్రాంతాలకూ ఆదరణ లభించింది.
- దేశీయంగా చూస్తే లక్షద్వీప్‌లోని అగట్టి దీవికి ఏకంగా 94 శాతం మేర బుకింగ్‌లు పెరిగాయి. దయ్యూకి 130 శాతం అధికంగా బుకింగ్‌లు వచ్చాయి. బెంగళూరు నుంచి గోవా, దయ్యూని కలుపుతూ అగట్టికి ఇండిగో సేవలు ప్రారంభించడం ఇందుకు నేపథ్యం.
- ఎక్కువ మంది అన్వేషించిన దేశీయ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా గోవా మొదటి స్థానంలో ఉంది. గతేడాదితో పోల్చితే గోవాకి ఫ్లయిట్ అన్వేషణలు 200 % పెరిగాయి. అమృత్‌సర్‌కు 106% బుకింగ్‌లు పెరిగాయి.
- ఎక్కువ మంది అన్వేషించిన అంతర్జాతీయ కేంద్రంగా అజర్‌బైజాన్‌లోని షాదాగ్ నిలిచింది. అలాగే, అదుబాబి, కౌలాలంపూర్, మెల్‌బోర్న్, లండన్, బ్యాంకాక్ ఫ్లయిట్ అన్వేషణల్లో ప్రముఖంగా నిలిచాయి. గతేడాదితో పోల్చితే 90-150 శాతం పెరుగుదల కనిపించింది.

విదేశీ మారక ద్రవ్య నిల్వలు @ 644.391 బిలియన్ డాలర్లు

డిసెంబర్ 20తో ముగిసిన వారంలో 8.478 బిలియన్ డాలర్లు డౌన్

ముంబై: భారత్ విదేశీ మారక నిల్వలు డిసెంబర్ 20తో ముగిసిన వారంలో అంతక్రితం వారం (డిసెంబర్ 13) ముగింపుతో పోల్చితే 8.478 బిలియన్ డాలర్లు తగ్గి 644.391 బిలియన్ డాలర్లకు చేరాయి. డిసెంబర్ 13తో ముగిసిన వారంలో కూడా నిల్వలు 1.988 బిలియన్ డాలర్లు తగ్గి ఆరు నెలల కనిష్ట స్థాయి 652.869 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. నిల్వలు గత కొన్ని వారాలుగా తగ్గుతూ వస్తుండడం గమనార్హం. డాలర్ మారకంలో రూపాయి స్థిరీకరణ కోసం ఆర్‌బీఐ డాలర్లను మార్కెట్‌లోకి పంప్ చేయడం, మారకద్రవ్య రీవ్యాల్యూయేషన్లు దీనికి ప్రధాన కారణం. సెప్టెంబర్ చివరిలో విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ఠం 704.885 బిలియన్ డాలర్లకు తాకిన సంగతి తెలిసిందే.

విదేశీ కరెన్సీ ఆస్తులు

యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల పెరుగుదల, క్షీణత ప్రభావానికి లోనయ్యే మొత్తం విదేశీ కరెన్సీ అసెట్స్ (డాలర్లు) 6.014 బిలియన్ డాలర్లు తగ్గి, 556.562 బిలియన్ డాలర్లకు చేరాయి.

బంగారం నిల్వలు

విదేశీ మారకద్రవ్య నిల్వలో భాగమైన బంగారం నిల్వలు 2.33 బిలియన్ డాలర్లు తగ్గి 65.726 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి.

ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్ద నిల్వల ప్రత్యేక డ్రాయింగ్ హక్కులకు సంబంధించిన ఈ విభాగం విలువ 112 మిలియన్ డాలర్లు తగ్గి 17.885 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది.

ఐఎంఎఫ్ వద్ద నిల్వలు

ఐఎంఎఫ్ వద్ద నిల్వల పరిమాణం 23 మిలియన్ డాలర్లు తగ్గి, 4.217 బిలియన్ డాలర్లకు చేరింది.



వెలవెలబోతున్న పెయింట్స్ పరిశ్రమ

- తీవ్ర పోటీ, లాభాలపై ఒత్తిళ్లు
- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడి



కోల్‌కత: భారతీయ పెయింట్స్ పరిశ్రమ తీవ్ర పోటీ, లాభాలపై ఒత్తిళ్లతో సవాళ్లను ఎదుర్కొంటోందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. '2021-22, అలాగే 2022-23లో పరిశ్రమ బలమైన వృద్ధిని సాధించింది. దీర్ఘకాలంగా స్థిరపడిన ప్రముఖ కంపెనీలైన ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, కాన్సాయ్ నెరోలాక్, అక్జో నోబెల్, ఇండిగో పెయింట్స్ వంటి సంస్థల ఆదాయ వృద్ధి 2023-24లో 4 శాతానికి స్థిరపడింది. ఇది 2018-19 నుంచి 2022-23 మధ్య నమోదైన 14-15 శాతం వార్షిక వృద్ధి కంటే చాలా తక్కువ. ముడిసరుకు వ్యయాలు తగ్గడం, అమ్మకాల మిశ్రమంలో తక్కువ విలువ ఉత్పత్తుల వాటా పెరగడంతో ధరల తగ్గింపు కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో ఈ క్షీణత ఏర్పడింది. పరిమాణం మాత్రం 10 శాతం దూసుకెళ్లింది. సవాళ్లు ఉన్నప్పటికీ ఈ రంగం 2025-26లో 8-10 శాతం వృద్ధిని సాధించడానికి సిద్ధంగా ఉంది' అని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అసోసియేట్ డైరెక్టర్ రిచా బగారియా తెలిపారు. నివేదిక ప్రకారం..

ఆపరేటింగ్ మార్జిన్లను..

ప్రకటన, సేల్స్ ప్రమోషన్ ఖర్చులు 100-200 బేసిస్ పాయింట్లు అధికమై ఆపరేటింగ్ మార్జిన్‌లను మరింత దెబ్బతీస్తుంది. 2019-20 నుంచి 2023-24 మధ్య పెయింట్స్ రంగంలో నిర్వహణ మార్జిన్లు సగటున 18 శాతం నుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో 16 శాతానికి వచ్చి చేరాయి. ధరల ఒత్తిడి, పెరుగుతున్న పోటీ కారణంగా 2025-26 నాటికి మార్జిన్స్ సుమారు 14 శాతానికి క్షీణిస్తాయని అంచనా. అయితే, స్థూల మార్జిన్ దాదాపు 40 శాతం స్థిరంగా ఉంటుందని అంచనా. ప్రధానంగా అధికం అవుతున్న ముడి చమురు ఉప ఉత్పత్తుల ఖర్చులను ఎదుర్కోవడానికి ఇటీవలి 1.5-2.5 శాతం ధరల పెంపు ఇందుకు కారణం.

వ్యవస్థీకృత కంపెనీలు..

పెయింట్స్ రంగంలో వ్యవస్థీకృత కంపెనీల వాటా మధ్య కాలంలో 80 శాతానికి పెరగనుంది. ఇది ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న, కొత్తగా ప్రవేశించిన కంపెనీల భారీ సామర్థ్య విస్తరణ ఇందుకు కారణం అవుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల లీటర్లకుపైగా అదనపు సామర్థ్యం తోడు కానుంది. ఇందులో అ త్యధిక వాటా కొత్త బ్రాండ్ల నుంచే ఉండనుంది. మొత్తం డిమాండ్‌లో 70-75 శాతం వాటా కలిగిన డెకొరేటివ్ పె యింట్స్ ఈ డిమాండ్‌ను నడిపిస్తున్నాయి. రీ-పెయింట్ కార్యకలాపాలు, పట్టణీకరణ, పెరుగుతున్న ఆదాయాలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. మొత్తం డిమాండ్‌లో పారిశ్రామిక పెయింట్స్ వాటా 25-30 శాతం. ఆటోమోటివ్, చమురు, సహజ వాయువు, మౌలిక రంగాల్లో వీటిని వినియోగిస్తున్నారు.

కొత్త బ్రాండ్ల రాకతో..

గట్టి పోటీ, సార్వత్రిక ఎన్నికలు, సుదీర్ఘ రుతుపవనాలు, ధరల తగ్గింపు ప్రభావం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఆదాయం మరింతగా ప్రభావితమైంది. జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఇతర కొత్త బ్రాండ్ల ప్రవేశంతో మార్కెట్‌కు అంతరాయం కలిగించింది. కొత్త బ్రాండ్లు దూకుడుగా విస్తరించి సామర్థ్యం, డీలర్ నెట్‌వర్క్, సేల్స్ టీమ్‌లను కలిగి ఉన్నాయి. ఫలితంగా ప్రచార కార్యకలాపాలు, ప్రకటనల వ్యయం పెరిగింది. ఇందుకు అనుగుణంగా పోటీ పడేందుకు ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు వాటి సొంత మూలధన వ్యయం, మార్కెటింగ్ పెట్టుబడులతో ప్రతిస్పందించడంతో ఒత్తిడి పెరిగింది.


కార్ల్‌సన్

డ్రస్ మార్చుకోని ఆడు... కుదరదు!

కార్ల్‌సన్‌పై క్రమశిక్షణ చర్యలు ● టోర్నీకే గుడ్‌బై చెప్పి నిష్క్రమించిన చెస్ దిగ్గజం

నేను తగ్గేదేలే... అయితే మేము ఆడించేదేలే! ఇటు చెస్ దిగ్గజం కార్ల్‌సన్, అటు అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఎవరికి వారు వెనక్కి తగ్గకపోవడంతో కార్ల్‌సన్ అర్ధాంతరంగా టోర్నీకి గుడ్‌బై చెప్పాడు. అలాగని అక్కడేదో పెద్ద ఘోరమేమీ జరగలేదు. కానీ అహం, ఆవేశం కలగలిపి చిన్న డ్రస్ కోడ్ అంశమే పెద్ద వివాదంగా మారింది. చెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

న్యూయార్క్: మాజీ ప్రపంచ చెస్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ చదరంగంలో ఎత్తులు పైఎత్తులు వేసే దిగ్గజ ఆటగాడు. 'ఫిడే' ప్రపంచ చెస్ వ్యవహారాలను చక్కబెట్టే సంస్థ. ఓ ఆటగాడు... ఓ సమాఖ్య... ఓ డ్రెస్ కోడ్... చిన్న అంశం సర్దుకుంటే పోటీల ఫలితాలు మీడియాలో వచ్చేవి. కానీ ఆ అంశం కాస్త వివాదంగా... చివరకు చినికి చినికి గాలివానలా మారి పెద్దవార్త అయ్యింది. ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) పంతానికే పోయాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య మాత్రం ఎంతవారైనా 'ఫిడే' నియమావళినే సుప్రీమ్ అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేయడంతో ఆటగాడు, సమాఖ్య వైరిపక్షాలుగా మారాయి. ఫిడే క్రమశిక్షణ చర్యలు చేపట్టడంతో... మీరేంటి నాపై చర్యలు తీసుకునేది నేనే టోర్నీకి ఇప్పుడే ఇక్కడితోనే గుడ్‌బై చెబుతానని కార్ల్‌సన్ ఉన్నపళంగా నిష్క్రమించాడు.

అసలేం జరిగింది?

న్యూయార్క్‌లో ప్రపంచ ర్యాపిడ్-బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. మన మేటి భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్, ప్రజ్ఞానంద, ద్రోణవల్లి హారిక, కోనేరు హంపి తదితరులు సైతం ఆడుతున్నారు. శనివారం ర్యాపిడ్‌లో ఎనిమిదో రౌండ్ తర్వాత డిఫెండింగ్ చాంపియన్, నార్వే దిగ్గజం కార్ల్‌సన్ జీన్స్ వేసుకొని చెస్ బోర్డు దగ్గరకు ఆడేందుకు వచ్చాడు. టోర్నీ చీఫ్ ఆర్బిటర్ అలెక్స్ హొలొజాక్ ముందుగా డ్రెస్‌కోడ్ విషయమై నార్వే స్టార్‌కు సున్నితంగా చెప్పారు. జీన్స్ ప్యాంట్ ధరించి ఆడటం ఫిడే నియమావళికి విరుద్ధమని దయచేసి ప్యాంట్ మార్చుకొని రావాల్సిందిగా ఆర్బిటర్ సూచించారు. తర్వాత 200 డాలర్లు (రూ.17,078) జరిమానా విధించారు. కానీ అప్పటికప్పుడు జీన్స్ మార్చుకునేందుకు ఏమాత్రం ఇష్టపడని మాగ్నస్ 'ఎలాగూ జీన్స్‌తో వచ్చాను కదా... ఈ రౌండ్ పూర్తయ్యాక మార్చుకుంటాలే' అని చెప్పేశాడు. దీంతో ఆర్బిటర్ అలా అయితే ఆడించటం కుదరదని స్పష్టం చేశారు. అయినాసరే డ్రస్ మార్చుకునేందుకు కార్ల్‌సన్ ససేమిరా అనడంతోనే వివాదం మొదలైంది. దీంతో నిబంధనలకు అనుగుణంగా అతనికి తొమ్మిదో రౌండ్ ప్రత్యర్థిని (పెయిరింగ్ ఇవ్వలేదు) కేటాయించలేదు. అంటే ఇది ఆ రౌండ్‌కు అనర్హత వేటు. ఈ క్రమశిక్షణ చర్యల్ని ఏమాత్రం సహించని కార్ల్‌సన్ ర్యాపిడ్ తొమ్మిదో రౌండే కాదు... బ్లిట్జ్ పోటీలు సహా మొత్తం టోర్నీనే బాయ్‌కాట్ చేస్తున్నానని అక్కడినుంచి నిష్క్రమించాడు.

> నేను ఆడే ఆటలో అలసిపోవడం కంటే కూడా ఫిడే నిబంధనలతోనే ఎక్కువగా విసిగిపోయాను. ఇకపై భరించను. సహించను. మిగిలిపోయిన ర్యాపిడ్ గేములే కాదు... తర్వాత జరిగే బ్లిట్జ్ గేముల్లోనూ పాల్గొనేది లేదు. స్వదేశంలోని అభిమానులు ఈ విషయాన్ని గమనించి నన్ను మన్నించాలి. అదో (డ్రెస్) బుద్ధిలేని నిబంధన. ఇప్పుడైతే ఆడతా తర్వాత మార్చుకొని వస్తాలే అన్నా వినలేదు. ఫిడే తీరును గర్హిస్తున్నాను.
> – డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్

> ఫిడే అథ్లెట్స్ కమిషన్ నియమావళిని గ్రాండ్‌మాస్టర్లంతా పాటించాల్సిందే. కమిషన్‌లోని ప్రొఫెషనల్ ప్లేయర్లు, నిపుణులే ఈ డ్రెస్‌కోడ్‌ను తెచ్చారు. ఎన్నోఏళ్లుగా ఉన్న నిబంధనలే! కొత్తగా వచ్చినవి కాదు. దీనిపై పాల్గొనే క్రీడాకారులందరికీ అవగాహన ఉంటుంది. ఎందుకంటే ప్రతీ టోర్నీకి ముందు కచ్చితంగా నియమావళిని ఆయా ఆటగాళ్లకు వివరంగా తెలియజేస్తాం. నిజానికి కార్ల్‌సన్ జీన్స్ మార్చుకునేందుకు పెద్ద సమయం కూడా పట్టదు. వేదికకు అత్యంత చేరువగా నడిచొచ్చే విధంగా బస ఏర్పాటు చేశాం. నిమిషాల సమయమే అయినాసరే కార్ల్‌సన్ వినిపించుకోలేదు. ఇంతకుముందు రష్యా గ్రాండ్‌మాస్టర్ నెపోమ్‌నియాచి ఇలాంటి పొరపాటే చేశాడు. కానీ వెంటనే డ్రస్ మార్చుకొని వచ్చి ఆట కొనసాగించాడు
> – ఫిడే సీఈఓ సుటోవ్‌స్కీ


అర్జున్

సంయుక్త ఆధిక్యంలో అర్జున్

న్యూయార్క్: ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి సంయుక్త ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. శనివారం తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి రష్యా గ్రాండ్‌మాస్టర్లు వొలొడర్ ముర్జిన్, అలెగ్జాండర్ గ్రిస్చుక్, జాన్ క్రిజ్‌స్టొఫ్ (పోలండ్)లతో కలిసి భారత ఆటగాడు ఏడు పాయింట్లతో ఉమ్మడిగా ఆధిక్యంలో ఉన్నాడు. 13 రౌండ్ల ఈ ర్యాపిడ్ ఈవెంట్‌లో ఇంకా నాలుగు గేములు మిగిలున్నాయి. డ్రెస్‌కోడ్ ఉల్లంఘనతో కార్ల్‌సన్‌పై చర్య దరిమిలా అతను టోర్నీ నుంచి తప్పుకోవడంతో అర్జున్ ఒక్కడే ఆధిక్యంలో నిలిచే అవకాశాలు కాస్త మెరుగయ్యాయి. శనివారం జరిగిన నాలుగు రౌండ్లలో (6, 7, 8, 9) రెండు విజయాలు, రెండు డ్రాలతో అర్జున్ సత్తాచాటుకున్నాడు. ఆరో రౌండ్లో అమెరికా ఆటగాడు రాబ్సన్ రేను కంగుతినిపించిన అర్జున్ మరుసటి గేమ్‌లో శాంట్ సర్గియాన్ (ఆర్మేనియా)పై గెలిచాడు. తర్వాత 8, 9వ రౌండ్లలో వరుసగా ముర్జిన్ (రష్యా), క్రిజ్‌స్టొఫ్ (పోలండ్)లతో గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. ఆదివారం జరిగే పదో రౌండ్ గేమ్‌లో తెలంగాణ ఆటగాడు రష్యాకు చెందిన గ్రిస్చుక్‌తో తలపడతాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలు కూడా సంయుక్త ఆధిక్యంలోకి దూసుకొచ్చారు. హంపి ఒక గేమ్‌లో ఓడి తర్వాత వరుసగా నాలుగు గేమ్‌ల్లో గెలిచింది. తద్వారా 9 రౌండ్లు ముగిసేసరికి సహచర క్రీడాకారిణి హారిక, వెన్‌జున్ జు (చైనా)లతో కలిసి 6.5 పాయింట్లతో ఉమ్మడిగా ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

ఆఖరి నిమిషంలో గట్టెక్కిన హైదరాబాద్ ఎఫ్‌సీ

ఇండియన్ సూపర్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సొంతగడ్డపై హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) గెలిచేందుకు కాదు... డ్రా చేసుకునేందుకే ఆపసోపాలు పడింది. మిడ్‌ఫీల్డర్లు అద్భుతంగా ఆడినా ఫినిషింగ్ లోపాలు జట్టును వేధించాయి. దీంతో శనివారం ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్ 1–1 స్కోరు వద్ద డ్రాగా ముగిసింది. మ్యాచ్‌లో చాలాసేపు బంతిని తమ ఆధీనంలో ఉంచుకొని పాస్ చేసిన స్ట్రయికర్లు గోల్ చేయడంలో విఫలమయ్యారు. చివరకు మ్యాచ్ ముగిసే దశలో 90వ నిమిషంలో మనోజ్ మొహమ్మద్ చేసిన గోల్‌తో హైదరాబాద్ ఎఫ్‌సీ డ్రాతో ఊపిరిపీల్చుకుంది. అంతకుముందు తొలి అర్ధభాగం గోల్ లేకుండా ముగిసినప్పటికీ ద్వితీయార్ధంలో జేక్సన్ సింగ్ (64వ నిమిషంలో) చేసిన గోల్‌తో ఈస్ట్ బెంగాల్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ స్కోరును సమం చేసేందుకు హైదరాబాద్ ఆఖరి నిమిషందాకా చెమటోడ్చింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 4–2తో చెన్నయిన్ ఎఫ్‌సీపై ఘనవిజయం సాధించింది. బెంగళూరు జట్టులో రియాన్ విలియమ్స్ (16వ, 68వ ని.లలో) రెండు గోల్స్ చేశాడు. సునీల్ ఛెత్రి (43వ ని.) ఒక గోల్ చేయగా, ప్రత్యర్థి ఆటగాడు లల్డిన్‌లిన రెంథెల్ (82వ ని.) సెల్ఫ్ గోల్ చేశాడు. చెన్నయిన్ తరఫున ఇర్ఫాన్ యద్వాడ్ (19వ ని.), లాల్‌రిన్‌లియానా హమతే (ఇంజ్యూరి టైమ్ 45+2వ ని.) గోల్ చేశారు.

మిలింద్ మ్యాజిక్

- పుదుచ్చేరిపై హైదరాబాద్ విజయం
- విజయ్ హజారే ట్రోఫీ


మిలింద్

అహ్మదాబాద్: లెఫ్టార్మ్ పేసర్ సీవీ మిలింద్ (5/13) నిప్పులు చెరగడంతో... విజయ్ హజారే టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు రెండో విజయం ఖాతాలో వేసుకుంది. గ్రూప్ 'సి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో పుదుచ్చేరిని మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పుదుచ్చేరి 31.5 ఓవర్లలో 98 పరుగులకు ఆలౌటైంది. పారస్ (57 బంతుల్లో 26; 3 ఫోర్లు) టాప్ స్కోరర్... కాగా తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. మొత్తం జట్టులో ముగ్గురు ప్లేయర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. హైదరాబాద్ బౌలర్లలో మిలింద్ 9.5 ఓవర్లు బౌలింగ్ చేసి 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు తీయగా... మొహమ్మద్ ముదస్సిర్, నిశాంత్ చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం లక్ష్యం చిన్నదే అయినా హైదరాబాద్ జట్టు తడబడింది. చివరకు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. హిమతేజ (61 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టును విజయ తీరాలకు చేర్చాడు. మిలింద్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం కర్ణాటకతో హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది.

భరత్, హెబర్ మెరుపులు

బౌలర్ల క్రమశిక్షణకు ఓపెనర్ల దూకుడు తోడవడంతో దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు మూడో విజయం నమోదు చేసుకుంది. గ్రూప్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 10 వికెట్ల తేడాతో సర్వీసెస్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సర్వీసెస్ 36.2 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. అర్జున్ శర్మ (39; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... అన్షుల్ గుప్తా (23), వినీత్ (23), అరుణ్ (22) తలా కొన్ని పరుగులు చేశారు. ఆంధ్ర బౌలర్లలో పిన్నింటి తపస్వి 4 వికెట్లు పడగొట్టగా... పృథ్వీ రాజ్, శశికాంత్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో ఆంధ్ర జట్టు 28.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 163 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రీకర్ భరత్ (90 బంతుల్లో 86 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), అశ్విన్ హెబర్ (66 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకాలతో రాణించారు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 3 విజయాలు, ఒక 'డ్రా'తో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని గ్రూప్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. తపస్వికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం మేఘాలయతో ఆంధ్ర జట్టు తలపడనుంది.

దక్షిణాఫ్రికా లక్ష్యం 148

సెంచూరియన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న 'బాక్సింగ్ డే' తొలి టెస్టులో ఆతిథ్య దక్షిణాఫ్రికా గెలుపుబాటలో 121 పరుగుల దూరంలో ఉంది. అయితే కీలకమైన 3 వికెట్లు కోల్పోవడం వల్ల సఫారీకి నాలుగో రోజు ఛేజింగ్ అంత సులభంగా అయితే లేదు. అంతకుముందు శనివారం 88/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్తాన్ 59.4 ఓవర్లలో 237 పరుగుల వద్ద ఆలౌటైంది. క్రితం రోజు బ్యాటర్లు బాబర్ ఆజమ్ (85 బంతుల్లో 50; 9 ఫోర్లు), సౌద్ షకీల్ (113 బంతుల్లో 84; 10 ఫోర్లు, 1 సిక్స్) ఇద్దరు అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. వీరి జోడి నిలబడినంత వరకు బాగానే ఉన్నా... బాబర్ ఫిఫ్టీ తర్వాత నిష్క్రమించడంతో కథ మొదటికొచ్చింది. జట్టు స్కోరు 153 పరుగుల వద్ద బాబర్‌ను జాన్సెన్ అవుట్ చేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగియగా, తర్వాత వచ్చిన రిజ్వాన్ (3), సల్మాన్ ఆఘా (1)లను జాన్సెన్ పెవిలియన్ చేర్చడంతో 176 స్కోరు వద్ద ఆరో వికెట్ పడింది. సఫారీ బౌలర్లు ఇదే జోరు సాగించడంతో పాక్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. మార్కో జాన్సెన్ 6 వికెట్లు పడగొట్టగా, రబడకు 2 వికెట్లు దక్కాయి. తొలిఇన్నింగ్స్‌లో సఫారీకి 90 పరుగుల ఆధిక్యం దక్కడం వల్ల 148 పరుగుల లక్ష్యమే ఎదురైంది. దీన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది.


జాన్సెన్

రహమత్ షా అజేయ డబుల్

- హష్మతుల్లా భారీ శతకం
- అఫ్గానిస్తాన్ తొలి ఇన్నింగ్స్ 425/2
- జింబాబ్వేతో తొలి టెస్టు

బులవాయో: రహమత్ షా (416 బంతుల్లో 231 బ్యాటింగ్; 23 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో కదం తొక్కడంతో జింబాబ్వేతో తొలి టెస్టులో అఫ్గానిస్తాన్ దీటుగా బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 95/2తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్... మూడో రోజు ఆట ముగిసే సమయానికి 125 ఓవర్లలో 2 వికెట్లకు 425 పరుగులు చేసింది. రహమత్ షా ద్విశతకంతో చెలరేగగా... కెప్టెన్ హష్మతుల్లా షాహిది (276 బంతుల్లో 141 బ్యాటింగ్; 16 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. అంతకుముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 586 పరుగులు చేసి.. టెస్టు క్రికెట్ చరిత్రలో తమ అత్యధిక స్కోరు నమోదు చేయగా... అఫ్గాన్ బ్యాటర్లు అంతకుమించి విజృంభించారు. శనివారం రోజంతా బ్యాటింగ్ చేసిన రహమత్ షా, హష్మతుల్లా 95 ఓవర్లలో 330 పరుగులు జోడించారు. ఈ జంట అబేధ్యమైన మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 361 పరుగులు జోడించడంతో అఫ్గాన్ జట్టు భారీ స్కోరుపై కన్నేసింది. ఈ క్రమంలో అఫ్గాన్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా రహమత్ షా రికార్డుల్లోకెక్కాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న అఫ్గానిస్తాన్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 161 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ టెస్టు మ్యాచ్ 'డ్రా' కావడం ఖాయంగా కనిపిస్తోంది.


రహమత్ షా

టైటిల్ వేటలో...

- నేడు ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఫైనల్
- తుదిపోరులో హరియాణాతో పట్నా ఢీ
- రాత్రి 8 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పుణే: రెండు నెలలకు పైగా క్రీడాభిమానులను ఉర్రూతలూగించిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)–11వ సీజన్ తుది అంకానికి చేరుకుంది. ఆదివారం పుణేలోని ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా... హరియాణా స్టీలర్స్‌తో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ టైటిల్ కోసం తలపడనుంది. వరుసగా రెండోసారి ఫైనల్ చేరిన హరియాణా స్టీలర్స్... ఇప్పటికే మూడుసార్లు టైటిల్ ముద్దాడిన పట్నా మధ్య రసవత్తర పోరు ఖాయమే. తొలిసారి చాంపియన్‌గా నిలవాలనుకుంటున్న హరియాణా స్టీలర్స్‌కు జైదీప్ సారథ్యం వహిస్తుండగా... మన్‌ప్రీత్ సింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. లీగ్ దశలో తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తూ నేరుగా సెమీఫైనల్‌కు చేరిన స్టీలర్స్... తుదిపోరులోనూ అదే జోరు కనబర్చాలని కృతనిశ్చయంతో ఉంది. స్టీలర్స్ తరఫున శివమ్ పాతరె, వినయ్, జైదీప్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా యూపీ యోధాస్‌తో హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో కీలక పాయింట్లు సాధించి జట్టును విజయ తీరాలకు చేర్చిన శివమ్, వినయ్ ఈ మ్యాచ్‌లోనూ రాణించాలని స్టీలర్స్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. డిఫెన్స్‌లో రాహుల్, సంజయ్ కీలకం కానున్నారు. మరోవైపు గతంలో వరుసగా మూడు సార్లు పీకేఎల్ ట్రోఫీ చేజిక్కించుకున్న పట్నా... ఇప్పుడు నాలుగో టైటిల్ ఖాతాలో వేసుకోవాలని తహతహలాడుతోంది. యువ ఆటగాళ్లు దేవాంక్ దలాల్, అయాన్ లోచాబ్ రాణించడంతో వరుస విజయాలతో ఫైనల్‌కు చేరిన పైరేట్స్.. అదే జోష్‌లో టైటిల్ పట్టాలని చూస్తోంది.



సెమీస్‌లో లక్ష్యసేన్ ఓటమి

షెన్‌జెన్ (చైనా): కింగ్ కప్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్యసేన్ 19–21, 19–21తో హు జీ అన్ (చైనా) చేతిలో ఓడాడు. హోరాహోరీగా సాగిన పోరులో ఆధిక్యం చేతులు మారుతూ వచ్చింది. తొలి గేమ్‌లో 23 ఏళ్ల లక్ష్యసేన్‌పై 18 ఏళ్ల చైనా షట్లర్ పైచేయి కనబర్చాడు. రెండో గేమ్ ఒక దశలో 6–6తో సమం కాగా... కాసేపటికే చైనా షట్లర్ 12–10తో స్వల్ప ఆధిక్యం సాధించాడు. అయితే పట్టు వదలకుండా ప్రయత్నించిన లక్ష్యసేన్ 19–16తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచినా... ఆ తర్వాత తడబడి పరాజయం వైపు నిలిచాడు.

ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు రేసులో శ్రేయాంక

దుబాయ్: భారత యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎమర్జింగ్ మహిళ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు నామినేట్ అయింది. గత ఏడాది డిసెంబర్‌లో జాతీయ జట్టు తరఫున తొలి మ్యాచ్ ఆడిన శ్రేయాంక 13 టి20లు ఆడి 15 వికెట్లు పడగొట్టింది. రెండు వన్డేల్లో 4 వికెట్లు తీసింది. మహిళల ఆసియా కప్ టి20 టోర్నీతో పాటు... ఐసీసీ మహిళల టి20 వరల్డ్‌కప్‌లోనూ శ్రేయాంక టీమిండియాలో కీలక పాత్ర పోషించింది.

ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్ శుభారంభం

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్ జట్టు షూటౌట్ 4–2తో గోనాసిక జట్టుపై విజయం సాధించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 2–2తో సమవుజ్జీగా నిలిచాయి. దీంతో షూటౌట్ అనివార్యం కాగా గోనాసిక తరఫున వాకర్, మన్‌ప్రీత్ తొలి రెండు ప్రయత్నాల్ని వృథా చేశారు. మోర్టన్, క్లైమెంట్‌లు మాత్రమే స్కోరు చేశారు. ఢిల్లీ స్ట్రయికర్లు వెటన్, డొమిన్, సౌరభ్, రాజ్ కుమార్ పాల్ గోల్స్ చేయడంతో ఎస్‌జీ పైపర్స్ గెలుపొందింది. నేడు జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్‌తో బెంగాల్ టైగర్స్ తలపడుతుంది.


ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఇటీవల వరల్డ్ చెస్ చాంపియన్‌గా అవతరించిన గ్రాండ్‌మాస్టర్ గుకేశ్... కుటుంబ సభ్యులతో కలిసి శనివారం న్యూఢిల్లీలో ప్రధానిని కలిశాడు. ఈ సందర్భంగా గుకేశ్ ప్రధానికి చెస్‌బోర్డును బహూకరించాడు.



శ్రీనగర్‌లోని ప్రముఖ దాల్ సరస్సులో శనివారం షికారా బోట్లపై పేరుకుపోయిన హిమం



దాల్ సరస్సు సమీపంలోని నిశాత్ గార్డెన్ వద్ద పర్యాటకుల సందడి



భారీగా మంచు కురియడంతో శ్రీనగర్‌లో మంచుతో కప్పేసినట్లుగా ఉన్న ఓ ప్రాంతం

మంచు ముద్దయిన కశ్మీరం!

- సాధారణ జనజీవనానికి అంతరాయం
- నిలిచిన రైలు, విమాన సర్వీసులు
- జమ్మూ-శ్రీనగర్ హైవే మూసివేత

శ్రీనగర్: కశ్మీర్‌లో శనివారం భారీగా మంచు కురిసింది. దీంతో స్థానికులు, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తుండగా సాధారణ జనజీవనానికి మాత్రం అవరోధం ఏర్పడింది. కశ్మీర్ వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఒక మోస్తరు నుంచి భారీగా మంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో, రైలు, విమాన సర్వీసులు నిలిచిపోయాయి. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని అధికారులు మూసివేశారు. మంచు కారణంగా కశ్మీర్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. శనివారం సాయంత్రం కల్లా 90 శాతం వరకు ఫీడర్లలో సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అననుకూల వాతావరణం కారణంగా కశ్మీర్ విశ్వవిద్యాలయం శనివారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసింది. శ్రీనగర్-సోనామార్గ్ హైవేపై రాకపోకలు నిలిచిపోవడంతో చిక్కుకుపోయిన పర్యాటకులకు గుండ్‌లోని మసీదులో స్థానికులు ఆశ్రయం కల్పించారు. సోనామార్గ్ నుంచి శుక్రవారం తిరుగుపయనమైన పంజాబ్‌కు చెందిన సుమారు డజను మంది శుక్రవారం రాత్రి మసీదులోనే గడిపారని స్థానికులు తెలిపారు. అదేవిధంగా, గందేర్‌బల్ జిల్లా కంగన్‌లో చిక్కుకుపోయిన పర్యాటకులకు స్థానిక కుటుంబం ఆశ్రయం కల్పించింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది.

దక్షిణ కశ్మీర్‌పై ఎక్కువ ప్రభావం

దక్షిణ కశ్మీర్ జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో రెండడుగుల మేర మంచు కురిసిందని అధికారులు వివరించారు. బారాముల్లా జిల్లాలో 4 నుంచి 9 అంగుళాల మేర మంచు నమోదవగా గుల్మార్గ్‌లో 15 అంగుళాల మంచు కురిసింది. పుల్వామాలో 10 నుంచి 15 అంగుళాలు, పొరుగునే ఉన్న కుల్గామ్‌లో 18 నుంచి 25 అంగుళాలు, షోపియాన్‌లో 6 నుంచి 10 అంగుళాల మంచు పేరుకుపోయింది. శ్రీనగర్‌లో 8 అంగుళాల మేర మంచు కురియగా, పొరుగునే ఉన్న గందేర్‌బల్‌లో 7 అంగుళాలు, ప్రముఖ పర్యాటక ప్రాంతం సోనామార్గ్‌లో 8 అంగుళాల మేర మంచు నమోదైందని అధికారులు చెప్పారు. పర్యాటక పట్టణం పహల్గామ్‌లో శనివారం 18 అంగుళాల మేర మంచు కురిసింది. అనంత్‌నాగ్ జిల్లాలో అత్యధికంగా 17 అంగుళాల హిమపాతం నమోదు కాగా శ్రీనగర్-లేహ్ రహదారి వెంట ఉన్న జోజిలాలో 15 అంగుళాలు, బుద్గాం జిల్లాలో 7 నుంచి 10 అంగుళాల మేర మంచు నమోదైంది.

మైనస్‌కు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు

శ్రీనగర్‌లో గురువారం రాత్రి మైనస్ 7.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, శుక్రవారం రాత్రికి తీవ్రత తగ్గి మైనస్ 1 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకుంది. స్కయింగ్‌కు పేరున్న ఉత్తర కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో మైనస్ 5 డిగ్రీలు, అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపున్న పహల్గామ్‌లో మైనస్ 2.8 డిగ్రీలుగా ఉంది. కశ్మీర్‌కు ముఖద్వారం వంటి క్వాజీగుండ్‌లో కనీస ఉష్ణోగ్రత మైనస్ 0.6 డిగ్రీలుగా నమోదవగా, పంపోర్ ప్రాంతంలోని కుగ్రామం కొనబాల్‌లో మైనస్ 1.5 డిగ్రీలుగా రికార్డయింది. కశ్మీర్ లోయలో అతి తీవ్రమైన చలికాలం 'చిల్లాయ్-కలాన్'ఈ నెల 21 నుంచి మొదలైంది. దాదాపు 40 రోజులపాటు భారీగా మంచు కురియడంతోపాటు ఉష్ణోగ్రతలు కూడా మైనస్ స్థాయికి పడిపోతాయి. జనవరి 30వ తేదీకల్లా ఈ తీవ్రత తగ్గుముఖం పట్టనుంది. అయితే, చలి గాలులు మాత్రం మరో 40 రోజుల వరకు కొనసాగుతాయి.

ప్రయాణాలను వాయిదా వేసుకోండి

జమ్మూ-శ్రీనగర్ 44వ నంబర్ జాతీయ రహదారిని మంచు కారణంగా అధికారులు మూసివేశారు. నవ్‌యుగ్ టన్నెల్ వద్ద అతి భారీగా మంచు కురుస్తుండటంతో యంత్రాలతో మంచు తొలగింపు పనులకు అంతరాయం కలుగుతోందని ట్రాఫిక్ విభాగం అధికారులు వెల్లడించారు. వాతావరణం మెరుగుపడి, రోడ్లు క్లియర్ అయ్యేదాకా ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని వాహనదారులను వారు కోరారు. పట్టాలపై భారీగా మంచు పేరుకుపోవడంతో అధికారులు ముందు జాగ్రత్తగా బనిహాల్-బారాముల్లా సెక్షన్‌లో రైళ్లను రద్దు చేశారు. ట్రాక్‌ను క్లియర్ చేసే పనులు కొనసాగుతున్నాయన్నారు. మంచు దట్టంగా కురుస్తుండటంతో శ్రీనగర్ విమానాశ్రయంలో విమాన సర్వీసులను నిలిపివేశారు. ప్రతికూల వాతావరణం కారణంగా శుక్రవారం సాయంత్రం శ్రీనగర్ విమానాశ్రయంలో అన్ని విమానాలను రద్దు చేశామని అధికారులు తెలిపారు. రన్‌వేను క్లియర్ చేసే పనులు చేపట్టామని, వాతావరణం అనుకూలిస్తేనే విమానాశ్రయంలో కార్యకలాపాలు తిరిగి మొదలవుతాయన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం కోసం వైమానిక సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. జిల్లా ప్రధాన కేంద్రాల్లోని ప్రధాన రహదారులు, ఆస్పత్రులకు దారి తీసే రోడ్లపై మంచు తొలగింపు పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. మంచు కారణంగా అంతర్గత రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు. వాహనాలు జారుతున్నందున మంచులో డ్రైవ్ చేయడం కష్టసాధ్యమే కాదు, ప్రమాదకరమని హెచ్చరించారు.



జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారీగా మంచు కురియడంతో నిలిచిపోయిన వాహనాలు



శ్రీనగర్‌లో రహదారి, వాహనాలతోపాటు ఓ చెట్టుపై పేరుకుపోయిన మంచు

'మహిళా సమ్మాన్'పై దర్యాప్తు చేయండి

మహిళల వివరాల్ని సేకరించే వారిపై చర్యలు తీసుకోండి ● ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: మహిళా సమ్మాన్ యోజన పేరుతో మహిళల వ్యక్తిగత వివరాలను ప్రైవేట్ వ్యక్తులు సేకరించడంపై దర్యాప్తు చేపట్టాల్సిందిగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అధికారులను శనివారం ఆదేశించారు. పథకంపై ఎన్నికల సమయంలో ప్రచారం జరుగుతున్న తీరును ఎలక్టోరల్ అధికారి ద్వారా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని కూడా ఆయన ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. కాంగ్రెస్ నేత, న్యూఢిల్లీ అసెంబ్లీ అభ్యర్థి సందీప్ దీక్షిత్ బుధవారం స్వయంగా తనకు చేసిన ఫిర్యాదుపై ఎల్జీ సక్సేనా ఈ మేరకు స్పందించారు. మహిళలకు ఆశ చూపి వ్యక్తిగత వివరాలను సేకరిస్తూ వారి గోప్యతకు భంగం కలిగించే వారెవరైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కూడా ఎల్జీ పోలీస్ కమిషనర్‌కు సూచించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్ల వద్ద పంజాబ్ ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా పెట్టినట్లు ఆరోపణలున్నాయని ఎల్జీ పేర్కొన్నారు. దీంతోపాటు, ఢిల్లీ ఎన్నికల్లో పంచేందుకు పంజాబ్ నుంచి డబ్బులు అందుతున్నాయన్నారు. మహిళా సమ్మాన్ యోజన కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆప్ ప్రభుత్వం అందజేస్తోంది. మళ్లీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ.2,100కు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆప్ కార్యకర్తలు ఇల్లిల్లూ తిరిగి మహిళల వివరాలను సేకరిస్తూ దరఖాస్తులను పూర్తి చేయిస్తున్నారు. అయితే, బయటి వ్యక్తులు వచ్చి అందజేసే దరఖాస్తులను నింపొద్దంటూ గత వారం మహిళా శిశు అభివృద్ధి శాఖ బహిరంగ ప్రకటన జారీ చేసింది. ఈ పథకం అమలు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తామని స్పష్టతనిచ్చింది.

ఆప్‌ను ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర: కేజ్రీవాల్

మహిళా సమ్మాన్‌పై దర్యాప్తు జరపాలన్న ఢిల్లీ ఎల్జీ ఆదేశాలపై ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాల్ మండిపడ్డారు. ఉత్తర్వులు ఎల్జీ కార్యాలయం నుంచి కాదు, అమిత్ షా నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆప్ పథకాలను అడ్డుకునేందుకే బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయంటూ నిప్పులు చెరిగారు. నేరుగా చర్యలు తీసుకునే ధైర్యం లేని బీజేపీ, కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో ఫిర్యాదు చేయించిందని ఆరోపించారు. 'ఎన్నికల్లో గెలిచాక మేమిచ్చే పథకాలతో లక్షలాది మంది మహిళలకు నెలకు రూ.2,100, వృద్ధులకు ఉచిత వైద్యం అందుతుంది. ఈ పథకాలను చూసి బీజేపీకి ఓటమి భయం పట్టుకుంది'అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. బీజేపీ గెలిస్తే తమ సంక్షేమ పథకాలన్నిటినీ నిలిపివేస్తుంది, అరాచకం రాజ్యమేలుతుందన్నారు. 'ఎన్నికల్లో గెలిస్తే అమలు చేస్తామని ప్రకటించాం. ఇందులో విచారించడానికేముంటుంది? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ గూండాలు, పోలీసులు కలిసి పథకాల నమోదు శిబిరాలు జరక్కుండా అడ్డుకుంటున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై నమ్మకముంచాలని, పథకాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఢిల్లీ ప్రజలను ఆయన కోరారు.

దలేవాల్ బతికుండాలా? చనిపోవాలా?

- ఆరోగ్యం క్షీణిస్తున్న వ్యక్తికి వైద్య సాయం అందకుండా అడ్డుకుంటారా?
- రైతు సంఘాల నాయకులపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం
- ఈ నెల 31లోగా దలేవాల్‌కు చికిత్స అందించాలని పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశం

న్యూఢిల్లీ: రైతాంగం సమస్యల పరిష్కారం కోసం గత నెల రోజులుగా పంజాబ్-హరియాణా సరిహద్దులో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పంజాబ్ రైతు సంఘం నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు వైద్య సాయం అందించడానికి అడ్డు తగులుతున్న రైతు సంఘాల నాయకులు, రైతులపై మండిపడింది. వారు నిజంగా దలేవాల్‌కు శ్రేయోభిలాషులు కాదని ఆక్షేపించింది. దలేవాల్‌ను ఆసుపత్రికి ఎందుకు తరలించడం లేదని పంజాబ్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ నెల 31వ తేదీలోగా ఆయనను ఆసుపత్రికి తరలించి, చికిత్స ప్రారంభించాలని ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ నుంచి సాయం తీసుకోవచ్చని సూచించింది. దలేవాల్‌కు వైద్య చికిత్స అందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధూలియాతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ శనివారం విచారణ చేపట్టింది. పంజాబ్ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ వాదనలు వినిపించారు. దీక్షలో ఉన్న దలేవాల్ చుట్టూ రైతులు మోహరించారని, ఆయనను ఆసుపత్రికి తరలించకుండా అడ్డుకుంటున్నారని, తమ ప్రభుత్వం నిస్సహాయ స్థితిలో ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ.. ''ఇదంతా జరగడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? దలేవాల్ చుట్టూ కోట కట్టడానికి అనుమతి ఉందా? దీక్షా స్థలానికి భారీ సంఖ్యలో రైతులు ఎలా చేరుకున్నారు? ప్రభుత్వం ఏం చేస్తోంది? ఆరోగ్యం క్షీణించి తక్షణమే వైద్య చికిత్స అవసరమైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించకుండా చుట్టుముట్టడం ఏమిటి?'' అని ప్రశ్నించింది. చికిత్స తీసుకోవడానికి దలేవాల్ అంగీకరించడం లేదని, ఎంత ఒప్పించినా ఫలితం ఉండడం లేదని, దీక్ష విరమిస్తే ఉద్యమం బలహీనపడుతుందని ఆయన భావిస్తున్నారని గుర్మీందర్ సింగ్ చెప్పారు. ఒకవేళ బలవంతంగా తరలిస్తే అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకొనే ప్రమాదం ఉందని, అందుకే వెనుకంజ వేస్తున్నామని వివరించారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. పంజాబ్ ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించడం లేదని పేర్కొంది. రైతు సంఘాల నాయకుల తీరుపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసుపత్రికి తీసుకెళ్లకుండా అడ్డుకోవడం నేరమేనని, ఆత్మహత్యకు పురికొల్పినట్లే అవుతుందని తేల్చిచెప్పింది. దలేవాల్ విషయంలో చట్టప్రకారం ముందుకెళ్లాలని పంజాబ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ''కొందరు రైతు సంఘాల నేతల ప్రవర్తనపై మేము ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదు. ఒక మనిషి చనిపోయే పరిస్థితుల్లో ఉంటే వారు స్పందించడం లేదు. వారేం నాయకులు? దలేవాల్ బతికి ఉండాలని కోరుకుంటున్నారా? లేక దీక్ష చేస్తూ చనిపోవాలని కోరుకుంటున్నారా? వారి ఉద్దేశం ప్రశ్నార్థకంగా ఉంది'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం విరుచుకుపడింది.

సెలవు రోజునా ప్రత్యేక విచారణ

సుప్రీంకోర్టుకు సాధారణంగా సెలవుదినం. రైతు సంఘం నేత జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం శనివారం ప్రత్యేకంగా సమావేశమై విచారణ చేపట్టింది.

రూ.10,418 కోట్ల

లాటరీ జాక్‌పాట్

కాలిఫోర్నియాలో అమ్ముడుపోయిన మెగా మిలియన్స్ లాటరీ టికెట్

వాషింగ్టన్: అమెరికాలో గుర్తు తెలియని వ్యక్తి జీవితంలోకి కొత్త సంవత్సరం అప్పుడే వచ్చేసింది. 3, 7, 37, 49, 55 నంబర్లు ఉన్న తెలుపు బంతులు, ఆరో నంబర్ ఉన్న బంగారు మెగా బంతి సరిపోలిన లాటరీ టికెట్‌కు 1.22 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.10,418 కోట్లు) భారీ జాక్‌పాట్ తగిలింది. కాలిఫోర్నియాలో ఈ టికెట్ అమ్ముడుపోయిందని మెగా మిలియన్స్ లాటరీ సంస్థ శనివారం ప్రకటించింది. అమెరికా మెగా మిలియన్స్ లాటరీల చరిత్రలోనే ఇది మూడో అతిపెద్ద లాటరీ మొత్తంగా రికార్డ్ సృష్టించింది. గత మూడు నెలలుగా లాటరీ తీస్తున్న ప్రతిసారీ ఏ ఒక్కరికీ విన్నింగ్ నంబర్ మ్యాచ్ కాకపోవడంతో టికెట్ల అమ్మకాలు కొనసాగించారు. దాంతో గెలుపు మొత్తం అలా కొండలా పెరిగి చివరకు రూ.10,000 కోట్లను దాటేసింది. కాటన్‌వుడ్ సిటీలోని రోండారోడ్‌లోని సర్కిల్ కె(సన్‌షైన్ ఫుడ్ అండ్ గ్యాస్)స్టోర్‌లో ఈ గెలుపు టికెట్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కొన్నారు. టికెట్ గెలిచింది ఎవరనేది సంస్థ ఇంకా ప్రకటించలేదు.

హెచ్1బీ వీసాల రక్షణ కోసం

యుద్ధానికైనా సిద్ధమే

తేల్చిచెప్పిన ఎలాన్ మస్క్



వాషింగ్టన్: టెస్లా, ఎక్స్, స్పేస్ఎక్స్ సంస్థల అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ హెచ్-1బీ వీసాలకు మద్దతుగా నిలిచారు. ఈ వీసాల పరిరక్షణ కోసం అవసరమైతే యుద్ధానికైనా సిద్ధమేనని తేల్చిచెప్పారు. హెచ్-1బీ వీసాల విషయంలో ఇటీవల విస్తృతంగా చర్చ జరుగుతోంది. కొందరు వ్యతిరేకిస్తుండగా, మరికొందరు మద్దతిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎలాన్ మస్క్ శనివారం స్పందించారు. నిపుణులైన ఉద్యోగులకు అమెరికాలో పనిచేసుకొనేందుకు అవకాశం కల్పించే హెచ్-1బీ వీసాల విషయంలో అభిప్రాయం మార్చుకోవాలని వాటి వ్యతిరేకులకు సూచించారు. ''నాతోపాటు ఎంతోమంది అమెరికాకు రావడానికి, స్పేస్ఎక్స్, టెస్లా వంటి సంస్థలు స్థాపించడానికి కారణం హెచ్-1బీ వీసాలే. ఈ వీసాలతోనే మేము ఇక్కడికొచ్చి పనిచేశాం. అవకాశాలు అందుకున్నాం. హెచ్-1బీ వీసాలతోనే అమెరికా బలమైన దేశంగా మారింది. ఇలాంటి వీసాలను వ్యతిరేకించడం మూర్ఖపు చర్య. దాన్ని నేను ఖండిస్తున్నా. ఈ వీసాలు ఉండాల్సిందే. ఈ విషయంలో అవసరమైతే యుద్ధానికైనా సిద్ధంగా ఉన్నా''అని మస్క్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వచ్చే ఏడాది జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేయబోతున్నా డొనాల్డ్ ట్రంప్ విదేశాల నుంచి వలసలు తగ్గిస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. విదేశీయులకు వీసాలు ఇచ్చే విషయంలో కఠినంగా వ్యవహరించబోతున్నట్లు ఇప్పటికే ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్‌క అత్యంత సన్నిహితుడైన ఎలాన్ మస్క్ హెచ్-1బీ వీసాలకు మద్దతుగా గొంతు విప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కృత్రిమ మేధపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ సలహాదారుడిగా భారత అమెరికన్ వెంచర్‌క్యాపిటలిస్టు శ్రీరామ్ కృష్ణన్‌ను ట్రంప్ ఇటీవల నియమించారు. నిపుణులైన వలసదార్ల కోసం గ్రీన్‌కార్డులపై పరిమితి తొలగించాలని కృష్ణన్ డిమాండ్ చేస్తున్నారు. దీన్ని రిపబ్లికన్ నేతలు తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో హెచ్-1బీ వీసాలపై రగడ మొదలైంది.

పాకిస్తాన్‌పై తాలిబన్ల భీకర దాడి

19 మంది పాక్ జవాన్లు, ఇద్దరు అఫ్గాన్ పౌరులు మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ పాలకులు ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. గత వారం పాకిస్తాన్ సైన్యం అఫ్గానిస్తాన్‌పై విరుచుకుపడింది. వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో తాలిబన్లకు ప్రాణనష్టం వాటిల్లింది. పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా తాలిబన్ సేనలు శనివారం దాడులకు పాల్పడ్డాయి. సరిహద్దుల్లోని పాక్ సైనిక పోస్టులపై బాంబుల వర్షం కురిపించాయి. పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి తాము దాడులు చేసినట్లు అఫ్గానిస్తాన్ రక్షణ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో 19 మంది పాకిస్తాన్ సైనికులు, ఇద్దరు అఫ్గాన్ పౌరులు మృతిచెందినట్లు తాలిబన్ అనుకూల హురియత్ డైలీ వార్తా సంస్థ తెలియజేసింది. అయితే, తాలిబన్ల దాడులపై పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా స్పందించలేదు.

నేటి మోదీ పరివర్తన్ ర్యాలీ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆదివారం ప్రధాని మోదీ పాల్గొనాల్సిన బీజేపీ 'పరివర్తన్ ర్యాలీ'వాయిదాపడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో కేంద్రం వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాలని బీజేపీ నిర్ణయించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఢిల్లీలో ప్రచార శంఖారావాన్ని పూరించే లక్ష్యంతో ఈ నెల 29న తొలి పరివర్తన్ ర్యాలీని రోహిణి నుంచి ఆరంభించాలని బీజేపీ ప్రణాళిక రచించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే డిసెంబర్ 29న, జనవరి 3న ర్యాలీలు చేపట్టేందుకు సిద్ధమైంది. రిథాలాలో కొత్త మెట్రోరైల్ కొత్త లైను సహా మరికొన్ని కీలక హామీలను ప్రకటించాలని భావించింది. అయితే జనవరి ఒకటి వరకు సంతాప దినాలుగా ఉండటంతో మోదీ పరివర్తన్ ర్యాలీని 5న నిర్వహించాలని నిర్ణయానికి వచ్చింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి జనవరి 15వ తేదీ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఆప్ తన ప్రచారాన్ని విస్తృతం చేయగా, కేజ్రీవాల్ భారీ హామీలను ప్రకటిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ సైతం తన ప్రచారాన్ని మోదీ ర్యాలీల ద్వారా ఉధృతం చేయాలని భావిస్తోంది.

అన్నా వర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారం ఘటన.. సిట్ విచారణ

- బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం
- మద్రాస్ హైకోర్టు ఆదేశాలు

చెన్నై: చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో ఈ నెల 25న విద్యార్థినిపై లైంగిక దాడి ఘటనపై మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన న్యాయస్థానం.. సిట్‌లోని ముగ్గురు సభ్యులూ మహిళా ఐపీఎస్ అధికారులే అయి ఉండాలని స్పష్టీకరించింది. అంతేకాదు, బాధిత విద్యార్థినికి పరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. బాధితురాలు ఎటువంటి ఆటంకం లేకుండా చదువుకొనసాగించేలా చర్యలు తీసుకోవాలంది. ఆమె నుంచి ఇకపై ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని కూడా వర్సిటీని ఆదేశించింది. విద్యార్థినిపై లైంగిక దాడి ఘటనపై విచారణను సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌పై శనివారం వాదనలు విన్న జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియమ్, జస్టిస్ వి.లక్ష్మీనారాయణ్‌ల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. అన్నా వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థిని అత్యాచారానికి గురైన ఘటన తీవ్ర అలజడి రేపింది. డీఎంకే ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

నటి ఉర్మిళా కొఠారే కారు ఢీకొని..

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ముంబై: ముంబైలో మరాఠా సినీ నటి ఉర్మిళా కొఠారే కారు ఢీకొన్న ఘటనలో ఒక కార్మికుడు చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కందివలి ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనలో కొఠారే, ఆమె కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పోయిసర్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్డు పక్కన మెట్రో రైలు పనుల్లో పాల్గొంటున్న కార్మికులపైకి కారు వేగంగా దూసుకెళ్లింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఉండటంతో ఉర్మిళతోపాటు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే కారణమని ప్రాథమికంగా తేల్చారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. 'దునియాదారి', 'థ్యాంక్‌గాడ్'వంటి పలు మరాఠా, హిందీ చిత్రాల్లో కొఠారే నటించారు.

దుకాణమంతా దోచేయండి

- సరకు మొత్తం ఉచితం
- ఆస్ట్రేలియాలో వింత ఆఫర్

పెర్త్: ఆషాడం సేల్. సగం ధరకే పట్టుచీర. బట్టల దుకాణాల్లో తరచూ కనిపించే ప్రకటన ఇది. ఇక జనరిక్ మందుల దుకాణాల్లో 70 శాతం, 80 శాతం డిస్కౌంట్ బోర్డులను అక్కడక్కడ చూస్తూనే ఉంటాం. కానీ ఏకంగా 100 శాతం డిస్కౌంట్. అంటే ఉచితంగా పట్టుకెళ్లండి అనే షాప్ మీరు ఎక్కడా చూసి ఉండరు. అలాంటి దుస్తుల దుకాణం కొద్దిసేపు తెరచి ఉంచితే మరు నిమిషంలో సరుకంతా మటుమాయమైన ఘటన ఆస్ట్రేలియాలో జరిగింది. పెర్త్ నగరంలో స్ట్రీట్ఎక్స్ అనే దుస్తుల షోరూమ్ ఉంది. దాని యజమాని డేనియల్ బ్రాడ్‌షాకు కొత్త ఆలోచన వచ్చింది. ''టీ-షర్ట్‌లను షాప్‌లో సిద్ధంగా ఉంచుతా. దోచేయండి''అని యువతకు మీడియాలో ఒక ప్రకటన ఇచ్చారు. అంతే ఇక. టీ-షర్ట్‌లను పట్టుకెళ్లేందుకు యువత పోటెత్తింది. గురువారం ఉదయం దుకాణం షట్టర్ పైకెత్తగానే యువతీ యువకులు పరుగుపరుగున లోపలికి దూరేసి దొరికింది పట్టుకెళ్లారు. ఎగబడి కలబడి టీ-షర్ట్‌లను ఎగరేసుకుపోయారు. తొక్కిసలాటలో దెబ్బలు తగులుతాయని ముందు జాగ్రత్తగా ఒక యువకుడు హెల్మెట్, మోకాళ్లు, మోచేతులకు ప్యాడ్లు ధరించిమరీ జనంలోకి దూకాడు. తోపులాటలో చిన్నపాటి గీసుకుపోవడం లాంటి దెబ్బలు తప్ప చెప్పుకోదగ్గ, ఆస్పత్రిలో చేరేంత స్థాయి గాయాలు ఎవరికీ కాలేదు. గతంలో సైతం షాప్ యజమాని ఒక భారీ ట్రక్కు నిండా దుస్తులు ఇలాగే ఉచితంగా దోచేసే ఆఫర్ ఇచ్చాడని అక్కడికొచ్చిన ఒకావిడ చెప్పింది. గురువారం దుకాణంలో దాదాపు 400 టీ-షర్ట్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలుస్తోంది.

మహారాష్ట్రలో 16 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్

ముంబై: భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించడంతోపాటు ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా నివాసం ఉంటున్న 16 మంది బంగ్లాదేశీయులను అరెస్ట్ చేసినట్లు మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజమ్ స్క్వాడ్(ఏటీఎస్) తెలిపింది. వీరిలో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారంది. నవీ ముంబై, థానె, సోలాపూర్ పోలీసుల సాయంతో గత 24 గంటల్లో వీరిని పట్టుకుని సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండేళ్లుగా ఇక్కడే ఉంటున్న వీరు ఫోర్జరీ పత్రాల సాయంతో ఆధార్ కార్డులను సైతం పొందగలిగారన్నారు. నకిలీ గుర్తింపు పత్రాలను తయారు చేస్తున్న ముగ్గురు కూడా పట్టుబడిన వారిలో ఉన్నారన్నారు.

ప్రణబ్ చనిపోతే సీడబ్ల్యూసీ సంతాప సమావేశం కూడా జరగలేదు

- కాంగ్రెస్‌పై మాజీ రాష్ట్రపతి కుమార్తె శర్మిష్ఠ ధ్వజం
- మన్మోహన్ స్మారకంపై వివాదం నేపథ్యంలో వ్యాఖ్య

కోల్‌కతా: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో ప్రత్యేకంగా స్మారకం ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రధాని మోదీని కోరడంపై దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ తీవ్ర విమర్శలు చేశారు. 2020 ఆగస్టులో తన తండ్రి చనిపోతే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కనీసం సంతాప సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రపతులు చనిపోయిన సందర్భాల్లో అలాంటి సమావేశాలు జరగవని పార్టీ సీనియర్ నేత ఒకరు తనతో అన్నారని గుర్తు చేసుకున్నారు. అదంతా వట్టి భూటకమని కొట్టిపారేశారు. మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ మృతి చెందడంతో అప్పట్లో స్వయంగా సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేసి, సంతాప తీర్మానాన్ని ఆమోదించినట్లు తన తండ్రి ప్రణబ్ డైరీల ద్వారా తనకు తెలిసిందన్నారు. గాంధీల కుటుంబానికి చెందిన వారు కాదనే కారణంగా పార్టీ ప్రముఖ నేతలను కాంగ్రెస్ నాయకత్వం ఎలా విస్మరించిందీ బీజేపీకి చెందిన సీఆర్ కేశవన్ పెట్టిన పోస్టును శర్మిష్ఠ ప్రస్తావించారు. యాసిడెంట్ ప్రైమ్ మినిస్టర్ పుస్తకం రాసిన సంజయ్ బారువా కూడా 2004లో మాజీ ప్రధాని పీవీ చనిపోతే ఢిల్లీలో స్మారకం నిర్మించలేదనే విషయాన్ని పేర్కొన్నారని కూడా ఆమె తెలిపారు.

సాక్షి ప్లస్
ఆదివారం। 29-12-2024

అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధితోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు-2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు-2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది.

ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడంగానీ చేయలేదు.

ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు-2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు.



రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో),ఆస్తి కొనుగోలు,భూమిని సాగు చేసుకోవడం, బోరుబావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది.దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి
   డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు
   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష
   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    ఎ) ఎం. హిదయతుల్లా
    బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
    సి) పి.ఎన్. భగవతి
    డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
    ఎ) సుప్రీంకోర్టు బి) హైకోర్టు
    సి) జిల్లా కోర్టు డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
    ఎ) క్యూరేటివ్ పిటిషన్
    బి) రివిజన్ పిటిషన్
    సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
    డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి; 5) డి; 6) డి; 7) సి; 8) బి; 9) సి; 10) సి; 11) డి; 12) సి.

శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణఅంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96):**
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: రుగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925-2010):**
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910-83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ **ప్రక్రియ:** గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):**
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915-61):**
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.
10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930-89):**
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగు చుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నండూరి రామమోహన్‌రావు (1927-2011):** పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922-2011):**
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు - రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) - సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) - శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) - వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) - భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) - దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) - సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) - సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) - సభారంజన శతకం (అనువాద కర్త)

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం ?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త 4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 1; 11) 3; 12) 4; 13) 2; 14) 4; 15) 3; 16) 1.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

గ్రామీణ వ్యవసాయ పరపతి

గ్రామీణాభివృద్ధి, భారత ఆర్థికాభివృద్ధికి చుక్కాని వంటిది. గ్రామాలు సుసంపన్నంగా ఉన్నప్పుడే భారత్ అన్ని రంగాల్లో వెలుగొందుతుంది. కానీ నేటి గ్రామీణ భారతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందుకు ప్రధాన కారణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండడం. డబ్బుతో ముడిపడి ఉన్న ఆధునిక వ్యవసాయా నికి సరిపడ పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆదాయం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల చెల్లింపునకే సరిపోనప్పుడు రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది. 'రాయల్ కమిషన్' చెప్పినట్లుగా మనదేశంలో రైతు అప్పులతో పుడుతున్నాడు. అప్పులతో నివసిస్తూ చివరకు అప్పులతో మరణిస్తున్నాడు.

గ్రామీణ రుణగ్రస్థత

భారత గ్రామీణాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వ్యవసాయ రుణగ్రస్థత. ఇది దేశ వ్యవసాయాభివృద్ధిని కుంటుపరుస్తుంది. గ్రామీణుల్లో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. వీటిలో కొంతభాగం కుటుంబ అవసరాలకు,మిగిలిన దాన్ని వ్యవసాయ పెట్టుబడికి వినియోగిస్తున్నారు. అనేక కారణాల వల్ల గ్రామీణులు ఆ అప్పులను పూర్తిగా తీర్చలేక రుణగ్రస్థులవుతున్నారు. ఈ పరిస్థితిని 'గ్రామీణ రుణగ్రస్థత' (Rural Indebtedness) అంటారు.

కారణాలు

పేదరికం, వారసత్వంగా వచ్చిన అప్పులు, పెరిగిన వ్యవసాయ ఖర్చులు, వ్యవసాయ రంగం వెనుకబాటుతనం, అల్ప ఉత్పాదకత, భూమి కౌలు రుసుం అధికంగా ఉండడం, సాంఘిక, మతపరమైన కట్టుబాట్లు, ఆచారాల కోసం చేసే వ్యయం, వడ్డీ వ్యాపారుల మీద అధికంగా ఆధారపడటం, ప్రభుత్వ పరపతి సదుపాయాలు తగినంతగా లేకపోవడం, అనారోగ్యం, దురలవాట్లు మొదలైనవి.

పరిణామాలు

అధిక రుణభారం వల్ల వ్యవసాయదారుడి పెట్టుబడి శక్తి క్షీణిస్తుంది. తద్వారా దిగుబడి తగ్గి, ఉత్పత్తి తక్కువై ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార సరఫరా తక్కువ అవడం వల్ల డిమాండ్ అధికమై ప్రజల ఆహార ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ప్రజల మిగులు ఆదాయం తగ్గడం వల్ల పారిశ్రామిక, సేవారంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. అపుడు ఆర్థిక వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అది ప్రజల విద్యా, వైద్య, ఆరోగ్య స్థితిగతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాల కోసం, రైతుల రుణాలు మాఫీ చేయాలని ఉద్యమాలు పుడతాయి. వీటికి ప్రభుత్వ స్పందన సానుకూలంగా లేకపోతే అవి హింసాత్మకంగా మారి సమాజ భద్రతకు సవాలుగా మారుతాయి.

నివారణ చర్యలు

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాలను గ్రామీణ రైతులకు అధికంగా అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ప్రభుత్వం నియంత్రించి అధిక వడ్డీ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కరువు పరిస్థితుల్లో రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందజేయాలి.

గ్రామీణ పరపతిపై ప్రభుత్వ చర్యలు

- గ్రామీణ రుణగ్రస్థతను నిర్మూలించడానికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 'గోర్వాలా' అధ్యక్షతన 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం'(1954)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రధానంగా సహకార పరపతి సంఘాలను ఎక్కువ సంఖ్యలో స్థాపించాలని, సహకార మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని సూచించింది.
- గోర్వాలా నివేదిక ప్రకారం ప్రభుత్వం 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్'ను జాతీయం చేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)'గా మార్చింది.
- ఈ కమిటీ సూచనల మేరకు 1956లో ఆర్‌బీఐ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి - దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి'ని ఏర్పాటు చేసింది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకోవడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'ని ప్రారంభించింది.
- ప్రభుత్వం వ్యవసాయ పరపతిని అధికం చేసే క్రమంలో 1969లో 14 వాణిజ్య బ్యాం కులు, 1980లో 6 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది.
- 1963లో 'వ్యవసాయ పునర్విత్త సంస్థ'ను స్థాపించారు.
- ప్రొఫెసర్ ఎమ్. నరసింహం కమిటీ సిఫారసు ఆధారంగా ప్రభుత్వం 1975 అక్టోబర్ 2న 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్' (RRB)లను స్థాపించింది.
- వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి సంస్థాగతమైన ఏర్పాట్ల సమీక్షించడం కోసం క్రాఫికార్డ్ (CRAFICARD) కమిటీ (1979)ను ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1982 జూలై 12న 'జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్'(NABARD)ను ఏర్పా టు చేసింది. ఇది ఆర్‌ఆర్‌బీల విధానాలను పర్యవేక్షించే అత్యున్నత బ్యాంక్ (Apex Bank). దీన్ని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా స్థాపించాయి. ఆర్‌ఆర్‌బీలకు, ఆర్‌బీఐకి మధ్య నాబార్డ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంక్ (SCB)లకు, ఆర్‌ఆర్‌బీలకు ఇది ప్రత్యక్షంగా రుణ సహాయం అందిస్తుంది. రైతులకు నేరుగా రుణాలను అందించదు.
- గ్రామీణ పరపతిపై సూచనలిచ్చే ఉద్దేశం తో అర్.వి.గుప్తా నేతృత్వంలో 1997లో ఆర్‌బీఐ ఒక పరిశీలన సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ గ్రామ పరపతిని ప్రోత్సహించే మార్గదర్శక సూత్రాలను సూచించింది. రైతు క్లబ్‌లను స్థాపించి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేలా వాణిజ్య బ్యాంకులు కృషిచేయాలని సిఫారసు చేసింది.
- రైతులకు అవసరమైన పరపతిని సకాలం లో అందించడానికి మనదేశంలో 1904 లోనే 'సహకార సంస్థలు' ఆవిర్భవించాయి. వీటిని మొదట 1961లో, ఆ తర్వాత 1976లోనూ పునర్వ్యవస్థీకరించారు. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన 'ఏకగవాక్ష విధానం'(Single window system) సహకార పరపతి విధానంలో నూతన చైతన్యం కలిగించింది. ఇది రైతులకు పరపతి సౌకర్యాలను సులభతరం చేసింది.



వ్యవసాయ పరపతి- వర్గీకరణ

వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, వ్యవసాయ పనులు చేపట్టడానికి అవసరమైన పరపతిని వ్యవసాయ పరపతి అంటారు. రైతులు తమ పరపతి అవసరాలను వివిధ మార్గాల ద్వారా తీర్చుకుంటున్నారు. అవి రెండు రకాలు.

1. **సంస్థాగతమైన పరపతి మార్గాలు:** ప్రభుత్వం, సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాలు.
2. **సంస్థాగతం కాని పరపతి మార్గాలు:** ప్రభుత్వ నియంత్రణ లేని సంస్థలు, ఎలాంటి చట్ట పరమైన విధి విధానాలు లేని వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, స్నేహితులు, బంధువులు, భూస్వాముల నుంచి తీసుకునే అప్పులు. నేడు రైతులకు ఈ మార్గాల నుంచే అధికంగా పరపతి లభిస్తుంది. దీనికి వడ్డీ అధికంగా ఉండటం వల్ల రైతులు ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం సంస్థాగతం కాని పరపతి సంస్థలను నియంత్రించడానికి ప్రయత్నిస్తోంది. 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం' కాలవ్యవధి ఆధారంగా సంస్థాగతమైన పరపతి మార్గాలను 3 రకాలుగా వర్గీకరించింది.

1. **స్వల్పకాలిక పరపతి:**
12 నుంచి 15 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన వ్యవసాయ రుణాలను 'స్వల్పకాలిక పరపతి' అంటారు.సాధారణంగా పంట చేతికి రాగానే రైతులు ఈ రుణాలను తీర్చేస్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత కొనుగోలు, కూలీల వేతనాలు, పంట ను మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా వ్యయానికి ఈ స్వల్పకాలిక రుణాలను రైతులు ఉపయోగించుకుంటారు.
2. **మధ్యకాలిక పరపతి:**
15 నెలల నుంచి 5 ఏళ్ల వ్యవధిలో ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. పశువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, బావుల తవ్వకం, భూమిని మెరుగుపర్చడం కోసం ఈ రుణాలను తీసుకుంటారు.
3. **దీర్ఘకాలిక పరపతి:**
5 నుంచి 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే రుణాలు.ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల కొనుగోలు, శాశ్వతంగా భూమిని అభివృద్ధి చేయడం, అదనంగా భూమి కొనుగోలు చేయడా నికి... అధిక మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. దీన్ని తక్కువ కాలంలో తీర్చడం వీలుకాదు. ఎక్కువ వాయిదాల్లో రైతులు ఆ రుణాలను తీర్చడానికి అనువుగా ఈ పరపతి సౌకర్యం సహాయపడుతుంది.

- టి.డబ్ల్యూ. షుల్జ్ అభిప్రాయం ప్రకారం 'ఇండియాలో పరపతి కొరత మూలంగా వ్యవసాయాభివృద్ధి కుంటుపడడమే కాకుండా, వ్యవసాయాన్ని ఆధునికీకరించే ప్రక్రియలో వేగం తగ్గింది'. దీన్ని బట్టి వ్యవసాయంలో ప్రగతిని స్థిరీకరించడానికీ పరపతి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు.

తక్కావి రుణాలు

సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, వాణిజ్య బ్యాంక్‌లు, రైతులకు పరపతి సౌకర్యాలను అందించక ముందు ప్రభుత్వమే నేరుగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేది. ముఖ్యంగా కరువు కాట కాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇచ్చే రుణాలను 'తక్కావి' రుణాలంటారు. రైతులు ఈ రుణాలను తక్కువ వడ్డీతో, ఎక్కువ వాయిదాల్లో తీర్చేటట్లుగా వెసులుబాటు ఉండేది. అయితే కఠినమైన నియమాలు ఉండటం, మంజూరు చేయడంతో జాప్యం వల్ల ఇవి ఆదరణ కోల్పోయాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరాగాంధీ ఏ బ్యాంక్‌లను జాతీయం చేశారు?
ఎ) గ్రామీణ బ్యాంక్‌లు బి) వాణిజ్య బ్యాంక్‌లు
సి) భారతీయ స్టేట్ బ్యాంక్‌లు
డి) పైవన్నీ
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1975 బి) 1978 సి) 1980 డి) 1982
3. గ్రామీణ రుణగ్రస్థతకు ప్రధాన కారణం
ఎ) రైతులు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణాలకు అధికంగా వడ్డీ చెల్లించడం
బి) వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండీ దిగుబడి తక్కువై రైతుల ఆదాయం తగ్గటం
సి) పెళ్లిళ్లు, పుట్టుక, పండుగలు, చావులు కార్యక్రమాల కోసం గ్రామీణులు అధికంగా ఖర్చుచేసి అప్పుల పాలవడం
డి) పైవన్నీ
4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్ ?
ఎ) RBI బి) SBI
సి) NABARD డి) DCB
5. 'తక్కావి రుణాలు' అంటే ఏమిటి?
ఎ) ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రైతులకిచ్చే అతిస్వల్పకాలిక రుణాలు
బి) వ్యవసాయ పనిముట్ల కొనుగోలు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకిచ్చే రుణాలు
సి) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో తీర్చేలా ప్రభుత్వం రైతులకిచ్చే రుణాలు
డి) సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంక్‌లు అతి తక్కువ వడ్డీతో రైతులకిచ్చే స్వల్ప కాలిక దీర్ఘకాలిక రుణాలు
6. రామయ్య పశువులను కొనుగోలు చేయటానికి రుణం కోసం బ్యాంక్‌కు దరఖాస్తు చేశాడు. అపుడు బ్యాంక్ ఏ రకమైన రుణాన్ని అతడికి మంజూరు చేస్తుంది?
ఎ) స్వల్పకాలిక రుణం
బి) అతి స్వల్పకాలిక రుణం
సి) మధ్యకాలిక రుణం డి) దీర్ఘకాలిక రుణం
7. కిందివాటిలో రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వని సంస్థ?
ఎ) ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకులు
బి) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
సి) ఎస్‌బీఐ డి) నాబార్డ్
8. నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?
ఎ) క్రాఫికార్డ్ కమిటీ బి) సరయూ కమిటీ
సి) నరసింహం కమిటీ డి) గోర్వాలా కమిటీ

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి;
5) సి; 6) సి; 7) డి; 8) ఎ.

The technique of focus on advertising..



BANK EXAMS

MARKETING AWARENESS

1. The fact that services are sold, produced and consumed at the same time refers to which of the following service characteristics?
a) Intangibility b) Inseparability
c) Variability d) Perishability
e) None of the above
2. Electronic shopping, TV shopping is related with:
a) Advertising
b) Personal Selling
c) Direct Marketing
d) In direct Marketing
e) Personal buying
3. The purpose of which of the following type of advertising is to create repeat purchases?
a) Reminder b) Reinforcement
c) Persuasive d) Informative
e) None of the above
4. ______ is the process of evaluating each market segment's attractiveness and selecting one or more segments to enter.
a) Mass marketing
b) Market segmentation
c) Market targeting
d) Market positioning
e) None of the above
5. The technique of focus on advertising of non-competitive brand with the other brand is called:
a) Cross-promotions
b) Tie-in promotions
c) Premiums d) All the above
e) None of the above
6. Labelling, packaging are associated with:
a) Price mix b) Product mix
c) Place mix d) Promotion mix
e) Cost mix
7. Entry of laggards is in which stage of PLC (Product Life Cycle)?
a) First b) Second
c) Third d) Fourth
e) Fifth
8. ______ factors are the most popular bases for segmenting customer groups.
a) Geographic
b) Demographic
c) Psychographic
d) Behavioural
e) None of the above
9. A method in which various products are combined at the same price is:
a) Promotional pricing
b) Product-bundle pricing
c) Captive product pricing
d) Optional product pricing
e) All the above
10. Differentiation in pricing for various geographical customers:
a) Price skimming
b) Psychological pricing
c) Pricing variations
d) Geographical pricing
e) None of the above
11. According to the American Marketing Association, which of the following is marketing of products that are presumed to be environmentally safe?
a) Gray Marketing
b) Green Marketing
c) Global Marketing
d) Social Marketing
e) Internet Marketing
12. One of the following is not included in the 7 Ps of Marketing. Find the same ______.
a) Placement b) Price
c) Production d) Promotion
e) Product
13. Innovation in marketing is same as ______
a) Motivation b) Perspiration
c) Aspiration d) Creativity
e) Team work
14. A call marketing terms means?
a) A newly introduced product
b) Territory allocation for salesperson
c) A Call Centers
d) A Sales meeting
e) To visit a prospect
15. Bank ATMs are______
a) Delivery outlets
b) Market plans
c) Personalized Products
d) Tools for overcoming buyers resistance
e) Motivating tools
16. The USP of current account is ______
a) High minimum balance
b) No restrictions on transactions
c) No internet payable
d) Restricted deposits
e) Easy credits
17. The target group for SME Loan is ______
a) All salaried persons
b) Govt. undertakings
c) All entrepreneurs
d) All students
e)All housewives
18. ______ is a principle of enlightened marketing that requires a company seek real product and marketing improvements.
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
19. NAV is the price of______
a) Entire fund value
b) One unit of a fund
c) Surrender value
d) Average value of shares
e) Dividends paid in a year
20. A Master policy in the case of Life insurance indicates ______
a) Policy is sale
b) Policy is in the name of servant
c) Only one life is assured
d) There are several beneficiaries
e) Life assured should be a male
21. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
a) Exporting
b) Joint venturing
c) Licensing
d) Direct investment
e) None of the above
22. Financial inclusion means canvassing the accounts of ______
a) Financial Institutions
b) NRIs c) HNIs
d) Housewives
e) Persons below a specified income level
23. Facilities for sale and purchase of agricultural products are available in ______
a) Commodity exchange
b) Regulated market
c) Stock exchange
d) Unregulated market
e) None of the above
24. The company that overlooks new and better ways to do things will eventually lose customers to another company that has found a better way of serving customer needs is a major tenet of:
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
25. All of the following would be ways to segment within the category of psychographic segmentation EXCEPT:
a) Social class
b) Occupation
c) Lifestyle
d) Personality
e) Creativity
26. In terms of execution styles, a family seated at the dinner table enjoying the advertised product would be an example of which of the following types of advertising?
a) Slice of life b) Lifestyle
c) Mood or imagery
d) Personality symbol
e) Personality
27. A child in the United States is normally exposed to all of the following values EXCEPT:
a) Achievement and success
b) Activity and involvement
c) Material comfort
d) Collectivism
e) None of the above
28. ______ has contractual authority to sell a manufacturer's entire output.
a) Selling agents
b) Rack jobbers
c) Manufacturer's agents
d) Purchasing agents
e) None of these
29. Sellers that handle their own exports are engaged in:
a) Direct exporting
b) Indirect exporting
c) Licensing
d) Contract manufacturing
e) None of the above
30. More and more salespeople are being evaluated and compensated based on different measures than in the past. All of the following are illustrations of those measures EXCEPT:
a) Long-term customer satisfaction
b) Competitive predatory pricing performance
c) Full customer service
d) Retention rates
e) None of the above
31. ______ includes practices such as overstating the product's features or performance, luring the customer to the store for a bargain that is out of stock, or running rigged contests.
a) Deceptive promotion
b) Deceptive packaging
c) Deceptive pricing
d) Deceptive cost structure
e) None of the above
32. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is the:
a) Canned approach
b) Formula approach
c) Need-satisfaction approach
d) Critical-thinking approach
e) None of the above
33. In terms of special product life cycles, a ______ is a basic and distinctive mode of expression.
a) genre b) style
c) fashion d) fad
e) None

KEY

1) b 2) c 3) a 4) c 5) a
6) b 7) d 8) b 9) b 10) d
11) b 12) c 13) d 14) e 15) c
16) b 17) c 18) a 19) b 20) d
21) d 22) e 23) d 24) a 25) b
26) a 27) d 28) a 29) a 30) a
31) b 32) a 33) b